
# శ్రీకృష్ణ కమిటీ ఏమంటోంది?



18069

ఆంధ్రప్రదేశ్ విభజన అధ్యయనంపై

# జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ నివేదిక

## డిసెంబరు, 2010

**కమిటీ సారథి**

**శ్రీ జస్టిస్ బి.ఎన్.కృష్ణ (రిటైర్డ్), మాజీ జడ్జి, భారత సుప్రీంకోర్టు**

## సంక్షిప్త తెలుగు అనువాదం

చెన్ను పెద్దిరాజు

కె. నవీన్

పి. శ్రీనివాస శాస్త్రి

323
కృష్ణ

## సభ్య కార్యదర్శి

శ్రీవినోద్ కుమార్ దుగ్గల్, ఐఎఎస్ (రిటైర్డ్)

భారత ప్రభుత్వ, హోంశాఖమాజీ కార్యదర్శి

## సభ్యులు

ప్రొఫెసర్ (డాక్టర్) రణబీర్ సింఘ్

వైస్ ఛాన్సలర్, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, ఢిల్లీ

డా॥ అబుసలే షరీఫ్

ఛీఫ్ ఎకనామిస్ట్ / సీనియర్ ఫెలో,

నేషనల్ కౌన్సిల్ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్, ఢిల్లీ

ప్రొఫెసర్ (డాక్టర్) రవీందర్ కౌర్

హ్యూమానిటీస్ అండ్ సోషల్ స్టడీస్ శాఖ, ఐఐటి, ఢిల్లీ

C1171 16

18069

# శ్రీకృష్ణ కమిటీ ఏమంటోంది?

(శ్రీకృష్ణ కమిటీ నివేదిక తెలుగు అనువాదం)

© ఏజెండ్ల పబ్లికేషన్స్

తొలి ముద్రణ : జనవరి 2011

**3000** ప్రతులు

వెల: రూ. **125/-**

ప్రతులకు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, అబిడ్స్, హైదరాబాద్

ఏజెండ్ల యాడ్స్ అండ్ ప్రింటర్స్, హైదరాబాద్

ఫోన్ నెంబర్లు: 040-66686999, 040-64619333

ప్రచురణ:

ఏజెండ్ల యాడ్స్ అండ్ ప్రింటర్స్,

షావరిన్ షెల్టర్స్, 11-4-650, ఫ్లాట్ నెం. జి1,

లకడీకాపూల్, హైదరాబాద్ - 500004.

# ముందుమాట

తెలంగాణ విభజనపై కేంద్ర ప్రభుత్వం నియమించిన శ్రీకృష్ణ కమిటీ పది నెలల వ్యవధి తర్వాత తన నివేదిక సమర్పించింది. రాష్ట్రం యావత్తూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న నివేదిక ఇది. రాష్ట్రాన్ని శ్రీకృష్ణ విభజిస్తారా? సమైక్యంగా ఉంచేందుకు సామరస్య పూర్వక పరిష్కారం చూపుతారా? అనేది అందరి మదిని ఆలోచింపజేస్తున్న ప్రశ్న. శ్రీకృష్ణ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీ ఏం చెప్పింది. కలిసి ఉంటే కలదు సుఖం అందా కలిసి ఉంటే లేదు సుఖం అని భాష్యం చెప్పిందా? ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రజలకు కొంత అవగాహన కలిగినప్పటికీ కమిటీ ఇచ్చిన ఆరు ప్రతిపాదనల్లో సారం ఏమిటి? తెలంగాణ ప్రజలు విభజన కోరడానికి కారణాలేమిటి? యాభై యేళ్ళుగా నిజంగా తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందా? రాయలసీమ, కోస్తాంధ్ర పాలకులు దోపిడీ చేస్తున్నారా? తెలంగాణ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన 'పెద్ద మనుషుల ఒప్పందం', ఆరు సూత్రాల పథకం, ఎనిమిది సూత్రాల పథకం, 610 జీ.వో., నిర్లక్ష్యానికి గురయ్యాయా? ముల్కీ అంటే ఎవరు? జై ఆంధ్ర ఉద్యమం సాధించినదేమిటి? ఆంధ్రప్రదేశ్ గురించి నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఏం చెప్పారు? కర్నూలు నుంచి రాజధాని హైదరాబాద్‌కు ఎందుకు మారింది? తెలుగు మాట్లాడే వారంతా ఒకే రాష్ట్రంలో ఉండాలని ఎవరు ప్రతిపాదించారు? నైజాం కాలంలో అంధకారంలో ఉన్న తెలంగాణలో విద్యుల్లతలు అలుముకోడానికి కారణాలేమిటి? తెలంగాణ కోసం ఎంతోకాలం పోరాటం చేసిన నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చివరకు ఏమన్నారు? తెలంగాణలోనే అధిక శాతం నీటి వనరులున్నప్పటికీ ఈ ప్రాంతానికి అవి ఎందుకు దక్కడం లేదు? విద్య, ఉద్యోగాల్లో ఏ ప్రాంతానికి ఎంత న్యాయం జరుగుతుంది? తెలంగాణలో వేష భాషలు... సంస్కృతీ సంప్రదాయాలు అవమానానికి గురవుతున్న విషయం నిజమేనా? రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు, హైదరాబాద్‌లో అగ్రగామిగా ఉన్న ముస్లింలు విభజనకు ఓటేస్తున్నారా? సమైక్యతకు సై అంటున్నారా? ఆర్థికంగాను, రాజకీయంగాను అధికారం చెలాయిస్తున్నట్టు చెబుతున్న అగ్రకులాలు విభజించి పాలించాలనుకుంటున్నాయా? సమైక్యమే మేలంటున్నారా? తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటిస్తే లాభమా? నష్టమా? తెలంగాణ కన్నా వెనుకబడిన రాయలసీమను ఆదుకోవడం అవసరమా? లక్షకు పైగా అర్జీలు, వందకు మించి సమావేశాలు నిర్వహించిన శ్రీకృష్ణ కమిటీ తన నివేదికలో తేల్చిన విషయాలేమిటి?... ఈ ప్రశ్నలు అందరికీ ఆసక్తి కలిగించేవి. ఆంగ్ల రూపంలో ఉన్న ఈ నివేదికను ఆంధ్రంలోకి అనువాదం చేసి రాష్ట్రంలో తెలుగు ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో ఈ పుస్తకాన్ని ప్రజల ముందుకు తెస్తున్నాను. శ్రీకృష్ణ కమిటీ నివేదికను మక్కికి మక్కీగా కాకుండా కొంత స్వేచ్ఛానువాదంతో భావం చెడకుండా అనువదించారు సీనియర్ జర్నలిస్టులు. వేగంగా చేయడంలో అక్కడక్కడా చిన్నచిన్న పొరపాట్లు దొర్లితే పెద్ద మనస్సుతో అర్థం చేసుకోగలరని ఆశిస్తాను. ఇలాంటివి ఏమైనా ఉంటే దీని మలి ముద్రణలో సరిదిద్దుతానని మాటిస్తున్నాను. ఈ పుస్తకంపై మీ సలహాలను, సూచనలను మాకు తెలియజేస్తారని ఆశిస్తూ... ఈపుస్తక రచనలో సహకరించిన అందరికీ మనసారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

*పబ్లిషర్*

**ఎజెండ్ల మురళీ**

అధ్యాయం
1

# పూర్వాపరాలు

## ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి- ఒకచారిత్రక నేపథ్యం

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1956 నవంబరు 1న అస్తిత్వం లోకి వచ్చింది. అది ప్రధానంగా తెలుగు మాట్లాడే అతి పెద్ద, పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రధాన భాగమైన ప్రాంతాన్ని ఆంధ్రరాష్ట్రంతో కలపడం ద్వారా ఏర్పడింది. ఆంధ్రరాష్ట్రం అంతకుముందు మద్రాసు రాష్ట్రం నుంచి వేరుపడడం ద్వారా ఏర్పడిన రాష్ట్రం. ఆ రాష్ట్రం అక్టోబరు 1, 1953న ఏర్పడింది. పార్లమెంటు ఆంధ్ర రాష్ట్ర చట్టం 1953ను చేసిన తరువాత, సెప్టెంబరు 14, 1953న రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఇది దేశ స్వాతంత్ర్యం తరువాత ఏర్పడిన మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరుణంలో అందులో అనంతపూర్, కర్నూల్, కడప, చిత్తూరు, నెల్లూరు, కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలతో కూడుకుని వుంది. అదనంగా ఆలూర్, ఆదోని, రాయదుర్గం తాలూకాలను ఆంధ్ర రాష్ట్రంతో కలిపారు. ఇవి బళ్ళారి జిల్లాలోనివి. మొదటి రెండు తాలూకాలు కర్నూలు జిల్లాలో, చివరన పేర్కొన్న తాలూకాలు అనంతపురం జిల్లాలో కలిపారు. ప్రకాశం (ఒంగోలు) జిల్లా 1970 ఫిబ్రవరి, 2న అస్తిత్వంలోకి వచ్చింది. నెల్లూరు, కర్నూలు, గుంటూరు జిల్లాలో కొన్ని భాగాలను వేరుచేయడం ద్వారా ఈ జిల్లా ఏర్పడింది. అలాగే 1979-80లో శ్రీకాకుళం, విశాఖజిల్లాల నుంచి వేరుచేసి విజయనగరం జిల్లాను సృష్టించారు. జిల్లా ముఖ్యపట్టణమైన కర్నూలును ఆంధ్రరాష్ట్ర రాజధానిగా ఎంపికచేసి అభివృద్ధి పరిచారు. శాసనసభ 196 మంది సభ్యులతో కర్నూలు నుంచి పనిచేసేది. ఆంధ్రహైకోర్టును గుంటూరులో 1954 జూలై 5న ఏర్పాటు చేశారు. 1937 నవంబరు 15న కుదిరిన శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం ఈ ఏర్పాటు జరిగింది. కోస్తా ఆంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య ఈ ఒడంబడిక కుదిరింది. అందుకు అనుగుణంగా విశ్వవిద్యాలయాన్ని అప్పుడున్నచోటే కొనసాగించాలని నిర్ణయించారు. 1927 ఆరంభంలో యూనివర్శిటీని ఉత్తర కోస్తాజిల్లా విశాఖపట్టణం (వాల్తేరు)లో నెలకొల్పారు. శ్రీబాగ్ ఒడంబడిక వివరాలు అపెండిక్స్ 1.1లో ఇవ్వబడినాయి.

నిజాం రాజ్యమైన హైదరాబాద్ ఈలోగా ఇండియన్ యూనియన్‌లో భాగంగా మారింది. 1948 సెప్టెంబరు 13-18 తేదీల మధ్య భారత ప్రభుత్వం జరిపిన పోలీసు చర్య ద్వారా ఈ పరిణామం సంభవించింది. 1949 ఆఖరు దాకా హైదరాబాద్ స్టేట్‌ను మిలటరీ గవర్నర్ పాలనలో ఉంచారు. 1950 జనవరిలో ఎంఎ వెల్లోడి ఐసిఎస్ అధికారిని ముఖ్యమంత్రిని చేశారు. నిజాంకు రాజ్‌ప్రముఖ్ హోదా కల్పించారు. 1952లో సార్వత్రిక ఎన్నికల తరువాత బూర్గుల రామకృష్ణారావు సారథ్యంలో మొదటి ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. 1952-56 మధ్య హైదరాబాద్ రాష్ట్రంలో మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, హైదరాబాద్ నగరం (రంగారెడ్డి జిల్లాతో కలిపి) ఉండేవి. ఇవన్నీ తెలుగు మాట్లాడే ప్రాంతాలే. ఈ అన్ని జిల్లాల్లో ప్రజల భాష తెలుగే. మరాఠి మాట్లాడే ఉత్తర జిల్లాలైన ఔరంగాబాద్, బీర్, పర్బని, ఉస్మానాబాద్, నాందేడ్,

అలాగే కన్నడ భాషాప్రాంతాలైన దక్షిణ ప్రాంతపు జిల్లాలు గుల్‌బర్గా, రాయచూర్, బీదర్‌లు కూడా హైదరాబాద్ రాష్ట్రంలోనివి. హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు భాషా జిల్లాలన్నీ కలిపి 50శాతం కంటే ఎక్కువ ప్రాంతం. అందుకు విరుద్ధంగా నిజాం పాలనలో హైదరాబాద్ రాష్ట్రం అటు ఇంగ్లీషు, ఇటు ప్రజలభాష ఏదీ కాకుండా పరభాష పరిపాలనా భాషగా వుంది. ప్రధానంగా పాలనాభాష, బోధనాభాష, కోర్టు వ్యవహారాల భాష ఉర్దూయే.

1953 అక్టోబరులో ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, ఇతర భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు డిమాండ్ ఊపందుకుంది. 1953 డిసెంబరు 22న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రాష్ట్రాల పునర్విభజన కమిషన్ (ఎస్ఆర్‌సి) ఏర్పాటు నిర్ణయం లోక్‌సభలో ప్రకటించారు.'లక్ష్యశుద్ధితో పక్షపాత రహితంగా' ఇండియన్ యూనియన్‌లోని రాష్ట్రాల పునర్విభజన అంశాన్ని పరిశీలించడానికి ఈ ఎస్ఆర్‌సి నిర్ణయాన్ని తీసుకున్నారు. అందుకు అనుగుణంగా 1953 డిసెంబరు 29న భారత ప్రభుత్వ హోం వ్యవహారాల శాఖ ఒక తీర్మానం ద్వారా ఈ కమిషన్‌ను జస్టిస్ ఎస్ ఫజల్ అలీ సారధ్యంలో హెచ్.ఎన్.కుంజురు, కె.ఎం.ఫణికర్ సభ్యులుగా నియమించింది. భాష ప్రాతిపదికగా రాష్ట్రాల పునర్విభజనను సిఫార్సు చేయడానికి ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కమిషన్ తన నివేదికను 1955లో భారత ప్రభుత్వానికి నివేదించింది. ప్రజాస్వామ్య వ్యవస్థల సక్రమ నిర్వహణకు, ప్రభుత్వంతో ప్రజల అర్థవంతమైన సంప్రదింపులకు భాష చాలా బలమైన ఆధారమని తన చర్చల సందర్భంగా కమిషన్ నిర్ధారణకు వచ్చిందని ఆ నివేదికలో పేర్కొన్నారు.

ఎస్ఆర్‌సి అందుకు అనుగుణంగా ప్రజల భాషా ప్రయుక్త సమిష్టిజీవనసూత్రం ప్రాతిపదికగా రాష్ట్రాల పునర్విభజనకు ఏకగ్రీవంగా సూచించింది. ఈ సిఫార్సుల ఆధారంగా రాష్ట్రాల పునర్విభజన చట్టం పార్లమెంటులో ఆమోదం పొంది 1956 నవంబరు 1న అమలులోకి వచ్చింది.

## ఎస్ఆర్‌సి తన నివేదికలో ఇంకా ఇలా చెప్పింది:

హైదరాబాద్ భవిష్యతు ప్రకారం దక్షిణ భారతంలో రాష్ట్రాల పునర్విభజన భవిష్యతు ఆధారపడి వుందని, రాష్ట్రాలను భాష ఆధారంగా పునర్విభజించాలని ప్రజల మద్దతుతో గట్టి డిమాండ్ వినపడుతోందని మేము తీర్మానానికి వచ్చి ఎస్ఆర్‌సి చేసిన సిఫార్సులు :

1. కన్నడ భాష మాట్లాడే జిల్లాలైన రాయచూర్, గుల్బర్గాలను అప్పటి మైసూర్ స్టేట్‌కు (ప్రతిపాదిత కర్నాటక రాష్ట్రానికి) బదిలీ చేయాలి.
2. హైదరాబాద్ రాష్ట్రం నుంచి మరాట్‌వాడా జిల్లాలను వేరుచేసి ప్రధానంగా తెలుగు మాట్లాడే ప్రాంతాలను ప్రత్యేకంగా ఉంచాలి.
3. ఆయా పరభాషా ప్రాంతాలను వేరుచేయగా మిగిలిన హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రాలో కలవవచ్చు. ఈ ప్రక్రియ 1961లో జరుగనున్న సాధారణ ఎన్నికల తరువాత సాగాలి. అటువంటి కలయికకు అనుకూలంగా హైదరాబాద్‌స్టేట్ శాసనసభ మూడింట రెండువంతుల మెజారిటీతో తీర్మానం ఆమోదించాలి.

పరభాషా ప్రాంతాలను వేరుచేశాక మిగిలిన రాష్ట్రం హైదరాబాద్ స్టేట్‌గా పిలువబడుతూనే తెలుగు మాట్లాడే మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ (ఖమ్మంతో సహా) కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, మెదక్ జిల్లాలు అందులో భాగాలుగా కొనసాగుతాయి. అలాగే బీదర్ జిల్లా కూడా హైదరాబాద్ రాష్ట్రంలో వుంటుంది. నల్గొండ జిల్లాలోని మునగాల ప్రాంతం కూడా.

1955లో హైదరాబాద్ రాష్ట్రం పైన పేర్కొన్న తెలుగు మాట్లాడే జిల్లాలతో తక్షణమే ఆంధ్ర రాష్ట్రంతో కలవాల్సిన పనిలేదనీ, అంతకుముందు హైదరాబాద్ ప్రజలకు ఆలోచించి నిర్ణయానికి తగినంత సమయం ఇవ్వాలనీ తమ భవిష్యత్తుపై తగిన నిర్ణయానికి రావడానికి తదుపరి ఆరేళ్ళ తరువాత జరగనున్న సార్వత్రిక ఎన్నికల దాకా వ్యవధిని ఎస్ఆర్సి ఇచ్చింది. ఈ అంశంపై వివరణాత్మకమైన సంప్రదింపులలో కూడా కమిషన్ అనేక అవకాశాలను చర్చించింది. వాటిని ముఖ్యంగా రెండు సావకాశాలుగా తన నివేదికలో పేర్కొంది.

## 'విశాలాంధ్ర' ఎన్నదగిన ఆలోచన

1. విశాలాంధ్ర ఏర్పాటు ఒక ఆదర్శవంతమైన ఆలోచన. ఇందుకు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల రెండింటా అనేక ప్రజాసంస్థలు, వ్యక్తుల సానుకూలత చాలా కాలంగా వుంది. ఈ ఆలోచనకు వ్యతిరేకంగా బలమైన వ్యక్తీకరణలు వుంటే తప్ప విశాలాంధ్ర ఏర్పాటు ఆలోచన పరిశీలనకు అర్హమైనది.

2. విశాలాంధ్ర ఏర్పాటువల్ల మరో సానుకూల అంశమేమిటంటే కృష్ణా, గోదావరి నదుల రెంటి అభివృద్ధిని ఒక ఏకీకృత నియంత్రణ క్రిందకు తీసుకురావచ్చు. కృష్ణా, గోదావరి ప్రాజక్టు దేశంలో కెల్లా అత్యంత ఆశావహమైనది. విశాలాంధ్ర అంతర్భాగంగా తెలంగాణా ప్రాంతం నేరుగాను, పరోక్షంగానూ చాలా లాభపడుతుంది. కనుక ఆంధ్ర రాష్ట్రంతో దాని విలీనం గురించి ఎంతైనా వివరించవచ్చు.

3. అందుచేత విశాలాంధ్ర ఏర్పాటుకు అనుకూలంగా ఎంతో ఆసక్తికరమైన వాదనలు ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణకు అనుకూలమైన వాదనలకు అంతటి బలంలేదు కనుక వాటిని సున్నితంగా పక్కన పెట్టవచ్చు.

4. విద్యావిషయకంగా వెనుకబడి వున్న తమను ఆధునికత మరింతగా సాధించిన కోస్తా ప్రాంతపు ప్రజలు విపరీతంగా కమ్మేసి, ఆక్రమణ ధోరణిలో దోపిడి చేస్తారని తెలంగాణ ప్రజలు భయపడ్డమే విశాలాంధ్ర ఏర్పాటు ప్రతిపాదనకు ముఖ్యమైన వ్యతిరేకతగా కనిపిస్తోంది. హైదరాబాద్ నగరానికి వెలుపల గల జిల్లాల్లో విద్య అత్యంత వెనుకబడి వుంది. తాము ఆంధ్రలో కలిస్తే తమను ఆంధ్రప్రజలతో సమానమైన ప్రతిపత్తి ఇవ్వకుండా చిన్నచూపు చూస్తారని తెలంగాణ ప్రజల నిజమైన భయం. ఈ భాగస్వామ్యంలో తక్షణ ప్రయోజనాలను ప్రధాన భాగస్వామి దొరకపుచ్చుకొని కోస్తా ప్రజలు చేతిలో తెలంగాణ ఒక వలస ప్రాంతంగా మిగిలిపోతుంది అనికూడా తెలంగాణలో ప్రజల సంకోచం.

రాష్ట్రాల పునర్విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ రాష్ట్రంలోని మరాఠి భాషా జిల్లాలను అప్పటి బొంబాయి రాష్ట్రంతోను, కన్నడ భాషా జిల్లాలను అప్పటి మైసూర్ రాష్ట్రంలోను విలీనం చేశారు.

## తెలుగు భాషకు ఒకే రాష్ట్రం

ఈలోగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కాలం నుంచి తెలుగు భాషా ప్రాంతాలను కలపాలన్న ఆలోచన పార్లమెంటు చర్చల్లో 1953-55 కాలంలో వినపడేది. కర్నూలు స్థానే హైదరాబాద్‌ను అలా ఏర్పడే తెలుగు ప్రజల ఏకైక రాష్ట్రానికి రాజధానిని చేయాలని బలమైన వ్యక్తీకరణలుకూడా అప్పుడు వినపడేవి.

ఉదాహరణగా చెప్పాలంటే నిజామాబాద్ ఎంపి శ్రీహెడ 1953 ఆగస్టు 19న లోక్‌సభలో ఆంధ్రరాష్ట్ర బిల్లుపై మాట్లాడుతూ ఇలా అన్నారు.

దురదృష్టవశాత్తు 11 జిల్లాల ఆంధ్రరాష్ట్రం మొత్తంలో జిల్లా కేంద్రంగా పేర్కొనదగ్గ ఒక్క పట్టణం కూడా లేదని నా అభిప్రాయం. అదృష్టవశాత్తు హైదరాబాద్ రాజధానికి అర్హతకలిగి అన్నివిధాలా సిద్ధంగా అందుబాటులో వున్న నగరం. మొత్తం భారతదేశంలోని ఉత్తమ నగరాలలో ఒకటి. చక్కని సిమెంట్‌రోడ్లు, చక్కని ఎన్నో భవనాలు, ఉత్తమ నగరానికి కావలసిన అన్ని సౌకర్యాలు సిద్ధంగా వున్న నగరం. అందుచేత హైదరాబాద్‌ను రాజధానిగా చేస్తూ నిర్ణయం తీసుకుంటే అనేక చిక్కులు తొలగిపోతాయి.

విశాలాంధ్రకు హైదరాబాద్ భవిష్య రాజధాని అయ్యే పక్షంలో ఇప్పటికే వున్న సౌకర్యాలను, లింకులను అభివృద్ధిపరచి ఆంధ్రరాష్ట్రానికి రాజధానిగా ఎందుకు చేయకూడదు...

అదేరోజున అదేబిల్లుపై కరీంనగర్ ఎంపి శ్రీఎమ్మార్ కృష్ణ మాట్లాడుతూ అదే రకం అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆయన ఏమన్నారంటే :-

'........... తాత్కాలిక రాజధానిని హైదరాబాద్ వెలుపల ఉంచే బదులు హైదరాబాద్‌ని తక్షణమే విడగొట్టి రాజధానిని అక్కడ నెలకొల్పాలి'.

## శ్రీకృష్ణాచార్యజోషి అనే యాదగిరి పార్లమెంటుసభ్యుడు అదే చర్చలో ఏమన్నారో చూద్దాం...

'హైదరాబాద్‌ను విడగొట్టి తెలంగాణ 8 జిల్లాలను ఆంధ్రాతో కలపకపోతే ఆంధ్రరాష్ట్రం అసంపూర్ణంగా మిగులుతుందని చాలా మంది ప్రజలు భావిస్తున్నారు....'.

## హైదరాబాద్‌కు తెలుగు రాష్ట్ర రాజధాని యోగ్యత

వేరే మాటల్లో చెప్పాలంటే ఆంధ్రరాష్ట్రపు రాజధానిగా హైదరాబాద్ నగరం (కర్నూలు కాకుండా) వుండాలన్నది పెద్దగా వ్యక్తమైన అభిప్రాయం. తెలుగు భాషాప్రాంతాల ఏకీకరణ అట్టే దూరంలో లేదని అనిపిస్తోంది. 1953లో పార్లమెంటులో హైదరాబాద్ గురించి ఈ అభిప్రాయాలు ఏర్పడగా సికింద్రాబాద్‌లో 1955 నవంబరులో ఏర్పాటుచేసిన తెలంగాణా మహాసభలో ఎంపి హరిచంద్ర హెడ తన ముందునాటి వైఖరిని మార్చుకుని ప్రత్యేక తెలంగాణా ఏర్పాటును గట్టిగా సమర్థించారు. ఈ మహాసభలో ఆ మేరకు ఆమోదించిన తీర్మానంలో హెడాకు మద్దతుగా తెలంగాణ అనుకూల వాదులుగా పేరొందిన కెవి రంగారెడ్డి, చెన్నారెడ్డితో పాటు అనేకమంది సీనియర్ కాంగ్రెసు నాయకులు మద్దతు పలికారు. వారిలో జెవి నర్సింగరావు, ఎంపి అహ్మద్ మోహియుద్దీన్, ఎం. హన్మంతరావు వంటి వారున్నారు.

## తెలుగులకు ఒకే వేదిక

1946లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు సూత్రబద్ధంగా జాతీయ నాయకులు ఆమోదించాక తెలుగు భాషా ప్రాంతాలకు ఒకే రాష్ట్రం వుండాలన్న అభిప్రాయం బలం పుంజుకుంది. ఈ లక్ష్య సాధనతో విశాలాంధ్ర మహాసభ ఆంధ్ర ప్రాంతపు నాయకులతో 1949లో ఏర్పడింది. హైదరాబాద్ రాష్ట్రంలోని చాలామంది ప్రజల మద్దతు కూడా ఈ సంఘానికి వుంది. నిజానికి, 1937లోనే సర్కారు జిల్లాల్లో తెలుగు భాషా ప్రాంతాలకు ఒకే రాష్ట్రం వాదన బయలుదేరింది. తెలంగాణతో సహా అన్ని తెలుగు

ప్రాంతాలకు ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు లక్ష్యంతో ఆంధ్ర కాంగ్రెస్ స్వరాజ్య పార్టీ ఏర్పడింది. 1942 అక్టోబరులో ఆంధ్ర మహాసభ వర్కింగ్ కమిటీ విశాలాంధ్రకు అనుకూలంగా తీర్మానం ఆమోదించింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక, ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్‌ను 1948లో కలిపాక విశాలాంధ్ర డిమాండ్ ఊపందుకుంది. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సానుకూలత వ్యక్తం చేసిన 10 రోజుల తరువాత 1949 నవంబరులో అయ్యదేవర కాళేశ్వరరావు (ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యారు) విశాలాంధ్ర మహాసభను రూపొందించారు. 1950 ఫిబ్రవరిలో విశాలాంధ్ర మహాసభ స్టాండింగ్ కమిటీ వరంగల్‌లో సమావేశమై తక్షణమే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు, హైదరాబాద్ రాష్ట్రంలో భాషాప్రాంతాల విభజనకు, హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్ర ఏర్పాటుకు డిమాండు చేసింది. ఒక నెల తరువాత, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఒక తీర్మానాన్ని చేస్తూ హైదరాబాద్ రాష్ట్రం నుంచి తెలుగు భాషా ప్రాంతాల ఏర్పాటుకు ఆ ప్రాంతాలు (తెలంగాణ, మరాట్వాడా, కర్నాటక) అనుకొని వున్న భాషా పరమైన రాష్ట్రాల్లో విలీనానికి డిమాండ్ చేసింది. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు అనుకూలంగా భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక ఈ కృషి మరింత ముమ్మరమైంది. ఈ పరిణామాలతో నిమిత్తం లేకుండా హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగుభాషా ప్రాంతాల్లో ప్రత్యేక గుర్తింపును నిలబెట్టుకోవడానికి వ్యతిరేక అభిప్రాయం గట్టిగా బయలుదేరింది. ఆ కాలంలో పండిట్ నెహ్రూ హైదరాబాద్ రాష్ట్ర ప్రత్యేకతకు అనుకూలంగా ఆరంభంలో మాట్లాడారు. దీనితో హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగుభాషా ప్రాంత స్వతంత్ర ప్రతిపత్తి నిలబడాలన్న వాదానికి అనుకూలత కూడా పెరిగింది. అందుకోసం వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయడం కూడా మొదలైంది. అందుకనుగుణంగా ఎస్ఆర్‌సి అన్నది ఏకీకరణకు అనుకూల వ్యతిరేక వర్గాల వేదికగా మారింది. వారుభయులు తమ అభిప్రాయాలను ఎస్ఆర్‌సికి సమర్ధంగా నివేదించారు. అందుచేతనే ఎస్ఆర్‌సి హైదరాబాద్ ప్రతిపత్తి విషయంలో నిర్ణయం తీసుకోలేకపోయిందని కొందరంటారు. ఎస్ఆర్‌సికి మెమోరాండంను సమర్పించే విషయంలో కెవి రంగారెడ్డి సారథ్యంలో హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ హైదరాబాద్ రాష్ట్రంలోని మూడు భాషా ప్రాంతాల భవిష్యతును తెలంగాణా, మరాట్వాడా, కర్నాటక ప్రాంతాల కాంగ్రెస్ డెలిగేట్లు నిర్ణయించాలని 1954లో తీర్మానించింది. కెవి రంగారెడ్డి ప్రత్యేక హైదరాబాద్ తెలుగు రాష్ట్రాన్ని సమర్థించారు. ఈ డెలిగేట్ల సమావేశాలు 1954 జూన్‌లో విడివిడిగా జరగాల్సి ఉండెను. అప్పుడు తెలంగాణా డెలిగేట్ల సంఖ్య 107 కాగా సమావేశానికి హాజరైన వారి సంఖ్య 50 మాత్రమే. మరునాడు ఓటింగ్ సమయానికి 44 మంది మాత్రమే హాజరయ్యారు. కె.వి.రంగారెడ్డి సైతం హాజరుకాలేదు. హైదరాబాద్ ప్రత్యేకరాష్ట్రం వాదనను సమర్థించిన డా.ఎమ్. చెన్నారెడ్డి అప్పటి హైదరాబాద్ ప్రభుత్వంలో మంత్రి. రెండు తెలుగు రాష్ట్రాల ఏర్పాటు సిఫార్సు చేసే తీర్మానాన్ని ఆయనే ప్రతిపాదించారు. 31-13తో తీర్మానం నెగ్గింది. వ్యతిరేకించిన 13 మంది డెలిగేట్లు ఆ తీర్మానం మొత్తం తెలంగాణా ప్రజల అభిప్రాయాలను ప్రతిఫలిస్తున్నట్లుగా భావించరాదని పేర్కొన్నారు. ఏకైక తెలుగు రాష్ట్రం ఏర్పాటుద్వారా తెలంగాణ ప్రజల ఐక్యతను పరిరక్షించాలని హైదరాబాద్ పిసిసి కార్యవర్గం భావించింది. తెలంగాణ జిల్లాలు తాము మరాట్వాడా, కర్నాటక జిల్లాల్లోని కొన్ని తెలుగు భాషా ప్రాంతాలు, తూర్పుగోదావరి జిల్లాలోని భద్రాచలం తాలూకాలోని కొంతప్రాంతం కలిసి హైదరాబాద్ రాష్ట్రం (తెలంగాణ రాష్ట్రం) ఉండాలని కడకు డిమాండ్ చేయడం జరిగింది.

## కలిసిపోదామన్న హైదరాబాద్ అసెంబ్లీ

అయితే ఎస్ఆర్సి ప్రతిపాదించినట్లుగా అయిదేళ్ళ కాలం వేచి వుండక్కరలేకుండా వెంటనే తెలంగాణా ఆంధ్రప్రాంతాలను విలీనం చేయాలని ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు 1955 అక్టోబరు 22 నాటి ముఖ్యమంత్రుల మహాసభలో సూచించారు. ఈ పరిస్థితిలో ఎస్ఆర్సి నివేదికపై 1955 నవంబరు 25 నుంచి డిసెంబరు 3 దాకా హైదరాబాద్ అసెంబ్లీ ఒక అధికారిక తీర్మానాన్ని చర్చించింది. ఈ చర్చలో వైఖరి ఎలావుందంటే స్పీకరు మినహా సభలోని 174 మంది సభ్యులు ఈ చర్చలో పాల్గొనగా 147 మంది తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వారిలో 103 మంది విశాలాంధ్రకు మద్దతు పలికారు. 29 మంది స్వతంత్ర హైదరాబాద్ స్టేట్‌ను బలపరిచారు. 15 మంది తటస్థంగా మిగిలారు. 'ఏకీకృత విస్తృత తెలుగు రాష్ట్రం' ప్రతిపాదనను మరికొంత పరిశీలించాలని ఇండియన్ నేషనల్ కాంగ్రెసు నాయకత్వం నిర్ణయించింది. ఎందుకంటే ఈ అంశంపై అభిప్రాయాలు కొంతవరకు చీలిపోయి వున్నాయి కనుక. అందుకుగాను ఒక సబ్‌కమిటీని కాంగ్రెస్ పార్టీ ఏర్పరచింది. అందుచేత భారత ప్రభుత్వం ఎస్ఆర్సి సిఫార్సుల్లో మిగతా వాటిని ఆమోదిస్తూ ఈ ఒక్క అంశంపై నిర్ణయాన్ని పక్కన పెట్టింది. ఆ కాలంలో హైదరాబాద్, ఆంధ్రరాష్ట్రాలు రెండింటా కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంది. (సబ్‌కమిటీకి చెందిన కొందరు సభ్యులు హైదరాబాద్ రాష్ట్రాన్ని రెండుసార్లు సందర్శించారు. ఆ బృందానికి కాంగ్రెస్ అధ్యక్షులు యుఎన్ దేవర్ సారథ్యం వహించారు. ఆ బృందంలో పండిట్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, కె.ఎన్.కట్జు తదితరులు కూడా వున్నారు. 1955 డిసెంబరు నుంచి 1956 జనవరి మధ్య ఈ సందర్శనలు చోటు చేసుకున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రాన్ని మూడు భాగాలు చేయాలని నిర్ణయించారు. అయితే హైదరాబాద్ రాష్ట్రంలో సబ్‌కమిటి ఎటువంటి నిర్ణయం చేయలేకపోయింది. ఆంధ్రాతో అన్యభాష రాష్ట్రాలు పోను తక్కిన హైదరాబాద్ రాష్ట్రాన్ని కలిపే విషయంపై కాంగ్రెస్ జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకోలేకపోయింది. ఎందుకంటే పార్టీ సీనియర్ నాయకుడు మౌలానా ఆజాద్ అటువంటి విలీనాన్ని వ్యతిరేకించారు. అయితే ఒకపక్క ఆంధ్రా నాయకుల్లో చాలా మంది, మరోప్రక్క హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రజాభిప్రాయం విలీనానికి అనుకూలంగా వుండటంతో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రంగంలోకి దిగి మౌలానా ఆజాద్‌కు నచ్చజెప్పిన ఫలితంగా విశాలాంధ్ర ఏర్పాటుకు అనుకూలంగా కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంది. 1955 అక్టోబరు నాటి ముఖ్యమంత్రుల మహాసభలో ఇరువురు ముఖ్యమంత్రులు ముందుకు తెచ్చిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఏకీకృత రాష్ట్రం ఏర్పాటుకు తలూపింది. ఈ పరిణామాలతో సంబంధం లేకుండా అప్పటి హైదరాబాద్ ప్రభుత్వంలో మంత్రులైన కెవి రంగారెడ్డి, ఎం.చెన్నారెడ్డి రెండు ప్రత్యేకరాష్ట్రాల డిమాండ్‌కు కట్టుబడి వున్నారు. ఆ లక్ష్య సాధన దిశగా తమ కృషిని కొనసాగించారు. ఈ సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణా ప్రయోజనాలను పరిరక్షించడానికి ఆంక్షలు వుండాలన్న తలంపు బలం పుంజుకుంది. ఈ దిశగా సాగిన కృషి ఫలితంగా ఈ రెండు ప్రాంతాల మధ్య ఒక ఒడంబడికకు రూపం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశంపై రెండు ప్రాంతాల ప్రతినిధుల సమావేశం ఢిల్లీలో జరిగింది. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో 1956లో ఫిబ్రవరి 20న ఈ సమావేశం జరిగింది. ఇరు ప్రభుత్వాలు, పిసిసిలలోని అత్యున్నతస్థాయి నాయకులు సమాన సంఖ్యలో ప్రతినిధులుగా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో కూలంకష చర్చల తర్వాత తెలంగాణ ప్రాంతం భద్రత కోసం 'తెలంగాణ క్షేమంకోసం' అనే ఒడంబడిక పత్రంపై పాల్గొన్న 8 పక్షాలూ సంతకాలు చేశాయి. అతి ముఖ్యమైన ఈ సమావేశం చర్చోపచర్చల పత్రంపై ఉభయ గ్రూపుల వారూ సంతకాలు చేశారు. దీనినే పెద్ద మనుషుల ఒప్పందంగా పేర్కొంటారు. ఇది 1956లో కుదిరిన ఒడంబడిక.

ఇందులోని అంశాలు ఏమిటో కింద చూద్దాం...

## తెలంగాణ రక్షణ చర్యల ఒడంబడిక

**న్యూఢిల్లీలో 1956 ఫిబ్రవరి 20న హైదరాబాద్ హౌస్‌లో జరిగిన సమావేశం-హాజరైనవారు**

1. బెజవాడ గోపాల్ రెడ్డి, 2. నీలం సంజీవరెడ్డి, 3. గౌతు లచ్చన్న, 4. ఎ.సత్యనారాయణ రాజు, 5. బూర్గుల రామకృష్ణరావు, 6. డా॥ మర్రి చెన్నారెడ్డి, 7. జె.వి.నర్సింగరావు, 8. కె.వి.రంగారెడ్డి.

## చర్చకు వచ్చిన ముఖ్యాంశాలు...

1. రాష్ట్రానికి చెందిన కేంద్ర, సాధారణ పాలనాఖర్చులు ఈ రెండు ప్రాంతాలు దామాషా పద్ధతిలో భరించాలి. తెలంగాణ ప్రాంతంనుంచి వచ్చిన ఆదాయంలో మిగులును ఆ ప్రాంతం అభివృద్ధి ఖర్చుకు గాను ప్రత్యేకించి ఉంచాలి. ఈ ఏర్పాటును అయిదేళ్ళ తరువాత సమీక్షించాలి. అసెంబ్లీలోని తెలంగాణ సభ్యులకు ఆమోదయోగ్యం అయితే మరో అయిదేళ్ళపాటు ఈ ఏర్పాటును కొనసాగించాలి.
2. తెలంగాణ ప్రాంతంలో మద్యనిషేధం అమలుకు ఆ ప్రాంతంలోని అసెంబ్లీ సభ్యులు నిర్ణయించిన మార్గాన్ని అనుసరించాలి. తెలంగాణ ప్రాంతంలోని ప్రస్తుత విద్యా సౌకర్యాలను తెలంగాణా ప్రాంతం విద్యార్థులకే అందుబాటులో వుంచాలి. అంతేకాకుండా వాటిని మరింతగా మెరుగుపరచాలి.
3. తెలంగాణ ప్రాంతంలో ప్రస్తుతమున్న సాంకేతిక విద్యాసంస్థలతో సహా అన్ని కాలేజీలలో ప్రవేశాలను తెలంగాణా ప్రాంతపు విద్యార్థులకు పరిమితం చేయాలి. లేదా మొత్తం రాష్ట్రంలోని అడ్మిషన్లలో మూడింట ఒకవంతు అడ్మిషన్లను తెలంగాణ ప్రాంతపు విద్యార్థులకు ప్రత్యేకించాలి. ఈ విషయంలో తెలంగాణ విద్యార్థులకు సానుకూలమైన, ప్రయోజనకరమైన విధానాన్ని అవలంబించాలి.
4. రెండు ప్రాంతాల ఏకీకరణ వల్ల ఉద్యోగుల రిట్రించ్‌మెంట్ తప్పనిసరి అయితే ఇరు ప్రాంతాల్లో తగిన నిష్పత్తిలో రిట్రించ్‌మెంట్లు ఉండాలి.
5. సర్వీసులలోకి భవిష్యతు రిక్రూట్‌మెంట్లకు ఇరు ప్రాంతాల జనాభా సంఖ్యను ప్రాతిపదికగా తీసుకోవాలి.
6. తెలంగాణ ప్రాంతంలో ప్రస్తుతం పాలనా వ్యవహారాలకూ, కోర్టు వ్యవహారాలకూ అమలులో వున్న ఉర్దూ హెూదాను మరో అయిదేళ్ళపాటు కొనసాగించి అప్పటి పరిస్థితిని ప్రాంతీయ మండలి రివైజ్ చేయాలి. ఇంతవరకూ సర్వీసులలోకి రిక్రూట్‌మెంట్ల విషయానికి వస్తే తెలుగులో పరిజ్ఞానం వుండాలనే షరతులేదు. అయితే వారిని రిక్రూట్‌చేసుకున్న రెండేళ్ళలోగా నిర్ణీత తెలుగుపరీక్షలో ఉత్తీర్ణులవ్వాలనే నిబంధన ఉంది.
7. తెలంగాణ ప్రాంతంలో సర్వీసులలోకి నిర్ణీత నిష్పత్తి సాధించడానికి ఏదో ఒక విధమైన ప్రాదేశిక నిబంధనలు వుండాలి. ఉదా: 12 ఏళ్ళపాటు ఆ ప్రాంతంలో నివాసం వంటిది. ఇటువంటి నిబంధన తప్పనిసరిగా వుండాలి.
8. తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయభూములు అమ్మకాన్ని ప్రాంతీయ మండలిద్వారా నియంత్రించాలి.

9. తెలంగాణ ప్రాంతం తన అవసరాలకు అనుగుణంగా అన్నివిధాలా అభివృద్ధిని సాధించడానికి ప్రాంతీయ మండలి ఏర్పాటవుతుంది.

10. ఈ ప్రాంతీయ మండలిలో ఈ క్రింది విధంగా 20 మంది సభ్యులు వుంటారు.

ప్రతి జిల్లాకు ప్రాతినిధ్యం వుండేలా 9 మంది అసెంబ్లీ సభ్యులు. వీరిని విడిగా తెలంగాణ అసెంబ్లీ సభ్యులు ఎన్నుకుంటారు. అసెంబ్లీలోని తెలంగాణ ప్రతినిధులు విడిగా ఆరుగురు అసెంబ్లి లేదా పార్లమెంటు సభ్యులను ఎన్నుకుంటారు. అదే విధంగా అసెంబ్లీ వెలుపలి నుంచి 5 మందిని తెలంగాణ అసెంబ్లిసభ్యులు ఎన్నుకుంటారు.

తెలంగాణ ప్రాంతానికి చెందిన అందరు మంత్రులూ సభ్యులుగా వుంటారు. తెలంగాణ నుంచి వచ్చిన ముఖ్యమంత్రి లేదా ఉపముఖ్యమంత్రి ఈ కౌన్సిల్‌కు ఛైర్మన్‌గా వుంటారు. ఇతర క్యాబినెట్ మంత్రులను కూడా ఆహ్వానించవచ్చు.

11. ఎ. ఈ ప్రాంతీయ మండలి చట్టబద్ధమైన సంస్థగా వుంటుంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఏ అంశంపైనైనా ఇది నిర్ణయం తీసుకుంటుంది. ప్రణాళిక - అభివృద్ధి, సాగునీటి పారుదల - ఇతర ప్రాజక్టులు, సాధారణ ప్రణాళికకు లోబడి పారిశ్రామిక అభివృద్ధి, తెలంగాణ ప్రాంతంలో రిక్రూట్‌మెంట్లకు సంబంధించిన అంశాలన్నిందిపై ఈ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రాంతీయమండలికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అభిప్రాయబేధాలు ఉంటే తుది నిర్ణయంకోసం వివాదాన్ని భారత ప్రభుత్వానికి నివేదించవచ్చు.

బి. అంగీకారం ద్వారా ఈ ఒడంబడికను సవరిస్తే తప్ప ప్రతి 10 ఏళ్ళ కొకసారి సమీక్షించవలసి వుంటుంది.

12. దామాషా ప్రకారం మంత్రివర్గంలో 60:40 శాతంగా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు సభ్యులుంటారు. 40 శాతం తెలంగాణ మంత్రులు, ఒకరు తెలంగాణ ముస్లిం అయి వుండాలి.

13. ముఖ్యమంత్రి ఆంధ్రా ప్రాంతంవారైతే ఉపముఖ్యమంత్రి తెలంగాణ ప్రాంతానికి చెందినవారై వుండాలి. అలాగే ముఖ్యమంత్రి తెలంగాణ ప్రాంతం వారైతే ఉపముఖ్యమంత్రి ఆంధ్రాప్రాంతంవారై వుండాలి. ఈ దిగువన పేర్కొన్న మంత్రిత్వ శాఖల్లో రెండు తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన మంత్రులకు కేటాయించాలి.

ఎ. హెూం, బి. ఫైనాన్స్, సి. రెవెన్యూ, డి. ప్రణాళిక-అభివృద్ధి, ఇ. వాణిజ్యం-పరిశ్రమలు.

14. 1962 దాకా తెలంగాణా ప్రాంతానికి వేరుగా పిసిసి వుండాలని హైదరాబాద్ పిసిసి అధ్యక్షులు కోరుతున్నారు. అందుకు ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షునికి అభ్యంతరంలేదు.

1956 ఫిబ్రవరి 20న పై ఒడంబడిక కుదిరింది. దానిపై సంతకాలు చేసినవారు:

ఎ. ఆంధ్రముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి

బి. ఆంధ్ర ఉపముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి

సి. ఆంధ్రమంత్రివర్గ సభ్యుడు, కృషికార్ లోక్‌పార్టి నాయకుడు గౌతు లచ్చన్న (ఈ పార్టి 1955లో ఎన్నికల్లో గెలిచి మంత్రివర్గం ఏర్పాటు చేసిన యునైటెడ్ కాంగ్రెస్ ఫ్రంట్ భాగస్వామ్య పక్షం)

డి. ఎపిసిసి అధ్యక్షుడు ఎ. సత్యనారాయణ రాజు

ఇ. హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు

ఎఫ్. హైదరాబాద్ మంత్రివర్గంలో సభ్యులు కె.వి.రంగారెడ్డి

జి. హైదరాబాద్ ప్రభుత్వంలో మంత్రి డాక్టర్ ఎం.చెన్నారెడ్డి

హెచ్. హైదరాబాద్ పిసిసి అధ్యక్షుడు జె.వి. నర్సింగరావు

ఈ ఒడంబడికను అప్పటి ఉపముఖ్యమంత్రి కె.వి.రంగారెడ్డి తన 'ది స్ట్రగుల్ అండ్ ది బిట్రేయల్' అనే గ్రంథంలో రికార్డు చేశారు. ఆయన కూడా సంతకందారే. ఆయన ఇలా పేర్కొన్నారు.

పైన పేర్కొన్న అంశాలన్నీ 1956 ఫిబ్రవరి 20న జరిగిన ఒక సమావేశంలో అంగీకరించినవే (అంటే ఒడంబడికలోవే). మేము ఈనాడు దిగువన పేర్కొన్న రెండు అంశాలు గురించి మరింతగా చర్చించాం. ఈ రెండు అంశాలపై నాటి సమావేశంలో అంగీకారం కుదరలేదు.

1. కొత్త రాష్ట్రం పేరు :- ముసాయిదా బిల్లులో పేర్కొన్నట్లుగా కొత్తరాష్ట్రం పేరును ఆంధ్ర తెలంగాణగా వుంచాలని తెలంగాణ ప్రతినిధులు కోరుకున్నారు. అయితే ఆంధ్ర ప్రతినిధులు జాయింట్ సెలక్షన్ కమిటీ సవరించిన విధంగా ఆపేరు ఆంధ్రప్రదేశ్‌గా వుండాలని పట్టుబట్టారు.

2. హైకోర్టుకు సంబంధించి గుంటూరులో ఒక బెంచ్ వుండాలని తెలంగాణా ప్రతినిధులు కోరారు. వారు కోరిన ప్రకారం హైకోర్టు ప్రధాన కేంద్రం హైదరాబాద్‌లో వుండాలి. ప్రిన్సిపల్ సీట్‌గా దీన్ని వ్యవహరిస్తారు. అయితే ఆంధ్రప్రాంతం ప్రతినిధులు గుంటూరులో బెంచ్ వుండరాదని మొత్తం హైకోర్టు హైదరాబాద్‌లోనే వుండాలని కోరుకున్నారు. (అయితే హైకోర్టు బెంచ్‌ల విషయంలో రాష్ట్రాల పునర్విభజన చట్టం సంతృప్తికరమైన సూచనచేసి వుంది అని ఇక్కడ గమనించాలి).

తదనంతరం పార్లమెంటు ఎదుట తెలంగాణ పరిరక్షణ ఆంక్షల పత్రాన్ని ఉంచారు. 1956 ఆగస్టు 10న లోక్‌సభలో దీనిని వుంచారు. భారతరాష్ట్రపతి ఆమోదించిన విధంగా 1958 ఆంధ్రప్రదేశ్ రీజనల్ కమిటీ ఉత్తర్వు 1958 ఫిబ్రవరి 1న జారీ చేశారు.

## ఎ. ప్రాంతీయ స్థాయీ సంఘం

1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికి ఒకే శాసనసభ వుంటుంది. మొత్తం రాష్ట్రానికి శాసనాలను తయారుచేసే వ్యవస్థగా ఈ సభ వుంటుంది. రాష్ట్రం మొత్తానికి ఒక గవర్నర్ వుంటారు. మంత్రిమండలి సభ్యులు ఈ గవర్నర్‌కి సలహాలు ఇస్తూ వుంటారు. మంత్రులు పాలనా యంత్రాంగం మొత్తానికి, అసెంబ్లీకి బాధ్యులై వుంటారు.

2. కొన్ని ప్రత్యేక అంశాల విషయంలో ప్రభుత్వ కార్యకలాపాలు మరింత సానుకూలంగా వుండటానికి తెలంగాణా ప్రాంతాన్ని ఒక ప్రదేశంగా పరిగణిస్తారు.

3. తెలంగాణా ప్రాంతానికి రాష్ట్ర విధానసభ స్థాయీ సంఘం వుంటుంది. అది ఆ ప్రాంతపు రాష్ట్ర అసెంబ్లీ సభ్యులతో కూడుకుని వుంటుంది. వారిలో ఆ ప్రాంతపు మంత్రులు కూడా వుంటారు. అయితే ముఖ్యమంత్రి ఆప్రాంతం వాడైతే ఆయన దాని సభ్యుడు కాదు.

4. ప్రత్యేక వ్యవహారాలకు సంబంధించిన శాసనాన్ని ప్రాంతీయ కమిటీకి రిఫర్ చేస్తారు. ఇటువంటి ప్రత్యేక అంశాల విషయంలో రీజనల్ కమిటి ప్రతిపాదనలు చేసి రాష్ట్రప్రభుత్వానికి శాసనం చేయడంకోసం పంపించవచ్చు. లేదా ఆర్థిక నిబద్ధతకు సంబంధించని సాధారణ విధానపరమైన విషయాల్లో కమిటి తన ప్రతిపాదనలు చేయవచ్చు. అయితే రోజువారి పరిపాలనకు

సంబంధించిన ప్రశ్నలు, ప్రత్యేక సందర్భాలకు సంబంధించిన ఖర్చుల విషయాల్లో కమిటీ ప్రతిపాదనలు చేయనవసరం లేదు.

5. ప్రాంతీయ కమిటీ చేసే సూచనలు లేదా ఇచ్చే సలహాలన్నీ సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రవిధానసభ ఆమోదిస్తాయి. అయితే బేదాభిప్రాయాలు తలెత్తిన సందర్భంలో కమిటీ సిఫార్సులు గవర్నరుకు నివేదిస్తారు. ఆయన నిర్ణయం తప్పనిసరిగా అమలు పర్చాల్సిన తుదినిర్ణయం అవుతుంది.

6. ప్రాంతీయ కమిటీ ఈ క్రింది విషయాల్లో పాలుపంచుకుంటుంది

ఎ) రాష్ట్ర శాసనసభ రూపొందించిన సాధారణ విధానాలు అభివృద్ధి ప్రణాళికల స్వరూపానికి లోబడి ఆర్థిక ప్రణాళిక, అభివృద్ధి అంశాలు.

బి) స్థానిక స్వపరిపాలన, అంటే మున్సిపల్ కార్పొరేషన్, ఇంప్రూవ్‌మెంట్ ట్రస్టులు, డిస్ట్రిక్‌బోర్డులు ఇతర జిల్లా అథారిటీల స్థానిక స్వపరిపాలన, గ్రామీణపాలన యంత్రాంగం కోసం సూచనలు ఇవ్వటం.

సి) ప్రజారోగ్యం-పారిశుద్ధ్యం, స్థానిక ఆసుపత్రులు, ఔషధశాలలు :

డి) ప్రాథమిక మరియు మాధ్యమిక విద్య

ఇ) తెలంగాణ ప్రాంతంలోని విద్యాసంస్థల్లో అడ్మిషన్ల క్రమబద్ధీకరణ

ఎఫ్) మధ్యనిషేధం

జి) వ్యవసాయభూమి అమ్మకం

హెచ్) కుటీర పరిశ్రమలు, మధ్యతరహా పరిశ్రమలు

ఐ) వ్యవసాయం, సహకార సంస్థలు, మార్కెట్లు, సంతలు

ముందే కుదిరిన ఒప్పందం ప్రకారం సవరింకపోతే పదేళ్ళ తరువాత ఈ ఒడంబడికను సమీక్షించవలసి వుంటుంది.

## బి. ప్రాదేశిక నిబంధనలు

తెలంగాణ ప్రాంతాన్ని సబార్డినేట్ సర్వీసుల్లో రిక్రూట్‌మెంట్లకు ఒక యూనిట్‌గా పరిగణించడం జరుగుతుంది. కనీసం 5 ఏళ్ళ పాటు ఆ ప్రాంతంలో ఉండాలని తాత్కాలిక నిబంధనను రిక్రూట్‌మెంట్లలో అమలు చేస్తారు. ఈ ప్రాదేశిక నిబంధనలతో సంతృప్తిపరిచిన వారితోనే ఈ సర్వీసులలో వివిధ క్యాడర్లకు నియామాకాలు జరుగుతాయి. ప్రస్తుత హైదరాబాద్ నిబంధనల ప్రకారం ఈ ప్రాదేశిక నిబంధనలను పాటించడం జరుగుతుంది.

## సి. ఉర్దూ స్థాయి

అయిదేళ్ళ కాలానికి రాష్ట్ర పాలనా వ్యవహారాలు, కోర్టు వ్యవహారాల్లో ఉర్దూకి ప్రస్తుతం గల స్థాయిని కొనసాగించాలి. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సలహా ఇస్తుంది. ఇందుకు తగిన చర్యలు తీసుకోమని సూచిస్తుంది.

## డి. కొత్త రాష్ట్రంలో మిగులు సిబ్బంది రిట్రెంచ్‌మెంట్

రిట్రెంచ్‌మెంట్లు ఉండాలనీ, ఉంటాయనీ కేంద్ర ప్రభుత్వం ఆశించడం లేదు. ఈ నిబంధనల ఉద్దేశం ఏమిటంటే హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో విలీనం అయినప్పుడు ఆ రాష్ట్ర సిబ్బంది

యావత్తునూ కొత్త రాష్ట్రంలోకి బదిలీ చేయాలి. ఇందుకు స్క్రీనింగ్ వంటి ప్రక్రియలను దాటవేయాలి. అయినప్పటికీ రిట్రెంచ్‌మెంట్లు అవసరపడితే విశాలాంధ్రలోని మొత్తం సర్వీసుల యావత్ సిబ్బందిని సమాన స్థాయిలో పరిగణించడం జరుగుతుంది.

## ఇ. తెలంగాణ, ఆంధ్రప్రాంతాల మధ్య ఖర్చుల పంపిణీ

రాష్ట్రానికి గల వనరుల పరిమితికి లోబడి ఖర్చులను కేటాయించడం ఆ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర శాసనసభ పరిధిలోని అంశం. కాబట్టి ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల ప్రతినిధుల మధ్య కుదిరిన ఒప్పందం ఏమిటంటే కొత్తరాష్ట్రంలో కేంద్ర, సాధారణ పరిపాలనా ఖర్చును ఆ రెండు ప్రాంతాలూ దామాషా ప్రకారం భరించాలి. తెలంగాణ ప్రాంతం నుంచి ఖర్చులుపోను మిగిలిన ఆదాయం ఆ ప్రాంతం అభివృద్ధి నిమిత్తం నిక్షిప్తం చేయాలి. బడ్జెటరి కేటాయింపులు చేయడంలో రాష్ట్రప్రభుత్వం ఒడంబడిక షరతుల ప్రకారం మెలగడానికి స్వేచ్ఛ కలిగి వుంటుంది. ఈ ఒడంబడిక పట్ల సరైన అవగాహన ఏర్పరచుకోవాలని ఆంధ్ర ముఖ్యమంత్రికి కేంద్రం సూచిస్తుంది. సరిగా ఒడంబడికను అమలుచేసే నిమిత్తం ఈ అవగాహన కలిగి వుండాలని కేంద్రం ఆకాంక్ష.

కె.వి. రంగారెడ్డి పుస్తకంలో పెద్ద మనుషుల ఒప్పందం, రీజినల్ కమిటి నియమ నిబంధనలతో పాటు ఈ క్రింది విషయాలు కూడా పేర్కొనడం జరిగింది.

పెద్దమనుషుల ఒప్పందం లక్ష్యాలకు కట్టుబడకుండా ఆ ఒప్పందంలోని కొన్ని నిబంధనలను తదనంతరం అమలు చేయకపోవడం వల్ల కొన్ని ఆందోళనలు తలెత్తి రాష్ట్రాన్ని మళ్ళీ విభజించాలని డిమాండ్ తలెత్తింది. 14 ఐటమ్‌లతో కూడిన పెద్దమనుషుల ఒప్పందంలో తెలంగాణా సర్వీసులు, అభివృద్ధి, వ్యవసాయ భూముల అమ్మకం, ఉర్దూహోదా, ముఖ్యమంత్రి / ఉపముఖ్యమంత్రి పదవులకు తగిన రాజకీయ ఏర్పాటు, మంత్రివర్గంలో తెలంగాణ ప్రాంతానికి ప్రాతినిధ్యం వంటి వ్యవహారాల్లో ప్రాంతీయ కమిటి నియమనిబంధనలు, పనిచేసే విధానం గురించి ఈ ఐటమ్‌లలో పేర్కొనడం జరిగింది. అయితే ప్రాంతీయ కమిటి ప్రస్తావన లేదు. మొత్తానికి అసెంబ్లీ ప్రాంతీయ కమిటీని రాజ్యాంగంలోని 371(1) అధికరణ ప్రకారం ఏర్పాటు చేశారు. ఒప్పందంలోని కొన్ని షరతుల అమలుకు వీలుగా దీనిని రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన కొత్తలో తెలంగాణలో అసంతృప్తి రేకెత్తడానికి దారితీసిన పరిస్థితుల్లో పైన పేర్కొన్నది కూడా ఒకటి.

## ఏకీకృత రాష్ట్రం పేరుపై తర్జన భర్జన

ఎస్ఆర్‌సి చట్టం ముసాయిదా బిల్లులో ఏకీకృత రాష్ట్రం పేరును 'ఆంధ్ర-తెలంగాణ'గా పేర్కొన్నారు. ఈ పేరుకు సంబంధించి చర్చలు జరిగిన తరువాత ఒక అవగాహన కుదిరింది. రాష్ట్రం పేరుపై ఆంధ్ర నాయకుల అభిప్రాయాన్ని దృష్టిలో వుంచుకొని జాయింట్ సెలక్ట్ కమిటి తుదకు ఆ పేరును 'ఆంధ్రప్రదేశ్'గా సవరించింది. గుంటూరులో హైకోర్ట్ బెంచ్ విషయం చర్చకు వచ్చిన మరో అంశం. అప్పుడు హైకోర్టు అక్కడే పనిచేస్తోంది. ఎస్ఆర్‌సి చట్టంలో ఈ అంశంలో సెక్షన్ 51(2) నిబంధనల్లో వుంది. హైకోర్ట్‌కు ఆ రాష్ట్రంలో ఒకచోట గాని మరిన్ని చోట్ల గాని శాశ్వత బెంచ్‌ల లేదా బెంచ్ ఏర్పాటు గురించిన నిబంధనలివి. హైకోర్ట్ ప్రిన్సిపల్ బెంచ్ కాకుండా అవసరార్థం ఈ బెంచ్‌లను లేదా బెంచ్‌ని ఏర్పాటు చేయాలని నిబంధనలు సూచిస్తున్నాయి.

## పార్లమెంట్‌కు తెలంగాణ రక్షణ చర్యలు

తెలంగాణ రక్షణ చర్యల నోట్‌ను 1956 ఆగస్టు 10న లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దానిలో భాగంగా తెలంగాణ ప్రాంతం భద్రతకోసం అసెంబ్లీ రీజినల్ కమిటీ ఏర్పాటు అంశాన్ని

కూడా లోక్‌సభ ముందుంచారు. ఈ అంశాలపై కేంద్రప్రభుత్వ పర్యవేక్షణకు వీలు కల్పించాలన్నది ఈ చర్యవెనుక లక్ష్యం. ఆంధ్రప్రదేశ్, బొంబాయి, పంజాబ్ రాష్ట్రాల అభివృద్ధి బోర్డుల అంశం కూడా ఈ నోట్‌లో భాగంగా సభముందుంచారు. అసెంబ్లీ ప్రాంతీయ కమిటీలను ఆంధ్రప్రదేశ్ కోసం ఏర్పాటుచేసే అధికారాన్ని రాష్ట్రపతికి 371 అధికరణ కల్పించింది.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (1956-1973)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అలా అస్తిత్వంలోకి వచ్చింది. ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1956 నవంబరు 1న నూతన రాష్ట్రానికి ప్రారంభోత్సవం చేశారు.

భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏకీకృత రాష్ట్రంగా రాజ్యాంగం ప్రకారం అస్తిత్వంలోకి వచ్చినా ఇంకా అది ఏకరాష్ట్రంగా కాకుండా రెండు రాజకీయపరమైన ప్రత్యేక ప్రాంతాలుగా వ్యవహరించడం మానలేదు. ఆ ప్రాంతాలు తెలంగాణ, ఆంధ్ర. చారిత్రక నేపథ్యంలో సామాజిక, ఆర్థిక అంశాలను పరిగణిస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడు ప్రత్యేక ప్రాంతాలుగా చూడబడుతోంది. అవి : 1. ఆంధ్ర, 2. రాయలసీమ, 3. తెలంగాణ. ఆ తదనంతరం రూపుదిద్దుకుంటున్న పరిణామాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యంగా రెండు ప్రాంతాల రాజకీయ సమ్మిశ్రమంగా చూడబడుతూ వచ్చింది. ఇది ఆ రాష్ట్ర ప్రయోజనాలను మించిన ఇరకాట పరిస్థితికి దారితీస్తూ వచ్చింది. కాలప్రవాహంలో వేర్వేరు సందర్భాల్లో ఆంధ్రప్రదేశ్ గత 54 ఏళ్ళ చరిత్రలో చాలా ఆటుపోట్లను ఎదుర్కొందని ఈ నివేదిక ప్రస్తావించింది. నూతన రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి రెండు దశాబ్దాల్లోని రాష్ట్రం రెండు తీవ్ర ఉద్యమాలను చవిచూసింది. 1969 నాటి 'జై తెలంగాణ' ఉద్యమం ఒకటికాగా, 1972లో 'జై ఆంధ్ర' పేరిట మరో ఉద్యమం తలెత్తింది. మొదటి ఉద్యమం తెలంగాణ ప్రాంతానికి పరిమితం కాగా, తదుపరి ఉద్యమం ఆంధ్ర ప్రాంతంలో తలెత్తింది. ఈ రెండు ఉద్యమాల ప్రభావం మొత్తం రాష్ట్రంపై పడింది. ఈ కాలంలో పెద్దమనుషుల ఒప్పందం అమలును పరీక్షకు పెట్టడం జరిగింది. ఈ ఒప్పందం అమలులో కొన్ని ప్రకాశవంతమైన సందర్భాలున్నా చాలా వరకు ఒప్పందాన్ని తుంగలో తొక్కడమే జరిగిందని విమర్శలు రేకెత్తాయి. ఒప్పందంలో పేర్కొన్న 14 అంశాల్లో ముఖ్యంగా మూడింటి విషయంలో అత్యంత రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రాముఖ్యత ఇవ్వడం జరిగింది. ఈ మూడింటి విషయంలోనే సాధారణంగా అందరి దృష్టి పడింది. ఈ అంశాలు : 1. అధికార పంపిణీ ప్రక్రియలో తెలంగాణాకు ప్రాతినిధ్యానికి సంబంధించిన రాజకీయ అంశాలు, 2. తెలంగాణ ప్రాంతానికి బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయం మరియు రెవెన్యూ మిగులు నిధుల వినియోగంలో అన్యాయాలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక అంశాలు, 3. రాష్ట్రంలో ఉత్పన్నమైన ఉపాధి మరియు విద్యావకాశాల సక్రమ పంపిణీకి సంబంధించిన సమస్యలు. ఇక్కడ మనం ప్రధానంగా చెప్పుకోవాల్సిన అంశం ఏమిటంటే ఆ ఒప్పందం అమలు ప్రారంభమే ఒక నిర్లక్ష్య పూరిత వైఖరితో మొదలైంది. పెద్దమనుషుల ఒప్పందంపై సంతకం చేసిన పెద్దమనిషే ఒప్పందంలోని ముఖ్యమంత్రి/ఉపముఖ్యమంత్రికి సంబంధించిన నియమాన్ని తుంగలో తొక్కారు. ఆ పదవుల ఏర్పాటులో తెలంగాణ ప్రాంతాన్ని దృష్టిలో వుంచుకోవడం జరగలేదు. ఆంధ్రప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. 1956లో ఏర్పడిన మొట్టమొదటి మంత్రివర్గాన్ని ఆరోవేలని ఆయనే అన్నట్టు ప్రతీతి. కాలక్రమంలో సాగుజలాల పంపిణి, భూమి నిర్వహణ వంటివి కూడా తెలంగాణ ప్రాంతంలో తీవ్ర అసంతృప్తికి దారితీసిన అంశాలు. మొదటి మంత్రివర్గం పాలనలో పేరుకొన్న అసంతృప్తి రెండో మంత్రివర్గం నాటికి బద్దలయ్యింది. 1960 జనవరి 11న ఈ రెండో మంత్రివర్గం ఏర్పడింది.

దామోదరం సంజీవయ్య అప్పటి ముఖ్యమంత్రి. ఈ అసంతృప్తిని కొంతవరకు పరిష్కరించే ప్రయత్నం అప్పుడు జరిగింది. సంజీవయ్య సారధ్యంలోని కాలంలోనే కె.వి.రంగారెడ్డికి ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చారు. ఈ ఏర్పాటు కేవలం రెండేళ్ళపాటు సాగింది. తరువాత మళ్ళీ నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చి ఉపముఖ్యమంత్రి పదవికి గుడ్‌బై చెప్పారు. ఈ ముఖ్యమంత్రి / ఉపముఖ్యమంత్రి పదవి పునరుద్ధరించినది 1969లో రగిలిన 'జై తెలంగాణ' ఆందోళన తరువాతే.

1958లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి చెందిన సభ్యులతో ప్రాంతీయ కమిటీ ఏర్పడింది. ప్రాంతీయ ప్రయోజనాలను కాపాడ్డానికి బ్రిటీష్ హౌస్ కామన్స్ ఏర్పాటు చేసిన స్కాటిష్ స్టాండింగ్ కమిటి నమూనాలో ఈ అసెంబ్లీ ప్రాంతీయ కమిటి ఏర్పడిందంటారు. ఈ ప్రయోగం అంతకుముందు పంజాబ్ విషయంలో అమలుచేసి చూశారు. హిందువులు మెజారిటీలో గల హిందీభాషా ప్రాంతాలను, సిక్కులు మెజారిటీలోగల పంజాబీ భాషా ప్రాంతాలను కలిపి ఉంచడానికి పంజాబ్‌లో ఈ అసెంబ్లీ కమిటి నమూనాను ప్రయోగాత్మకంగా అమలుపరచి చూశారు. ఇదే తెలంగాణ పరిరక్షణ కోసం తదనంతర కాలంలో పెద్దమనుషుల ఒడంబడికకు, తరువాత కాలంలో అది అమలు సవ్యంగా లేక అసంతృప్తులు పెచ్చరిల్లడానికి దారితీసింది.

## ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఎన్నికల పర్వం

ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత 1957లో ఆ రాష్ట్ర అసెంబ్లీకి తెలంగాణ నియోజక వర్గాల నుంచి ఎన్నికలు జరిగాయి. అంతకు ముందు నాటి ఆంధ్ర శాసనసభకు 1955లో ఎన్నికలు జరిగినందున అప్పటికి తెలంగాణ ప్రాంతం విలీనం జరగనందున ఇది అవసర పడింది. రాజ్యాంగంలో 371వ అధికరణ క్లాజ్ (i) ద్వారా సంక్రమించిన అధికారాల క్రింద కేంద్ర హోంమంత్రిత్వశాఖ '1958 ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కమిటి ఉత్తర్వు'ను జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1958 మార్చి 13 గెజెట్ నోటిఫికేషన్ ద్వారా ఆ ఉత్తర్వు ప్రతిని ప్రచురించింది. తదనంతర పరిణామాలు ఈ రీజనల్ కమిటి కేవలం పరిమిత పాత్రనే పోషించిందనీ, ముఖ్యంగా 1969 వరకు అనీ నిరూపించాయి. పెద్దమనుషుల ఒప్పందంలో పేర్కొన్న ప్రకారము తెలంగాణ ప్రాంతపు రాజకీయ నాయకులకు అవకాశం కల్పించి, రీజనల్ కౌన్సిల్‌ను అమలు సంస్థగా ఏర్పరచి వుంటే తెలంగాణ ప్రాంతం ఆర్థికంగా ఇతరత్రా అభివృద్ధి చెంది వుండేదనేది అందరూ భావించే అంశం. ఈ కమిటీ ముందు హాజరైన అనేక తెలంగాణ ప్రతినిధి వర్గాలు ఈ అంశాన్ని బలంగా చెప్పాయి. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు రెంటిమధ్య నమ్మకరాహిత్యం మొదలైన నేపథ్యమిది.

ప్రభుత్వ ఉత్తర్వులో ఈ క్రింది అంశాలు లేవని చెప్పవచ్చు.

1. ప్రభుత్వ సర్వీసులకు సంబంధించిన ముఖ్యమైన అంశాలు. అలాగే ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించిన షరతులు.
2. ఆర్థిక నిబద్ధతకు సంబంధించని అంశాలకే 'అభివృద్ధి-ప్రణాళిక' పరిమితమైంది.

   అంతే కాకుండా షెడ్యూల్‌లో చేర్చిన అంశాల్లో ఉన్నత విద్యను కూడా చేర్చాలని తెలంగాణ ప్రాంతం నుంచి గట్టి డిమాండ్ వినిపించింది. ఈ షెడ్యూల్ ముల్కి నిబంధనల అమలుకు ఉద్దేశించినవి. ఈ అంశాలను వదిలివేయడం కూడా తెలంగాణ ప్రాంతంలో అసంతృప్తికి ఆజ్యం పోసింది.

## ఆందోళనల ఆలాపన

ఉద్యోగ నియామకాలు, ఉపాధి అవకాశాల కల్పన విషయంలో జరిగిన అన్యాయమే అసంతృప్తిని ప్రేరేపించి తెలంగాణలో 1968 డిసెంబర్‌లో మొదలైన ఉద్యమానికి ప్రాతిపదిక అయింది. తరువాత చెప్పుకోదగ్గ అంశం 'తెలంగాణ మిగులు ఆదాయం వినియోగించిన విధానం'. ఈ అంశాలపై మొదలైన ఉద్యమం మొత్తం తెలంగాణ ప్రాంతమంతటా విధ్వంసకరంగా పరిణమిస్తూ త్వరత్వరగానే విస్తరించింది. దాదాపు ఒక ఏడాది కాలం ఈ ఉద్యమం కొనసాగి 1969 ద్వితీయార్థంలో ముగిసింది. ఈ ఉద్యమమే 'జై తెలంగాణ' ఉద్యమంగా చరిత్రకు ఎక్కింది. ఈ ఉద్యమం శిఖరస్థాయిలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి 1969 ఏప్రిల్ 11న లోక్‌సభలో ప్రకటన చేశారు. ఆ తరువాత ఉద్యమం హింసాత్మకంగా మారింది. ఈ ప్రకటనలో శ్రీమతి ఇందిరాగాంధి ప్రభుత్వానికీ, తెలంగాణ ప్రాంతీయ కమిటీకి మధ్య అవగాహనా రాహిత్యం గురించి ఘాటుగా ప్రస్తావించారు. ముఖ్యంగా 'తెలంగాణ మిగులు' గా పేరుగాంచిన అంశాలను లోతుగా ప్రస్తావించారు. ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరిస్తూ తెలంగాణ ప్రాంతంలో అభివృద్ధి వేగాన్ని పెంచి, ఉపాధి అవకాశాలను మెరుగు చేయాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి మధ్య పొంతన సాధించడానికి సానుకూల పరిస్థితులు కల్పించాలని అంటూ ఈ లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయవాది ఛైర్మన్‌గా ఒక కమిటీని నియమిస్తుందని ప్రకటించారు. ఆ న్యాయమూర్తికి సహాయకంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల పట్ల అవగాహన గల నిపుణుడైన ఆర్థికవేత్తను, కాగ్ సీనియర్ ప్రతినిధిని సభ్యులుగా నియమిస్తామని కీలక ప్రకటన చేశారు. తెలంగాణకు చెందాల్సిన రెవెన్యూ మిగులు నిధులు తేల్చడానికి కేటాయింపు ప్రతిపాదనలు, ప్రాతినిధ్యాలు నిర్ణయించడానికి ఈ కమిటీని ఆమె సంకల్పించారు. అందుకనుగుణంగా అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశిష్ఠ భార్గవ్ ఛైర్మన్‌గా, ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రొ॥ ఎమ్.వి.మాథుర్, డిప్యూటీ కాగ్ హరిభూషణ్ భాను సభ్యులుగా 1969 ఏప్రిల్ 22న ఈ కమిటీని నియమించారు. 1969 మే నెలాఖరుకు ఈ కమిటీ తన నివేదికను ఇవ్వాలని ఆశించారు. అయితే తరువాత ఆ వ్యవధిని 1969 అక్టోబరు వరకు పొడిగించారు. అంతేకాకుండా తెలంగాణ ప్రజల భయాలను పోగొట్టి, నమ్మకాన్ని ప్రాదుకొల్పే నిమిత్తం 1958-68 కాలంలో తెలంగాణ ప్రాంతీయ కమిటీ పనితీరును అంచనా వేయాలని సంకల్పించారు. ఇందుకోసం 1969 ఆగస్టు 28న అసెంబ్లీ కమిటీ సిఫార్సులను ఆమోదిస్తూ టిఆర్‌సి ఒక తీర్మానం ఆమోదించింది. ఈ తీర్మానాన్ని అప్పటి హోంమంత్రి జలగం వెంగళరావు ప్రవేశపెట్టారు. తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన సర్వీసు నియామకాలు, ఉపాధి అవకాశాల వ్యవహారాలకు సంబంధించిన తీర్మానం ఇది.

**1970 ఫిబ్రవరి 18న కేంద్ర ప్రభుత్వం ఈ క్రింది చర్యలను ప్రకటించింది :**

1. తెలంగాణ ప్రాంతీయ కమిటీకి అప్పగించిన పరిశీలనాంశాల పరిధిని విస్తరించడం.
2. అందుకు సంబంధించిన కమిటీ అధికారాలను విస్తరించడం.

అందుకనుగుణంగా 1958 నాటి అసలు ఉత్తర్వును సవరిస్తూ 1970 మార్చి 7న 371 అధికరణ క్రింద ఒక రాష్ట్రపతి ఉత్తర్వు జారీ అయింది. ఈ ఉత్తర్వు క్రింద కొత్తగా ఈ క్రింది అంశాలు కూడా చేర్చారు.

- రాష్ట్ర ప్రభుత్వం క్రింద తెలంగాణా ప్రాంతంలో ప్రభుత్వ సర్వీసుల్లో నియామకాలకు రిక్రూట్‌మెంట్ పద్ధతులను, సూత్రాలను అనుసరించాలని నిర్దేశించారు.
- రాష్ట్ర ప్రభుత్వంలో తెలంగాణ ప్రాంతానికి తగినంతగా ఉపాధి అవకాశాలు పెంచాలని నిర్దేశించారు.

## హైదరాబాద్‌కు వలసల ఆదిపర్వం

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కాలంలో, 1956లో ఏర్పడిన తరువాత హైదరాబాద్‌కు కోస్తా ఆంధ్రనుంచి వలసలు మొదలై సామాజిక ఉద్రిక్తతలకు దారితీశాయి. నెమ్మదిగా ఈ అసంతృప్తి తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులకు, నిరుద్యోగ యువతకు వ్యాపించింది. తమని నిర్లక్ష్యం చేస్తున్నారనీ కోస్తా ఆంధ్ర ప్రాంతానికి చెందిన పెత్తందారీ వర్గాలు, దూసుకుపోయే గుణం వున్న పారిశ్రామిక వేత్తలూ తమ అవకాశాలను ఆక్రమిస్తున్నారని వారు భావించడం తీవ్రమైంది. తెలంగాణ ప్రాంతంలో అన్ని అర్హతలున్నవారిని కాదని కోస్తా ఆంధ్రప్రాంతం వారితో ఉన్నత పదవులను నింపేస్తున్నారని తీవ్ర అసంతృప్తి రగిలింది. బొంబాయి, మైసూర్ రాష్ట్రాల నుంచి కూడా అర్హులంటూ అభ్యర్థులను రప్పించి పదవులు కట్టబెడుతున్నారని ఆరోపణలు ముంచెత్తాయి. ఇటువంటి పరిస్థితుల నుంచి రక్షణకు 1968 జూలై 10న తెలంగాణ పరిరక్షణ దినాన్ని ప్రారంభించడం తెలంగాణ ప్రాంతంలో మొదలైంది.

1957 పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్టం క్రిందకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ రాదని హైకోర్టు తీర్పు నివ్వడంతో 1969 జనవరిలో తెలంగాణాలో ఆందోళన మొదలైంది. అదే నెలలో ఖమ్మం విద్యార్థి ఒకరు నిరాహారదీక్ష ప్రారంభించడంతో ప్రజల ఆగ్రహం, అసంతృప్తులు మిన్నంటి ఉద్యమానికి దారితీశాయి. జనవరి మధ్య నాటికి ఈ ఉద్యమం తెలంగాణా జిల్లాల్లో ఉధృత రూపం దాల్చింది. అప్పుడే రాష్ట్ర విభజన నినాదం బయలుదేరింది. 1969 జనవరి 18-19 తేదీల్లో రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. తెలంగాణా నుంచి కోస్తా ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపాలన్న డిమాండ్‌తో సహా తెలంగాణకు చెందిన మిగులు నిధుల మొత్తం గురించి చర్చలు జరిగాయి. తెలంగాణ ఆదాయంలో మిగులు నిధులు ఎంత? అనే విషయాన్ని ప్రభుత్వం నియమించే సీనియర్ అధికారి నిర్ణయించడానికి, కోస్తా ఆంధ్రప్రాంతంలో ఉద్యోగాలను కల్పించడం ద్వారా ఆ ప్రాంతం వారిని అక్కడకు పంపేయడానికి ఒప్పందం కుదిరింది. అయితే దురదృష్టవశాత్తు 1969 జనవరి 20న ఆందోళనకారులైన విద్యార్థులపై పోలీసు కాల్పులు జరిగి పరిస్థితి అదుపు తప్పింది. విద్యార్థులు ఈ సంఘటనతో మరింతగా రెచ్చిపోయారు. ఫలితంగా అఖిలపక్ష సమావేశంలో కుదిరిన నిర్ణయాలను శాంతికోసం విన్నపాలు వృధాప్రయాసగా మిగిలాయి. జనవరి 22న తెలంగాణా అంతట ఉద్యమం హింసాత్మక రూపం దాల్చింది. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు తీవ్రనష్టం సంభవించింది. దీనితో నాన్‌ముల్కీ అధికారులందరినీ వారి ప్రస్తుత పదవుల నుంచి తొలగించడానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందుకు 1969 ఫిబ్రవరి 28ని గడువుగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌బోర్డుకు కూడా ముల్కీ నిబంధనలన్నీ వర్తింపచేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ బోర్డుకు రాష్ట్రమే నిధులు కల్పిస్తుందన్న తర్కంతో ఇందుకు సంసిద్ధత ప్రకటించింది. తెలంగాణ మిగులు నిధుల నిర్ధారణకు సీనియర్ అధికారిని నియమించేందుకు కాగ్ సమ్మతి తెలిపింది. ఈ హామీల ఫలితంగా కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు రేకెత్తాయి. ఆ తరువాత తెలంగాణా విద్యార్థి కార్యాచరణ కమిటీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేదాకా తరగతుల బహిష్కరణకు విద్యార్థి లోకానికి పిలుపునిచ్చింది. పూర్వపు ఉపముఖ్యమంత్రి

కె.వి.రంగారెడ్డి కూడా విద్యార్థులతో చేతులు కలిపారు. ప్రత్యేక రాష్ట్రం లేకుండా తెలంగాణకు జరిగిన అన్యాయం నివృత్తి కాదని ఆయన పేర్కొన్నారు. ముల్కీ కాని ఉద్యోగులను వెనక్కి పంపేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టు ఇంజంక్షన్ (తాత్కాలిక నిలిపివేత) ఉత్తర్వును జారీ చేసింది. పర్యవసానంగా ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణలో ఉద్యమం మరింతగా ఘాటెక్కింది.

ఈ పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్న ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి 1969 ఏప్రిల్ 11న 8 సూత్రాల పథకాన్ని లోక్‌సభలో సమస్య పరిష్కారం కోసం ప్రకటించింది. అసంతృప్తికి దారితీసిన అన్ని అంశాలపై పరిష్కారాలను ఈ పథకం నిర్దేశించింది. తెలంగాణా ప్రాంతానికి చెందిన కాంగ్రెసేతర పార్టీలు, కాంగ్రెస్‌లోని అసంతృప్తి నాయకుల వాదనను ఈ ఎనిమిది సూత్రాల ప్రణాళిక పరిగణనలోకి తీసుకోలేదు. ఫలితంగా విద్యార్థుల ఆందోళన కొందరి రాజకీయ పార్టీల నాయకుల చేతుల్లోకిపోయింది. వారు 'తెలంగాణ ప్రజాసమితి' పేరిట వేరు కుంపటిగా రూపొందారు. తదనంతరం ఈ సమితి వ్యూహాత్మకంగా ఉద్యమాన్ని నిర్వహించడం మొదలుపెట్టింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటే ఈ సమితి ఏకైక లక్ష్యం. ఉద్యమంలో నున్న రాజకీయ నాయకులతో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. నవంబరు దాకా ఉద్యమం సాగాక సమితిలో చీలిక వచ్చింది. మెల్లగా కాలం గడుస్తున్నకొద్దీ మామూలు పరిస్థితులు తిరిగి నెలకొన్నాయి.

## ఆందోళనతో తెలంగాణాకు జరిగిన మేలు

1969 జైతెలంగాణ ఆందోళన వల్ల జరిగిన మేలు ఏమిటంటే -

1. ప్రభుత్వం తెలంగాణ ప్రాంతీయ కమిటీని పటిష్ఠ పరిచింది.
2. తెలంగాణ ఆదాయంలో మిగులు నిధులు ఎంత? అనేది హేతుబద్ధంగా లెక్కించేందుకు చర్యలు తీసుకున్నారు.
3. తెలంగాణ ప్రాంతంలో విద్యాసంస్థల సంఖ్య పెరిగింది.
4. తెలంగాణలోని ఆరు జిల్లాలు, రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలకు ప్రత్యేక సబ్సిడీలు అమలులోకి వచ్చాయి. రాజకీయ రంగంలో 1971 సెప్టెంబరులో పి.వి. నరసింహారావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఆ పదవి అలంకరించిన మొదటి తెలంగాణ వ్యక్తి అయ్యారు.

1956లో హైదరాబాద్ రాష్ట్రాన్ని మూడు ముక్కలుగా (భాషాపరం) విభజించాక తెలంగాణా ప్రాంతంలో ముల్కీ నిబంధనలు అములులో కొనసాగాయి. ఫలితంగా తెలంగాణ ప్రాంతంలో ప్రభుత్వం సర్వీసుల ప్రవేశం దుర్లభమైనట్లుగా కోస్తా ఆంధ్ర ప్రాంత ప్రజలు ఇరకాటం ఫీలయ్యారు. ముఖ్యంగా ముల్కీ నిబంధనలు గట్టిగా అమలులోగల హైదరాబాద్ నగర విషయంలో ఇటువంటి అభిప్రాయాలు బలపడ్డాయి. తమ సొంత రాష్ట్రంలోనే తమకు వివక్ష ఎదురౌతోందని వారు తలపోశారు. అందుకు కొందరు కోస్తా ఆంధ్ర ఉద్యోగులు అసలు ముల్కీ నిబంధనలే చెల్లవని హైకోర్టులో సవాలు చేశారు. 1972 ఫిబ్రవరి 14న హైకోర్టు ఫుల్‌బెంచ్ ముల్కీ నిబంధనలు చెల్లవని తీర్పునిచ్చింది. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఒక పెద్ద కుదుపు కాగా తెలంగాణ ప్రాంతంలో ప్రజలు హతాశులవడానికి దారితీసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు అపీలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. అంతే కాకుండా సర్వీసుల ప్రాంతీయకరణ చర్యల అమలు కొనసాగిస్తామని కూడా ప్రకటించింది. ఉపాధి అవకాశాల విషయంలో తెలంగాణా ప్రజల ప్రయోజనాల రక్షణకు ఈ చర్యలు

తీసుకుంటామని ప్రకటించింది. 1972 అక్టోబరు 3న సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన మునుపటి ఉత్తర్వులను తలక్రిందులు చేసింది. ముల్కీ నిబంధనలు చెల్లుతాయని అవి అమలులో ఉన్నాయని తీర్పు నిచ్చింది. ఈ తీర్పు కోస్తా ఆంధ్ర ప్రజలను నిరాశపరచింది. తాము సొంత రాష్ట్ర రాజధానిలో ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలామని వారు ఆవేదన చెందారు. తమ ఆత్మగౌరవం నిలుపుకోవడానికి తెలంగాణవారితో సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని వారు నిర్ణయించారు. ఈ నేపథ్యమే 'జైఆంధ్ర ఆందోళన'రేకెత్తడానికి మూలం. పరిస్థితిని చక్కదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం రంగప్రవేశం చేసింది. 1977 దాకా జంట నగరాల్లో, 1980 దాకా తక్కిన తెలంగాణ జిల్లాల్లో ముల్కీ నిబంధనలు అమలులో ఉండేలా అవగాహన కుదర్చడానికి ప్రయత్నించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు 1972 డిసెంబరు 31న ఆమోదం పొందినది. ఈ చర్చలో జోక్యం చేసుకుంటూ అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ఏమన్నారంటే –

'మనం ప్రజల మనోభావాలకు విలువనివ్వాలి. కాని ఆ భావాల ఉరవడిలో కొట్టుకుపోకూడదు. ప్రజలకు అధిక ప్రయోజనాలు ఏ మార్గంలో చేకూరుతాయన్నదే మన ఆలోచన కావాలి'.

'మనం వివిధ రాష్ట్రాలను ఏర్పరచుకోవడంలో ఓ సమూల హేతుబద్ధత వుంది. క్షణికావేశాలకు విలువనిచ్చి ఈ హేతుబద్ధ పునాదికి మనం చేటు తేకుండా వుండడానికి సదాప్రయత్నించాలి.'

'ఆ ప్రాంతపు ప్రజల ప్రయోజనాల గురించి ప్రభుత్వం ప్రశాంతంగా ఆలోచించి వారికి ఏది మేలు అన్నది తేల్చాలి'.

ఈ బిల్లు ఆమోదం పొందడంతో ఆంధ్ర ప్రాంతపు ప్రజలు దిగ్భ్రాంతులయ్యారు. ముల్కీ నిబంధనలు ఏకమొత్తంగా తక్షణమే రద్దవ్వాలనే వారు కోరుకోవడంతో ఈ బిల్లు ఆమోదం వారిని నిర్ఘాంతపరిచింది.

కోస్తా ఆంధ్రకు చెందిన కాంగ్రెస్ వారు 1972 డిసెంబరు 31 తిరుపతిలో మహాసభ జరిపారు. ఈ సభకు అసెంబ్లీ, కౌన్సిల్‌తో సహా అనేకమంది కాంగ్రెస్ వాదులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు ఛైర్మన్ చాలామంది హాజరయ్యారు. అప్పటిదాకా ఉపముఖ్యమంత్రిగా వుండి సభకు ముందే ఆ పదవికి రాజీనామా చేసి, బి.వి. సుబ్బారెడ్డి ఆ సభకు అధ్యక్షత వహించారు. ఈ సభలోనే కాంగ్రెస్ వాదులు 'రాష్ట్రప్రభుత్వాన్ని స్తంభింపచేద్దాం' పిలుపునిచ్చారు. నిషేధాజ్ఞలు ధిక్కరించడం, పన్నుల ఎగవేత ద్వారా ప్రభుత్వ నవనాడులు స్తంభింపజేయాలని పిలుపునిచ్చారు. ఆ పిలుపు జైఆంధ్ర ఉద్యమానికి నాందిపలికింది. ఆ ఉద్యమం దావానలం లాగా వ్యాపించింది. నిజంగానే రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింప జేసింది. ఆ ఉద్యమం రెండు నెలలపాటు కొనసాగి ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు విస్తారంగా నష్టం తెచ్చింది. ఎందరో చనిపోయారు. అనేకమంది గాయపడ్డారు. ఉద్యమ తీవ్రతతో సహా ఈ పరిస్థితులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని 1973 జనవరిలో ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలనను విధించారు. 1973 మార్చి 18న చిత్తూరులో ఆంధ్రనాయకులు సమావేశమై ఈ పరిస్థితిని చక్కదిద్దాలని తీర్మానించారు గాని పెద్దగా అనుకున్నదిసాధించ లేకపోయారు.

## ఎవరు ముల్కీ?

ఈ లోగా ముల్కీ నిబంధనల నిర్వచనానికి సంబంధించిన మరోమలుపు చోటుచేసుకుంది. 1973 ఫిబ్రవరి 16న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఒక కీలకమైన తీర్పునిచ్చింది. తెలంగాణ ప్రాంతానికి బయట నుంచి వచ్చి స్థిరపడిన వారిని కూడా ముల్కీలు అనవచ్చని ఆ తీర్పు సారాంశం. తెలంగాణాలోనే పుట్టి పెరిగిన వారిని మాత్రమే ముల్కీలుగా పరిగణించడం సబబు కాదని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం



18069

ఫలితంగా ముల్కీ నిబంధన ప్రయోజనాన్ని తాము కోల్పాయని తెలంగాణ ప్రజలు ప్రకటించారు. మరో పరిణామంగా 1973 జూలై 11న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మరో తీర్పునిచ్చింది. ముల్కీనిబంధన ఆరంభంలో నియామకానికి మాత్రమే వర్తిస్తుంది తప్ప అనంతర ప్రమోషన్, సీనియారిటి, రివర్షన్, రిట్రెంచ్‌మెంట్లకు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ పరిణామాల ఫలితంగా ప్రజల మద్దతు కోల్పోయిన ఇరుప్రాంతాల కాంగ్రెసు వారు ప్రతిష్ఠ కాపాడుకోవడానికి తమ ఆందోళనా మార్గాలనుండి విరమించాలని నిర్ణయించుకున్నారు.

## మళ్ళీ ఇందిర ప్రమేయం

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ఈ దశలో జోక్యం చేసుకొని ఇరుపక్షాలతో సుదీర్ఘ చర్చల తరువాత ఆరు సూత్రాల ప్రణాళికను రూపొందించారు. 'పెద్దమనుషుల ఒప్పదం'లోని అంశాలకే ఈ ఆరుసూత్రాల ప్రణాళిక సమగ్రరూపం కల్పించింది. ఆంధ్రప్రదేశ్ ప్రజల భావనాత్మక ఐక్యతకు నాందీబీజాలు నాటాలన్నది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. 1973లో 32వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ పథకం సమర్ధంగా అమలు చేయడానికి వీలు ఏర్పరిచారు.

పైన పేర్కొన్న పరిణామాల నేపథ్యంలో 1973లో ముల్కీ నిబంధనలను రద్దుచేశారు. 1973 సెప్టెంబరు 21, అక్టోబరు 22న ముల్కీ నిబంధనల రద్దు చట్టాన్ని, ఆరు సూత్రాల ప్రణాళికను ప్రకటించారు. ఆరు సూత్రాల ప్రణాళికలో ఈ క్రింది అంశాలు ఉద్ఘాటించారు.

1. రాష్ట్రస్థాయిలో ప్రణాళికాబోర్డు రూపకల్పన, వివిధ వెనుకబడిన ప్రాంతాలకు ఉపకమిటీలు.
2. విద్యాసంస్థల్లో ప్రవేశానికి స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత నివ్వడం, కొత్తగా హైదరాబాదులో సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు చేయడం.
3. నేరుగా రిక్రూట్‌మెంట్ల విషయంలో స్థానిక అభ్యర్థులకు నిర్ణీత పరిధి మేరకు ప్రాధాన్యత నివ్వడం, స్థానిక క్యాడర్లను నిర్వహించడం.
4. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ రూపకల్పన
5. పై లక్ష్యాలను ఉద్దేశించి రాజ్యాంగాన్ని తగిన విధంగా సవరించడం

పై అంశాల దృష్ట్యా ముల్కీ నిబంధనలను కొనసాగించ నవసరం లేదు. రీజనల్ కమిటీ అవసరం తీరిపోయింది.

## ఆంధ్రప్రదేశ్ (1973-2000)

ఆరు సూత్రాల ప్రణాళికలను రాజ్యాంగంలో పొందుపరిచారు. 1975 ఫిబ్రవరి 20న రాష్ట్రపతి ఉత్తర్వు కూడా వెలువడింది. (జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 674). ఈ ఉత్తర్వు రూపొందిన 1973 సెప్టెంబరు నుంచి ఉత్తర్వు అమలు ప్రారంభమైన 1875 ఫిబ్రవరి దాకా మధ్యకాలంలో రెండు ముఖ్యమైన పరిణామాలు సంభవించాయి. 1. 1973 డిసెంబరు 31న ముల్కీ నిబంధనలు రద్దుకాగా రెండవది 1974 జనవరి 1న తెలంగాణ ప్రాంతీయ కమిటీని ఎత్తివేయడం. ఆరుసూత్రాల ప్రణాళికకు చట్టబద్ధత కల్పించే బిల్లును పార్లమెంటు 311-8 ఓట్లతో ఘనంగా గెలిపించింది. ఈ సూత్రం ఫలితంగానే 1973-1982 కాలంలో తెలంగాణ సారధ్యంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రజాప్రభుత్వాలు నడిచాయి. 1978 ఎన్నికలు జరిగాక వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి జోరందుకుని ఆర్థికాభివృద్ధి కార్యకలాపాలు

వేగవంతమయ్యాయి. ఎమర్జన్సీ తరువాత 1977లో జరిగిన ఎన్నికల్లో యాధృచ్ఛికంగా అన్ని రాష్ట్రాల్లో ఇందిర సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ఓడిపోగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో 42 లోక్‌సభ సీట్లకు 41ని గెలిచింది. 1978 ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇందిర సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పటికీ అది సంచలన విజయం సాధించింది. ఎన్నికల తరువాత నెల రోజులకే ఆ పార్టీ మరోసారి చీలింది. 1978 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శ్రీమతి ఇందిరాగాంధి చూచిస్తున్న ఏ. ఆంధ్రప్రదేశ్ ఏకత్వరూపాన్ని సమర్థించినట్లు భావించాలి. ఇంతకుముందు ప్రత్యేక తెలంగాణ వాదాన్ని బలపరచిన మర్రిచెన్నారెడ్డి ఇప్పుడు 1978 మార్చి 6న ముఖ్యమంత్రి అయ్యారు. ఈ సందర్భంలోనే ఆయన *'ప్రత్యేక తెలంగాణకు అంశానికిప్పుడు సందర్భశుద్ధి లేదు'* అని కీలక ప్రకటన చేశారు. షట్సూత్ర ప్రణాళికకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఒక ప్రణాళికా బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలోని అనేక వెనుకబడిన ప్రాంతాలకు సబ్‌కమిటీలను నియమించింది. అలాగే కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణాలకు కూడా ప్రణాళికా బోర్డులను ఏర్పాటు చేసింది.

## ఆరు సూత్రాల ఆవశక్యత

ఆ విధంగా ఆరు సూత్రాల ప్రణాళిక రాష్ట్ర అభివృద్ధికి వ్యూహాన్ని, విద్యాభివృద్ధికి ఒక విధానాన్ని రిక్రూట్‌మెంట్లకు ఒక పద్ధతిని నిర్దేశించింది. రాష్ట్రాల వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కూడా అత్యవసరమైన ఒక వ్యూహాన్ని రచించింది. రాష్ట్ర రాజధాని ప్రణాళికబద్ధ అభివృద్ధికి విస్పష్టంగా నిర్దేశించిన వనరులతో ఒక పథకాన్ని తెచ్చింది. రాష్ట్ర శాసనసభలో వెనుకబడిన ప్రాంతాల ప్రతినిధుల ప్రమేయాన్ని వీలుకల్పించింది. ఈ లక్ష్యాల సాధనకు రాష్ట్రస్థాయిలోనే కాకుండా ప్రాంతాల స్థాయిలో కూడా అభివృద్ధి బోర్డులను నెలకొల్పడం ద్వారా మార్గం సుగమం చేసింది. పూర్వపు పెద్దమనుషుల ఒప్పందం తెలంగాణ ప్రాంతం ప్రాధాన్యతగా రూపుదిద్దుకుంటే ఆరుసూత్రాల ప్రణాళిక మొత్తం రాష్ట్రం అభివృద్ధికి బాట వేసిందని చెప్పవచ్చు. మొత్తానికి ఆరుసూత్రాల ప్రణాళిక రాష్ట్ర ప్రజల ఆమోదముద్రను విశేషంగా పొందింది. 1956లో విశాలాంధ్ర ఏర్పడేటప్పుడు వున్న ప్రాంతాలవారీ భయాలకు తెరదించింది. తెలుగు ఉపజాతీయత పెంపొందించడంలో ఈ పథకం విజయం సాధించింది. ఈ క్రమంలో ప్రత్యేక తెలంగాణ / హైదరాబాద్ వాదన తగ్గుముఖం పట్టి మొత్తం తెలుగువారి ఆత్మగౌరవం సమస్య తెరమీదకు వచ్చింది. ఇదిలా వుండగా 1972 డిసెంబరు 22న ఏర్పాటు భావాలు శిఖరస్థాయిలో వున్న తరుణంలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి లోక్‌సభ చర్చలో చేసిన సుదీర్ఘ ప్రసంగం సంక్షిప్త పాఠాన్ని దిగువన ఇస్తున్నాం.

*'మన రాజ్యాంగంలో మొట్టమొదటి అధికరణే భారతదేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా పేర్కొంటోంది. ప్రతి ఒక్క రాష్ట్రానికి సుదీర్ఘమైన సాంస్కృతిక, చారిత్రక నేపథ్యం వుంది. ప్రతి ఒక్క రాష్ట్రం ఏదో ఒక ప్రత్యేకతతో రాజకీయ అస్తిత్వాన్ని, గుర్తింపును పొంది వుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేలాది సంవత్సరాల పాటు ప్రత్యేకమైన సాంస్కృతిక వేదికగా విలసిల్లుతోంది.....చరిత్రలో చాలాకాలం పాటు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడినవాలా ప్రాంతాలు ఒకే గొడుగు క్రింద వుండేవి..... బహుశా ఈ సుదీర్ఘ చరిత్రే తెలుగు వారికి స్ఫూర్తిగా నిలిచి తెలుగు భాషా ప్రాంతాలన్నీ ఒకే గొడుగు క్రిందకు రావడం కోసం పోరాటం సల్పే శక్తినిచ్చింది. కొంతమంది ప్రజలు హైదరాబాద్ రాష్ట్రం ప్రత్యేకత నిలుపుకోవాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో తెలుగువారందరి మనోభీష్టమే వారిని ఆంధ్రప్రదేశ్‌గా కలిపిందని నేను భావిస్తున్నాను......*

*జాతీయోద్యమంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రశ్న ఒక అంతర్భాగమని చెప్పటం యదార్థమే. దాన్నుంచి దూరంగా జరిగే ప్రశ్నలేదు. భాష ప్రాతిపదికగా ఒకప్పుడు ప్రత్యేక ప్రతిపత్తితో విడివిగా వున్న ప్రాంతాలన్నీ ఇప్పుడు ఏక రాష్ట్రంగా అస్తిత్వంలోకి వచ్చాయి.....*

*నేను సమైక్య రాష్ట్రానికే గట్టిగా కట్టుబడి వున్నాను.... మనకి ఎన్ని రాష్ట్రాలున్నాయి? అన్నది ప్రశ్నకాదు. అసంఖ్యాక అంశాల్లో ఇరుగుపొరుగుతో కలిసి మెలగవలసిందే. కేవలం వేర్పడినంత మాత్రాన అన్యరాష్ట్రాలూ, ఇరుగుపొరుగు ప్రజలను వదుల్చుకోలేము. అలా అనుకుంటే ఆ ప్రవర్తన విద్రోహం. ఇటువంటి చెడు కల నిజమవుతుందని మన అనుభవం మనకు ఏ రకంగానూ చెప్పటం లేదు'.*

రాను రాను కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కొన్ని ఇతర రాష్ట్రాలలోవలెనే ఆంధ్రప్రదేశ్‌లో బలహీనపడింది. దీనికి తోడు తెలుగువారి ఆత్మగౌరవస్పృహను రెచ్చగొట్టడం ద్వారా తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాజకీయరంగంలో ప్రముఖంగా తెరమీదకు వచ్చింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అంతవరకు వున్న తెలంగాణ, కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలవారీ సమీకరణలు వెనక్కిపోయాయి. తెలుగుదేశం పార్టీ వృద్ధితో అది ఆవిర్భవించిన కొన్ని ఏళ్ళలోనే రెండుపార్టీల వ్యవస్థకూ బాట వేసింది. 1982 నుంచి ఇప్పటి దాకా ఆంధ్రప్రదేశ్‌లో అయితే తెలుగుదేశం పార్టీ లేకపోతే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పరిపాలిస్తూ వచ్చాయి. తెలుగుదేశం సారథ్యంలో ఎన్.టి.రామారావు, ఆ తరువాత చంద్రబాబు నాయుడు పాలకులుగా ఎంతో నిలకడ సాధించారు. తరువాత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి దీర్ఘకాలం పాలించారు. ఈ ముగ్గురి పాలనలో గట్టి రాజకీయ యంత్రాంగం దన్నుతో తెలుగు వారి ఐక్యత వర్థిల్లింది. అయితే అణచివేతకు గురయ్యామన్న భావనతో తెలంగాణా ప్రాంతంలో రాజకీయ ఆందోళనలు ప్రత్యేక తెలంగాణా డిమాండుకు దారితీశాయి. శక్తివంతమైన పై ముగ్గురు నాయకులు తెలంగాణా ప్రాంతానికి చెందినవారు కాదు. వారి విధానాలు సర్వసాధారణంగా తెలంగాణా అభివృద్ధికి అనుకూలంగా వున్నవి కాదని కమిటీకి నివేదించబడింది. ఈ నేపథ్యంలో 1982 నుంచి నేటిదాకా హైదరాబాద్ లోపల, చుట్టుపక్కల గల వనరులతో కూడిన భూములను ప్రభుత్వం చౌకగా సేకరించడం జరిగిందన్నది తెలంగాణా ప్రాంతంవారి ఆరోపణ. ఇలా సేకరించిన వారిలో తెలంగాణా ప్రాంతానికి చెందని వారు స్థానికుల ప్రయోజనాలను పణంగా పెట్టి తమకే సానుకూలంగా వ్యవహరించారని ఆరోపణ. ఆర్థిక, రాజకీయ చమక్కులద్వారా మాత్రమే ఏకీకృత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వారు ఇంతకాలం నిర్వహిస్తూ వచ్చారనీ, తెలంగాణా ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా కాదనీ కమిటీముందు వారి వాదన.

## హైదరాబాద్ నాడు-నేడు

ఈలోగా హైదరాబాద్ పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధి ముఖ్యంగా ఆరు సూత్రాల ప్రణాళిక అమలుతో ఒనకూడిన పురోగతి వివాదస్పదమైంది. ఈ నగరం 1975 అనంతర కాలంలో విస్తృతంగా అభివృద్ధి చెందిందనడంలో వివాదం లేకపోయినా హైదరాబాద్ అభివృద్ధిలో పొంతనలేదని తెలంగాణా వాదులు అంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధి ఫలాలు స్థానికులైన తెలంగాణా వారికి దక్కకుండా బయట నుంచి వచ్చిన వలసవాదులకే దక్కాయని ఈ క్రమంలో సామాజిక, ఆర్థిక సమానత్వం అనే విలువలకు తిలోదకాలు ఇచ్చారనీ వారు విమర్శిస్తున్నారు. ఈ దోపిడీ క్రమంలో వారు తెలంగాణా భూములను కూడా వదలలేదనీ ఆరోపిస్తున్నారు. వస్తూత్పత్తి, వాణిజ్యం ద్వారా మాత్రమే తక్షణ నగదు వనరులు సమకూరుతున్నది. హైదరాబాద్ పారిశ్రామిక అభివృద్ధిలో ఈ రంగాలను విస్మరించడం

వలన అభివృద్ధి నిలకడగా లేకుండా పోయిందనీ వారు తప్పుపడుతున్నారు. హైదరాబాద్ పారిశ్రామిక రంగంలో వృద్ధి కేవలం సర్వీసు రంగానికీ, స్థానిక వాణిజ్యానికీ మాత్రమే పరిమితమైందనీ వారు కమిటీకి తమ వాదనలో విశదపరిచారు. 1956లో విశాలాంధ్ర ఏర్పడ్డాక రాజధాని హైదరాబాద్ జనసంఖ్య దాదాపు మూడురెట్లు పెరిగితే, కనీస సౌకర్యాలు మాత్రం ఆ స్థాయిలో పెరగలేదు. రవాణా వ్యవస్థలో చోటు చేసుకున్న పురోగతి కేవలం పట్టణ ప్రాంతానికి చెందిన కొన్ని సంపన్నవర్గాలకే దక్కిందనీ వారంటున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల వలసవచ్చిన వారు నెలకొల్పిన పరిశ్రమలు, పారిశ్రామిక కేంద్రాలను నడపడానికి తమ ప్రాంతపు వారినే సిబ్బందిగా చేర్చుకోవడం వలసవాదులకు పరిపాటి అవడంతో స్థానికులకు పారిశ్రామికాభివృద్ధి ద్వారా దక్కాల్సిన ఉద్యోగ ఫలాలు దక్కలేదనీ తెలంగాణా వాదుల ముఖ్యమైన ఆరోపణ. పైగా హైదరాబాద్ కేవలం తెలంగాణా వారిది కాదనీ వలస వాదులు కొత్తగా వాదిస్తున్నారనీ దాని గుర్తింపు గత 35 ఏళ్ళలో పూర్తిగా మారిపోయిందంటున్నారనీ తెలంగాణా వాదులు చెప్తున్నారు. హైదరాబాద్‌ను దేశంలోని ప్రధానమైన మహానగరాలలో ఒకటిగా ఇప్పుడు పేర్కొనడాన్ని వారు తప్పు పడుతున్నారు. ఇందుకు మద్దతుగా వారు పెట్టుబడులూ, జనసంఖ్యలో మార్పూ, కోస్తా ఆంధ్ర నిరుద్యోగులకు పెద్దగా ఉద్యోగావకాశాలు పెరగడం వంటి అనేక వాస్తవాలను చూపుతున్నారు. 2009-2010 ప్రథమార్థం దాకా ప్రత్యేక తెలంగాణ అలజడి వల్ల కలిగిన పారిశ్రామిక నష్టంతో నిమిత్తం లేకుండా కొంత కాలంగా హైదరాబాద్ విశేష అభివృద్ధిని సాధించి మామూలు నగరం స్థాయినుంచి ప్రధాన నగరంగా విస్తరించింది. ఆ నగరం విశిష్టమైన విశ్వజనీన స్వరూపాన్ని సంతరించుకుంది. ప్రత్యేక తెలంగాణా కావాలని గట్టిగా కోరుతున్నవారూ సమైక్యాంధ్రగానే కొనసాగాలనీ పట్టుబడుతున్న వర్గాలమధ్య హైదరాబాద్ ప్రస్తుతం ఒక ప్రధాన సమస్యగా మారింది. హైదరాబాద్ అభివృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక గుర్తింపు విడిగా కలిగి వుందని అందరూ ఒప్పుకుంటారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు రియల్ ఎస్టేట్, మౌలిక సాధన సంపత్తి రంగాల్లో భారీ ఉత్పత్తి సంస్థలకు హైదరాబాద్, దాని పొలిమేరలు కేంద్రంగా వున్నాయి. అంతే గాకుండా అది ముఖ్యంగా సేవారంగానికి కేంద్రంగా ఇటీవలి కాలంలో వర్ధిల్లింది. అది ఆంధ్రప్రదేశ్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో అతిపెద్ద కేంద్రం. అంతే గాకుండా అక్కడి నుంచి ఐటి ఎగుమతులు విస్తారంగా సాగుతున్నాయి. దేశం నలుమూలల నుంచి సాఫ్ట్‌వేర్ నిపుణులను ఆకర్షించడంతో అది జాతీయ ఎగుమతుల్లో చెప్పుకోదగ్గ భాగాన్ని సాధించి గణతికెక్కింది అదనంగా ఆ నగరంలో ఖాళీ ప్రదేశాలు ఇంకా విస్తారంగా వున్నాయి. భూమి, రోడ్లూ, రవాణావ్యవస్థలు, విద్యుత్ సరఫరా వంటి రంగాల్లో కూడా విస్తార అవకాశాలు వున్నాయి. ఆ నగరానికి గల కాస్మోపాలిటన్ ప్రత్యేక గుణం వల్ల దేశంలో అన్నిప్రాంతాల నుంచి నిపుణులను ఆకర్షిస్తోంది. నేపథ్యంలో ఉర్దూ సంస్కృతి వుండటం వల్ల హిందీ భాషావ్యాప్తి శరవేగంగా హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. దీనివల్ల ఉత్తర భారత రాష్ట్రాలతో మంచి కమ్యూనికేషన్ సంబంధాలు కలిగి వుంది. అందువల్ల ఉత్తర భారత్ రాష్ట్రాల నుంచి పనికోసం వలసలు రావడం పెరిగింది. హైదరాబాద్‌కు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వలసలు కొత్తకాదు. 1920లోనే హైదరాబాద్‌కు కోస్తా ఆంధ్ర నుంచి వ్యవసాయ నిపుణులను అప్పటి నిజాం ఆహ్వానించడంతో ఈ వలసలు మొదలయ్యాయి. ప్రాథమికమైన బొగ్గు, విద్యుత్ వనరులు, పెట్టుబడుల డబ్బు సమకూర్చుకోవడానికి రుణాలు లభించే మెరుగైన అవకాశాలు ఈ నగరానికి వలసలను పెంచిన వాస్తవాలు. ఐటి దానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్, సర్వీసు సంస్థల విస్తరణతో హైదరాబాద్ నగరం జాతీయ స్థాయిని సంతరించుకుంది.

1975 రాష్ట్రపతి ఉత్తర్వు ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో న్యాయం చేయడానికి హామీ ఇస్తోంది. అయితే అమలులో ఈ ఉత్తర్వు తెలంగాణా ప్రాంతం వారిపై మరింతగా వివక్షతకు దారి తీసింది. రాష్ట్రపతి ఉత్తర్వులో 'స్థానికుడు' అనే పదానికి తప్పుడు నిర్వచనం ఇవ్వడం వల్ల స్థానికులు కానివారికి లాభం చేకూరి తెలంగాణా వారిలో భయాలు పెరిగాయి. గెజిటెడ్ హోదాలకూ, వివిధ శాఖల అధిపతులకూ సంబంధించి ఇచ్చిన మినహాయింపులు నిర్వీర్యానికి గురయ్యాయి. అనేక నాన్‌గజిటెడ్ హోదాలను గెజిటెడ్ హోదాకు స్థాయి పెంచారు. 1975 రాష్ట్రపతి ఉత్తర్వుకు సంబంధించిన అసమానతలను తొలగించడానికి పదేళ్ళు పట్టింది. ప్రభుత్వం 1985లో ఈ అసమానతల తొలగింపునకు జీ.ఓ.ఎమ్,ఎస్.నెం. 610 రూపంలో 1985 డిసెంబరు 30న ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వులలో ఒక ముఖ్యమైన ఆదేశం క్రింది విధంగా వుంది.

*'ఆరుసూత్రాల ప్రణాళిక సూచిస్తున్న జోనలీకరణకు విరుద్ధంగా 18.10.75 నాడు ఐదవ, ఆరవ జోన్‌లకు కేటాయించిన ఉద్యోగులను వారి అసలు జోన్‌లకు తిరిగి పంపించి వేయాలి. అవసరమైనచోట్ల సూపర్ యాన్యువరీ ఉద్యోగాలను సృష్టించి 31.3.1986లోగా ఈ పని జరగాలి. జోన్ 5,6 తెలంగాణా జోన్‌లు'.*

610 జీఓ జారీ అయిన తరువాత 15 ఏళ్ళకాలంలో ప్రభుత్వానికి లోపాల సవరణ నిమిత్తం ప్రాతినిధ్యాలు అందినట్లు తెలుస్తోంది. ఆరుసూత్రాల ప్రణాళిక అమలులో ప్రభుత్వ సిబ్బంది నియామకాలకు సంబంధించిన లోపాలు అవి.

15.6.2001 నాడు అఖిలపక్ష సమావేశంలో ఈ అంశం చర్చించాక మరో ఏక సభ్య కమీషన్‌ను అదే ఏడాది జూన్ 25న నియమించారు. మరో రిటైర్డ్ ఆఫీసర్ జయం గిర్‌గిలాని ఈ కమీషన్ సారథి. 30.9.2004 నాడు ఈ కమీషన్ తుది నివేదికను సమర్పిస్తూ లోపాలు పరిష్కరించడానికి 35 చర్యలను సూచించింది. ఈ ఏకసభ్య కమీషన్ సిఫార్సులను పరిశీలించడానికి ప్రభుత్వం 10.8.2004 నాడు మంత్రుల బృందాన్ని నియమించింది. ఈ బృందం పరిశీలన జరిపి గిర్‌గిలాని తుది నివేదికను ఆమోదించింది. 16.2.2006 నాడు రాష్ట్ర మంత్రివర్గం ఈ నివేదికను చర్చించింది. నివేదికను తుదిగా ప్రభుత్వం 10.8.2006 నాడు ఆమోదించింది. జి.ఓ.610 అమలులో గత నాలుగేళ్ళలో తెలంగాణా సిబ్బందికి సంతృప్తి కలిగే స్థాయిలో పురోగతి సాధ్యమైనట్లు ప్రస్తుత కమిటీకి సమాచారం అందింది. అయితే అసలు సమస్య అయిన 1985-2005 మధ్య కాలంలో జి.ఓ.610 అమలు అస్తవ్యస్థంగా వున్నదన్న సమస్య అలాగే వుంది. నేటికి కూడా ఈ అంశం అత్యంత వివాదాస్పదంగా మిగిలింది. తరువాత ఈ అంశంపై సమగ్ర పరిశీలనకు ఒక ప్రత్యేక చాప్టర్‌ను నివేదికకు అనుసంధించారు.

తెలుగువారి ఉపజాతీయత (ఆత్మగౌరవం) నిలబెట్టడానికి సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసిన ఉద్దేశాన్ని భంగపరుస్తూ మూడు ప్రాంతాల్లో అభివృద్ధి స్థాయి వుండాల్సిన విధంగా లేదు. ఫలితంగా వాటికి ప్రత్యేక గుర్తింపు (వెనుకబడిన ప్రాంతాలుగా) వచ్చింది. ఈ గుర్తింపు రాష్ట్ర రాజకీయాలనూ, ఎన్నికల ఫలితాలనూ ప్రభావితం చేస్తూ వుంది. వచ్చే దశాబ్దాల్లో కూడా ఈ మూడు ప్రాంతాల స్థితుల ప్రభావం ఇలాగే కొనసాగబోతోంది. 1983 ఎన్నికల్లో తెలుగుదేశం ఆవిర్భావం తరువాత రాష్ట్రం కొన్ని ప్రధాన అంతరంగిక ఆందోళనలకు కింద పేర్కొన్న ప్రత్యేక సమస్యల విషయంలో నిలయమైంది.

ఎ. ముందుగా పేర్కొనవలసినది తెలుగుదేశం ప్రభుత్వం రిటైర్‌మెంట్ వయసును 58 నుంచి 55 ఏళ్ళకు తగ్గించడం. ఈ చర్య ఫలితంగా ప్రభుత్వానికి ఎన్‌జీఓలకు మధ్య దీర్ఘకాలం పోరాటం సాగింది.

బి. ఆంధ్రప్రాంతంలో కరణాలుగా, తెలంగాణా ప్రాంతంలో పట్వారీలుగా పిలిచే రెండు సాంప్రదాయక వారసత్వ ఉద్యోగాలను తెలుగుదేశం ప్రభుత్వం రద్దుచేసి, వారిస్థానంలో విలేజ్ అడ్మినేస్ట్రేటివ్ ఆఫీసర్లు (విఏఓ)ను నియమించింది. విఏఓ పోస్టులను బదిలీ చేయతగ్గవిగా పేర్కొంది.

సి. మహిళలు ప్రారంభించిన సారా వ్యతిరేక ఉద్యమం

డి. దళితులు తమ అస్తిత్వాన్ని చాటుకోవడానికి ప్రయత్నించడం మొదలైంది. దానితోబాటు కొన్ని దళిత సంఘాలు కొత్తగా తలెత్తాయి.

## నక్సలిజం ప్రభావం

ఈ లోగా రాష్ట్రం గత 30 ఏళ్ళలో నక్సలిజం బలంగా ఎదగడాన్ని చూసింది. రాష్ట్రంలో నక్సలిజం పెద్ద ఉద్యమంగా రూపొందడానికి అనేక సమీకరణలు, వాస్తవ పరిస్థితులు కారణం. తెలంగాణా ప్రాంతంలో 1945-51 కాలంలో సాగిన కమ్యూనిస్టు ఉద్యమంలో ఈ నక్సలిజం వేళ్ళు ఉన్నాయి. ఆ కాలంలో తెలంగాణా ప్రాంతంలో జమీందారీ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా రైతులు, రైతుకూలీల పోరాటం సాగింది. స్వాతంత్ర్యానంతరం ఈ ఉద్యమానికి ప్రజల మద్దతు క్రమంగా సన్నగిల్లింది. పశ్చిమ బెంగాల్‌లో ఈ రైతుకూలీ ఉద్యమం 1968-69లో నక్సల్‌బరీలో తిరిగి తలెత్తింది. ఈ నక్సల్‌బరీ ఆందోళన తెలంగాణాతో సహా ఆంధ్రప్రదేశ్‌కు వ్యాపించింది. నక్సలిజాన్ని ప్రభుత్వం శాంతిభద్రతల సమస్యగా పరిగణించినప్పటికీ, అనేక సమర్థమైన మార్గాల్లో నక్సలిజాన్ని కొంతవరకు అణచివేసినప్పటికీ అది విస్తరిస్తూనే వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను నక్సలిజం ప్రభావితం చేసింది కూడా. ముఖ్యంగా ఎన్నికల రాజకీయాలపై దాని ముద్ర వుంది. ఎన్నికల తరుణంలో వివిధ రాజకీయ పార్టీలు నక్సలైట్ల మద్దతును తీసుకున్నట్లు కూడా తెలుస్తుంది. ఇది పైన పేర్కొన్న కాలంలో విస్తారంగా జరిగిన వాస్తవం.

## తెలంగాణాపై బిజెపి వైఖరి

1997లో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశం జరిగినప్పుడు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం డిమాండ్‌ను బలపరుస్తూ తీర్మానం ఆమోదించింది. అందుకనుగుణంగా 1998 సార్వత్రిక ఎన్నికలలో 'ఒక ఓటు, రెండు రాష్ట్రాలు' నినాదాన్ని ఇచ్చింది. చిత్రంగా అప్పుడు తెలంగాణా ప్రాంతంలో బిజెపికి ఎక్కువ ఓట్లు వచ్చాయి. ఈ పరిస్థితిని అనుకూలంగా భావించి టిడిపి 1999 లోక్‌సభ ఎన్నికలప్పుడు బిజెపితో జతకట్టింది. అప్పటికీ తెలుగుదేశం పార్టీ కేంద్ర ప్రభుత్వ నూతన ఆర్థిక సంస్కరణల కార్యక్రమాన్ని అమలు పరచడం ప్రారంభించి వామపక్షాలతో పొత్తుకు గుడ్‌బై చెప్పింది. 1999 ఎన్నికల్లో తెలుగుదేశం, బిజెపి పార్టీలు రెండూ పొత్తుద్వారా లాభం పొందాయి. బిజెపి పోటీ చేసిన 8 లోక్‌సభ సీట్లకు ఏడింటిని గెలుచుకోగా తెలుగుదేశం 29 లోక్‌సభ సీట్లు గెలుచుకుంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 179 సీట్లను గెలుచుకొని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ లోగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని అదనుగా తీసుకొని తెలంగాణా ప్రాంతంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలంగాణా ఫోరం పేరిట ప్రాంతీయ ఫోరంను ప్రారంభించారు. దీనికి రాష్ట్ర నాయకత్వం అనుమతి వుంది. తెలంగాణా ప్రాంతంలోని పంచాయితీ ఎన్నికలలో ఫోరం నినాదం 'జై కాంగ్రెస్, జై తెలంగాణా'గా వుంది. దీనికి తోడు పనిలోపనిగా ఈ ఎన్నికల్లో పంచాయితీలకు హెచ్చునిధులు, ఎక్కువ అధికారాలు కల్పించడం ద్వారా వాటిని పటిష్ఠం చేయాలన్న ప్రచారం కూడా

ధీటుగా సాగింది. ఆ విధంగా 2001 ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం మరోసారి తలెత్తడానికి నాంది పలికింది.

## ఆంధ్రప్రదేశ్ (2001-2009)

పంచాయితీ ఎన్నికల్లో తెలంగాణా సమస్య మళ్ళీ తలెత్తడం టిఆర్ఎస్ పుంజుకోవడానికి కావలసిన నేపథ్యాన్ని సమకూర్చింది. అంతకు ఒక ఏడాది ముందే ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని సాధించాలన్న లక్ష్యంతో టిఆర్ఎస్ ఏర్పడింది. ఈ పార్టీ ప్రత్యేక తెలంగాణా నినాదం సజీవంగా తెలంగాణా ప్రజల్లో వ్యాపించడానికి కావలసిన సైద్ధాంతిక, తార్కిక నేపథ్యాన్ని కూర్చింది. ఈ క్రమంలో ఆ పార్టీ కేంద్ర, రాష్ట్రస్థాయి ఎన్నికల్లో ప్రాముఖ్యతను చూపుకోవడానికి ప్రయత్నించింది.

1969లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ప్రధానంగా సామాజిక బృందాలు, విద్యార్థులు, ప్రభుత్వోద్యోగులు ప్రారంభించగా దానికి అసమ్మతి కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతుతో చురుకుదనం చేకూరింది. అందుకు విరుద్ధంగా 2001 నాటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి చాలా పార్టీల మద్దతు వుంది. రాజకీయ రంగంలో ఇంచుమించు అన్ని పార్టీలు ప్రత్యేక తెలంగాణా సాధనకోసం పోటీలు పడుతూ రంగంలోకి దిగాయి. జాతీయ పార్టీలకు, టిడిపి, టిఆర్ఎస్ అనే రెండు ప్రాంతీయ పార్టీలకు మధ్య రాజకీయ పొత్తులు కుదరడానికి సానుకూలమైనదిగా ప్రత్యేక తెలంగాణా నినాదం రూపుదిద్దుకుంది. ఎన్నికల ఫలితాల కోసం మరోపక్క జాతీయ పార్టీల మధ్య కూడా ఇటువంటి పోటీ తలెత్తింది. టిఆర్ఎస్ ఆవిర్భావం, బిజెపి తెలంగానంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రశాఖ కూడా తెలంగాణ కోసం ఉద్యమిస్తామంటూ 2001 పంచాయితీ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటర్స్ ఫోరమ్ ద్వారా రంగంలోకి అప్పుడు తెలంగాణా ప్రాంతానికి చెందిన వారితోపాటు 41 మంది ఎమ్మెల్యేలు తెలంగాణా ఉద్యమ సారథ్య బాధ్యత తాము చేపట్టడానికి అనుమతించాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీని కోరారు.

ఇది కాక తెలంగాణా కాంగ్రెస్ ఫోరం, తెలంగాణా కాంగ్రెస్ శాసనసభ్యుల ఫోరమ్ 2002 డిసెంబర్‌లో నల్గొండలో ఒక తీర్మానం చేస్తూ తెలంగాణాకు ప్రత్యేక రాష్ట్ర హెూదా ఇవ్వటం కాంగ్రెస్ అజెండాలో వుందని స్పష్టం చేశారు. తాము ప్రత్యేక రాష్ట్రం కొరకు అహర్నిశలు శ్రమిస్తామని కూడా వారు తీర్మానించారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడాలంటే అది కాంగ్రెస్ పరిపాలనలోనే సాధ్యమవుతుందనీ, పార్టీ తదుపరి మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని కూడా చేరుస్తామనీ తీర్మానం చేశారు. గతంలో ప్రాంతీయ పార్టీలు తమ లక్ష్యాన్ని సాధించటంలో విఫలమయ్యాయని వారన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానవర్గం జార్ఖండ్, ఉత్తరాంచల్ (ప్రస్తుతం ఉత్తరాఖండ్), చత్తీస్‌ఘడ్‌ల ఏర్పాటుకు మద్దతు నిచ్చిందన్న విషయాన్ని గుర్తు చేస్తూ తమ నల్గొండ సమావేశం కాంగ్రెస్ అధిష్ఠానం సమ్మతితోనే ఏర్పాటయ్యిందని అన్నారు.

లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, తెలంగాణా రాష్ట్ర సమితి ఎన్నికల ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. 2004 ఎన్నికల నాటి కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో *ఉధృతమవుతున్న తెలంగాణా ప్రజల భావాలను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తోందని* ఉటంకించింది. ఆ మ్యానిఫెస్టోలోనే రాష్ట్రాల పునర్విభజన కమీషన్ నివేదికను తాము గౌరవిస్తామని పేర్కొన్నారు. విదర్భలోనూ తెలంగాణాలోనూ ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటుకు సరైన కారణాలు ఉన్నాయని కాంగ్రెస్‌పార్టీ తన మ్యానిఫెస్టోలో పేర్కొంది. అయితే ప్రస్తుత రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ అంశం చాలా ఇతర అంశాలకు ముడిపడి వుంది. ఇవన్నీ మరొక రాష్ట్రాల పునర్విభజన కమీషన్ పరిశీలిస్తే మంచిదని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది.

కాంగ్రెస్ 2004 ఎన్నికల్లో లోక్‌సభలోను, రాష్ట్ర శాసనసభలోను మెజారిటీ సాధించి కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారాన్ని చేపట్టింది. టిఆర్ఎస్ కూడా కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వంలో చేరింది. కాంగ్రెస్‌పార్టీ నాయకత్వంలో కేంద్రంలో యుపిఎ ప్రభుత్వం ఏర్పడింది. యుపిఎ తన ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికలో తెలంగాణా అంశాన్ని కూడా చేర్చింది. 'యుపిఎ ప్రభుత్వం తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు డిమాండ్‌ను పరిశీలన, ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం సరైన సమయంలో పరిశీలిస్తుంది'. ఆ తరువాత ఉమ్మడి పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంలో, 2004 జూన్ 7న 'ప్రభుత్వం తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు విషయమై డిమాండ్‌ను తగిన సంప్రదింపులు జరిపిన అనంతరం సరైన సమయంలో పరిశీలిస్తుంది' అని పేర్కొన్నది. అదే విధంగా యుపిఎ ప్రభుత్వం కేంద్ర మంత్రులతో కూడినముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. 2004 నవంబరులో ప్రణబ్ ముఖర్జీ, రఘువంశ్ ప్రసాద్ సింగ్, దయానిధిమారన్ సభ్యులుగా ఈ కమిటీ రూపొందింది. ఈ కమిటీ ఈ అంశాన్ని తరువాత పరిశీలించినా ఒక నిర్ణయానికి ఇంకా రాలేదు.

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణా అంశంమీద టిఆర్ఎస్ ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కచ్చితంగా తెలంగాణా రాష్ట్రమిస్తామన్న వాగ్దానమేదీ లేదు. కనీస ఉమ్మడి కార్యాచరణ పథకంలో కూడా హామీని కానీ, ఒక నిర్దిష్ట కాల వ్యవధిని కానీ సూచించలేదు. 2006 సెప్టెంబరులో టిఆర్ఎస్ కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో యుపిఎ ప్రభుత్వానికి తన మద్దతును ఉపసంహరించుకుంది. దీనికి ప్రధానకారణం టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు, కాంగ్రెస్ ముఖ్యమంత్రి డా॥వైఎస్‌రాజశేఖరరెడ్డిల మధ్య పొడసూపిన విభేదాలేనని అన్నారు. టిఆర్ఎస్ మంత్రులు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ తమ పదవులకు రాజీనామా చేశారు. ఆ తరువాత నలుగురు టిఆర్ఎస్ ఎంపీలు, 16 మంది ఎమ్మెల్యేలు తమ స్థానాలకు 2008 మార్చి మొదటి వారంలో ప్రత్యేక తెలంగాణా అంశంమీద రాజీనామాలు చేసినందువల్ల ఉప ఎన్నికలకు తెరలేచింది. 2008 మే నెలలో జరిగిన ఈ ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ ప్రత్యేక తెలంగాణా కోసం పూర్తిగా పట్టుబట్టి ప్రజాభిప్రాయాన్ని ఇవ్వాలని కోరింది. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు తెలంగాణా అంశం మీద ఈ ఎన్నికలు ప్రజాభిప్రాయ సేకరణ కాదనీ మౌనంగా వుండిపోయాయి. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటును తాము వ్యతిరేకించడం లేదని కూడా ఈ పార్టీలు తమ వైఖరిని ప్రదర్శించాయి. అయితే ఉప ఎన్నికల ఫలితాలు టిఆర్ఎస్‌ను బాగా దెబ్బ తీశాయి. 16 ఎమ్మెల్యేలకు గాను 7 మంది మాత్రమే గెలిచారు. 4గురు ఎంపీలకు గాను ఇద్దరు మాత్రమే గెలుపొందారు.

రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలకు ముందు 2009 జనవరి 31న టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు తమ పార్టీ 'మహాకూటమి'లో చేరుతుందని ప్రకటించారు. ఈ మహాకూటమికి తెలుగుదేశం పార్టీ నాయకత్వం వహించగా, వామపక్షాలు మూడవ ఫ్రంట్‌లో వున్నాయి. ఈ మహాకూటమి ముఖ్య లక్ష్యం లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో తెలంగాణా అంశంమీద ఎటువంటి నిర్ణయము తీసికోని కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా ఉమ్మడిగా పోటీ చేయడమే. భారతీయ జనతాపార్టీ 2004 వరకు తన ఎన్‌డిఏ పరిపాలనలో తెలంగాణా అంశంమీద ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. అయితే చిన్న రాష్ట్రాల ఏర్పాటు విషయంలో తమ విధానాన్ని కొనసాగిస్తామనీ, రాబోయే ఎన్నికల్లో తాము గెలిస్తే తెలంగాణాను ఏర్పాటు చేస్తామనీ, హామీ ఇచ్చింది. ఇదిలా వుండగా, కాంగ్రెస్ పరిపాలనలోని రాష్ట్రప్రభుత్వం శాసనసభ్యుల ఉమ్మడి కమిటీని అప్పటి ఆర్థికమంత్రి కె.రోశయ్య ఆధ్వర్యాన తెలంగాణా సంబంధిత అంశాలమీద చర్చించేందుకు నియమించింది. అయితే బిజెపి, సిపిఎం, సిపిఐ, టిఆర్ఎస్ వంటి ప్రతిపక్ష పార్టీలు కొన్ని ఆ కమిటీలో తాము చేరబోమని స్పష్టం చేశాయి.

తెలుగుదేశం పార్టీ కూడా ప్రభుత్వ వినతికి స్పందించలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం వహించే 7గురు శాసనసభ్యులకు (మూడు ప్రాంతాలకు చెందినవారు), ఒక మజ్లీస్ సభ్యునితో కమిటీ ఏర్పాటయింది. ప్రధాన పార్టీలు సహాయ నిరాకరణ చేసినందువల్ల ఆ కమిటీ తనకు నిర్దేశించిన అంశాలపై ముందుకు వెళ్ళలేకపోయింది.

అసెంబ్లీ ఎన్నికలు 2009 మేలో జరగగా టిఆర్ఎస్ 10 సీట్లను మాత్రమే గెలుచుకుని తెలంగాణా ప్రాంతంలో తన పలుకుబడిని మరింత కోల్పోయింది. 2004లో ఈ పార్టీకి 26 స్థానాలు, 2008లో 17 స్థానాలు, ఉప ఎన్నికల్లో 6 స్థానాలు మాత్రమే వున్నాయన్న సంగతి తెలిసిందే. 2009లో ఇది మరింత కృశించుకొని పోయి 10 స్థానాలకు చేరింది. లోక్‌సభలో కూడా రెండు స్థానాలను మాత్రమే గెలుచుకుంది. అంతకుముందు ఈ పార్టీకి 5 స్థానాలు వుండేవి. ఈ విధంగా 2004 నుండి 2009లోకి టిఆర్ఎస్ తన పలుకుబడిని కోల్పోతూ వచ్చింది. 2004లో టిఆర్ఎస్ విజయానికి కారణం కాంగ్రెస్ జతకోరడమేనని రాజకీయ పండితులన్నారు. 2009 అసెంబ్లీ ఎన్నికల తరువాత టిఆర్ఎస్ మహాకూటమిని వదలి బిజెపితో జతకట్టింది. ఇది ఇప్పటికీ కొనసాగుతోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం నుండి 33 మంది ఎంపిలతో కేంద్రంలో యుపిఏ ప్రభుత్వాన్ని తిరిగి ఏర్పాటు చేసుకోగలిగింది. ఇక్కడ ముఖ్యంగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే కనీస కార్యాచరణ పథకంలో తెలంగాణా అంశాన్ని చేర్చకపోయినా కూడా యుపిఏ వరుసగా రెండుసార్లు ఆంధ్రప్రదేశ్‌లో విజయాన్ని సాధించింది.

తెలంగాణా అంశంమీద 2009 మే-నవంబరు నెలలో చెప్పుకోదగ్గ సంఘటనలేవీ జరుగలేదు. ఈ కాలంలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (2009 నవంబరు 23)కు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్ పోటీ చేయలేదు. ఈ విషయంలో టిఆర్ఎస్ అధ్యక్షుడు ఒక ప్రకటన చేస్తూ 'ప్రత్యేక తెలంగాణా సాధన వంటి పెద్ద అజెండాతో మేము ముందుకు సాగుతున్నందువల్ల అతి చిన్నదైన ఈ మునిసిపల్ ఎన్నికల్లో మేము పోటీచేయకపోవడం వలన పెద్ద ప్రభావం ఏమీ ఉండదు" అన్నారు. 2009 నవంబరు చివరి వారంలో నిరవధిక నిరాహార దీక్షకు తమ పార్టీ వ్యూహాన్ని రచిస్తోందని ప్రకటించారు. అయితే మిగతా పార్టీలన్నీ టిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో పోటీచేయకపోవడానికి ముఖ్యకారణం దానికి హైదరాబాద్‌లో తగిన ప్రజాదరణ లేకపోవడమే నని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను లెక్కచేయని టిఆర్ఎస్ 2009 నవంబరు నుండి తెలంగాణా అంశంమీద తన ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009 సెప్టెంబరు 2వ తేదీన హెలికాప్టర్ ప్రమాదంలో అకస్మాత్తుగా మరణించారు. 2009 నవంబరు 9న టిఆర్ఎస్ అధ్యక్షులు చంద్రశేఖరరావు భారత ప్రధానికి ఒక లేఖరాస్తూ ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర అంశంమీద ప్రజల అభిప్రాయాలనూ, భావనలనూ మన్నించేందుకు తాను ఆమరణ నిరాహారదీక్ష చేయనున్నట్లు ప్రకటించారు. ముందుగా అనుకున్న ప్రకారం 2009 నవంబరు 29 నుండి తన ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభమవుతుందని ఆయన బహిరంగ ప్రకటన చేశారు.

## ఆంధ్రప్రదేశ్ నవంబరు 29, 2009-డిసెంబరు 31, 2010

2009 నవంబరు 29 నుండి ఏడాది పాటు జరిగిన సంఘటనలు ప్రజల జ్ఞాపకాలలో ఇంకా వుండే వుంటాయి. పార్లమెంటులో తెలంగాణా బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతూ 2009 నవంబరు 29న టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు. దీక్షకు ముందు ఆయన విద్యార్థి సంఘాలను, ఉద్యోగ సంఘాలను, వివిధ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంస్థలను ఉద్యమంలో చేరమని ఆహ్వానించారు. 1989 ఎన్నికల తరువాత తెలంగాణా అంశం బయటకు

రావడంతో విద్యార్థులు, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు, ఇతర సంస్థల వారు తిరిగి తెలంగాణా ఉద్యమంలోకి వచ్చి చేరారు. తన దీక్ష రోజున చంద్రశేఖరరావు అరెస్టయి ఖమ్మంకు పంపబడ్డారు. 2009 నవంబరు 30న ఆయన తన దీక్షను తెలంగాణా వాదుల నిరసనల మధ్య విరమించారు. దీని ఫలితంగా 2009 డిసెంబరు 6, 7 తేదీలలో తెలంగాణా ప్రాంతంలో ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. పలు హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆత్మహత్యలతోపాటు, ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగింది. ఈ కాలంలోనే ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల విద్యార్థులతో ఉమ్మడి కార్యాచరణ సంఘం (జెఏసి) ఏర్పడింది. జెఏసి ప్రత్యేక తెలంగాణా కొరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. తెలంగాణా ప్రాంతమంతటా విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. రవాణా కూడా స్తంభించిపోయింది. ఈ కాలంలోనే సుమారు 5వేల మందిని శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందు జాగ్రత్త చర్యగా అరెస్టు చేశారు.

పరిస్థితి చేయిదాటి పోతుండటంతో 2009 డిసెంబరు 7న ముఖ్యమంత్రి కె.రోశయ్య అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల శాసనసభ్యులు, నాయకులతో ఒక సమావేశం జరిగింది. సిపిఎం ఒక పార్టీ తప్ప మిగతా రాజకీయ పార్టీలన్నీ ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకు రాష్ట్ర అసెంబ్లీలో ఒక తీర్మానం చేయాలని ప్రతిపాదించాయి. సిపిఎం మాత్రం ప్రణబ్ ముఖర్జీ కమిటీ కాలంలో తాను తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉంటానని ప్రకటించింది. మరోవైపు మజ్లీస్ పార్టీ శాసనసభలో అన్నిపార్టీలు తమ సరైన అభిప్రాయాలను ప్రకటించాలని కోరింది. ఈ నేపథ్యంలో 2009 డిసెంబరు 9 రాత్రి కేంద్ర హోంమంత్రి పి.చిదంబరం ఒక ప్రకటన చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్ర ప్రక్రియను ప్రారంభించేందుకు అనువుగా రాష్ట్ర అఖిలపక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం రాష్ట్ర అసెంబ్లీలో తగిన సమయంలో తెలంగాణా అంశంపై ఒక తీర్మానం చేయాలని ప్రకటించారు.

చిదంబరం ప్రకటన తరువాత రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో చెలరేగిన ఉద్యమాలను పరిగణిస్తూ కేంద్ర హోంమంత్రి అన్ని రాజకీయ పార్టీల, గ్రూపుల సలహా సంప్రదింపులను పరిశీలించిన అనంతరమే రాష్ట్ర విభజన ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. ఈ ప్రకటన వల్ల రాయలసీమ, కోస్తా ఆంధ్రలలో ఉద్యమం తగ్గుముఖం పట్టగా తెలంగాణాలో తిరిగి మొదలయింది. తెలంగాణా ప్రాంతానికి చెందిన వివిధ పార్టీల ఎమ్మెల్యేలు (కాంగ్రెస్ 13, టిడిపి 37, టిఆర్ఎస్ 10, బిజెపి 1, పిఆర్పి 2) తమ రాజీనామాలను 2009 డిసెంబరు 30న సమర్పించారు. జెఏసి తెలంగాణా బంద్ పిలుపునివ్వగా మొత్తం ప్రాంతం స్తంభించిపోయింది.

ఈ ఏడాది కాలంపాటు వివిధ రకాల ఉద్యమాలతో రాష్ట్రం అట్టుడికి పోగా 2009 నవంబరు నుండి 2010 జనవరి వరకు ఉద్యమ తీవ్రత మరింత అధికంగా అనిపించింది. ఈ ఉద్యమాలు తెలంగాణా ప్రాంతంలో జరిగాయి. తెలంగాణా ప్రాంతంలో అరెస్టులు కూడా అధికంగా చోటుచేసుకున్నాయి. 8000 మందికిపైగా ఉద్యమకారుల హింసాత్మక సంఘటనలను గుర్తించి 1600లకు పైగా కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను రెండు రకాలుగా వర్గీకరించాయి. రస్తారోకో, రైల్‌రోకో, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, హింసాత్మక చర్యలకు ప్రేరేపించడం, నిషేధాజ్ఞలను ఉల్లంఘించటం, జాతీయ నాయకుల విగ్రహాలను అవమానించడం, ఆత్మహత్యలకు ప్రయత్నించడం వంటివి సాధారణ కేసుల క్రింద నమోదు కాగా ప్రభుత్వ ఆస్తులను దెబ్బతీయడం, కాల్చడం, ప్రభుత్వ ఉద్యోగుల మీద దాడిచేయడం వంటివి నేర పూరిత కేసులుగా నమోదయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మొదటి వర్గానికి సంబంధించిన 565 సాధారణ కేసులను విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని వెనక్కు

తీసుకుంది. మిగతా కేసులను ఆయా కేసుల తీవ్రతను బట్టి పరిశీలిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబరు 23న ప్రకటించిన విధంగా రాష్ట్రంలో 8 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులను / ప్రతినిధులను ఆహ్వానించి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కేంద్ర హోంమంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఆ సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. టిఆర్ఎస్, బిజెపి, సిపిఐ పార్టీలు తెలంగాణా అంశంమీద వేరే సంప్రదింపులు అక్కర్లేదని ముందు ప్రకటించిన ప్రకారం రాష్ట్ర విభజన ప్రక్రియను ప్రారంభించాలనీ కోరగా కాంగ్రెస్, సిపిఎమ్, మజ్లీస్, పిఆర్పి పార్టీలు ఆ దశలో వివిధ సంప్రదింపులు అవసరమని తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చాయి. టిడిపి ప్రతినిధుల్లో ఒకరు సంప్రదింపులను బలపరచగా మరొకరు ప్రత్యేక రాష్ట్రానికి మద్దతు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతల అంశానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని పార్టీలవారూ సంయమనం పాటించాలని ప్రజలను కోరారు.

ఈ కాలంలో వివిధ పార్టీల మధ్య, గ్రూపుల మధ్య భిన్నాభిప్రాయాలు చోటు చేసుకున్నాయి. భారత ప్రభుత్వం 2010 ఫిబ్రవరి 3న ప్రస్తుత కమిటీని ఏర్పాటు చేసింది. 'ఆంధ్రప్రదేశ్‌లో సంప్రదింపుల కొరకు కమిటీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. కాగా ఈ కమిటీ 2010 ఫిబ్రవరి 13న సమావేశమవగా ఒక్క బిజెపి తప్ప మిగతా రాజకీయ పార్టీలన్నీ ఈ కమిటీకి తమవంతు సహకారాన్ని అందించాయి. తెలంగాణా ప్రాంతంలోని లాయర్లు విద్యార్థి సంఘాల ప్రతినిధులు మొదట్లో కొంత వ్యతిరేకత కనబరిచినా తర్వాత తమవంతు సమాచారాన్ని అందిస్తూ సహకరించాయి. మొత్తంమీద రాష్ట్రమంతటా శాంతియుత వాతావరణం నెలకొనింది.

ఈ కమిటీ పనిచేసిన కాలంలో మూడు ముఖ్య సంఘటనలు రాష్ట్రంలో చోటు చేసుకున్నాయి. ఒకటి 2010 ఆగస్టులో తెలంగాణా ప్రాంతంలోని ఐదు జిల్లాల్లో 12 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు. రెండు ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రూప్‌వన్ పోస్టులకు 42% రిజర్వేషన్ కోరుతూ ఉద్యమం. మూడు రాష్ట్ర ప్రభుత్వంలో న్యాయాధికారుల పోస్టులకు రిజర్వేషన్లను ఏర్పరచాలని తెలంగాణా లాయర్ల సంఘం ఉద్యమం.

12 అసెంబ్లీ స్థానాలకు 2010 ఫిబ్రవరిలో జరిగిన ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థులు 11 స్థానాల్లో గెలుపొందారు. కాంగ్రెస్ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ నిజామాబాద్‌లో టిఆర్ఎస్ మద్దతుతో పోటీచేసిన బిజెపి అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. టిఆర్ఎస్ అభ్యర్థులు గత ఎన్నికలతో పోలిస్తే తమ ఓట్ల శాతాన్ని బాగా పెంచుకున్నారు. ఈ ఉప ఎన్నికల ఫలితాల వలన ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి మంచి ఊతం ఏర్పడిందని చెప్పవచ్చు.

గ్రూప్‌వన్ పోస్టుల రిజర్వేషన్ కింద ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు ఉమ్మడికార్యాచరణ సంఘం (జెఎసి)గా ఏర్పడి తెలంగాణాకు 42% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపిపిఎస్‌సి నిర్వహించే గ్రూప్‌వన్ పోస్టుల స్క్రీనింగ్ టెస్టును వాయిదా వేయాలని ఉద్యమించారు. పరీక్ష రోజున, 2010 సెప్టెంబర్ 5న జెఎసి బంద్‌కు పిలుపునిచ్చింది. అయితే ఆరోజున కొన్ని స్వల్ప సంఘటనలు మినహా రాష్ట్రమంతటా పరీక్ష సజావుగా జరిగింది.

తెలంగాణా ప్రాంత లాయర్లు లా ఆఫీసర్ల పోస్టుల భర్తీలో తమ ప్రాంతానికి జరుగుతున్న వివక్షతను నిరశిస్తూ ఉద్యమంలోకి దిగారు. తెలంగాణా ప్రాంతంలో కోర్టులను బహిష్కరిస్తూ 2010 సెప్టెంబర్‌లో నిర్ణయం తీసుకున్నారు. వారు హైకోర్టును కూడా బహిష్కరించి నిరవధిక నిరాహారదీక్షలను చేపట్టారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకుని ముగ్గురు మంత్రులతో కూడిన కమిటీని వేసింది. ఈ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి ఇచ్చింది.

శ్రీకృష్ణ కమిటీ చేసిన మొత్తం పని చాలా క్రమశిక్షణతో ఒక పద్ధతి ప్రకారం జరిగింది. ప్రారంభంలో కొన్ని అవాంతరాలు ఎదురైనా తర్వాత బిజెపి మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ, ఇతర గ్రూపులన్నీ ఈ కమిటీకి తమ సహాయ సహకారాలను అందించాయి.

***

అధ్యాయం **2**

# ప్రాంతీయ ఆర్థిక సమానతలు ప్రాధాన్యతలు-విశ్లేషణ

## ఆంధ్రప్రదేశ్ నేపథ్యం - నైసర్గిక చిత్రం

భారతదేశంలో అత్యంత విస్తీర్ణత కలిగిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. 2,75,000 చదరపు కిలోమీటర్ల భూభాగంతో, 90 మిలియన్ల జనసాంద్రతతో ఈ రాష్ట్రం వుంది. ఆంధ్రప్రదేశ్ జి.డి.పి రూ.3,26,547 కోట్ల రూపాయలు కాగా తలసరి ఆదాయం రూ.35,600గా 2007-08లో అప్పటి ధరల ఆధారంగా అంచనా కట్టారు. కేంద్ర ప్రభుత్వం వారి అభివృద్ధి పథకాలు గణాంక శాఖల వివరాల్ని బట్టి 2003-04 నుంచి రాష్ట్రంలో అభివృద్ధి దాదాపు శాతం 10% వుంది. రాష్ట్రంలోని పౌరుల సగటు, తలసరి ఆదాయం లెక్కలతో దేశంలోని రాష్ట్రాల అభివృద్ధి క్రమంలో 4వ స్థానంలో ఉంది. మొత్తం జి.డి.పిలో వ్యవసాయరంగం 26%గా ఉండగా 62% మేరకు ఉపాధికల్పన వ్యవసాయ ఆధారిత రంగాల్లో పనిచేసే వారి ద్వారా సమకూరుతోంది. (పట్టిక 2.1 చూడండి). సగటున హెక్టారు భూమి నుంచి పంటల ద్వారా రూ.25,000 దాకా దిగుబడి ఆదాయం ఉంటోంది. అక్షరాస్యత రంగంలో 60.5% కాగా, 70.3% పురుషులు 50.4% మహిళలుగా ఉంది. వెయ్యిమందికి 43 దాకా శిశు మరణాలు సంభవిస్తున్నా అది ఇతర ప్రాంతాల కన్నా తక్కువ. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం అత్యధిక జనాభాతో దేశంలో 6వదిగా విస్తరించింది. రాష్ట్రంలోని జనాభాలో 27% మంది పట్టణాలు నగరాల్లో స్థిరపడి పోయారు. 16.2% దళిత కులాలు, 6.6% షెడ్యూల్డు తెగలు, 9% మైనారిటీలు ఉండగా పెద్ద సంఖ్యలో అభివృద్ధి పథకాలు, విధానాలను అన్ని ప్రాంతాలు, జిల్లాల్లో అమలు చేస్తున్నారు.

విశాలమైన రాష్ట్రంలో సాధారణంగా ఉండే హెచ్చుతగ్గులు జిల్లాల్లోని పథకాల అమలు తీరులో ప్రస్ఫుటమవుతున్నాయి. ప్రకృతి సంబంధమైన అంశాలు, వాతావరణం, చారిత్రకపరమైన కారణాలు, అమలు తీరులో తేడాలు వంటి వాటితో తరచుగా ఈ హెచ్చుతగ్గులు ఉంటున్నాయని కారణాలుగా పేర్కొంటున్నారు. వాటన్నింటిని తులనాత్మకంగా పరిశీలించడానికి తగిన అంచనాలు, కొలమానాలతో ఈ అధ్యాయంలో పలు అంశాల్ని ప్రస్తావిస్తున్నాము.

జిల్లాల వారీగా మదింపు చేసిన అంచనాలను క్రోడీకరించి విశ్లేషణతో ఈ నివేదిక చివరి భాగంలో పొందుపరిచాము.

ఈ రాష్ట్రం 3 ప్రధానమైన ప్రాంతాలుగా భౌగోళికంగా విభజించబడింది. చారిత్రక నేపథ్యంగల ఈ ప్రాంతాలు తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ పేర్లతో ఉన్నాయి.

తెలంగాణ ప్రాంతం 10 జిల్లాలతో 40.6%, 9 జిల్లాలతో కోస్తా ప్రాంతం 41.6%, 4 జిల్లాలతో రాయలసీమ 17.6% జనాభా దామాషాతో ఉన్నాయి. తెలంగాణా ప్రాంతంలో భాగంగా హైదరాబాద్ మహానగరం అర్బన్ జిల్లాగా రూపొందింది. 2001లో 3.8 మిలియన్ ప్రజలతో ఉన్న

ఈ నగరం 2010 నాటికి 4.9 మిలియన్‌లుగా రాష్ట్ర జనాభాలో 5.6% భాగంగా విస్తరించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో నివాసం ఉంటున్న వారి విస్తృతితో 2010 కల్లా 7.3 మిలియన్‌ల జనాభాగా మొత్తం రాష్ట్ర జనాభాలో 8.4%గా పరిణమించింది. తెలంగాణ ప్రాంతంలో షెడ్యూల్డు కులాలు, తెగలవారి జనాభా 24.7%తో కొంచెం అధికంకాగా కోస్తా ప్రాంతాల్లో 22.3%, రాయలసీమలో 19.5%గా ఉన్నారు. మైనార్టీల సాంద్రత కూడ కోస్తా ప్రాంతం కన్నా తెలంగాణలో ఎక్కువగా ఉంది.

కోస్తాంధ్రలో తలసరి ఆదాయం 36,496 రూపాయలు కాగా హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ ప్రాంతంలో రూ.36,082. రాజధాని నగరాన్ని మినహాయిస్తే తెలంగాణా తలసరి ఆదాయం రూ.33,771, రాయలసీమ ప్రాంతంలో రూ.33,056. 2007-08 ధరవరల ప్రకారం ఈ తలసరి ఆదాయాన్ని లెక్కకట్టారు. రాయలసీమ ప్రాంత ఆదాయంలో వ్యవసాయరంగం 25% కాగా కోస్తా ఆంధ్ర ప్రాంతంలో 24%, తెలంగాణలో 22%గా లెక్కలు తేలుస్తున్నాయి. ఉపాధి అవకాశాల అంశంలో రాయలసీమ 47.5%తో అధికంగా ఉండగా 46% శాతంతో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు ఇంచుమించుగా ఒకటిగా ఉన్నాయి. పట్టణీకరణ పరిణామాల్ని అంచనా వేస్తే ఆశించిన లక్ష్యాల స్థాయి కన్నా తక్కువగా తెలంగాణలో 22%, కోస్తాలో 25%, రాయలసీమలో 23% అని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి హైదరాబాద్ జిల్లా పూర్తిగా నగరీకరణ చెందటంలో మూడు ప్రాంతాల ఆదాయ వాటాలతోనే వికసించింది.

## జిల్లాస్థాయి స్థూల ఉత్పాదకత (జిడిడిపి)

మనదేశంలో ఆర్థికపరమైన అంచనాలన్నీ రాష్ట్రస్థాయి ఉత్పత్తి విలువల ఆధారంగా ఉంటాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిని జిల్లా ఆర్థిక పరిమాణం ఆధారంగా ప్రతి జిల్లా లెక్కన అంచనా వేస్తారు. ఇందుకు గాను కాలానుగతంగా ధృవీకరణకు గురయ్యే కొన్ని నిర్దేశిత పద్ధతులను అనుసరిస్తారు. ఆర్థికపరమైన విశ్లేషణలు జిల్లాస్థాయి స్థూల ఉత్పాదన గణాంకాలతో (జిడిడిపి) ప్రాంతీయ స్థాయి గణాంకాల నుంచి రూపొందుతాయి. హైదరాబాద్ మహానగరంలో పారిశ్రామిక ఉత్పత్తి, వాణిజ్యం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెంది ఉంటాయి. తలసరి సగటు ఆదాయం అన్ని కాలాల్లో ఎప్పుడూ ఎక్కువగానే ఉంటుంది. 1993-94లో కోస్తాంధ్ర ప్రాంతంలో ఈ ఆదాయం రూ.12,809గా ఉంది (1999-2000 ఏడాది ధరల ఆధారంగా). తెలంగాణలో హైదరాబాద్‌ను మినహాయించి లెక్కడితే చాలా తక్కువగా రూ.11,391గా వెల్లడి అయింది. కాగా 2007-08 ఏడాదిలో హైదరాబాద్ అభివృద్ధి పెరుగుదల అత్యధికంగా సగటు తలసరి ఆదాయం రూ. 39,145 స్థాయికి పెరిగింది. ఈ తీరులోనే ఇతర ప్రాంతాల్లో కూడా మదింపు వేస్తే కోస్తాంధ్రలో రూ.25,237, తెలంగాణలో రూ.25,237గా ఉండగా రాయలసీమ ప్రాంతంలో రూ.23,860గా తేలింది.

**1999-2000 ధరల ఆధారంగా (రూ.లలో)**

| ప్రాంతం | 1993-94 | 2000-01 | 2007-08 |
|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 12,235 | 16,615 | 26,310 |
| తెలంగాణ (హైదరాబాద్‌తో కలిపి) | 11,558 | 16,566 | 27,006 |
| తెలంగాణ (హైదరాబాద్ మినహా) | 11,391 | 15,746 | 25,237 |
| హైదరాబాద్ | 12,745 | 22,135 | 39,145 |
| రాయలసీమ | 12,414 | 15,105 | 23,860 |
| కోస్తాంధ్ర | 12,809 | 17,301 | 26,655 |

*ఆధారం : కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ*

ప్రాంతీయ అభివృద్ధి స్థాయి క్రమాన్ని సమీక్షిస్తే కచ్చితమైన ఆర్థిక వ్యవస్థ అమలు చిత్రం అవగతం అవుతుంది. 2000-01 నుండి 2007-08 మధ్యకాలంలో మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయం 58%. సరిగ్గా అదేకాలంలో హైదరాబాద్‌లో అత్యధిక స్థాయి పెరుగుదల 77%. తెలంగాణలో (హైదరాబాద్ నగర ప్రాంతాన్ని మినహాయిస్తే) 60%, రాయలసీమలో 58%, కోస్తాంధ్రలో 54% తక్కువగా నమోదయింది. 1993-94 కాలం నుంచి తెలంగాణ ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేనంత అధికంగా జి.డి.డి.పి. గణాంకాలు తెలియజేస్తున్నాయి. జాతీయ స్థాయి దృక్కోణం నుంచి లెక్కలు కడితే అన్ని ప్రాంతాల్లో పెద్ద అసమానతలు వ్యత్యాసం లేకుండా ఇంచుమించు దగ్గర దగ్గరగా ఉన్నాయని తేటతెల్లం అవుతోంది.

తెలంగాణ జి.డి.డి.పి.ని విశ్లేషిస్తే (హైదరాబాద్‌ను మినహాయించి) తక్కువ స్థాయి నుండి గత కొంతకాలంగా రాయలసీమ ప్రాంతం కన్నా ఎక్కువగాను, కోస్తాంధ్ర కన్నా తక్కువగాను ఉందని తెలియవస్తుంది.

## ఆదాయంలో ప్రాంతీయ పరమైన వాటా

మరో పద్ధతిగా ఆయా ప్రాంత అభివృద్ధి ఆదాయాల్ని తులనాత్మకంగా పరిశీలిస్తే ఏళ్ళ తరబడి లెక్కలు కడుతున్న తలసరి ఆదాయంలో హెచ్చుతగ్గుల కారణాలు తెలుస్తాయి. ఏడాదికేడాదిగా అభివృద్ధి క్రమాన్ని మదింపు చేయటం వల్ల తరచుగా తేడాలు ఉంటాయి. 3ఏళ్ళకో మారుగా ఒక నిశిత పరిశీలనను చేసి సమీక్షిస్తే జి.డి.డి.పి.లోని హెచ్చు తగ్గుల కారణాలపై సరైన అవగాహన పెంచుకోవటానికి వీలవుతుంది. తెలంగాణ (హైదరాబాద్ లేకుండా) ప్రాంతంలో, హైదరాబాద్ జిల్లాలో జి.డి.పి. శాతం పురోగమన దిశలో వుంది. ఉదా హరణకు తెలంగాణలో 33%గా 1993-94లో వెల్లడైన ఆదాయం 2007-08 నాటికి 35% అయింది. అలాగే హైదరాబాద్‌కు సంబంధించి ఈ ఎదుగుదల 5% నుంచి 8%గా ఉంది. ఈ తరహా పరిశీలనలో కోస్తాంధ్ర ప్రాంతంలో జి.డి.పి. 44% నుంచి 41%గా నమోదు కాగా రాయలసీమ ప్రాంతంలో 18% నుంచి 16%కు తగ్గింది. అన్ని ప్రాంతాల్లో జి.డి.పి. ఎదుగుదలను గమనించి అర్థం చేసుకోవటం ముఖ్యం. కోస్తాంధ్రను మినహాయించి చూస్తే 2005 నుంచి ఎదుగుదల శాతం పెరుగుతూనే ఉందని తెలుస్తోంది. ఇదే కాలంలో ఆంధ్ర ప్రాంతంలో ఈ కొలమానం దాదాపుగా స్థిరంగా వుంది.

## జి.డి.డి.పిలో ప్రాంతీయ ప్రాతిపదిక వాటా

ఇందులో ప్రధానంగా ఆర్థికపరంగా కీలకమైన 3 రంగాలను సమీక్షించాము. ప్రాథమికమైన వ్యవసాయం, ఉత్పత్తులు, సేవారంగాలలో అధ్యయనంతో వ్యవస్థపై అవగాహన కలుగుతుంది. జి.డి.డి.పిలో భాగమైన తెలంగాణ ప్రాంతంలో పారిశ్రామిక, సేవారంగాలలో అధ్యయనాన్ని మిగిలిన రెండు ప్రాంతాలతో పోల్చాము. వాస్తవంగా హైదరాబాద్‌ను మినహాయించిన తెలంగాణప్రాంతంలో పారిశ్రామిక రంగంవల్ల పెరిగిన ఉపాధి అవకాశాలు గతంలో కన్నా గణనీయంగా పెరిగాయి (30%). హైదరాబాద్‌లో ఆశయలక్ష్యాల మేరకే ఉద్యోగ సేవా రంగాల్లో ఆర్థిక అభివృద్ధి ఆదాయం 82% దాకా పెరిగింది. పారిశ్రామిక ప్రగతి ఇందుకు తోడ్పడింది.

## వాణిజ్య బ్యాంకుల పరపతి

**అభివృద్ధికి రుణాలు :** ఒకానొక ప్రాంతంలో ఆర్థికపరమైన స్థితిగతుల్ని, వ్యవస్థ రూపాన్ని మదింపు వేయాలంటే కచ్చితమైన మార్గం షెడ్యూల్డ్ బ్యాంక్‌లు. అవి ప్రభుత్వ రంగంలోని వయినా, ప్రైవేటు రంగంలోని వయినా వసూలకాని రుణ బకాయిలు అనువైన సూచిక అవుతుంది. ఒకానొక ఎంచుకున్న ప్రాంతం లేదా మండలిలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్‌ల ఖాతాలలోని వసూలకాని రుణ బకాయిల మొత్తం ఆ ప్రాంతంలోని వాణిజ్య అవకాశాలు, ఆదాయ అభివృద్ధి నమూనాకు విశ్వసనీయమైన సూచికగా పరిగణించవచ్చు. వ్యక్తిగతమైన పొదుపు మదుపులకు అదనంగా షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల పట్టికలు నిర్వహణ తీరుతెన్నులు ఆ ప్రాంత అభివృద్ధిని అర్థం చేసుకోవటానికి పనికివస్తాయి. 2009 మార్చి వరకు ఆంధ్రప్రదేశ్ మొత్తం రాష్ట్రంలో లావాదేవీలు 2.29 లక్షల కోట్ల రూపాయలు బ్యాంక్‌ల ద్వారా అయ్యాయి. అనుకున్న అంచనాల మేరకే హైదరాబాద్‌లోని జనాభాలో 1000 మందికి 211 మంది బ్యాంక్ ఖాతాదారులుగా నమోదు అయ్యారు. రాయలసీమ ప్రాంతంలో ఈ లెక్క 159, కోస్తాంధ్రలో 154, తెలంగాణలో కాస్తంత తక్కువగా 113గా (హైదరాబాద్‌ను పరిగణించకుండా) ఉంది.

ఆయా జిల్లాల్లోని నిల్వల మదింపుతో చేసే విశ్లేషణలు అంచనాలు అసలు సిసలు ఆర్థికపరమైన కార్యకలాపాల నిగ్గును తెలియచెపుతాయి. రాయలసీమ ప్రాంతంలోని బ్యాంక్ ఖాతాల నిల్వ ఇతర ప్రాంతాలకన్నా కాస్తంత ఎక్కువ మందాన ఉంది. నిల్వల విలువ కనీసంగా రూ.71,000 దాపుల్లో ఉండగా తెలంగాణలో (హైదరాబాద్ లేకుండా) రూ.94,000, కోస్తాంధ్ర ప్రాంతాల్లో రూ.1,19,000 దాకా వుంది. కోస్తాంధ్ర ప్రాంతంలో బ్యాంక్‌ల వినియోగం అందుబాటు తదితర అంశాలు ఇతర ప్రాంతాలకన్నా ఎక్కువగా ఉంది. అదే విధంగా హైదరాబాద్‌ను కలిపి తెలంగాణా ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకుంటే మిగులు నిల్వల మొత్తం రూ.3,34,000గా అంచనా. కాగా హైదరాబాద్ నగరం, జిల్లా పరిధిలోని మిగుల నిల్వ ఒక ఖాతాకు రూ.12లక్షలుగా లెక్కకు వచ్చింది.

గత 12 సంవత్సరాల కాలంలో హైదరాబాద్ ప్రాంతంలోని బ్యాంక్ ఖాతాలలో వ్యవసాయరంగానికి సంబంధించిన వాటిల్లోని లావాదేవీలు జమల్లో విశ్లేషిస్తే అధిక పెరుగుదల గోచరమవుతుంది. 2001-04 మధ్యకాలంలో తెలంగాణ ప్రాంతంలో గణనీయమైన అభివృద్ధి నమోదయింది. తదనంతర కాలంలో ఈ దశ విలోమంగా తగ్గుదల సూచించింది.

మరోవైపు అభివృద్ధి క్రమం పరిణామం అన్ని ప్రాంతాల్లో 2005-07 సంవత్సరాల్లో గణనీయంగా ఉంది. అదే తీరులో 2007-09 మధ్యకాలంలో అధ్యయనం చేస్తే తగ్గుదల కనిపిస్తుంది. వ్యవసాయేతర రంగం సంబంధిత ఆర్థిక కార్యకలాపాలలో రాష్ట్రం అంతటా ఈ తరుగు పతన దశను సూచిస్తుంది.

## వ్యవసాయ రుణాలు

వాణిజ్యబ్యాంక్‌ల లావాదేవీల ప్రధాన కార్యకలాపాల్లో "వ్యవసాయిక పరపతి" ప్రాధాన్యత క్రమంలో ముందుంటుంది. వర్షపాతం తక్కువగా మాగాణి వ్యవసాయం చేయటానికి అనువుగా ఉండని రాయలసీమలో వెయ్యింట 127 ఖాతాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. కోస్తాంధ్రలో ఈ లెక్క 110 కాగా తెలంగాణలో 85గా ఉంది. అయితే రుణ చెల్లింపుల్లో కోస్తాంధ్ర ప్రాంతం ముందంజలో ఉంది. ఈ క్రమంలో వ్యవసాయరంగంలో జమ, పరపతి వంటివి భూవసతి పరిమితి, జలవనరులు, సాలుసరి దిగుబడి పంటలు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుందని గమనించాలి. కోస్తాంధ్ర ప్రాంతంలో సాగుభూమి అధికం, ఏటేటా 3 పంటలు పండటం వల్ల బ్యాంకింగ్ వినియోగం, లావాదేవీలు, మదుపు అధికంగా ఉంటాయి. తెలంగాణ ప్రాంతంలో మదుపు మొత్తం వ్యవసాయిక ఖాతాల్లో సగటున రూ.48,000 దాపుల్లో రాయలసీమ ప్రాంతంలోని రూ.43,000 కన్నా హెచ్చుగా ఉంది. అయితే కోస్తాంధ్ర ప్రాంతంలోని రూ.59,000తో పోలిస్తే చాలా తక్కువ.

షెడ్యూల్డు వాణిజ్య బ్యాంక్‌ల ఖాతాలు మదుపు తీరుతెన్నులతో సరాసరి లెక్కన హెక్టారు భూభాగంలో పంట దిగుబడి అంచనా మదింపు సాధ్యం అవుతుంది.

కోస్తాంధ్రలో హెక్టారు పంట రాబడి మొత్తం రూ.32,000 కాగా, రాయలసీమ ప్రాంతంలో రూ.21,000, తెలంగాణలో 18,000 రూపాయలుగా మాత్రమే ఉంది. వ్యవసాయ కార్యకలాపాల్లో తెలంగాణా ప్రాంతంలో ఆర్థికపరమైన మదుపును పెంచటానికి ప్రత్యేక శ్రద్ధ కనపరచాల్సి వుంది. హైదరాబాద్ ప్రాంతంలో కూడా వ్యవసాయ సంబంధిత మదుపు రూ.29,000 కాగా సగటు ఖాతా మదుపు చాలా ఎక్కువగా రూ.16.4 లక్షలుగా వుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతలలో వ్యవసాయ రుణాల మంజూరు పెరుగుతూనే వుందని విశ్లేషణ ప్రకారం తెలియవస్తుంది. 1998 నుంచి 2007దాకా దాదాపుగా అన్ని ప్రాంతాల్లో ప్రత్యేకించి తెలంగాణలో ప్రగతి గణనీయంగా ఉంది. ఈ కాలంలో రాష్ట్రంలో మొత్తంగా అన్ని ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో పరపతి విస్తృతి హెచ్చుగా ఉంది.

## అభివృద్ధికి రుణాలవల్ల ప్రయోజనాలు

రిజర్వుబ్యాంకు నియమ నిబంధనలకు లోబడి గ్రామీణ ప్రాంతాల్లో రుణ సౌకర్యంతో వ్యవసాయ రంగానికి సముచితమైన చేయూత ఇవ్వటం జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు రుణాలతోపాటు, ఉత్పత్తి, గృహనిర్మాణం, వ్యక్తిగత రుణాలు, వ్యాపారం తదితర రంగాలకు ఆర్థికపరమైన తోడ్పాటు ఉంది. వ్యవసాయేతర రంగాల వివరాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలంటే హైదరాబాద్ ప్రాంతంలోని ఖాతా నిల్వల మొత్తం అత్యధికంగా ఉందని గమనించాలి. 3 ప్రాంతాల్లోని తారతమ్యాల్ని అధ్యయనం చేయాలంటే హైదరాబాద్‌ను మినహాయించిన ప్రాంతాల్లో కోస్తాంధ్ర ప్రాంతం ఎక్కువ మొత్తాలతో ముందు ఆ తరువాత క్రమంలో తెలంగాణ (హైదరాబాద్ కాకుండా) ఆ తర్వాతనే రాయలసీమ తక్కువ మొత్తంతో ఉన్నాయి.

## ఆర్థిక, ద్రవ్య తదితర పథకాల సూచికలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అధికారికమైన సమాచారం కోసం జిల్లాస్థాయిలోని ఆర్థిక అంశాలు ఆదాయమార్గాలు, వ్యయపట్టికలు, ప్రగతి విధానాలు వంటివి పేర్కొనమని కమిటీ కోరింది. 1995-96 నుంచి 2008-09 వరకు గల ఆదాయం, వ్యయం వివరాలు అన్నింటిని క్రోడీకరిస్తూ సమన్వయ

నివేదికగా పిఎఓ- ఫర్/పిడబ్ల్యుడి పద్దుకింద, ప్రత్యేక కేటాయింపులేని పద్దుకింద సమీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ మొత్తం వ్యయంలో 36%గా ఉన్న మొత్తాలు అన్నీ ఈ రెండు వర్గీకరణ పద్దుల్లో చోటు చేసుకున్నాయి. 47% మేరకు ఆదాయ వనరులు జమ అయిన సొమ్ము మొత్తం అన్ అపోర్షన్ అమౌంట్‌గా (అనామతు ఖాతా) పేర్కొనటం జరిగింది. ఇలాంటి పద్దుల్లో జమాఖర్చులన్నింటిని ప్రోదిచేసి జిల్లాల వారి కేటాయింపుగా మదింపు వేయటం సమంజసం కాదు అన్న భావనతో ప్రాంతీయమైన విశ్లేషణను నిర్ధారించటం సరికాదని చేపట్టటం మానివేశాము.

ఈ కారణాలతోనే కొన్ని నిర్ధారించిన పద్దుల్ని ద్రవ్యపరమైన సమాచారంగా స్వీకరిస్తూ వాణిజ్యపన్నులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్థానిక సంస్థలకు సంక్రమించిన అధికారికమైన వనరులు, సర్వశిక్ష అభియాన్‌లో వ్యయం అయిన నిధులు వగైరాలను విశ్లేషణకు అనువైన అంశాలుగా కమిటి పరిగణించింది. వాటికి అదనంగా రహదారుల విస్తృతి వాటిని వినియోగించే వాహనాల రాకపోకల సాంద్రత వంటివాటిని విశ్లేషించాము. అలాంటివన్నీ కలగలిపి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టిని, తీరుతెన్నుల్ని గణనం కోసం పరిగణించారు.

## ప్రాంతాలవారీగా వాణిజ్య పన్నుల రాబడులు

ఆంధ్రప్రదేశ్‌లో వాణిజ్యరంగంలో పన్నుల రూపేణా 2008-09లో సంక్రమించిన వాస్తవిక ఆదాయం రమారమి రూ. 22,000 కోట్లు దాకా ఉంది. ఈ మొత్తంలో దాదాపుగా 75% కేవలం హైదరాబాద్ నుంచి ఒనగూడిందని గమనించాలి. వాణిజ్యపన్నుల వసూలు కోసం ఏర్పాటయిన ప్రాంతీయ విభాగాల వ్యవహారశైలిని ప్రమాణంగా ఎంచుకోవటం జరిగింది. మామూలు జిల్లాకన్నా విస్తరించిన పరిధి తరచుగా వాణిజ్య కేంద్రపరిధిగా ఉంటుంది. హైదరాబాద్ పరిధిని మినహాయించి, అత్యధికంగా వాణిజ్య కార్యకలాపాలు కోస్తాంధ్రలో కేంద్రీకృతం అయ్యాయి. పన్నుల వసూలు స్థాయి కోస్తాంధ్రలో 15%, తెలంగాణ ప్రాంతంలో 8%, రాయలసీమలో 3% గా వుంది.

## విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

ప్రపంచీకరణ ప్రభావంతో వేగంగా విస్తరిస్తున్న పెట్టుబడులను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ.)గా పేర్కొంటున్నాము. ఈ రకమైన పెట్టుబడులు ఆర్థిక పాటవాన్ని సూచించడమే గాక భవిష్యత్తులో ఆర్థికాభివృద్ధిని కూడా నిర్ధారిస్తాయి.

స్థూలంగా మొత్తం రాష్ట్రానికి సంబంధించి 12,421 కోట్ల రూపాయలు మాత్రమే విదేశాల నుంచి నేరుగా వచ్చాయి. వాటిల్లో రూ.6,490 కోట్ల మేరకు హైదరాబాద్‌తో కూడిన తెలంగాణలో పెట్టుబడిగా పెట్టారు. కాని వాటిల్లో అత్యధిక శాతం హైదరాబాద్ నగర జిల్లాకు మాత్రమే పరిమితం అయ్యాయి. ఈ ప్రాంతాల్లో మౌలిక వసతులు, వనరులు, సేవలు వంటివి అందుబాటులో ఉండటం వల్ల హైదరాబాద్ పరిధికి మాత్రమే అకర్షణ ఉండటం ఆశ్చర్యకరమేమీ కాదు. హైదరాబాద్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ఉంటే తెలంగాణ ప్రాంతంలోని పెట్టుబడులు రూ.1,658 కోట్లు కాగా కోస్తాంధ్ర ప్రాంతాల్లో రూ.5,499 కోట్లు, రాయలసీమలో కేవలం రూ.732 కోట్లుగా ఉన్నాయి.

హైదరాబాద్‌లో మాత్రమే కేంద్రీకృతం అవుతున్నందువల్ల తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో ఎఫ్.డి.ఐ. పెట్టుబడులు తక్కువగా ఉన్నాయి.

## జిల్లాపరిషత్‌లు, మండలాలు, గ్రామ పంచాయితీలకు ద్రవ్య వినియోగ అధికారాల పంపిణీ

మన దేశంలో మూడంచెల వ్యవస్థ పాలనగల రాష్ట్రాల్లో స్థానిక సంస్థలకు విశేష అధికారాలు, ఆర్థిక వనరులు సమకూర్చిన కొన్ని రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ విశిష్టమైనది. ఆయా జిల్లాలలోని స్థానిక సంస్థల ఆదాయ వ్యవహారాలు పట్టికలతో సహా కలక్టరేట్ స్థాయిలో ముద్రించిన గణాంకాల పుస్తకాల్ని 22 జిల్లాల్లో పంపిణీ చేశారు. హైదరాబాద్ మహానగరం మాత్రం ఈ తరహా సమాచార వ్యవస్థలో లేదు. జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయితీలతో కూడిన స్థానిక సంస్థల పాలనలో సరైన విలువైన సమాచారం తద్వారా అందివచ్చింది.

మూడంచెల వ్యవస్థలోని జడ్‌పి, ఎంపి, జిపిలను పరస్పరం కలగలిపితే ఆర్థిక సమీక్ష సమగ్రం అవుతుంది. మౌలికంగా పల్లెపట్టుల్లో ప్రాథమిక స్థాయిలో విడివిడిగా మదింపు అంచనాలు ఆ వివరాల్ని తెలియ చెపుతాయి.

పంచాయితి రాజ్ పాలన వ్యవస్థలోని అన్ని స్థాయిల్లో సగటు వ్యయం రాయలసీమ ప్రాంతంలో అత్యధికంగా ఉందని తెలుస్తోంది. గ్రామ పంచాయితి స్థాయిలో ఈ తలసరి వ్యయం రాయలసీమలో రూ.268గా ఉండగా, కోస్తాంధ్రలో రూ.115గా ఉంది. తెలంగాణలో ఈ వ్యయం కేవలం రూ.66 మాత్రమే. అయితే జిల్లా పరిషత్, మండల స్థాయిల్లో వ్యయం తెలంగాణాలో అత్యధికంగా నమోదయ్యింది. ఆ తరువాతి క్రమంలో కోస్తా ప్రాంతం, రాయలసీమలు ఉన్నాయి. ఈ వ్యయపరమైన అంచనాల వల్ల తెలంగాణ తక్కువ ఫలితాల ప్రాంతం అయింది. జిల్లాపరిషత్, మండలస్థాయి వ్యయ నివేదికలు ఎక్కువ మొత్తాలు చూపిస్తుంటే, గ్రామపంచాయితీల్లో వ్యయం చాలా తక్కువగా జరిగిందని వెల్లడి అవుతోంది. రాయలసీమలో గ్రామపంచాయితీలో వ్యయం అంచనాలు అధికంగా ఉండటంతో ఎన్నతగిన అభివృద్ధి గోచరిస్తుంది. సి.సి.ఎస్.వి.పి. ప్రత్యేకంగా శ్రద్ధపెట్టి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామపంచాయితి స్థాయిలోని ఆదాయవనరుల సమాచారాన్ని నేరుగా పొందగలిగింది. ఉదాహరణకి గ్రామస్థాయిలో పన్నులు వసూలు, ఇంటిపన్ను, ఆస్తిపన్ను, ఆయా వాహనాలపై రుసుం, స్థానికంగా లైసెన్సులు, నిర్మాణాలపై పన్నులు, లే అవుట్ కోసం పన్ను, స్థానిక వనరుల వేలం వంటి వాటితోపాటు, కుళాయిపన్ను వంటి పన్నుల రాబడితో గ్రామపంచాయితీలు స్వయంగా ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు సర్వాధికారాలు కలిగి ఉంటాయి. గ్రామస్థాయిలో ఆర్థిక పుష్టికి ఇలాంటి స్థానిక వనరులు స్వయం పోషకత్వాన్ని పెంచుతాయి. తెలంగాణా ప్రాంతాల్లో 58% పై చిలుకుగా ఆర్థిక పోషకత్వం స్థానికంగా సమకూర్చుకోవటం అచ్చెరువు కలిగించే వాస్తవం. కోస్తాంధ్రలో ఈ మొత్తం 56% కాగా, రాయలసీమలో మాత్రం స్వయం వనరులు సమకూర్చుకోవటంలో 33% మాత్రమే సాధ్యం అయింది. రాయలసీమలో ఇలాంటి స్థితికి కారణం గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికం అని అవగతం అవుతుంది.

## స్థానిక సంస్థల్లో నిమ్న వర్గాల పాత్ర

స్థానిక పాలనలో మహిళల ప్రాతినిధ్యం, షెడ్యూల్డు కులాలు, తెగల నుంచి ప్రతినిధులు ఉ ండటం సామాజిక న్యాయానికి శుభసూచకం. అన్ని జిల్లాల నుంచి సంబంధిత సమాచారాన్ని సేకరించి సరైన రీతిలో క్రోడీకరించారు. మైనారిటీలు స్థానిక సంస్థల్లో పాల్గొనడం పట్ల సరైన సమాచారాన్ని అందించనందువల్ల ఆ సంస్థలలో మైనారిటీల ప్రానిధ్యాన్ని మదింపువేయటం సాధ్యం కాలేదు.

అన్ని ప్రాంతాల్లో ఎలాంటి తారతమ్యాలు లేకుండా మహిళల ప్రాతినిధ్యం స్థానిక సంస్థలో అత్యధికంగా ఉంది. ఆయా ప్రాంతాల్లోని జనాభా దామాషా కన్నా అధికంగానే ఎస్.సి. ప్రాతినిధ్యం

ఎక్కువగా ఉంది. ఆయా వర్గాలకు నిర్దేశించిన స్థానాల నిష్పత్తికి తగినట్టుగా వారి పాత్ర ఉంటోంది. తెలంగాణాలో షెడ్యూల్డ్ తెగల పాత్ర దాదాపుగా 13%, కోస్తాంధ్రలో 8%, రాయలసీమలో 3%కు మించటం లేదు. పోటీవల్ల వారికి అందాల్సిన ప్రాతినిధ్యపు వాటా అందిరావటం లేదన్నది అవగతం అవుతుంది.

## సర్వశిక్ష అభియాన్ సంబంధిత వ్యయం

సర్వశిక్ష అభియాన్ (2007-08నుండి ఆరంభమయింది)కు సంబంధించిన అరుదైన సమాచారం, ఖర్చు పద్దుల వివరాలు కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ నుంచి లభ్యం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఈ పద్దు నిధుల మొత్తం రూ. 3,737 కోట్లు. 2007-08 ఏడాది దాకా వాటిల్లో విడుదల అయింది 58% కాగా వ్యయం అయింది 57%. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కార్యాచరణ సమన్వయం, స్పష్టమైన ప్రతిపాదనలు తగిన విధంగా లేకపోవటంతో రాబట్టిన నిధుల మొత్తం కన్నా నిధుల వ్యయం తక్కువ అయింది. ఖర్చు చేసిన మొత్తంలో అర్హులైన పిల్లలకు ఎంత లబ్ధి చేకూర్చిందనేది మన చర్చకు సంబంధించిన అంశం. మొత్తంగా ఈ విద్యావిధానంలో నమోదు అయిన బాలలు, విద్యార్థుల గణాంకాలను అధ్యయనం చేశాము. ఈ పద్ధతి వల్ల సర్వశిక్ష అభియాన్‌లో ఆశయ లక్ష్య ఫలితాలు వాస్తవాలలోని తేడాలు, లోపాలు వెలికి వస్తాయి. సర్వశిక్ష అభియాన్ పథకం క్రింద చేరిన పిల్లల సంఖ్య తెలంగాణలో 39% కాగా, అందుకు వ్యయం తక్కువగా 36%గా ఉంది. కోస్తాంధ్రలో ఈ సంఖ్య కొంచెం హెచ్చుగా 40% దాపుగా ఉంటే వ్యయం 41% అయింది.

తెలంగాణలో తొలినాటి నుంచి అక్షరాస్యత తక్కువగా ఉందన్నది వాస్తవం. దానికి ఎక్కువ నిధులు కేటాయించి ఉండాలి. మంచి ఫలితాల్ని రాబట్టాలంటే అందుకు తగిన వనరులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలి.

## వెనుకబడ్డ ప్రాంతాల నిధుల కేటాయింపు (బి.ఆర్.జి.ఎఫ్)

దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని అభివృద్ధి కార్యక్రమాల్ని క్రమపద్ధతిలో సమీక్షించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పాటిస్తోంది. తద్వారా ఎప్పటికప్పుడు వెనుకబాటు ప్రాంతాల్ని గుర్తించటంతో పాటు ఆయా ప్రాంతాల వికాసానికి తగిన దామాషాలో నిధుల కేటాయింపును నియంత్రించటం సాధ్యం అవుతుంది. జాతీయ ప్రణాళిక సంఘం ఇలాంటి వెనుకపడిన జిల్లాల్ని గుర్తించి బ్యాక్‌వర్డ్ రీజియన్ గ్రాంట్ ఫండ్ పథకం ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుంది. ఇందుకు అవసరమైన సమీక్ష మదింపుకోసం ప్లానింగ్ కమీషన్‌లోని సీనియర్ అధికారులు సంబంధిత కమిటీలను సంప్రదించి సమగ్రసమీక్ష నివేదికల్ని రూపొందిస్తారు. 27 రాష్ట్రాల్లోని 250 జిల్లాలను వెనుకపడిన వాటిగా వర్గీకరించి బి.ఆర్.జి.ఎఫ్. నిధులు అందించారు. ఉదాహరణకు మొత్తంగా 200 జిల్లాలను జాతీయ ఉపాధి పథకంలో భాగంగా తొలి దశలో వర్తింప చేశారు. 170 జిల్లాలను మలిదశలో ఇంటర్ మినిస్ట్రీ టాస్క్‌గ్రూపులో చేర్చి అభివృద్ధి క్రమంలోని అసమానతల్ని సరిదిద్దారు. ఈ రెండింటిలో చాలా జిల్లాలు ఏకకాలంలో రెండు విధాల లబ్ధి పొందాయి. అదనంగా వాటిల్లో చాలా జిల్లాలు రాష్ట్రీయ శ్రమ్ వికాస్ యోజనతో పాటు పనికి ఆహార పథకంలో కూడా గుర్తింపుతో నిధుల కేటాయింపు ప్రాధాన్యతను పొందాయి. సర్వసాధారణంగా ఒక ప్రాంతం వెనుకబాటు తనాన్ని 3 కారణాలతో అంచనా వేయటం జరుగుతోంది. ఆయా జిల్లాలలో వ్యవసాయ కూలీ ఉత్పాదకశక్తి విలువ, వ్యవసాయ కూలీ ధర, ఎస్.సి, ఎస్.టి జనాభా స్థాయిలతో అంచనా వేస్తారు.

వామపక్ష తీవ్రవాద ఉద్యమం ప్రబలంగా ఉండటంతో అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉదా. ఆంధ్రప్రదేశ్‌లో 5 జిల్లాలు నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఖమ్మం, నల్గొండలు, తెలంగాణ ప్రాంతంలో భాగంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కేంద్ర హోం శాఖ వారి ప్రత్యేక ఆదేశాలు, సూచనల మేరకు ఆయా జిల్లాల్లో ఉద్యమ తీవ్రత తగ్గించదానికి గాను రాష్ట్రీయ శ్రమ్ వికాస్ యోజనను అమలు చేస్తోంది. వెనుకబాటు తనానికి ఇతర కారణాలతో పాటు తెలంగాణలో 4 జిల్లాలు, రాయలసీమలో 3 జిల్లాలు, కోస్తాంధ్రలో ఒక జిల్లా బి.ఆర్.జి.ఎఫ్ జాబితాలో చోటు చేసుకున్నాయి. ఈ వర్గీకరణలోనికి వచ్చిన ప్రాంతాల జనాభా హైదరాబాద్ కలిపి తెలంగాణ 41% కాగా రాయలసీమలో 74%, కోస్తాంధ్రలో 7%గా ఉన్నారు. మొత్తం తెలంగాణ జనాభాలో 87% బి.ఆర్.జి.ఎఫ్ లబ్ది పరిధిలోకి రాగా వారిలో 46% తీవ్రవాద ఉద్యమ ప్రభావం గల ప్రాంతాల్లో నివసిస్తున్నారు. బి.ఆర్.జి.ఎఫ్. కింద వెనుకబాటుతనం గుర్తింపు రాయలసీమ ప్రాంతంలో అత్యధికంగా ఉండగా, తెలంగాణాలో తక్కువగాను, కోస్తాంధ్రలో అతి తక్కువగాను ఉంది. కాబట్టి కొన్ని రాజకీయ పార్టీలు వాదిస్తున్నట్లుగా తెలంగాణా ప్రాంతంలోని పౌరసంఘాలు, సొసైటీలకు సరైన లబ్ది చేకూరటం లేదన్నది వాస్తవం కాదని తెలుస్తోంది.

## మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద వ్యయం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి పెద్ద మొత్తంలో ఆదాయం పెంపుదల అవకాశాలు అందివచ్చాయి. ఆ పథకంలో ఏడాదికి 100 రోజులు మించని పరిమితితో ఇంటింటా ఉపాధి హామీని కచ్చితంగా అమలు చేస్తూ ప్రమాణికమైన కూలీగా రూ.100ను పనిచేసినవారందరకు ఇస్తున్నారు. లిఖిత పూర్వకమైన వినతికి తప్పనిసరిగా స్పందిస్తున్నారు. 2008-09 నుంచి దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఈ పథకం అమలులో ఉంది.

జాతీయ ఉపాధిహామీ పథకంలో తెలంగాణ ప్రాంతాల్లో అమలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే కొంత మెరుగ్గా ఉంది. జాబ్‌కార్డ్‌ల పంపిణీ సంఖ్య, కూలి మొత్తాల చెల్లింపు వంటి వ్యయం వివరాలతో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో అమలు వాటా ఎక్కువ అని వెల్లడి అవుతోంది. కోస్తాంధ్ర ప్రాంతంలో ఈ పథకం అమలు పంపిణీ తక్కువగా ఉంది. స్థానికంగా సామాజిక వర్గాల వారి డిమాండ్ మేరకు మాత్రమే పథకం అమలు జరుగుతోందన్న విధానం నుంచి అవసరాల వాస్తవికత తేటతెల్లం అవుతుంది. ఉదాహరణకు కోస్తాంధ్ర ప్రాంతాల్లో పంటలు దిగుబడి ఎక్కువ కావటంతో గ్రామీణ పేదలకు కూలి పనిదినాల గిట్టుబాటు అధికంగానే ఉంటాయి. అందువల్ల గ్రామీణ ఉపాధి పథకం హామీవైపు అవసరం కోసం మొగ్గుచూపేవారి సంఖ్య తక్కువగా ఉంటుంది.

## రహదారుల నిడివి, రవాణా సౌకర్యాలు, మోటారు వాహనాల సాంద్రత

సమాజాభివృద్ధి, వాణిజ్య వికాసంతో పాటు ఆర్థికపుష్టిని మదింపు చేయటానికి ఆ ప్రాంతంలోని మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ సంఖ్య మంచి అవగాహన పెంచే సూచిక. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తంగా రకరకాల వాహనాలన్నీ కలిపి 9.2 మిలియన్‌ల దాకా ఉన్నాయి. ఆయా ప్రాంతాల వారీగా నివసించే వారిలో వెయ్యిమంది జనాభా దామాషాలో ఎన్ని వాహనాలు ఉన్నాయన్న లెక్కలు చర్చగా పరిగణించాము. ఆయా వాహనాల నమూనాలు, బ్రాండ్‌లను ఈ క్రింది వర్గాలుగా క్రోడీకరించాము.

1. మోటర్‌సైకిల్, స్కూటర్, మోపెడ్ వంటివి (రెండు చక్రాల వాహనాలు)
2. నాలుగు చక్రాల వాహనాలు కార్లు, వ్యాన్లు, ఇతర లైట్ వెహికల్స్‌ని (4 చక్రాల వాహనాలు)

3. మధ్యతరహా, భారీ వాహనాలు, క్రేన్‌ల వంటి వాటిని (4 చక్రాల వాహనాలు)

4. ఆటోరిక్షాలు, మాక్సికాబ్, ట్రాక్టర్‌ల వంటి ఇతరత్రా నమూనాలన్నింటినీ మరో వర్గంగా పరిగణించాం.

ప్రత్యేకించి అధ్యయనం చేయనక్కర లేకుండానే హైదరాబాద్‌లో వాహనాల సాంద్రత ఎక్కువ. తెలంగాణ ప్రాంతాన్ని ఈ రంగంలో తెలంగాణాను కోస్తాంధ్రతో పోలిస్తే ఇంచుమించు సరిసమానం. లైట్‌వెహికల్ సంఖ్య మాత్రం తెలంగాణా ప్రాంతాల్లో హెచ్చు. రాయలసీమలో అన్ని వాహనాల సాంద్రత తక్కువ.

## రహదారులు మౌలిక స్వరూపం

ప్రధానంగా రహదారులు జాతీయ రహదారి, పి.డబ్ల్యుడి (రాష్ట్రం) పంచాయితీ (గ్రామీణ)రహదారులుగా నిర్వహణ ఉంటుంది. వాటి నిర్వహణ, యాజమాన్యం ఆయాప్రాంతాల్లో వ్యాపార, మార్కెట్ అవసరాలపై ఆధారపడి ఉంటుంది. హైదరాబాద్ మహానగరంలోని వాహనసాంద్రతను ఈ గణాంకాల విశ్లేషణ పరిధి నుంచి మినహాయించాము. ఇటీవలి కాలంలో కోస్తాంధ్ర ప్రాంతం, రాయలసీమల్లో జాతీయ రహదారుల నిర్వహణ ఎక్కువ కాగా తెలంగాణలో తక్కువ అన్నది వాస్తవం.

స్వర్ణభుజి (గోల్డెన్ క్వాడ్రి లేటరల్) పథకం వల్ల భౌగోళిక పరంగా ప్రాంతాల్ని కలిపేదారుల విస్తీర్ణం పెరిగింది. అయితే రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ నిర్వహణలోని వాటిల్లో అత్యధికం కోస్తాంధ్రలోనే ఉన్నాయి. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో ఈ నిడివి తక్కువ.

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు అత్యధిక శాతం కాగా వారికి అవసరమైన రహదారుల కల్పన పంచాయితీది. ఆ దారులు తీరుతెన్నుల్ని అధ్యయనం చేస్తే ఆయా ప్రాంతాల ఆర్థిక, సామాజిక అంశాల్లో గ్రామప్రాంతాల స్థితిగతుల్ని తెలుపుతాయి. ఈ రంగంలో కోస్తాంధ్ర ప్రాంతం తెలంగాణా కన్నా విస్తీర్ణం, నిర్వహణలోను మెరుగ్గా ఉంది. గత 20 ఏళ్ళ కాలంలో గ్రామప్రాంతాల్లో రహదారులను నిర్మించటం తెలంగాణలో ఎక్కువ.

రోడ్‌లు వాటిపై తిరిగే వాహనాల వలన సామాజిక వికాసం ప్రామాణికంగా అర్థం అవుతుంది. జాతీయ రహదారుల వినియోగంలో తెలంగాణప్రాంతం ముందుండగా ఇంచుమించుగా పి.డబ్ల్యు.డి. రహదారుల విషయంలో కోస్తాంధ్ర ప్రాంతం ముందుంది. పంచాయితీల రోడ్‌లను వాడుకోవటంలో తెలంగాణ ప్రాంతంకన్నా కోస్తాంధ్ర మెరుగ్గా ఉంది. ఈ విధంగా పంచాయితి స్థాయి రోడ్‌ల వసతి, వినిమయంలో ఇతర ప్రాంతాలకన్నా కోస్తాంధ్ర ముందంజలో ఉంది.

## వ్యవసాయం, సాగునీరు, దిగుబడి

**వ్యవసాయంలో ప్రగతి :** ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ వ్యవసాయమే జీవనాధారం. ఈ రంగలో కోట్లమంది రైతులు, కూలీలు మనుగడ సాగిస్తున్నారు. అందువల్ల 1956 నుంచి 2009 వరకూ ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం సాగుబడి తీరుతెన్నుల్ని చర్చకు తెస్తున్నాం. స్థూలంగా ప్రకృతి సిద్ధంగా ఒనగూడిన సౌకర్యాలతో గోదావరి, కృష్ణానదీ పరివాహక, తీరప్రాంతాలు నీటిపారుదల వినిమయంలో ముందున్నాయి. 2006-09లో సాగుబడి ప్రాంతం (జి.సి.ఎ.) కోస్తాంధ్రలో 53 మిలియన్ హెక్టార్‌లు. 1956-60లలో 4.2 మిలియన్ హెక్టార్‌లుగా ఉన్నా గత 50 ఏళ్ళల్లో ఈ పెరుగుదల 20%గా ఉంది. కోస్తాంధ్ర ప్రాంతంలో విస్తరించిన సాగుబడి ప్రాంతం తెలంగాణలో ఇంచుమించు

స్థిరంగా ఉండగా రాయలసీమలో కుంచించుకుపోయింది. జలవనరులు, నీటిపారుదల వసతి, భూముల నుంచి పంటల దిగుబడి వంటి వాటిని అధ్యయనం చేస్తే వ్యవసాయిక రంగ ప్రగతిపై అర్థవంతమైన అవగాహన అవుతుంది.

### ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతాల వారీగా సాగు విస్తీర్ణం

(అయిదు సం.ల సగటు/మి.హెక్టార్లలో)

| ప్రాంతం | 1956-60 | 61-65 | 66-70 | 71-75 | 76-80 | 81-85 | 86-90 | 91-95 | 96-2000 | 2001-5 | 06-09 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| తెలంగాణ | 4.8 | 4.8 | 5.0 | 5.3 | 5.0 | 5.1 | 4.8 | 4.7 | 4.8 | 4.7 | 5.0 |
| రాయలసీమ | 3.2 | 3.2 | 3.0 | 3.1 | 2.9 | 2.8 | 2.7 | 3.0 | 3.0 | 2.9 | 3.0 |
| కోస్తాంధ్ర | 4.2 | 4.6 | 4.6 | 4.6 | 4.7 | 4.8 | 5.0 | 5.3 | 5.3 | 5.0 | 5.3 |

ఆధారం : అర్థ గణాంకశాఖ, ఆంధ్రప్రదేశ్

## నీటిపారుల అభివృద్ధి

వ్యవసాయరంగ వికాసానికి నీటిపారుదల కీలకం. కాగా వాతావరణం, వర్షపాతంలో ముడివడిన జలవనరులతో అభివృద్ధి ముడిపడి ఉంటుంది. వ్యవసాయం కోసం అవసరమైన నీటివసతికి ముఖ్యంగా మూడు మార్గాలు వున్నాయి.

కాలువలు, చెరువులు, బావులు. ఆంధ్రప్రదేశ్‌లోని 3 ప్రాంతాల్లో నీటి పారుదల వసతులపై విశ్లేషణలు దిగువన ఉన్నాయి.

## నికర నీటిసాగు ప్రాంతం

మూడు ప్రాంతాల్లో నీటిపారుదల ప్రాంత విస్తీర్ణం క్రమంగా పెరుగుతూ వస్తోంది. వాస్తవంగా తెలంగాణలో నీటి తీరువా దాదాపుగా రెట్టింపు (1956-60లో 0.8 మిలియన్ హెక్టార్‌లుగా ఉ ఒడగా, 2006-09 నాటికి 1.7 మిలియన్ హెక్టార్లు) అయింది. ఈ లెక్కన తెలంగాణలో 113% పెరుగుదల నమోదు కాగా కోస్తాంధ్రలో 30%, రాయలసీమలో 55%గా పెరుగుదల ఉంది. 1970 దశకం నుంచి తెలంగాణ ప్రాంతంలోని నీటితీరువా ప్రాంత వృద్ధి వేగంగా పుంజుకుంది. మిగిలిన రెండు ప్రాంతాల్లో ఈ పెరుగుదల నిలకడగా ఉంది.

## నీటితీరువా అభివృద్ధి

అయా ప్రాంతాల్లో మొత్తం సాగుబడి భూమికి అందుతున్న జలవసతిని అధ్యయనం చేస్తే నీటి తీరువా అభివృద్ధిపై అవగాహన పెరుగుతుంది. 1956 తరువాత ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పునర్ వ్యవస్థీకరణ సమయంలో కోస్తాంధ్ర ప్రాంతంలో నీటి తీరువా పెరుగుదల 44.7% కాగా తెలంగాణలో 17.2% మాత్రమే. అయితే రాయలసీమలో 14.7%గా ఉంది. 2008-09 నాటికి తెలంగాణలో 50.4%, కోస్తాంధ్రలో 60.6%, రాయలసీమలో 25.3%గా ఈ వసతి పెరిగింది. కోస్తాంధ్రలో ఈ

హెచ్చు 16శాతం కాగా రాయలసీమలో పెరుగుదల 10శాతంగా ఉంది. 53 ఏళ్ళ పరిణామ ప్రగతిలో తెలంగాణలో 33% పెరుగుదల నమోదు అయింది. వాస్తవానికి నీటిపారుదల వసతి తెలంగాణలో 1980 దశకం మధ్య నుంచి 23 ఏళ్ళ కాలంలో దాదాపుగా రెట్టింపు అయింది.

## సాగునీటి వనరులు

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల్లో సాగుబడి నేల గణాంకాల్ని పరిశీలిస్తే వాస్తవం బోధపడుతుంది.

సాధారణంగా సహజసిద్ధమైన ప్రకృతి వనరుల వల్ల ఒనగూడే అవకాశాల వల్ల నీటిపారుదల ఎక్కువగా వుంటుంది. కోస్తాంధ్రలోని మధ్యభాగంలో దాదాపుగా గోదావరి నదీ తీరప్రాంతం ఉత్తరం వైపుగా ఉంటే దక్షిణం వైపు కృష్ణానది ప్రాంతంగా ఉంది. అందువల్ల నీటి పారుదలకు సౌకర్యాలు వనరులు సహజంగానే విస్తృతంగా ఉంటాయి. కాలువల ద్వారా నీరు డెల్టా భూములకు అందుతుంది.

మరోవైపు తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో నదీజలాల పంపిణీ పారుదలకు సరైన వసతులు లేవు. అయితే సహజ సిద్ధమైన చెరువులు మరికొన్నింటి వల్ల తెలంగాణ ప్రాంతంలో నీటి పారుదల వసతి ఉండగా రాయలసీమ వాసులకు ఆ స్థాయి కూడా కొరవడింది. ఈ విధంగా రాయలసీమలోని అననుకూల పరిస్థితులు ప్రగతికి ప్రతికూలం అయ్యాయి. అన్నిరకాల జలవనరులలో ఈ ప్రాంతం వెనకబడే ఉంది.

పునర్ వ్యవస్థీకరణ సమయంలో కోస్తాంధ్రలోని సాగుభూమిలో మూడింట రెండువంతులు కాలువ నీటిద్వారానే సాగవుతున్నాయి. ఈ తీరు తెలంగాణాలో 16% కాగా రాయలసీమలో 19%గా ఉంది. 1955-56 ప్రాంతంలో చెరువుల ద్వారా మామూలుగా లభ్యమయ్యే జలవనరుల్లో తగ్గుదల 64% పైగా ఉంటే 2008-09 నాటికి కేవలం 12%గా తెలంగాణలో ఉంది. రాయలసీమ ప్రాంతంలో కూడా ఈ తగ్గుదల రమారమి ఈ పరిణామంలోనే ఉంది.

## సాగుభూముల దిగుబడులలో మార్పులు

ఒక భౌగోళిక ప్రాంతంలో వ్యవసాయ అభివృద్ధి వల్ల ఉత్పాదకశక్తి పెరిగి దిగుబడి పెంచుకోవటం సరైన ప్రగతిని సూచిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 1990-93 కాలంలోని ధరల పట్టీతో రూపాయి విలువతో మదింపు వేసిన వ్యవసాయ ఉత్పత్తులను హెక్టార్‌ల సగటు దిగుబడితో లెక్కగా పరిగణించారు.

స్థూలంగా రాష్ట్రవ్యాప్తంగా అన్నిప్రాంతాల్లో ఉత్పత్తి ఖచ్చితంగా పెరుగుతోంది. 1962-65 ఏళ్ళ మధ్య కాలంలో తెలంగాణలో సగటు దిగుబడి విలువ రూ.3,320. రాయలసీమలో ఇది రూ.4,795 కాగా కోస్తాంధ్రలో అత్యధికంగా రూ.7,422గా ఉంది. అయితే ఎదుగుదల తీరు మాత్రం ప్రాంతీయంగా సరిసమాన పద్ధతిలో లేదు. ఉదాహరణకు తెలంగాణలో భూముల సగటు దిగుబడి 2003-06లో 327%గా వుంది. ఇదేకాలంలో కోస్తాంధ్రలో అభివృద్ధి రేటు 149%కాగా, రాయలసీమలో చాలా తక్కువగా 84% మాత్రమే. ఇలా తెలంగాణలో అభివృద్ధి గణాంకాలు పెరుగుదలలో నిలకడగా ఉంటున్నాయి. గత 50 ఏళ్ళలో సగటు హెక్టారు దిగుబడిలో హెచ్చు అగుపిస్తోంది. నీటిపారుదల వసతిలో కూడా ఈ పెరుగుదల ఉంది.

ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ ప్రాంతంలో సగటున హెక్టార్‌లో వరి పంట దిగుబడి కచ్చితంగా పెరిగింది. ఈ ప్రాంతంలో 70%గా హెక్టార్ పంటలో దిగుబడి హెచ్చిందని

నమోదు అయింది. 1956-65, 1965-75 మధ్యకాలంలో కోస్తాంధ్ర ప్రాంతంలో ఉన్నపంటల పెరుగుదల 39% కాగా రాయలసీమ ప్రాంతంలో 20%గా ఉంది. కాబట్టి తెలంగాణలో వరి పంట దిగుబడి నిలకడగా 2006 దాకా అభివృద్ధి పథంలోనే దారిలోనే ఉంది. గత 50 ఏళ్ళలో రాయలసీమలోని ప్రాంతాల్లో వరి ధాన్యం దిగుబడి పెద్దగా పెరుగుదల లేకుండా వెనుకబడి ఉంది.

వేరుశెనగ, ప్రత్తిపంటలను హెక్టారు సగటు దిగుబడితో సమీక్షిస్తే కోస్తాంధ్ర కన్నా మిన్నగా రాయలసీమ కన్నా ఎంతో హెచ్చుగా తెలంగాణలో దిగుబడి ఉంది. గత 50 ఏళ్ళలో హైదరాబాద్ మినహా తెలంగాణ ప్రాంత రైతాంగానికి అభివృద్ధి ఫలితాలు కొంత ప్రయోజనకరంగా ఉన్నాయి. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణలో అభివృద్ధి వేగం పుంజుకుంది.

## భూకమతాల నిర్వహణ

వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థతో పెనవేసుకున్న ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ 60% పై చిలుకు రైతుకూలీలు ఈ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. భూ పంపకాన్ని ప్రాంతాలవారీగా గమనిస్తే ప్రయోజనం ఉంటుంది. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో కమతం సగటున 1.3 హెక్టార్లు, 1.6లుగా ఉన్నాయి. కోస్తాంధ్రలో కమతం సగటు 0.9 హెక్టారు.

మొత్తం వ్యవసాయ భూభాగంలో చిన్నకమతాలు (రెండు హెక్టార్ల కన్నా తక్కువ) కోస్తాంధ్రలో 57%, రాయలసీమలో 41%, తెలంగాణలో 46% ఉన్నాయి. పెద్ద కమతాలు కోస్తాంధ్రలో తక్కువగా ఉంటే, రాయలసీమ, తెలంగాణల్లో హెచ్చుగా ఉన్నాయి. కోస్తాంధ్రలో 56%, తెలంగాణలో 46% రాయలసీమలో 24% సాగుకు అనువైన భూమి ఉంది.

## విద్యుత్‌శక్తి వినిమయం

ఏ ప్రాంతంలోనైనా విద్యుత్‌శక్తి వినిమయ సూచికద్వారా ఆ ప్రాంతం అభివృద్ధిని అంచనా వేయవచ్చు. ఈ వినియోగంలో 1) వ్యవసాయరంగ వినిమయం, 2. లోటెన్షన్ విద్యుత్, 3. హైటెన్షన్ విద్యుత్. రెండు, మూడు వర్గాలకు చెందిన విద్యుత్ వినిమయం ప్రాంతీయమైన తేడాల్ని నిర్ధారిస్తాయి.

విద్యుత్ వినియోగంలో వ్యవసాయ కనెక్షన్‌లు 2008-09లో మూడు ప్రాంతాల్లో దాదాపుగా హేతుబద్ధంగానే ఉన్నాయి. రాయలసీమలో 6346 కెఎమ్‌హెచ్, తెలంగాణలో 5920 కెఎమ్‌హెచ్, కోస్తాంధ్రలో 5797 కెడబ్ల్యుహెచ్‌గా ఉన్నాయి. అయితే తెలంగాణ ప్రాంతంలో ప్రయోజన ఫలితాలు ఎక్కువ. ఉదా. 1974-2005లో వ్యవసాయ వినియోగం 1898 కెడబ్ల్యుహెచ్‌గా ఉండగా అది 2008-09 నాటికి 5920 కెడబ్ల్యుహెచ్ దాకా పెరిగింది. ఈ పెరుగుదల మూడింతలు కాగా కోస్తాంధ్రలో ఇదేకాలంలో 3323 కెడబ్ల్యుహెచ్ నుంచి 5787 కెడబ్ల్యుహెచ్ దాకా పెరిగితే, ఆ దామాషా 1.8 రెట్లుగా ఉంది. రాయలసీమలో వర్షపాతం తక్కువ కావటం వల్ల విద్యుత్ వినిమయంలో పెరుగుదల మీద ప్రభావం పడింది. అది ఇంచుమించు 3 రెట్లు దాకా ఉంది. అదే విధంగా హెక్టారు భూవసతికి సంబంధించి సగటు వినియోగం కూడా ఎంత ఉందనేది సమీక్షించాం. తెలంగాణలో 1974-75లో ఉన్న 260 కెడబ్ల్యుహెచ్ 2008-09 నాటికి 4930 కెడబ్ల్యుహెచ్ దాకా 18 రెట్లు పెరిగింది. మరోవైపు కోస్తాంధ్రలో ఈ పెరుగుదల కేవలం 10 రెట్లు మాత్రమే. రాయలసీమలో కూడ విద్యుత్‌శక్తి ఒక హెక్టారుకు సగటు వినియోగం 16 రెట్లు నమోదయింది.

విద్యుత్ వినిమయంలో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు సరిసమానంగా ఉంటే తెలంగాణలో కొంత ఎక్కువగా హైదరాబాద్ మహానగరం కన్నా తక్కువగా ఉందని గణాంకాలు తేల్చాయి.

## ఉపాధి అవకాశాల శాతం

భారతదేశంలో ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయి. ఆ ప్రభావం మన రాష్ట్రంలోని అన్నిప్రాంతాల్లో కూడా ఉంది. 1961లో తెలంగాణా ప్రాంతంలో ఉపాధి అవకావాలు 54% ఉండగా, 2001 నాటికి 45%కి తరిగిపోయింది. అదే తేడాతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఈ శాతం పతనం అయింది. అయితే 2001 నాటికి ఉపాధి అవకాశాలు రాయలసీమలో 48% ఉంది. కోస్తాంధ్ర, తెలంగాణల్లో కూడా దాదాపుగా 45%గా ఉంది.

ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటే అది అమలు అయిన ప్రాంతంలో ఉపాధి కల్పన కన్నా కరువు కాటకాల పరిస్థితి మిన్నగా ఉందని సూచిస్తుంది. సాధారణంగా సంప్రదాయకంగా మన దేశంలో యువశక్తిని ప్రోత్సహిస్తూ వారికి జీవనాధారం కల్పిస్తే వారు కుటుంబానికి పోషకులవుతారని అంచనా. మహిళలకు సంబంధించి కుటుంబ పోషణకు ఉపాధి అవసరం వుంది. కరువు కాటకాలు వినాశకరమైన వత్తిడి గల ప్రాంతాలలో ఈ అవసరం మరింతగా ఉంటుంది.

**స్త్రీ, పురుషుల ఉపాధిలో తేడా :** మన దేశంలో సాధారణంగా పురుషులు కుటుంబ పోషకులుగా ఉంటారు. మహిళలు విద్యావంతులైతే ఉద్యోగాలు చేస్తారు లేదా కుటుంబ అవసరాలకు తప్పనిసరిగా వ్యవసాయ కూలీలుగాను, ఇతర పనులకు కుదురుతారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తమ పొలాల్లో పనిచేస్తుకుంటారు లేదా వ్యవసాయ కూలీలుగా పనిచేస్తారు. ఇలాంటి పద్ధతి తెలంగాణాలో ఎక్కువగా ఉంది. అయితే పనిచేసే మగవారికన్నా, పనిచేసే స్త్రీలసంఖ్య చాలా తక్కువ. ఈ తేడా హైదరాబాద్‌లో ఎక్కువగా వుంది. కోస్తాంధ్రలో ఎక్కువగానూ, ఆ తరువాత రాయలసీమలోను, ఆ తరువాత తెలంగాణలోను ఉంది.

## వయసు వారీ ఉపాధి అవకాశాలు (15-65 సంవత్సరాలు)

తెలంగాణాలో వ్యవసాయ వృత్తిలో రైతులు ఎక్కువగా ఉన్నారు. రాయలసీమలో రైతులు ఎక్కువయినా, వ్యవసాయ కూలీలు చాలా తక్కువ. తక్కువ సారవంతం అయిన భూములు, పేదరికంతో మగ్గిపోతున్న సామాజికవర్గాలు ఉన్నందువలన రాయలసీమలో ఇటువంటి పరిస్థితి నెలకొని వుంది. అంచనాలకు అనువుగానే హైదరాబాద్‌లో వృత్తి నిపుణుల సంఖ్య అధికంగా 35% ఉండగా, రెక్కల కష్టంపై ఆధారపడిన శ్రమజీవుల సంఖ్య మరో 35%గా ఉంది.

## 2007-08 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసేవారి వివరాలు

| ప్రాంతం | నిరక్షరాస్యులు | మెట్రిక్యులేషన్ వరకు చదివినవారు | మెట్రిక్యులేషన్ పైన చదివినవారు | మహిళలు |
|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 48.3 | 41.6 | 10.0 | 37.6 |
| తెలంగాణ (హైదరాబాద్‌తో కలిపి) | 49.4 | 38.0 | 12.6 | 37.1 |
| తెలంగాణ (హైదరాబాద్ మినహా) | 52.6 | 38.4 | 9.0 | 39.2 |
| హైదరాబాద్ | 18.0 | 34.1 | 47.9 | 17.1 |
| రాయలసీమ | 50.0 | 42.5 | 7.4 | 39.6 |
| కోస్తాంధ్ర | 46.5 | 44.7 | 8.8 | 37.2 |

ఇతర ప్రాంతాలతో పోలిస్తే హైదరాబాద్‌లో వృత్తి ఉద్యోగ అవకాశాలు మెండు. ప్రాథమిక సేవా రంగాల్లో పట్టణ కార్మికులు, తక్కువ నైపుణ్యం కలిగినవారు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు.

## విద్యావంతులైన కార్మికులు

మొత్తం పనివారిలో (15-65 సంవత్సరాల మధ్యవయస్సు) కేవలం 9% మాత్రమే మెట్రిక్ / పదవతరగతి స్థాయికి మించిన వారు తెలంగాణలో ఉంటే ఇంకొంచెం ఎక్కువగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఉన్నారు. హైదరాబాద్ నగరంలోని ఉద్యోగులలో అత్యధికశాతం అక్షరాస్యులు ఉన్నారు. నిరక్షరాస్యులైన పనివారితో పాటు మహిళావర్కర్ల సంఖ్య మూడు ప్రాంతాల్లో దాదాపు ఒకేలా ఉండగా కోస్తాంధ్రలో కాస్త తక్కువగా ఉంది.

## విద్య - ఉపాధి

ఉపాధి అవకాశాల్లో విద్య ప్రభావం ఎక్కువగా ఉందన్నది స్పష్టమవుతోంది. అయితే మూడు ప్రాంతాల్లో ఈ వైవిధ్యం చాలా తక్కువగా ఉంది. ఉదా. మెట్రిక్‌లేషన్ పైన చదివి వృత్తి నిపుణులుగా వున్న వారు తెలంగాణా, కోస్తాంధ్రల్లో దాదాపు ఒకే సంఖ్యలో ఉన్నారు. అయితే వ్యాపారరంగంలో ఉన్న వారి సంఖ్య కోస్తాంధ్రలో కాస్త ఎక్కువగా ఉంది. ఒక్కరాయలసీమలో మాత్రమే విద్యావంతులైన రైతుల సంఖ్య 23%గా ఉంది. వీరి సంఖ్య తెలంగాణాలో కేవలం 10% కాగా, కోస్తాంధ్రలో 13%. దీన్ని బట్టి చూస్తే తెలంగాణా, కోస్తాంధ్ర ప్రాంతాల్లో వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అర్థమవుతోంది. చదువు ఎక్కువయ్యే కొద్దీ ప్రజలు అంతగా నైపుణ్యం లేని వ్యవసాయేతర వృత్తులను చేపట్టటం లేదు. ఈ ధోరణి మూడు ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించింది.

## వృత్తి - ఉపాధి

గ్రామీణ ప్రాంతాల్లో రైతు, వ్యవసాయ కూలీ, వ్యవసాయేతర కూలీ, వ్యవసాయేతర స్వయం ఉపాధి, నిర్ణీత జీతంతో పనిచేసేవారుగా ఉన్నారు. 1993 నుండి 2005 వరకు ఈ వృత్తుల వారిని పరిశీలించగా వ్యవసాయం ప్రధాన వృత్తిగా గలవారు తెలంగాణా ప్రాంతంలో 39% నుండి 25%నికి

తగ్గిపోయారు. కోస్తాంధ్రలో కూడా ఈ శాతం 25 నుండి 21కి తగ్గింది. రాయలసీమలో 48 నుండి 39%నికి తగ్గింది. ఈ విధంగా వ్యవసాయం నుండి ఇతర వృత్తులకు మళ్ళేవారి సంఖ్య తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. అయితే కోస్తాంధ్రాలో ఈ మార్పు చాలా తక్కువ. మరోవైపు వ్యవసాయ కూలీల శాతం తెలంగాణాలో 38 నుండి 47కు పెరగటం గమనార్హం. రాయలసీమలో కూడా 24 నుండి 39కి పెరిగింది. కోస్తాంధ్ర విషయానికొస్తే వ్యవసాయ కూలీల శాతం కేవలం ఒక్క శాతం మాత్రమే పెరిగింది. తెలంగాణా, కోస్తాంధ్ర ప్రాంతాలు వ్యవసాయేతర కూలీల సంఖ్య కొద్దిగా పెరిగింది. ఇక గ్రామీణ వ్యవసాయేతర స్వయం ఉపాధి విషయానికొస్తే తెలంగాణా రాయలసీమ ప్రాంతాల్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. కోస్తాంధ్రలో మాత్రం ఇది 4% తగ్గింది.

మరోవైపు స్థిర నెలసరి ఆదాయంతో పనిచేసే వారి సంఖ్య తెలంగాణా ప్రాంతంలో బాగా పెరిగింది. కోస్తాంధ్రలో కొద్దిగా పెరగ్గా రాయలసీమలో బాగా తగ్గింది. వీటన్నింటిని బట్టి చూస్తే తెలంగాణా ప్రాంతంలో కార్మికుల పనిమార్పిడి, శక్తి మిగతా రెండు ప్రాంతాలకన్నా ప్రస్ఫుటంగా ఎక్కువగా కనిపించింది. గృహ ఆదాయాలు పెరగడానికి ఇదొక మార్గం.

## ఉపాధి కల్పన (ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌ల ద్వారా)

రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులు పేర్లను లేక మరింత పెద్ద ఉద్యోగాలకు వెళ్ళే వారి పేర్లను నమోదు చేయటం ఆనవాయితీగా వస్తుంది. అన్ని జిల్లాల్లో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్ కేంద్రాలు పనిచేస్తూ నిరుద్యోగ యువత పేర్లను నమోదు చేస్తూ ఉంది. తెలంగాణా ప్రాంతంలో (హైదరాబాద్ మినహా) ఇలా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌లో నమోదు చేసుకున్నవారి సంఖ్య అత్యధికంగా ఉంది. ఈ సంఖ్య తెలంగాణాలో 1000 మందికి 123 మంది కాగా, రాయలసీమలో 104, కోస్తాంధ్రలో 79 మాత్రమే. ఇలా నమోదు చేసుకున్నవారందరూ నిరుద్యోగులని చెప్పలేము. ఉద్యోగాలు చేసేవారు కూడా మరింత మెరుగైన ఉద్యోగాల కోసం నమోదు చేసుకోవచ్చు. అందువల్ల ఈ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌లలో నమోదులను బట్టి నిరుద్యోగ స్థాయిని నిర్ణయించలేము.

విద్యాపరంగా నమోదు చేసుకున్న వారి శాతం ఇలా ఉంది. పోస్ట్ గ్రాడ్యుయేట్లు 3.7%, పట్టభద్రులు 12.8%, ఇంటర్మీడియట్‌లు 32.5%, మెట్రిక్యులేట్లు 14.7%, టెక్నికల్/ఐటిఐ 11.4%, సాంకేతికేతర (టైపిస్టు వగైరా) 14.4%, నైపుణ్యం లేని పనివారు 10.5%, సామాజిక వర్గాల కింద పరిగణిస్తే షె.కు 26%, షె.తె. 8.7%, వె.త.41%, ఇతరులు 24.3%.

కాగా ఈ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌లు చాలా తక్కువ ఉపాధి అవకాశాలను కల్పిస్తాయి. ఉదా. 2008లో 1045 ఉద్యోగాలను కల్పించారు. ఇందులో షె.కు వారికి 183, షె.తెలకు 73, వె.త.లకు 283. అయితే 2008 డిసెంబరు నాటికి నమోదు చేసుకున్న వారి సంఖ్య 20.7లక్షలు. కనుక ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌లు అతి తక్కువ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయి అని చెప్పవచ్చు.

## పారిశ్రామిక ఉపాధి

దేశంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో, ఉత్పాదన రంగంలో అతి వేగంగా వృద్ధి చెందుతున్న రాష్ట్రం. ఈ రాష్ట్రంలో ఫ్యాక్టరీల చట్టం క్రింద 29,436 పారిశ్రామిక సంస్థలు నమోదు చేసికొని 8.24 లక్షల పనివారికి ఉపాధి కల్పిస్తున్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 12,308 సంస్థలు నమోదు

కాగా (ఎక్కువగా బియ్యం మిల్లులు) తెలంగాణా ప్రాంతంలో (హైదరాబాద్ కలిపి) 12,308 నమోదయ్యాయి. ఒక ఫ్యాక్టరీకి తెలంగాణాలో 33మంది, హైదరాబాద్‌లో 44 మంది, కోస్తాంధ్రలో 25 మంది లెక్కన పనిచేస్తున్నారు. కనుక ఫ్యాక్టరీల సంఖ్య, పనిచేసేవారి సంఖ్యలను పరిగణనలోకి తీసుకుంటే తెలంగాణా, కోస్తాంధ్ర ప్రాంతాలలో సరిసమాన స్థాయిలో ఫ్యాక్టరీలు ఉన్నాయి. పనిచేసేవారున్నారు. ఎటొచ్చి రాయలసీమలో మాత్రమే తక్కువ ఫ్యాక్టరీలు, తక్కువ ఉద్యోగులు ఉన్నారు.

## వలస

సాధారణంగా ప్రజలు ఉపాధి అవకాశాలు కోసం, ఎక్కువ ఆదాయాలు పొందడం కోసం వలస వెల్తుంటారు. వలస ప్రాంతాలు మరింత మంచి విద్యను అందించి జీవన ప్రమాణాలను పెంపొందించగలవు. కాగా వలసలు గ్రామీణ ప్రాంతాల నుండి చిన్న చిన్న పట్టణాల నుంచి పెద్ద నగరాలకు జరుగుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినంతవరకు హైదరాబాద్ నగరం 11% వలసలను ఆకర్షించగా 3.6% జనాభా ఈ నగరానికి వలస వచ్చారు. ఈ నగరం నుండి 1.8 శాతం జనాభా బయటకు వెళ్లగా 4.4% పనివారు వలస వెళ్ళారు. తెలంగాణా విషయానికొస్తే హైదరాబాద్ మినహా రాయలసీమతో కలిసి ఈ ప్రాంతం 0.4% వలస కుటుంబాలను కలిగి ఉంది. కోస్తాంధ్రలో కొద్దిగా ఎక్కువగా 0.7% వలస కుటుంబాలు ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే రంగారెడ్డి జిల్లా 2.8%తో అన్ని జిల్లాలను వలసరంగంలో మించి పోయింది. హైదరాబాద్ నగరానికి ఇది అతి దగ్గరగా వుండటమే ఇందుకు కారణం.

### 2007-08లో ప్రాంతాల వారీగా జిల్లాల నుండి వలస వెళ్లిన వారి పట్టిక (%)

| ప్రాంతం | బయటకు వెళ్ళే వలసల సంఖ్య | | వలసలకు కారణాలు | | | | లోపలకు వచ్చే వలసల సంఖ్య | |
|---|---|---|---|---|---|---|---|---|
| | కుటుంబాల సంఖ్య | వ్యక్తుల సంఖ్య | ఉద్యోగాన్వేషణ | ఉపాధి | చదువులు | ఇతర కారణాలు | కుటుంబాల సంఖ్య | వ్యక్తుల సంఖ్య |
| ఆంధ్రప్రదేశ్ | 6.8 | 3.2 | 20.2 | 67.4 | 10.2 | 2.1 | 1.0 | 0.6 |
| తెలంగాణ (హైదరాబాద్ కలిపి) | 6.7 | 2.9 | 23.2 | 66.8 | 9.1 | 2.7 | 1.7 | 0.7 |
| తెలంగాణ (హైదరాబాద్ మినహా) | 7.1 | 3.1 | 21.5 | 66.8 | 9.3 | 2.5 | 0.4 | 0.3 |
| హైదరాబాద్ | 4.4 | 1.8 | 10.2 | 67.7 | 7.1 | 5.1 | 10.6 | 3.6 |
| రాయలసీమ | 7.8 | 3.3 | 22.7 | 64.1 | 11 | 2.2 | 0.4 | 0.3 |
| కోస్తాంధ్ర | 6.4 | 3.4 | 17.7 | 69.6 | 11.3 | 1.5 | 0.7 | 0.5 |

## సమసమానత్వం, సామాజిక, ఆర్థిక వైవిధ్యం

ఆర్థిక అసమానతలు : ఇందులో ఆదాయంలో మార్పులు, సమానత్వాంశాలు మొదలైన వాటిని గురించి చర్చించటం జరిగింది. ఒక దశాబ్ద కాలంపాటు కొన్ని సర్వేల ఆధారంగా తలసరి ఆదాయంలో అసమానతలను, సాగుభూముల్లో అసమానతలను గురించి చర్చించటం జరిగింది.

## ప్రాంతీయ గ్రామీణ రాబడిలో అసమానతలు

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ఒక దశాబ్ద కాలం పాటు ఆదాయ వనరుల్లో ఏర్పడిన మార్పుల గురించి ప్రాంతాల వారీగా సమాచారాన్ని క్రోడీకరించాము. ఇందులో తీసుకున్న గణాంకాలు న్యూఢిల్లీలోని ఆర్థిక పరిశోధనా జాతీయ మండలి సంస్థ ఒక దశాబ్దం పాటు జరిపిన పరిశోధనల ఫలితంగా సేకరించిన గణాంకాలు. మానవాళి అభివృద్ధి అంశంపై గ్రామీణ భారతంలో మొట్ట మొదటి సర్వేను 1993-94లో జరిపారు. ఆ తరువాత సర్వేను 2004-05లో నిర్వహించారు. వీటి ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల్లో ఆదాయాల మార్పును, తలసరి ఆదాయంలో మార్పును మేము సరిపోల్చాము. హైదరాబాద్ నగరాన్ని ఇందులో పరిగణించలేదు.

## మధ్యతరగతి తలసరి ఆదాయంలో మార్పు

తరగతిని బట్టి పైన తెలిపిన రెండు కాలాల్లో ఈ మూడు ప్రాంతాల్లో గ్రామీణ తలసరి ఆదాయంలో మార్పు వచ్చింది. గ్రామీణ కుటుంబాలను 5 తరగతులుగా వారి వారి కుటుంబ ఆదాయాన్ని, తలసరి ఆదాయాన్నిబట్టి విభజించారు. ఆ అయిదు తరగతులు ఇవి.

కడు నిరుపేదలు, నిరుపేదలు, క్రింది మధ్యతరగతి, పై మధ్యతరగతి, సంపన్నులు. మా విశ్లేషణ ద్వారా కోస్తాంధ్రలో సంపన్న వర్గాలు తప్ప మిగతా అన్ని ఆదాయ వర్గాలు తమ ఆదాయ మార్గాలను మెరుగుపర్చుకున్నాయి. రాయలసీమలో కడునిరుపేదలు, నిరుపేదలు తమ ఆదాయాలను మెరుగుపర్చుకోగా సంపన్నులు తమ ఆదాయాలకు తగ్గట్లుగా వృద్ధి చేసుకోలేకపోయారు. తెలంగాణా ప్రాంతంలో సంపన్నులు మాత్రమే తమ ఆదాయ వనరులను తగిన విధంగా పెంచుకోగలిగారు. నిరుపేదలు కడు నిరుపేదలు మరింత కష్టాలపాలయ్యారు.

కోస్తాంధ్ర గ్రామీణ కుటుంబాలు 80%పైగా ఆదాయ వనరులను పెంపొందించుకున్నా తెలంగాణాతో పోలిస్తే అది తక్కువ. తెలంగాణా ప్రాంతంలో పైన చెప్పిన విధంగా బీదవారు మరింత బీదవారు కాగా సంపన్నులు అధిక లాభం పొందగలిగారు. మరింత పేదవారైన, నిరాదరణకు గురైన ఈ వర్గాలను మరింత ఉన్నతి అవకాశాలు కల్పిస్తామని ఆశ చూపుతూ సేకరించే అవకాశం ఇక్కడ ఏర్పడింది. తెలంగాణా ప్రాంతంలోని సంపన్నులు అసంఖ్యాకంగా ఉన్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలన్నింటినీ రాబట్టుకుని మరింత ఎదగగలిగారు. సాంప్రదాయకపరంగా ఫ్యూడల్ వ్యవస్థకు చెందినవారు గనుక వారీవిధంగా ఆర్థిక లాభాలను పొందగలిగారు.

## ఆదాయంలో మార్పు - ఉద్యోగాలు

తెలంగాణా, కోస్తాంధ్ర ప్రాంతాలలో ఆదాయలలో మార్పులు వారి వారి వృత్తులను బట్టి ఏర్పడ్డాయని చెప్పాలి. మూడు ప్రాంతాలకు చెందిన రైతులు స్థిరమైన రాబడిని పొందగలిగారు. తెలంగాణలో వ్యవసాయ కూలీల ఆదాయం పడిపోయింది. అయితే కోస్తాంధ్రలో వీరి ఆదాయం పెరిగింది. కోస్తాంధ్ర తెలంగాణా రెండు ప్రాంతాల్లో వ్యవసాయేతర స్వయం ఉపాధి పనులు చేపట్టిన చిన్న చిన్న వ్యాపారులు వృత్తి కళాకారులు తమ ఆదాయాలను పెంచుకోగా రాయలసీమలో వారి రాబడి తగ్గిపోయింది

## ఆదాయంలో మార్పు - సామాజిక గుర్తింపు

ఆదాయంలో మార్పులకు కులం, మతం కారణం కావటం మరొక కోణం. తెలంగాణాప్రాంతంలో షె.కు, షె.తె మైనార్టీల ఆదాయ వనరులు తగ్గిపోగా కోస్తాంధ్రలో ఈ సామాజిక వర్గాల వారి ఆదాయం పెరిగింది. నిజానికి కోస్తాంధ్రలో అగ్రవర్ణాల ఆదాయాలకు గండిపడిందనే చెప్పాలి.

పై అంశాలనన్నింటినీ విశ్లేషించగా కోస్తాంధ్రలో 1990 నుండి 2000 దశకం వరకు షె.కె,షె.తె., మైనార్టీలు, కూలీలు నిరాదారణకు గురయినవారు తమ ఆదాయాలను పెంచుకున్నారని స్పష్టమవుతుంది. అయితే అదే సామాజిక వర్గాలకు చెందినవారు తెలంగాణాలో తమ జీవనప్రమాణాలను పెంచుకోలేకపోయారు.

## గిని కోఎఫెషియన్సి సిద్ధాంతం ద్వారా అసమానతల మదింపు

గిని కోఎఫెషియంట్స్ అసమానతలపై గణాంకాలను వెలికితీసే ఒక పద్ధతి. దీని ద్వారా ఒక ప్రత్యేక సముదాయపు ఆర్థికస్థితిని సరిపోల్చుకోవచ్చు. ఈ గిని కోఎఫెషియంట్స్ ప్రకారం తెలంగాణలో రాబడి పెరగ్గా, ఆ తరువాతి స్థానంలో రాయలసీమ ఉంది. సీమాంధ్రలో రాబడులు తగ్గాయి. గిని ప్రకారం హిందూ వెనుకబడిన తరగతుల వారిలో (ఎక్కువమంది రైతులు) ఆదాయ వనరులు తగ్గాయి. తెలంగాణలోని అగ్రవర్ణాల ఆదాయ వనరులు ఆశ్చర్యకరంగా పెరిగాయి. రాయలసీమలో అన్ని తరగతులవారి ఆదాయాలు పెరిగాయి. ముఖ్యంగా పేదల ఆదాయాలు పెరిగాయి.

సొంత సాగుభూమిలో తగ్గుదల. ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో సొంత సాగుభూమి లేనివారి శాతం పెరగగా, కోస్తాంధ్రలో మాత్రం తగ్గింది. గిని కోఎఫెషియంట్స్ గణాంకం కూడా దీనిని ధృవీకరించింది.

## వినియోగవ్యయం

వినియోగదారుల వినియోగశక్తిని అంచనా వేయటం ద్వారా వివిధ సామాజిక గ్రూపుల జీవన ప్రమాణాలు తెలుస్తాయి. ఎన్ఎస్ఎస్ఓ సంస్థ తన 64వ గణాంక సమీకరణలో వివిధ మతాలకూ, కులాలకు చెందిన సామాజిక వర్గాల వ్యయ, తలసరి నెలవారి, వ్యయపట్టికలను విశ్లేషించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం మీద 2007-08లో తలసరి నెలవారీ వ్యయం 971 రూ.లు. తెలంగాణలో ఈ మొత్తం 895రూ.లుగా ఉంది. రాయలసీమలో రూ.788 కాగా కోస్తాంధ్రలో ఎక్కువగా 1003 రూ.లుగా ఉంది. హైదరాబాద్ నగర పౌరుల వ్యయం అత్యధికం.

సామాజిక వర్గాల వారీగా చూసినా సంపన్నులు మూడు ప్రాంతాల్లోనూ అత్యధికంగా ఖర్చుచేశారు. ముస్లింలు, హిందూ వెనుకబడిన తరగతులవారు వ్యయం విషయంలో సరిసమానంగా ఉన్నారు. ఈ వ్యయం విషయంలో తెలంగాణా, కోస్తాంధ్ర ప్రాంతాల మధ్య పెద్దగా తేడా కనిపించకపోయినా, రాయలసీమలో నెలవారీ వ్యయం చాలా తక్కువగా ఉంది.

## మానవ వనరుల అభివృద్ధి - సూచికలో తరుగుదల

ఎన్.సి.ఎ.ఇ.ఆర్ అనే స్వతంత్ర పరిశోధనా సంస్థ ఒక దశాబ్ద కాలంపాటు రెండు మానవాళి అభివృద్ధి పరిశోధనలను జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో మానవాళి అభివృద్ధి తరుగుదలలో ఉందని ఈ సంస్థ సర్వే తేల్చింది. అయితే మూడు ప్రాంతాలలో ఈ తరుగుదలలో వ్యత్యాసం ఉంది. తెలంగాణలో మానవాళి అభివృద్ధి తరుగుదల ముందు ఎక్కువగా ఉన్నా ఆ తరువాత తరుగుదల కనిపించింది.

మిగతా ప్రాంతాలతో పోలిస్తే కోస్తాంధ్రలో తరుగుదల చాలా తక్కువ. ఒక్క రాయలసీమ ప్రాంతంలోనే ఇది వరకు అతి తక్కువగా ఉన్న మానవాళి అభివృద్ధి మరింత తక్కువ అయింది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి రంగంలో ఈ తరుగుదల వాస్తవికతను ప్రతిబింబిస్తుంది.

## సామాజిక స్వరూపం

ఒక ప్రాంతంలో రాజ్యాధికారానికి, సామాజిక విలువలకు ప్రధాన సూచికలుగా కులం, మతం, ఉంటాయి. తెలంగాణా ఏర్పాటుకు డిమాండు ఉన్న నేపథ్యంలో సామాజిక మతపర గ్రూపుల గురించి తెలుసుకోవటం కొంత అవసరం. ఈ చర్చలో కుల/సామాజిక / మత వర్గాలకు చెందిన జనాభా (షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, హిందూ, వెనుకబడిన తరగతులు, హిందూ అగ్రవర్ణాలు, ముస్లింలు, ఇతర మైనార్టీలు) గురించి విపులీకరించడమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలలో మొదటగా షెడ్యూల్డు తెగలు, ముస్లింల ప్రభావంపై భిన్నత గోచరిస్తుంది. హైదరాబాద్ తప్ప, మిగతా అన్ని ప్రాంతాలలో షెడ్యూల్డు కులాల ప్రాధాన్యత సుమారు 16%గా ఉండగా, షెడ్యూల్డు తెగల ప్రాధాన్యత వేర్వేరుగా ఉంది. తెలంగాణలో వీరి శాతం 10కాగా, రాయలసీమలో 3%, కోస్తాంధ్రలో 6%గా ఉంది. ముస్లిం విషయానికొస్తే తెలంగాణలో 8.4%గాను, రాయలసీమలో 12.5%గాను, కోస్తాంధ్రలో 4.5%గాను ఉన్నారు. చారిత్రాత్మక కారణాల వల్ల హైదరాబాద్ నగరంలో 41% ముస్లిం జనాభా ఉంది. ప్రాంతాల వారీగా హిందువులను వర్గీకరిస్తే అగ్రవర్ణ హిందువులు రాయలసీమలో 24%గా ఉండగా, తెలంగాణలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారు 53%గా ఉన్నారు.

## సారాంశము – చర్చ

తెలంగాణ ప్రాంతం ఆర్థికంగానూ, సామాజికంగానూ వివక్షకు లోనయ్యిందని ఆంధ్రప్రదేశ్ అవతరణ నుండి ఇది కొనసాగుతున్నదని తెలంగాణా వేర్పాటు వాదులు ప్రధానంగా చెపుతూ వస్తున్నారు. కోస్తాంధ్రతో పోలిస్తే తెలంగాణలో తలసరి ఆదాయం చాలా తక్కువనీ, ఉపాధి అవకాశాలు తక్కువనీ, వ్యాపారావకాశాలు తక్కువనీ, విద్యావకాశాలు కూడా తక్కువనీ వారు ఆరోపిస్తున్నారు. అన్ని ఉన్నతావకాశాలను కోస్తాంధ్రావారే తీసేసుకుంటున్నారన్నది వారి ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణల నన్నింటిని తరచి చూస్తే వాటిలో కొన్నింటిలో వాస్తవం ఉందని తెలుస్తోంది. మరోవైపు రాష్ట్ర ఎకానమీలో ప్రాంతాలవారీగా అభివృద్ధిని పరిశీలిస్తే తెలంగాణా వాదుల అభియోగాల్లో నిజాంలేదనీ తెలుస్తోంది. హైదరాబాద్ మినహా, తెలంగాణా ప్రాంతం రాష్ట్రంలో 36% జనాభాను, 41% భూమిని కలిగి ఉంది. 1974 వరకు తెలంగాణాకు న్యాయంగా రావలసిన వాటా చాలా తక్కువగా ఉన్నా ప్రస్తుతం చాలా అధికంగా ఉంది. తెలంగాణా వెనుకబడి ఉండటానికి కొన్ని దృష్టాంతాలను చూపటం జరిగింది.

మొత్తం మీద ఆంధ్రప్రదేశ్‌లో 50 సంవత్సరాల ప్రణాళికా దాని అమలు తరువాత ఫలితాలను పరిశీలిస్తే ఆర్థికాభివృద్ధి ప్రాంతీయ పరంగా విభిన్నంగా ఉందని తేలింది. అభివృద్ధి తెలంగాణలో (హైదరాబాద్‌ను మినహాయించినా కూడా)ను, కోస్తాంధ్రలోనూ అత్యధికంగా ఉంది. అణచివేతకు గురైన కొన్ని సామాజిక వర్గాలు తెలంగాణాలోను, రాయలసీమలోను మరింత నిరాదరణకు గురయ్యాయి. కోస్తాంధ్రలో ఆదాయ వనరుల వ్యత్యాసం సామాజిక వర్గాల మధ్య తగ్గటం గమనించవచ్చు. కనుక తెలంగాణాలో సంపన్నులు–సంపన్నులు కాని వారి మధ్య ముఖ్యంగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, మైనార్టీలలో ఈ ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విపరీత ఆర్థిక అసమానతలు వేర్పాటు ఉద్యమానికి బలాన్ని ఊతాన్నిస్తాయనడంలో సందేహంలేదు. అణచివేతకు గురైనవారిని

వేర్పాటు ఉద్యమంలో పనిముట్లుగా కొన్ని స్వార్థపరశక్తులు, రాజకీయ పార్టీలు వాడుకుంటాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

పేదరికం అంశం మీద తెలంగాణా వేర్పాటు ఉద్యమాన్ని సమర్థించాలనడంలో అర్థం లేదు. ఆర్థికాభివృద్ధి అన్ని అంశాల్లో తెలంగాణా కోస్తాంధ్రకు సమానంగా లేదా కొద్ది తక్కువలో ఉంది. హైదరాబాద్‌ను కలుపుకుంటే నిస్సందేహంగా తెలంగాణా ప్రాంతం పైస్థాయిలో ఉందని చెప్పుకోవచ్చు. తెలంగాణలో అభివృద్ధిశాతం అత్యధికంగా కూడా ఉందని చెప్పవచ్చు. కోస్తాంధ్ర సహజ ప్రకృతిపర లాభాలను, వ్యవసాయాభివృద్ధిలో దీర్ఘకాలిక చరిత్రను కలిగి ఉంది. అయితే తెలంగాణా ప్రాంతం వాణిజ్య బ్యాంకుల సేవలను అందుకోవడంలో చాలా వెనుకబడి ఉంది. పంచాయితీ స్థాయిలో ద్రవ్య వికేంద్రీకరణ స్థాయి తక్కువగా ఉంది. విద్య, వైద్య రంగాల్లో తెలంగాణా ప్రాంతంలో సర్వీసులు సరిగాలేవు. ఈ లోపాలనన్నింటిని తెలంగాణాలో ఏరివేయాల్సిన అవసరం నేడు ఉంది.

ఈ ప్రాంతంలో ఆర్థిక అసమానత అసహనానికి దారితీసే మరో ముఖ్యమైన సూచిక. గ్రామీణ ప్రాంతాల్లో తెలంగాణాలోని సంపన్నులు మాత్రమే మరింత సంపన్నులయ్యారు. మరోవైపు బీదవారు, నిరుపేదలు మరింత దోపిడీకి గురయ్యారు.

అన్ని ప్రాంతాల్లో రైతుల ఆదాయం నిలకడగా ఉంది. లేదా వారి ఆదాయాల్లో పెద్ద మార్పేమీ లేదు. తెలంగాణాలో వ్యవసాయ కూలీల ఆదాయం బాగా తగ్గిపోగా ఆంధ్రలో పెరగడం గమనార్హం అదే విధంగా తెలంగాణలో షెకు, షెతె, మైనార్టీల ఆదాయం బాగా తగ్గగా కోస్తాంధ్రలో పెరగడం గమనార్హం. తెలంగాణాలో అగ్రవర్ణాలు అధికంగా లాభపడగా కోస్తాంధ్రలోని ధనిక వర్గాల ఆదాయంలో కోత పడింది. ఈ మూడు ప్రాంతాలలో ఒక్క రాయలసీమలోనే జీవన ప్రమాణాలు తగ్గాయి. ఈ సీమలో నెలవారీ తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉంది.

మానవాళి అభివృద్ధి అంశానికొస్తే కోస్తాంధ్ర మిగతా రెండు ప్రాంతాలకన్నా అధిక్యతలో ఉంది. రాయలసీమలో మానవాళి అభివృద్ధి చాలా తక్కువ అవడం ఆందోళనకరం. ఆదాయ వ్యయాల్లో అసమానతల వల్ల మానవాళి అభివృద్ధి ఇక్కడ కుంటుపడుతుంది.

## ఆర్థిక పాటవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండుగా చీలితే ఆ రాష్ట్రాల ఆర్థిక పాటవం ఏమిటి అన్న ప్రశ్న చాలామంది విధానకర్తల్లో, ప్రజల్లో మెదులుతూ ఉంది.

ఆంధ్రప్రదేశ్ స్థూల ఉత్పత్తిని, తలసరి ఆదాయాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. వైశాల్యం విషయంలో ఇది దేశంలో నాల్గొవ అతిపెద్ద రాష్ట్రం కాగా జనాభా అంశంలో 5వ అతి పెద్ద రాష్ట్రం. 2007-08లో స్థూల జాతీయోత్పత్తి గణాంకాల ఆధారంగా ఈ రాష్ట్రం మూడవ స్థానంలో ఉంది. తలసరి ఆదాయం విషయానికొస్తే అఖిలభారత నిష్పత్తికి కొంచెం ఎక్కువలో 11వ స్థానంలో ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలను భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కొన్ని ఆసక్తికరమైన అంశాలు వెలువడ్డాయి. తెలంగాణా ప్రాంతం (హైదరాబాద్ మినహా) స్థూల ఉత్పత్తి అంశంలో 28 రాష్ట్రాలలో 15వదిగా ఉంది. తెలంగాణా ప్రాంతం చత్తీస్‌ఘడ్, జార్కండ్, ఉత్తర్‌ఖండ్, హిమాచల్ ప్రదేశ్, గోవా అన్ని ఈశాన్య రాష్ట్రాలకన్నా ఎక్కువ స్థానంలో ఉంది. తలసరి ఆదాయం విషయానికొస్తే తెలంగాణా ప్రాంతం (హైదరాబాద్ కలిపితే) అఖిల భారత సగటు నిష్పత్తికన్నా ఎక్కువగా 13వ

స్థానంలో ఉంది. ఎక్కువ నిర్లక్ష్యానికి గురైన రాయలసీమ ప్రాంతం తలసరి ఆదాయం అఖిల భారత సగటు నిష్పత్తికన్నా తక్కువగానూ, స్థూల ఉత్పత్తిలో ఉత్తరఖండ్, హిమాచల్ ప్రదేశ్, గోవా, అస్సాం మినహా ఈశాన్య రాష్ట్రాలకన్నా ఎక్కువగానూ ఉంది.

కోస్తాంధ్ర ఆంధ్రప్రదేశ్ భారీ ఆర్థిక శక్తి. దేశంలోని రాష్ట్రాలతో పోలిస్తే స్థూల ఉత్పత్తిలో ఇది 13వ స్థానాన్నీ, తలసరి ఆదాయం విషయంలో 10వ స్థానాన్నీ ఆక్రమించుకొని ఉంది. తెలంగాణా కూడా హైదరాబాద్ ఉన్నా, లేకున్నా తనకు తానుగా నిలదొక్కుకొని నిలబడగలదు. మరో కలయిక కింద కోస్తాంధ్ర, రాయలసీమ కలిపి ఒక రాష్ట్రంగా గుర్తింపు పొందగలవు.

## ఆర్థికసంస్కరణలు - రాష్ట్రాలు

చిన్న రాష్ట్రాల ఏర్పాటు వల్ల సరకుల రవాణాలో పలు ఆటంకాలు ఏర్పడతాయి. స్థానిక ప్రవేశపన్నులు, సుంకాలు, స్వేచ్ఛా వాణిజ్యానికి అడ్డుగా నిలుస్తాయి. సరకుల, సేవల వ్యయం పెరిగేందుకు ఇవి కారణమవుతాయి. సరకుల రవాణాకు స్థానిక చట్టాలు కూడా అడ్డుగా నిలుస్తాయి. తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ రాజధానిగా ఏర్పడితే హైదరాబాద్ నగరానికి తమ రాకపోకల్లో పలు ఆంక్షలు ఎదురవుతాయని రాయలసీమ సంశయాన్ని వ్యక్తం చేసింది. కోస్తాంధ్ర కూడా హైదరాబాద్ నగరంలో భారీ వ్యాపారాన్ని కోల్పోగలదు. ఈ అంశం మీద రాష్ట్ర విభజన ఆర్థికాభివృద్ధికి అడ్డుగా ఉండగలదు.

## పరిపాలనాపర వాదనలు

మరోవైపు చిన్న రాష్ట్రాల ఏర్పాటు వల్ల పరిపాలనా సౌలభ్యంగా ఉంటుందనీ, అభివృద్ధి త్వరగా జరుగుతుందని వాదనలు వినిపిస్తున్నాయి. చిన్నరాష్ట్రాలు ఎక్కువ ప్రాతినిధ్యంతో పరిపాలనా అంశాలలో జోక్యం చేసుకోగలవు. ఉదా. తెలంగాణా రాష్ట్రంలో షెడ్యూల్డు తెగలు, ముస్లింలు పరిపాలనా విషయాలలో ఎక్కువ చొరవ చూపగల అవకాశం ఉంది. కోస్తాంధ్ర విషయానికొస్తే ఈ రెండు వర్గాలవారు చాలా తక్కువ కనుక వారికది వీలుకాదు. పెద్ద రాష్ట్రాల వల్ల పరిపాలన కష్టమవుతుందని పరిపాలన రాష్ట్ర రాజధానికి కేంద్రీకృతమై ఉండటం వల్ల దూరం పెరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ కాలంలో పరిపాలనా వికేంద్రీకృతమవుతూ వస్తోంది. (73,74 రాజ్యాంగ సవరణ ద్వారా) అదీగాక ఆంధ్రప్రదేశ్ మండలాలను ఏర్పరుచుకుంది. అందువల్ల పరిపాలనా వికేంద్రీకరణ జరుగుతూ సమైక్యాంధ్రకు బలం చేకూరుతుంది.

## హైదరాబాద్ నగర ఆర్థిక పటుత్వం

హైదరాబాద్ జిల్లా దాని పరిసర ప్రాంతాలలో మార్కెట్లు, వ్యాపార లావాదేవీలు, ఉపాధి అవకాశాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఉదా. ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం స్థూల ఉత్పత్తిలో హైదరాబాద్ వాటా 8%. హైదరాబాద్ దాని పరిసర ప్రాంతాలను పరిగణలోకి తీసుకుంటే ఈ వాటా మరింత ఎక్కువ. తెలంగాణా ప్రాంతంలో హైదరాబాద్‌ను కలుపుకుంటే దాని స్థూల ఉత్పత్తి 18%. కనుక హైదరాబాద్ నగరాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని అన్నిప్రాంతాలకు ఈ ప్రాంతాన్ని అందుబాటులో ఉంచటం శ్రేయస్కరం.

అధ్యాయం
# 3 విద్య - ఆరోగ్యం

ప్రజల జీవనస్థాయిని తెలియజేసే విద్య, ఆరోగ్యం అంశాలను ఈ కమిటీ కూలంకషంగా చర్చించింది.

## విద్యారంగం

ప్రతి సమాజంలో ఉన్నతవర్గాలతోపాటు ఇతర సన్నకారు వర్గాలకు కూడా విద్యారంగంలో సమాన అవకాశాలు కల్పించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుంది. విద్య అనేది ముఖ్యమైన సూచికే కాకుండా, సాంఘికంగా, ఆర్థికంగా ఎదగటానికి కూడా దోహదపడుతుంది. ప్రజాస్వామ్య దేశాల్లో విద్యాభివృద్ధికి కృషి చేయడం ముఖ్యమైన అంశం. విద్య, ఉద్యోగం వలన కలిగే ప్రయోజనాల వల్ల సమాజంలో అన్ని వర్గాల ప్రజలు, వారి పిల్లల భవిష్యత్తుకు విద్య ఒక సోపానమనే భావనతో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణా, సీమాంధ్రలోని అక్షరాస్యత, విద్యారంగంలోని అసమానతలను పరిశీలించడమైనది. కాలానుగుణంగా తెలంగాణా ప్రాంతం విద్యారంగంలో వివక్షతకు గురి అవడం ద్వారా అది వేర్పాటు ఉద్యమానికి ఒక కారణంగా దోహదపడింది.

## రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో విద్యారంగ స్థాయి పరిశీలన

**అక్షరాస్యత :** ఒక ప్రాంతపు విద్యాస్థాయికి అక్షరాస్యత అనేది కొలమానంగా ఉంటుంది. అఖిల భారత అక్షరాస్యత స్థాయికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చాలా వెనుకబడి ఉంది. అయితే ఇటీవలి కాలంలో ఈ వ్యత్యాసాన్ని కొంత తగ్గించగలిగారు. 1956లో రాష్ట్రం ఏర్పడ్డ తరువాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రాథమిక విద్యను ఒక పద్ధతిగా పెంపొందించడం ద్వారా ఈ వ్యత్యాసం తగ్గింది.

## ప్రాంతాలవారీగా అక్షరాస్యతలో వ్యత్యాసం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2001 నాటికి అక్షరాస్యత 60%గా ఉంది. అందులో తెలంగాణా ప్రాంతంలో 58% మాత్రమే. కోస్తాంధ్రాలో 63%, రాయలసీమలో 60%గా ఉంది. హైదరాబాద్ మినహా తెలంగాణా ప్రాంతంలో అక్షరాస్యత 55% మాత్రమే. మొదట్లో తెలంగాణా ప్రాంతం అక్షరాస్యతా క్రమంలో వెనుకబడి ఉన్నా 1971 తరువాత ఈ వ్యత్యాసం బాగా తగ్గించబడింది. ఈ ప్రాంతంలోని జిల్లాల్లో పాఠశాలల సంఖ్య అధికమైనా కూడా ఈ ప్రాంతంలో అక్షరాస్యత తక్కువనే చెప్పాలి.

జిల్లాలవారీగా చూస్తే 10 తెలంగాణా జిల్లాలకుగాను ఆరు జిల్లాల్లో అక్షరాస్యతా శాతం 57.15గా వుంది. ఒక అక్షరాస్యతలోనేగాక మహిళల అక్షరాస్యత అంశంలో కూడా తెలంగాణా ప్రాంతం కోస్తాంధ్రకు, రాయలసీమకు వెనుక వరుసలోనే ఉంది. 1983 వరకు ఈ పరిస్థితి కొనసాగగా 2007లో విద్య నేర్చుకుంటున్న యువత సంఖ్య మిగతా రెండు ప్రాంతాల కన్నా తెలంగాణాలో అధికంగా ఉంది. 8 నుండి 24 వరకు వయస్సు గల వారు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్ళి చదువుకోవటం తెలంగాణా ప్రాంతంలో బాగా ఎక్కువైంది.

నిజాం పరిపాలనలో ఉర్దూ మాధ్యమంగా ఉన్నందువల్ల రాష్ట్రం ఏర్పడ్డ తరువాత తెలంగాణలో ఇంగ్లీషు తెలిసిన వారి సంఖ్య బాగా తక్కువగా ఉండింది. అందువల్ల ఆంధ్ర ప్రాంతం నుండి టీచర్లను తెలంగాణా ప్రాంతానికి రప్పించాల్సి వచ్చింది. 1969 తెలంగాణా ఉద్యమంలో దీనిని కూడా ఒక కారణంగా చూపారు. 1983 నుండి 2007 వరకు తెలంగాణా ప్రాంతంలో విద్యనభ్యసించిన షెడ్యూల్డు తెగల యువత 278% అంటే ఆశ్చర్యం కలుగక మానదు. అయినా కూడా వీరు సీమాంధ్రతో పోలిస్తే శాతం తక్కువే.

అక్షరాస్యత తక్కువగా ఉండేందుకు మౌలిక సదుపాయాలు లేకపోవడం అని వివరించారు. తగినన్ని పాఠశాలలు లేకపోవడం, పాఠశాలలు ఎక్కువ కాకపోవడంతో బాటు విద్యార్థి-ఉపాధ్యాయులు దామాషా తక్కువగా ఉండకపోవడం కూడా విద్య పట్ల అశ్రద్ధకు కారణమయింది.

## కమిటీ ఎదుట లేవనెత్తిన అంశాలు, రాజకీయ ఇతర గ్రూపులు సమర్పించిన ప్రత్యేక కేసులు

యూనివర్సిటీ - కాలేజీ విద్యకు సంబంధించి వివక్ష చోటు చేసుకుందని ఆరోపిస్తూ కొన్ని ప్రత్యేక కేసులను రాజకీయ పార్టీలు, ఇతర గ్రూపులు మౌఖికంగా, లిఖిత పూర్వకంగా కమిటీ దృష్టికి తీసుకువచ్చాయి. ఆయా కేసుల్లో ముఖ్యమైన వాటిని పరిశీలిస్తే తేలిన అంశాలు:

## ప్రాంతీయ యూనిర్సిటీలకు గ్రాంట్లు

ప్రాంతీయ యూనివర్సిటీలకు చేసిన చాలా గ్రాంట్లు పక్షపాతంతో కూడుకున్నవని కమిటీకి చాలా గ్రూపులు ఫిర్యాదు చేశాయి. ముఖ్యంగా తెలంగాణా యూనివర్సిటీలకు ఇచ్చిన తలసరి బ్లాక్ గ్రాంట్ తక్కువగా ఉంది. తెలంగాణా రాష్ట్ర సమితి, తెలంగాణా అభివృద్ధి ఫోరం, తెలుగుదేశం పార్టీకి చెందిన తెలంగాణా గ్రూపు, తెలంగాణా కాంగ్రెస్ గ్రూపు ఇటువంటి ఆరోపణలు చేశారు. ఆరు పాత యూనివర్సిటీలకు తలసరి యాన్యువల్ బ్లాక్ గ్రాంటు వివరాలు పరిశీలిస్తే ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు చాలా తక్కువ గ్రాంట్లు ఇచ్చారని తేలుతుందంటూ వారు వినతి పత్రాలు అందించారు. 2004-09 ఏళ్లకు సమర్పించిన బడ్జెట్ డాక్యుమెంట్లను వారు తమ వాదనకు ఆధారంగా చూపారు.

రాజకీయ గ్రూపులు ఈ విషయంలో అనుసరించిన పద్ధతి సవ్యం కాదని కమిటీ అభిప్రాయపడింది. యూనివర్సిటీలో డే స్కాలర్లు, పిజి స్టూడెంట్లు, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, అనుబంధ కళాశాలలు వంటి చాలా వర్గీకరణలు ఉంటాయి కనుక ఈ పద్ధతిలో గ్రాంట్లను లెక్కించడం సరికాదని కమిటీ వాదన. అందుచేత తలసరిన ఏడాదికి ఒక విద్యార్థికి అయ్యేఖర్చును విడివిడిగా 6 ప్రాంతీయ యూనివర్సిటీలకు కమిటీ లెక్కించింది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ నుంచి పొందారు.

## తెలంగాణాకు ఎక్కువ

పైన పేర్కొన్న ఆరు ప్రాంతీయ యూనివర్సిటీలకు ఇచ్చిన గ్రాంట్లను పోల్చిచూస్తే తెలంగాణా యూనివర్సిటీలకు ఇచ్చిన గ్రాంట్లు ఎక్కువని రాయలసీమలో అతి తక్కువని తేలింది. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థికి అయిన ఖర్చు తలసరిన తక్కువగా వుంది. 1993-94, 2008-09 ఈ ఖర్చు అనంతపురం జిల్లాలో అత్యధికంగా, మహబూబ్‌నగర్ జిల్లాలో అతి తక్కువగా ఉంది. అయినప్పటికీ ఏ ప్రాతిపదికపై నిధులు పంపిణీ చేశారో స్పష్టంగా తెలుస్తోంది. కొత్తగా నెలకొల్పిన ప్రాంతీయ యూనివర్సిటీల విషయంలో కూడా వివక్షతో నిధుల పంపిణీ జరిగిందన్నది కమిటీకి టి.ఆర్.ఎస్ చేసిన మరో ఆరోపణ. 2006-09 కాలంలో నిజామాబాద్‌లోని తెలంగాణా యూనివర్సిటీకి,

నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి వరుసగా రూ.29.5, 30.5 కోట్లు బ్లాక్ గ్రాంటు నిధులు మంజూరు చేయగా, కడపలోని యోగివేమన యూనివర్సిటీకి అదేకాలంలో రూ. 300 కోట్లు మంజూరు చేసారని టిఆర్ఎస్ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందుకు సంబంధించిన సమాచారం అందాక యోగి వేమన విశ్వవిద్యాలయానికి క్షేత్ర సందర్శన జరిగింది. యోగి వేమన యూనివర్సిటీకి పైన పేర్కొన్న ఇతర రెండు యూనివర్సిటీల కంటే ఎక్కువ నిధులు మంజూరు చేసినా, మరీ రూ.300 కోట్లు మంజూరయ్యాయనడం అతిశయోక్తి అని తేలింది.

## విద్యారంగంలో వ్యత్యాసాల పరిశీలన

ప్రజల జీవన స్థాయిని, సరళిని అంచనా వేయడానికి విద్యా ఆరోగ్య రంగాల స్థాయిని అంచనా వేయడం ముఖ్యం. విద్యారంగంలో మూడు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను కమిటీ విస్తారంగా పరిశీలించింది. ఈ పరిశీలనలో తెలంగాణా ప్రాంతం ఉద్దేశ్య పూర్వకంగా లేదా నిర్లక్ష్య ధోరణిలో వివక్షకు గురైందా అనే అంశాన్ని ముఖ్యంగా పరిశీలించింది. అవసరం వస్తే రాష్ట్రంలో ఈ రంగంలో వెనుకబడి ఉన్న ఇతర ప్రాంతాలను తక్కిన ప్రాంతాలతో సమంగా తీసుకురావడానికి ఏమి చేయాలన్నది సూచించే ఆలోచనతో పరిశీలన సాగింది.

ప్రాధమిక పాఠశాలల రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే చాలా రాష్ట్రాలకంటే ఎంతో మెరుగ్గా వుందని చెప్పవచ్చు. రాష్ట్రంలో 90% మందికి ప్రాధమిక పాఠశాలలు వారు నివసించే నివాస ప్రాంతాలకు అందుబాటులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ తక్కిన ప్రాంతాల్లో కంటే తెలంగాణాలో అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్నప్పటికీ 1971 నుంచి ఈ వ్యత్యాసం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం తెలంగాణా ప్రాంతంలో అక్షరాస్యత శాతం కొన్ని చోట్ల అధికంగా ఉంది. అంతేకాకుండా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల మధ్య, అలాగే జిల్లాల మధ్య వ్యత్యాసం ఎక్కువగా లేదు. అందుబాటులో పాఠశాలలు కొన్ని దశాబ్దాలుగా విరివిగా నెలకొంటున్నాయి. స్కూళ్లను కేవలం ఎక్కువగా అందుబాటులోకి తేవడమే కాకుండా ఆస్కూళ్లలో విద్యాప్రమాణాలను మెరుగుపరచడానికి రాష్ట్రం దృష్టి పెట్టాల్సిన సమయమిది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మరింత మెరుగు పరచాల్సి ఉంది. అదే విధంగా నేర్చుకున్న జ్ఞానాన్ని ఫలవంతం చేయడంలో రాష్ట్రంలో కృషి లోపభూయిష్టంగా ఉంది. సాధారణంగా మొత్తం తెలంగాణా ప్రాంతంలో, ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అత్యధికంగా ఉన్నతపాఠశాలలు, జూ॥కాలేజీలు, మాధ్యమికోన్నత పాఠశాలలున్నాయి. మూడు ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు హైదరాబాద్, రంగారెడ్డిలలో చదివించడానికి ఉవ్విళ్లూరుతుంటారు. ఇక్కడ నాలుగేళ్లపాటు పాఠశాల విద్య నెరిపితే ఆరో జోన్‌లో కేంద్రీకృతమై ఉన్న వృత్తి విద్యాసంస్థలు, ఉన్నత విద్యాసంస్థల్లో చదువుకోవడం సులభతరం అవుతుందని తల్లిదండ్రుల భావన.

కొన్ని తెలంగాణా జిల్లాల్లో ప్రాధమిక, మాధ్యమిక పాఠశాలల్లో డ్రాపవుట్ల శాతం ఇంకా అధికంగానే ఉంది. ఈ సమస్యపై దృష్టిపెట్టి పరిష్కరించవలసి వుంది. అయితే ఉన్నత పాఠశాలల స్థాయిలో ప్రాంతాల మధ్య వ్యత్యాసం తక్కువగా ఉంది. ఈ మూడు ప్రాంతాల్లోని కొన్ని జిల్లాలలో మాత్రమే బడి మానేసే పిల్లల శాతం అధికంగా ఉంది. సామాజిక గ్రూపులకు సౌకర్యాల విషయంలో తెలంగాణా ప్రాంతంలో లక్ష ఎస్సీ జనాభాకు హాస్టళ్ల సంఖ్య తక్కువగా ఉంది. కానీ 1991లో కంటే 2001లో ఈ అంతరం తగ్గుతూ వచ్చింది. ఈ హాస్టళ్లలో ప్రతి లక్ష జనాభాకు చేరే ఎస్‌సి విద్యార్థుల సంఖ్య 2001లో అతి తక్కువగా ఉంది. అదేవిధంగా ఎస్టీ హాస్టళ్ల సంఖ్య కూడా జనాభాకు తగ్గట్టుగా లేదు. ప్రతిలక్ష జనాభాకు లెక్కిస్తే ఎస్టీ విద్యార్థులు హాస్టళ్లలో చేరే సంఖ్య కోస్తా ఆంధ్రలో కంటే ఎక్కువగా ఉ

ంది. దీనిని బట్టి తెలంగాణా ప్రాంతంలో మరింతగా ఎస్టీ హాస్టళ్లు నెలకొల్పాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. అలాగే తెలంగాణా ప్రాంతానికి చెందిన చాలామంది విద్యావేత్తలు విద్యార్థులు వివిధ పాఠ్యాంశాల్లో ఉత్తీర్ణతకు నిర్దేశించిన మార్కుల స్థాయి పట్ల కూడా వ్యతిరేకత వ్యక్తం చేశారు. ముఖ్యంగా హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు, భాషలలో మార్కుల నిబంధన తెలంగాణా విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందని వారు ఫిర్యాదు చేశారు. ఈ మార్కుల నిబంధనలను హేతుబద్ధం చేసి, అడ్మిషన్లను సులభతరం చేయాలని వారు కోరారు.

మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో ఉన్నత విద్యకు, వృత్తిపరమైన విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉండటం సంతోషకరమైన విషయం. ఫలితంగా ఈ రాష్ట్రంలో విద్యా సంస్థల సంఖ్య కనీవినీ ఎరుగని విధంగా పెరిగింది. వాటిలో ప్రైవేటు సంస్థలే ఎక్కువ. ఈ ప్రైవేటు విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు బోధించే విద్యాసంస్థలే ఎక్కువ. రాష్ట్ర జనాభా నిష్పత్తితో పోలిస్తే తెలంగాణా ప్రాంతంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎమ్‌బిఏ, ఎమ్‌సిఏ కళాశాలల సంఖ్య చాలా ఎక్కువ. అవన్నీ రంగారెడ్డి జిల్లాలోనే ఎక్కువగా కేంద్రీకృతమైన వాస్తవాన్ని పరిగణంలోకి తీసుకుంటే మొత్తం తెలంగాణా ప్రాంతంలో వీటి సంఖ్య తక్కువేమీ కాదని తేలుతుంది.

## ఇతర విషయాలు

తెలంగాణాలోని విద్యార్థులు, ఇతర గ్రూపులు విద్యకోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళరు. ఐతే మిగిలిన రెండు ప్రాంతాల నుంచి విద్యార్థులు తెలంగాణాలోని విద్యాసంస్థల్లో అడ్మిషన్ తీసుకున్నారు. ముఖ్యంగా హైదరాబాదులో 4 సంవత్సరాల విద్య పూర్తి చేస్తే స్థానికులన్న గుర్తింపు వస్తుంది. ముల్కీ నిబంధనల ప్రకారం 15 సం॥లకు స్థానికులుగా గుర్తింపు లభిస్తుంది. ఐతే ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం నాలుగు సంవత్సరాలు హైదరాబాద్ స్కూళ్ళల్లో చదివితే స్థానికులుగా చెలామణీ అవుతారు. దీంతో చాలామంది ఇతర ప్రాంతాల నుంచి నకిలీ ధ్రువపత్రాలు సమర్పించడం జరుగుతుంది. కోస్తాంధ్ర విద్యార్థులు తమ రాష్ట్ర రాజధానిలోని విద్యా సంస్థల్లో అడ్మిషను తీసుకోవాలంటే తమను స్థానికేతరులు అంటున్నారని ఆవేదన చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ విద్యా సంస్థల్లో అడ్మిషన్ తీసుకోవాలంటే ప్రెసిడెన్షియల్ ఆర్డర్, ఇతర శాసనాల ప్రకారం జరుగుతుంది. ప్రస్తుతం ఈ వ్యవస్థకు ప్రత్యామ్నాయం చూడాల్సిన అవసరం ఉంది. ఏదిఏమైనా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించే వారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. సమాచార కమిటీకి, కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఏ.పి., డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏ.పి. ప్రకారం 85 శాతం ప్రొఫెషనల్ కాలేజిలో విద్యార్థులు స్థానికులే (90 నుంచి 98 శాతం) కూడా ఉన్నారు.

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజిలలో అడ్మిషన్‌కు జీవో ఎం.ఎస్‌జ84 ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తేది 20-8-1993 మరియు జీవో ఎంఎస్‌జ227 తేది 22-7-1994, ప్రైవేట్ ఇంజనీరిగ్ కళాశాలల్లో సీట్లు అన్ని సబ్జెక్ట్‌పరంగా కలిపి, ప్రాంతాలవారీగా 42, 36, 22 శాతం ఇవ్వటం జరుగుతోంది. ఫలితంగా తెలంగాణాకు 36 శాతం సీట్లు, తెలంగాణాలో ప్రైవేటు కళాశాలల్లో ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం 85 శాతం బదులుగా ఇవ్వటం జరుగుతోంది. కోస్తాంధ్ర, రాయలసీమలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 36 శాతం తెలంగాణా విద్యార్థులకు ఇవ్వవచ్చు. కాని కొద్దిమంది మాత్రమే ఆయా ప్రాంతాలకు వెళ్ళి చదువుకోవటం జరుగుతుంది. జస్టిస్ సుభాషన్ రెడ్డి, జస్టిస్ టి.రంగారావు (సి.జె. సమీరణ, ఎ.పి. స్టేట్ కౌన్సిల్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్, ఇతరులు). అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో 85 శాతం సీట్లు స్థానికులకే ఇవ్వాలని ప్రతిపాదించటం జరిగింది.

## కనీస అర్హత మార్కులు

ఇంగ్లీషు సబ్జెక్ట్‌కు పాస్ మార్కులు 35 కాగా హిందీకి కేవలం 18 మార్కులే అని తెలంగాణ విదార్థులు అంటున్నారు. మొత్త పర్సంటేజ్ నిర్ణయించడానికి ఇంగ్లీష్ మార్కులు లెక్కిస్తుండగా, హిందీ మార్కులను పరిగణనలోకి తీసుకోవడంలేదు. ఫలితంగా హిందీ పరిజ్ఞానం ఎక్కువగా ఉన్న తెలంగాణా విద్యార్థులకు లాభం కలగడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. భవిష్యత్తులో ఇంగ్లీష్ భాషకు ప్రాధాన్యత ఉన్న దృష్ట్యా, ఆ భాషరాని వారికి భాషపై అవగాహన కల్పించాల్సిన అవసరంవుంది.

## సంక్షిప్తం

విద్య, ఆరోగ్యం ప్రజల జీవన ప్రమాణాలకు ముఖ్యమైన సూచిక. అందుకే విద్యకు సంబంధించిన కోణములో కమిటీ దృష్టి పెట్టడం జరిగింది. విద్యకు సంబంధించిన సూచికలు, విద్యాసంబంధ మౌలిక సదుపాయాల కల్పన, ఇవి అందుబాటులో ఉన్న తీరు, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో విద్యకోసం కేటాయింపులు పరిశీలించడం జరిగింది. ఈ విషయంలో మూడు ప్రాంతాల్లో ఉన్న తేడాలు, ప్రజల అభిప్రాయాలు సేకరించి విశ్లేషించి, తెలంగాణా ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసారా అని పరిశీలించడం జరిగింది. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను గురించి సూచించటం జరిగింది.

దేశంలోనే రాష్ట్రాల సగటు కంటే ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక విద్య ఎంతో మెరుగ్గా ఉంది. 90 శాతం ప్రజలకు వారి ప్రాంతంలోనే ప్రాథమిక విద్య అందుతుంది. మిగిలిన రాష్ట్రంతో పోలిస్తే తెలంగాణాలో విద్యాశాతం తక్కువగా ఉన్నప్పటికి, అతేడా తక్కువగా వుంది. 1971 సం॥తరువాత తెలంగాణాలోని విద్యాశాతం ఎక్కువగావుంది. స్కూలల్లో అన్ని స్థాయిల్లో ఈ తేడా అంత ఎక్కువగా లేదు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ తేడా తగ్గుతూ వస్తుంది. ప్రభుత్వం ప్రస్తుతం నాణ్యమైన విద్యా ప్రమాణాలుండేలా చర్యలు తీసుకోవలసిన అవసరం వుంది. తెలంగాణా ప్రాంతంలోనూ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోను ఎక్కువ సంఖ్యలో హైస్కూళ్ళు, జూనియర్ కాలేజీలువున్నాయి. తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో హైదరాబాద్, రంగారెడ్డిలో తమ పిల్లలను చదివించడానికి ఇష్టపడుతున్నారు. ఎందుకంటే ఈ ప్రాంతంలో 4 సం॥చదివిన తరువాత, ఈ ప్రాంతంలోని వృత్తివిద్య, ఉన్నత విద్య కళాశాలల్లో చదవడానికి స్థానికులుగా అర్హతవుంటుంది కాబట్టి తెలంగాణాలో ముఖ్యంగా హైదరాబాద్‌లో. ప్రాథమిక విద్యాభ్యాసంలో తెలంగాణాలోని కొన్ని జిల్లాలో డ్రాపవుట్ల సంఖ్య ఎక్కువగావుంది. ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. హైస్కూల్ స్థాయిలో మూడు ప్రాంతాల్లో కొద్దిపాటి తేడా ఉన్నప్పటికి మూడు ప్రాంతాల్లోని కొన్నిజిల్లాల్లో డ్రాపవుట్ల సంఖ్య ఎక్కువగా ఉంది. సౌకర్యాల విషయానికి వస్తే, తెలంగాణా ప్రాంతంలో ఎస్.సి. జనాభాకు తక్కువ హాస్టళ్ళు ఉన్నాయి. 1991ని ఆధారం చేసుకుని మిగిలిన రెండు ప్రాంతాలతో పోలిస్తే 2001 సం॥లో తక్కువ మాత్రమే. 2001 సం॥లో ఈ హాస్టళ్ళలో నమోదు చేసుకున్న ఎస్.సి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ఎస్.టి. హాస్టళ్ళు, లక్ష ఎస్.టి.విద్యార్థులకు తెలంగాణా ప్రాతంలో తక్కువగా ఉన్నాయి. ఐతే ఎస్.టి. హాస్టళ్ళలో పేర్లు నమోదు చేసుకున్న ఎస్.టి.ల సంఖ్య కోస్తా ఆంధ్రకంటే ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో ఎస్.టి. హాస్టళ్ళ సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. దీన్నిబట్టి చదువుకునే ఎస్.టి. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నట్లు స్పష్టమౌతోంది.

హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ సబ్జెక్టుల్లో పాస్ మార్కులు నిర్ధారణ తమకు అనుకూలంగా లేదని కమిటీ ముందు వెల్లడించారు. హిందీలో తక్కువ పాస్ మార్కులు, ఇంగ్లీష్, తెలుగులో ఎక్కువ పాస్ మార్కులుండటం తెలంగాణా విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఈ విధానం వల్ల ఒక ప్రాంతంలోని ప్రజలు నష్టపోకూడదన్నారు. స్థానికతను నిరూపించేందుకు తెచ్చే నకిలీ సర్టిఫికెట్లపై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో ఉన్నత విద్య, వృత్తి విద్యా కళాశాలల అవసరం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా తెలంగాణాలో ఈ అవసరం ఎక్కువగా ఉంది. ఈ అవసరాన్ని గుర్తించి ప్రైవేట్ రంగంలో 1990 తరువాత మేనేజ్‌మెంట్, కంప్యూటరీ సంబంధ విద్యనందించే కాలేజీలు చాలా సంఖ్యలో ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కాలేజీలు ఎక్కువగా రంగారెడ్డి జిల్లాలోనే కేంద్రీకరించబడ్డాయి. ఇంజనీరింగ్, ఫార్మసీ, కాలేజీలు తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా ఉన్నప్పటికి, రంగారెడ్డి ప్రాంతాన్ని మినహాయిస్తే మిగిలిన ప్రాంతంలో తక్కువగానే వున్నాయి. ఇంకా ఎక్కువ సంఖ్యలో జాతీయ, రాష్ట్రస్థాయి విద్యాసంస్థల హైదరాబాద్ చుట్టు పక్కలే కేంద్రీకరించబడ్డాయి. కాబట్టి జిల్లా స్థాయిలో కూడా ఉన్నత విద్య సాంకేతిక విద్య, వృత్తి విద్యా కళాశాలల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

విద్యాసంస్థల ఏర్పాటు, నిధుల కేటాయింపులో ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంభిస్తోందన్న తెలంగాణావాదుల వాదనలు పరిశీలించిన తరువాత, ఇందులో కొన్ని వాదనలు మాత్రమే నిజమని కమిటీ నిర్ధారించింది. తెలంగాణా ప్రాంతంలో విద్యశాతం, స్కూలుకెళ్ళేవారి సంఖ్య సంతృప్తికరంగా ఉన్నప్పటికి, నిధుల కేటాయింపులోను, ఏ ప్రాంతాలు కాలేజీలు ఏర్పాటు చేయాలనే విషయంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. నిధుల కేటాయింపులో న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల్లో సమానంగా యూనివర్సిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేసింది. మెడికల్ కాలేజీల ఏర్పాటులో మాత్రం సమతుల్యత లేదు. ప్రస్తుతం రాయలసీమలో 4 మెడికల్ కాలేజీలుండగా, 9 జిల్లాలున్న కోస్తాంధ్రలో 5 కాలేజీలు, 10 జిల్లాలున్న తెలంగాణాలో 4 మెడికల్ కాలేజీలున్నాయి. అందులో 2 హైదరాబాద్‌లోనే వున్నాయి. ఉత్తర తెలంగాణాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నట్లు కమిటీ సూచిస్తుంది.

ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం... గవర్నమెంటు, ఎయిడెడ్ కళాశాలలకు కలిపి ప్రభుత్వ గ్రాంటు తెలంగాణాలో 93 కోట్లు, కోస్తాఆంధ్రలో 224 కోట్లు. కాలేజీకి వెళ్ళేవారికి సంఖ్య తెలంగాణాలో లాగే వుంది) రాయలసీమలో 91 కోట్లు (కాలేజీకి వెళ్ళేవారి సంఖ్య తెలంగాణా వారితో పోలిస్తే సగమే). కాబట్టి తెలంగాణా ప్రాంతానికి ఎక్కువ నిధులు కేటాయించాల్సిన అవసరం వుంది. 1985 తరువాత కొత్తగా కాలేజీలేమీ రానందున కాలేజీలు తక్కువగా ఉన్న ప్రాంతంలో ఎక్కువ గవర్నమెంట్ కాలేజీలు ఏర్పాటు చేయాలి.

1983లో యువతకు అక్షరాస్యత శాతం తెలంగాణాలో మిగిలిన 2 ప్రాంతాలకంటే తక్కువగా ఉన్నా, 2007 సం॥లో ముందుంది. 1983లో స్కూలుకెళ్ళే విద్యార్థుల సంఖ్య 8-24 సం॥ మధ్య ఉన్నవారికంటే 2007 సం॥నికి గణనీయంగా పెరిగి, మొదటి స్థానానికొచ్చింది. దీన్నిబట్టి చూస్తే, తెలంగాణాలో యువత, వ్యవసాయానికి కాక విద్య, ఉపాధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసమే ప్రత్యేక తెలంగాణా కోరుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని యువత, ఉపాధి అవకాశల దృష్ట్యా సాంకేతిక, వృత్తి విద్యలకు ప్రాధాన్యతనిస్తున్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రభుత్వం

స్కాలర్‌షిప్పులు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ చేస్తున్న దృష్ట్యా ఆయా వర్గాల నుంచి వృత్తి విద్యాకోర్సులు చదివేవారి సంఖ్య పెరుగుతోంది. ఇందువల్లే ప్రైవేట్ సంస్థల పెరుగుదల కూడా ఎక్కువగా వుంది.

ప్రభుత్వరంగ ఉద్యోగాలు తక్కువగా ఉన్నా ప్రైవేట్ రంగంలో అవకాశాలు ఎక్కువగా వున్నాయి. సేవల రంగం కూడా విస్తరించింది. ప్రస్తుతం అవసరాన్ని మించి సాంకేతిక, వృత్తి విద్యా నిపుణులున్నారు. ఎంప్లాయర్‌కు అవసరమైన నైపుణ్యం విషయంలో కూడా గ్రాడ్యుయేట్లలో తేడాలున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. అందువల్లే ఉద్యోగాలు లేకుండా ఉండటం, తక్కువ వేతనాలు పొందటం జరుగుతోంది. ఈ అవకాశాన్ని రాజకీయ నాయకులు ఉపయోగించుకుని, ప్రాంతాల వారీగా ప్రభుత్వం తేడాలు చూపించటం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని వాదిస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యంపై విద్య నాణ్యత విషయంలో ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. గవర్నమెంట్ స్కూళ్ళలో ఇంగ్లీషు సబ్జెక్టును తొలిదశల్లో ప్రవేశపెట్టటం వల్ల, మార్కెట్లో పోటీతత్వం ఎదుర్కునేందుకు విద్యార్థులకు నమ్మకం కుదురుతుంది.

తెలంగాణా ప్రాంతంలో చాలామంది మొదటితరం కాలేజీ విద్య అభ్యసించి గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చినవారు. వారి తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. గవర్నమెంట్ సంస్థల్లో మంచి జీతం ఆశించేవారు. ప్రస్తుతం విద్యార్థుల్లో ఈ అర్హత కొరవడినందువల్ల ఇదే వారి నిరాశ, నిస్పృహలకు గురి చేస్తుంది. దళితులు, వెనుబడిన తరగతుల వారు ఎక్కువగా ప్రస్తుతం తెలంగాణా ఉద్యమంలో పాల్గొంటున్న విద్యార్థులు ఈ కోవకు చెందిన వారే! కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా దళితులు, వెనకబడ్డ తరగతుల వారే! ఉద్యమంలో ఎక్కువగా చనిపోయిన విద్యార్థులు కూడా వీరే! సరైన ఉద్యోగావకాశాలు లేనిది వారికి సరైన శిక్షణ లేకనే! విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలున్న విద్యను అందజేసి, ఉద్యోగ అవకాశాలు కలుగజేస్తే, ఉద్యమాలపట్ల ఆకర్షితులవకుండా ఉండే అవకాశం ఉంది.

మిగిలిన రాష్ట్రంతో పోలిస్తే తెలంగాణాలో విద్యాశాతం తక్కువగా ఉన్నప్పటికి, ఆ తేడా తక్కువగా ఉంది. 1971 సం॥తరువాత తెలంగాణాలోని విద్యాశాతం ఎక్కువగా ఉంది. స్కూళ్ళల్లో అన్ని స్థాయిల్లో ఈ తేడా అంత ఎక్కువగా లేదు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ తేడా తగ్గుతూ వస్తుంది. ప్రభుత్వం ప్రస్తుతం నాణ్యమైన విద్యా ప్రమాణాలుండేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. తెలంగాణా ప్రాంతంలోనూ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోను ఎక్కువ సంఖ్యలో హైస్కూళ్ళు, జూనియర్ కాలేజీలు ఉన్నాయి. హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ సబ్జక్టుల్లో పాస్‌మార్కులు నిర్ధారణ తమకు అనుకూలంగా లేదని కమిటీ ముందు వెల్లడించారు. హిందీలో తక్కువ పాస్‌మార్కులు, ఇంగ్లీష్, తెలుగులో ఎక్కువ పాస్‌మార్కులుండటం తెలంగాణా విద్యార్థులకు వ్యతిరేకంగా వుందన్నారు. విధానం వల్ల ఒక ప్రాంతంలోని ప్రజలు నష్టపోకూడదన్నారు. స్థానికతను నిరూపించేందుకు తెచ్చే నకిలీ సర్టిఫికెట్లపై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం వుంది.

## ఆరోగ్యం

### రాష్ట్రంలో ఆరోగ్య రంగం తీరు

కమిటీ మూడు ప్రాంతాల్లో జరిపిన క్షేత్ర పర్యటనల్లో కానీ, ఇతరత్రా అధ్యయనాల్లోగానీ ఆరోగ్య సంబంధమైన అంశాలు అంతగా ప్రస్తావనకు రాలేదు. అయితే ఆరోగ్య రంగం కూడా ప్రజల జీవన సరళి అంచనాకు ముఖ్యమైనదే కనుక ఆ రంగంపై కమిటీ దృష్టి పెట్టింది. ప్రాంతాల వారీగా ఆరోగ్య

పరిరక్షణ సౌకర్యాలు ఎలా ఉన్నాయో మదింపు చేసే ప్రయత్నం ఈ విభాగంలో కమిటీ చేసింది. 1961 నుంచి 2009 దాకా ఆరోగ్య రంగంలో జరిగిన అభివృద్ధిని ముఖ్యంగా ప్రభుత్వం కల్పించిన ఆరోగ్య సౌకర్యాలను ఈ విభాగంలో వివరిస్తున్నాం. ఆసుపత్రుల సంఖ్య, డిస్పెన్సరీలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ఆసుపత్రి పడకలు, డాక్టర్ల సంఖ్య, లక్ష జనాభాకు ఎంత ఉంది అనేది లెక్కకట్టడం జరిగింది. ప్రభుత్వ రంగం నుంచి ఈ రకమైన సమాచారం విరివిగా లభిస్తున్నా ప్రైవేటు రంగం నుంచి ఇటువంటి సమాచారం అంతగా లభించ లేదు. రాష్ట్రంలో అలోపతి డిస్పెన్సరీల సంఖ్య 1960-61లో 564 వుండగా, 1990-91లో 1680కి పెరిగినా, తరువాత ఆ సంఖ్య తగ్గుతూ వచ్చి 2008లో కేవలం 289కి పడిపోయింది. ఫలితంగా ఈ కాలంలో లక్ష జనాభాకు ఉన్న అలోపతి డిస్పెన్సరీల సంఖ్య తీవ్రంగా తగ్గిపోయింది.

రాష్ట్రంలో ఆరోగ్య సంబంధమైన మౌలిక సాధన సంపత్తి చాలా నెమ్మదిగా పురోగతి సాధించింది. ఫలితంగా చాలా వైద్య సౌకర్యాలు స్తంభించిపోయాయి లేదా వాటి పెరుగుదల కనీస మాత్రంగానే ఉంది. లక్ష జనాభాకు ఆసుపత్రులు, పడకలు, డాక్టర్ల సంఖ్య రాయలసీమలో అత్యధికంగా ఉండగా, తర్వాతి స్థానంలో కోస్తా ఆంధ్ర నిలిచింది. హైదరాబాద్ నగరాన్ని మినహాయించి తక్కిన తెలంగాణా ప్రాంతం ఈవిషయంలో బాగా వెనుకబడి ఉంది. మౌలిక సాధన సంపత్తి కాకుండా వైద్య రంగం అభివృద్ధి గతిని గమనిస్తే ఈ సంగతి అర్థం అవుతుంది. సంతాన సాఫల్యత, శిశు ఆరోగ్యం విషయాల్లో తెలంగాణాలోని చాలా జిల్లాలు కోస్తాఆంధ్రా, రాయలసీమలలో కంటే చాలా ముందున్నాయి. ముఖ్యంగా ఉత్తరకోస్తా ప్రాంతం ఈ విషయంలో చాలా అధ్వాన్న పరిస్థితిలో వుంది. తెలంగాణాలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సౌకర్యాలను వినియోగించుకోవడం అత్యధిక స్థాయిలో సాగుతోంది. అలాగే ప్రైవేటు ఆరోగ్య పరిరక్షణ సౌకర్యాలను కూడా తెలంగాణా ప్రాంతంలో అధికంగా వినియోగించుకుంటున్నారు. అందుకే ప్రసూతి, శిశు ఆరోగ్యం ఈ ప్రాంతంలో మిగిలిన ప్రాంతాల్లో కంటే మెరుగ్గా వుంది. కార్పోరేట్ ఆసుపత్రులు విరివిగా ఉన్న హైదరాబాద్ నగరం, కోస్తా ఆంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో ఈ విషయంలో కొద్ది తేడా కనిపిస్తుంది. వీటిలో అత్యంత ఆధునిక వైద్య సౌకర్యాలు మెండుగా వుంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్య పరిరక్షణరంగం రానురాను ప్రైవేటు సంస్థల చేతుల్లోకి పోతోంది.

శ్రీ కృష్ణ కమిటీ హైదరాబాద్‌లోని వివిధ గ్రూపులతో చర్చించినప్పుడుకానీ, మూడు ప్రాంతాలలో క్షేత్రస్థాయి సందర్శనల్లో కానీ ఆరోగ్య సంబంధ విషయాలు చర్చకు రాలేదు. అయితే ప్రజల విద్య, ఆరోగ్య పరిస్థితులు సంక్షేమానికి ముఖ్యమైన సూచికగా గుర్తించి, కమిటీ వివిధ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్య సదుపాయాలు ఏ విధంగా వుందో దృష్టి పెట్టింది.

## ఆరోగ్య సంబంధ మౌలిక సదుపాయాలు:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులో డాక్టర్లు, బెడ్ల సంఖ్య (పడకల సంఖ్య) మొదలయిన విషయాలపై అధ్యయనం చేయటం జరిగింది. 1961 నుండి 2009 సం॥వరకు లక్ష జనాభాకు ఈ సదుపాయాలు ఏ విధంగా ఉన్నయో లెక్క తీయటం జరిగింది. ప్రభుత్వ రంగంలో, ఆరోగ్యంపై, సదుపాయాలపై సరైన సమాచారం లభించినప్పటికి ప్రైవేట్ రంగంలో మాత్రం కొద్ది సమాచారం లభించింది.

## అల్లోపతి వైద్యశాలలు

అల్లోపతి వైద్యశాలల సంఖ్య 1960-61లో 564 నుంచి 1990-91 సం॥నికి 1680కు పెరిగింది. ఆ తరువాత ఆ సంఖ్య తగ్గి 2009 సం॥లో 289 మాత్రమే వుంది. ఫలితం లక్ష జనాభాకు ఆస్పత్రుల సంఖ్య తగ్గింది. ఈ సంఖ్య తగ్గటానికి ప్రధాన కారణం చాలా ఆస్పత్రుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మారాయి. తెలంగాణా ప్రాంతంలో హైదరాబాద్‌తో కలిసి, హైదరాబాద్ లేకుండా ఆస్పత్రుల సంఖ్య సీమ, కోస్తాఆంధ్ర కంటే తక్కువగా ఉంది.

ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (సబ్ సెంటర్లతో కలిసి) 2 లేదా 3 డిస్పెన్సరీలు సేవలందించే ప్రాంతాలను కవర్ చేస్తుంది. డిస్పెన్సరీలు స్థానాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆక్రమించిన దృష్ట్యా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అందులో డాక్టర్లు, పడకల సంఖ్య ప్రాంతాల వారీగా వున్న మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టడం జరిగింది.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ విధులతో ఏర్పాటు చేయబడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వెన్నెముకగా నిలుస్తున్నాయి. పిల్లల సంరక్షణ మరియు ప్రసూతి ఇంకా ఇతర సేవలు వ్యక్తులకు కానీ, సమూహాలకు కానీ అందిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్య 1998-99లో 1422 నుంచి 2004 సం॥లో 1386కు పెరిగింది. ఆ తరువాత 2009లో 1581 చేరింది. ద్వితీయ శ్రేణి, అంతకంటే కింది స్థాయి ఆస్పత్రులు పరిధిని మించి సేవలందిస్తుండగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ల సంఖ్య తక్కువగా వుండటం వల్ల, అనుకున్న స్థాయిలో సేవలందించ లేక పోతున్నాయి. అధ్యయనాలు చెప్పేదానిబట్టి చూస్తే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 30% మంది డాక్టర్లు గైర్హాజరవుతున్నట్లు తెలుస్తుంది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కేవలం గ్రామీణ ప్రాంత ప్రజలకే సేవలందిస్తున్న దృష్ట్యా, గ్రామీణ ప్రాంత ప్రజల సంఖ్యబట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్య, లక్ష జనాభాకు నిర్ధారించబడింది.

ప్రాంతాలవారీగా లక్ష జనాభాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్యను పోల్చి చూస్తే మూడు ప్రాంతాల్లో పెద్ద తేడా వుండదు. తెలంగాణా ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రాష్ట్ర సగటుకు దగ్గరగా వుండగా, రాయలసీమలో కొంచెం ఎక్కువగాను, కోస్తాఆంధ్రలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల సంఖ్య తెలంగాణాకన్నా, రాష్ట్ర సగటుకన్నా తక్కువగా ఉన్నాయి.

## అల్లోపతి ఆస్పత్రుల సంఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో 1960-61 నుండి 2001 వరకు 289 మరియు 397 మధ్య వుండగా, 2009కి 481 వరకు వున్నాయి. ఇదే సమయంలో జనాభా సంఖ్య 36 మిలియన్ల నుంచి 76 మిలియన్లకు చేరింది. ఈ సమయంలో రాష్ట్రంలో లక్ష జనాభాకు ఆస్పత్రుల సంఖ్య 1.10 నుండి 0.56 తగ్గింది. ఆరోగ్య రంగానికి, నిధుల కేటాయింపు తక్కువగా వుండటమే ఆస్పత్రుల సంఖ్య తక్కువగా వుండటానికి, ప్రభుత్వ వైద్యశాలల్లో సౌకర్యాల లేమికి కారణం! ప్రాంతాలవారీగా చూస్తే హైదరాబాద్‌లో కూడిన తెలంగాణా మిగిలిన ప్రాంతాలకంటే అన్ని సంవత్సరాల్లో రాష్ట్ర సగటుకంటే ఎక్కువగా వుండగా, 1961లో హైదరాబాద్ లేని తెలంగాణా కూడా రాష్ట్ర సగటుకంటే కొంచెం ఎక్కువగానే వుంది. 1960-61 సం॥లో లక్ష జనాభాకు ఆస్పత్రుల సంఖ్య హైదరాబాద్‌లో రాష్ట్ర సగటుకంటే రెట్టింపుగా వుంది. ఆ తరువాత నుంచి తగ్గింది. కోస్తాఆంధ్ర, రాయలసీమల్లో రాష్ట్ర

సగటుకంటే తక్కువగా వున్నాయి. మొత్తంగా చూస్తే, గత దశాబ్దంలో మూడు ప్రాంతాల మధ్య తేడా కూడా తక్కువగానే వుంది.

## అల్లోపతి ఆస్పత్రుల పడకల సంఖ్య

ఆస్పత్రులు ఎన్ని ఉన్నాయనే దానికంటే ఆస్పత్రులో ఎన్ని పడకల సౌకర్యం వుందనేదాన్ని బట్టి, ఆరోగ్య సంరక్షణ ఏ విధంగా వుందో తెలుస్తుంది. ముందుగా చెప్పినట్లు ప్రభుత్వ వైద్యశాలలు తక్కువ సంఖ్యలో పెరగటం వల్ల, జనాభాకు తగినట్లుగా సేవలందించ లేకపోతున్నాయి. 1961లో ఆస్పత్రుల్లో 19వేల పడకలుండగా 2009లో దృష్ట్యా, ఈ సమయంలో లక్ష జనాభాకు 54 నుంచి 46 పడకల మాత్రమే వున్నాయి. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణా మిగిలిన ప్రాంతాలకంటే ఈ విషయంలో ముందుంది. అయితే హైదరాబాద్‌లేని తెలంగాణా ఈ విషయంలో వెనుకబడి వుంది. జిల్లా స్థాయి వివరాలను బట్టి, లక్ష జనాభాకు ఆస్పత్రిలో పడకల సంఖ్య హైదరాబాద్‌లో ఎక్కువగా వుంది. (రాష్ట్ర సగటు 46కాగా, హైదరాబాద్‌లో 148) 2001-2009 సం॥లో హైదరాబాద్ లేని తెలంగాణా రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా వుంది. రాయలసీమలో కూడా ఎక్కువగానే వుండగా, కోస్తాఆంధ్ర వెనుకబడి వుంది.

## వైద్యుల సంఖ్య

డాక్టర్ల సంఖ్య 1960-61లో 1826 వుండగా 2009 సం॥లో 10,117 (9321 రెగ్యులర్, 796 కాంట్రాక్టు) వుంది. ఈ సమయంలో లక్ష జనాభాకు డాక్టర్ల సంఖ్య 5 నుంచి 12 పెరిగింది. హైదరాబాద్‌లేని తెలంగాణా రాయలసీమ, కోస్తాఆంధ్ర కంటే వెనుకబడింది. హైదరాబాద్‌లోని ఎక్కువ సంఖ్యలో డాక్టర్లు వుండటంతో, రాష్ట్ర సగటుకంటే, కొంచెం ఎక్కువగా వుంది. హైదరాబాద్ లేని తెలంగాణాలో, మిగిలిన రెండు ప్రాంతాలకంటే, రాష్ట్ర సగటుకంటే తక్కువగా వుంది. కోస్తా ఆంధ్ర రాయలసీమకంటే ముందుండగా, ఇటీవల కాలంలో ఈ తేడా స్వల్పంగా పెరిగింది. మిగిలిన రెండు ప్రాంతాలకంటే, రాయలసీమ ఆర్థికంగా వెనుకబడి వుండటవల్ల, ప్రైవేట్ వైద్యశాలలను వెళ్ళే శక్తి లేనందువల్ల, ప్రభుత్వ ఆస్పత్రుల అవశ్యకత ఈ ప్రాంతంలో ఎక్కువగా వుంది.

## హైదరాబాద్‌లో వైద్యసదుపాయాలు

హైదరాబాద్ మెట్రోపాలిటిన్ ప్రాంతంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలపై ఎక్కువగా దృష్టి పెట్టడం జరిగింది. తెలంగాణా ప్రాంతంలో 2009లో 17000 ఆస్పత్రిలో పడకల సంఖ్య వుండగా, 6700 హైదరాబాద్‌లోనే వున్నాయి. తెలంగాణా ప్రాంతంలో 4000 మంది డాక్టర్లుండగా హైదరాబాద్‌లోనే 1400 మంది వున్నారు. ఆ విధంగా హైదరాబాద్‌లో డాక్టర్లు, పడకల సంఖ్య రాష్ట్ర సగటుకంటే మూడు రెట్లు ఎక్కువగా వుంది. విద్య సంస్థలు వైద్యరంగంలో కూడా అర్బన్ ప్రాంతాల్లో ఎక్కువగా దృష్టి పెట్టటం జరిగింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి వైద్యం కోసం హైదరాబాద్‌కు రావటం జరుగుతుంది.

### హెల్త్‌కేర్ ప్రైవేటీకరణ

ఆంధ్రప్రదేశ్‌లో 1980 నుంచి ఆరోగ్య సంరక్షణలో ప్రైవేట్ రంగానికి అధిక ప్రాధాన్యం వుంది. జనాభాకు అనుగుణంగా, ప్రభుత్వ రంగంలో వైద్య సదుపాయాలు మెరుగుపడలేదు. ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ బడ్జెట్లో నిధుల కేటాయింపు తగ్గింది. 5వ పంచవర్ష ప్రణాళికలో (1974-78 6.5% నుంచి 9వ పంచవర్ష ప్రణాళికలో 1997-02) 5.4%నికి తగ్గింది. 2005-06 సం॥రానికి 4.5%

తగ్గింది. తలసరి గణాంకాలు చూస్తే ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ ఖర్చు 7వ పంచవర్ష ప్రణాళికలో (1985-1990) రూ.141 వుండగా, 8వ పంచవర్ష ప్రణాళికలో (1992-97)లో రూ. 124 వుంది. ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వ ఖర్చు చూస్తే 7వ పంచవర్ష ప్రణాళికలో 1.29% నుండి 8వ పంచవర్ష ప్రణాళికలో 0.96% ఆ తరువాత 2005-06 సం॥నికి 0.76% పడిపోయింది. ఆ విధంగా ఆరోగ్యంపై బడ్జెట్లో నిధుల కేటాయింపు తగ్గింది. కార్పోరేట్ ఆస్పత్రుల సంఖ్య పెరిగింది. 1988లో హైదరాబాద్‌లోని మొదటి కార్పొరేట్ ఆస్పత్రి ఏర్పాటయింది. 2004 సం॥నికి వీటి సంఖ్య 16కు పెరిగింది. 57% పడకలతో ఇవి సేవలందిస్తున్నాయి. సబ్సిడీలు ఇస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ ఆస్పత్రులను ప్రోత్సహిస్తున్నాయి. భూకేటాయింపులు, కస్టమ్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇస్తున్నాయి. ఈ ఆస్పత్రుల్లో, సిబ్బంది, ఇతర సౌకర్యాలు కనీస ప్రమాణాలపై ప్రభుత్వ నియంత్రణ లేదు.

## ఆరోగ్యశ్రీ

ఇటీవల ప్రభుత్వ, ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో ఆరోగ్యశ్రీ అనే సామాజిక భీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కొన్ని రకాల వ్యాధుల, సర్జరీలు ప్రైవేట్ ఆస్పత్రులో చేస్తే ప్రభుత్వం వాటికి డబ్బు చెల్లిస్తోంది. రోగులు ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స చేయించుకుని, ఇన్సూరెన్స్ ఏజన్సీ ద్వారా డబ్బు పొందే సదుపాయం వుంది.

ఈ స్కీమ్ ద్వారా కార్పోరేట్ ఆస్పత్రులలో పేదలకు మంచి వైద్యం అందుతున్నప్పటికీ, ఇందులో రెండు స్థాయిలో లోపాలున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం ఈ స్కీమ్‌ను తమ స్వలాభం కోసం దుర్వినియోగం చేసే అవకాశం వుంది. ఆరోగ్యశ్రీ కేటాయించే నిధులు ప్రజారోగ్య వ్యవస్థ ద్వారా, ప్రాథమిక, ద్వితీయ శ్రేణి ఆస్పత్రులకు కేటాయిస్తే లబ్ధిపొందే వారి సంఖ్య, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధి పొందే వారికంటే ఎక్కువగా వుంటుంది. ఇన్సూరెన్స్ పథకాలకు ఈ విధంగా నిధుల మళ్ళించి, కార్పొరేట్ వైద్యానికి పెద్దపీట వేయటం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ రంగంలో ఆరోగ్య సంరక్షణ మూలనబడే అవకాశం వుందని నిపుణులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

## ఆరోగ్య సూచికలు

ప్రసూతి, చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణ, చిన్న పిల్లలు మరణాలు మొ॥నవి ముఖ్యమైన ఆరోగ్య సూచికలు: వాటిని ఈ విభాగంలో విశ్లేషించటం జరిగింది. ప్రసూతి మరణాలు కూడా ఆరోగ్య సూచికలుగా తీసుకోవటం జరిగింది. గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితి, శిక్షణ పొందినవారిచే ప్రసవం మొ॥నవి తీసుకోవటం జరిగింది. మొత్తంగా, తెలంగాణా ప్రాంతంలో ప్రసూతి వైద్యం బాగానే వుంది. ఉత్తరాంధ్రలో జిల్లాలో ఇది చాలా తక్కువగా వుంది. ఆదిలాబాద్, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో (ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీ 60%) పరిస్థితి అధ్వానంగా వుంది. రాయలసీమలోని కర్నూలులో కూడా ప్రసవం తరువాత మహిళల సంరక్షణ సరిగాలేదు. ఒక ప్రాంతంలో ఆర్థిక పరిస్థితి, మానవ అభివృద్ధి చిన్నపిల్లల మరణాల సంఖ్య బట్టి చెప్పవచ్చు.

## సంక్షిప్తం

ఆరోగ్యానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు రాష్ట్రంలో తక్కువ స్థాయిలో పెరగటం దీంతో సదుపాయాలు తలసరి లెక్కన చూస్తే, స్వల్పంగా అతి తక్కువగా పెరిగాయి. ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాలు (డాక్టర్లు, పడకలు) లక్ష జనాభాకు రాయలసీమలో ఎక్కువగా వుండగా, కోస్తా ఆంధ్ర ఆ తరువాత

స్థానం. హైదరాబాద్ లేని తెలంగాణా ఈ విషయంలో వెనుబడి వుంది. మౌలిక సదుపాయాల కంటే, ఆరోగ్య సూచికను గమనిస్తే వేరే విధంగా వుంటుంది. ఎక్కువ తెలంగాణా జిల్లాలో ప్రసూతి, పిల్లల ఆరోగ్యం బాగుండగా రాయలసీమ, కోస్తాఆంధ్ర ముఖ్యంగా ఉత్తరాంధ్ర ఈ విషయంలో వెనుకబడ్డాయి. రాష్ట్రంలోని ప్రైవేట్ రంగంలోనే ఆరోగ్య పరిరక్షణలో ఆధిపత్యం వహిస్తుంది.

విజయనగరం, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలలో ప్రసూతి, పిల్లల ఆరోగ్య సూచికలు వెనుకబడి వున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎక్కువ మంది పేదలు వుండటంతో, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం వీరికి అందని ద్రాక్షే! విశాఖ, గుంటూరు, నెల్లూరులో ప్రకాశంలో తక్కువ స్థాయిలో వున్నాయి. ఈ ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణపై అవగాహన లేక ఈ విధంగా వుంది. పేదల సంఖ్య అధికంగా వున్న ప్రాంతాల్లో ప్రభుత్వ రంగంలో ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయటమే కాక ప్రజలకు అవగాహన కూడా కల్పించాల్సిన అవసరం వుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రసూతి, పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణలో అవగాహన కల్పించాలి! ప్రైవేట్ రంగంలో వున్న వైద్య సంస్థలపై నియంత్రణ ఉండి నిధుల దుర్వినియోగం కాకుండా చూడాలి!

+++

అధ్యాయం 4

# జలవనరులు, సాగునీటి పారుదల, విద్యుత్ రంగ అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 2,75,100చ॥ కిలో మీటర్లు. ఉత్తరాన శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం నుండి దక్షిణాన నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సు వరకు 960 కిలోమీటర్లు సముద్రతీర ప్రాంతముంది. కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా అనే 3 ప్రాంతాలు, 23 జిల్లాలు గల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జనాభా 7 కోట్ల 62లక్షల 10 వేలు (2001 జనాభా లెక్కల ప్రకారం). అయితే తాజా అంచనాల ప్రకారం రాష్ట్ర జనాభా 8 కోట్ల పైనే. భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారత ద్వీపకల్పంలో ఉంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 40 భారీ, మధ్యతరహా, చిన్న నదులు ప్రవహించే నదీ జలాల క్షేత్రం. అంతరాష్ట్ర నదులైన గోదావరి, కృష్ణా, పెన్నా నదులు ఆంధ్రప్రదేశ్ మధ్యన ప్రవహిస్తున్నాయి. ఇవికాక గోదావరికి ఉత్తరాన 5 అంతరాష్ట్ర నదులు ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌ల ద్వారా ప్రవహిస్తున్నాయి. పెన్నానదికి దక్షిణాన 4 అంతరాష్ట్రనదులు ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల గుండా ప్రవహిస్తున్నాయి. ఈ 12 నదులేకాక 28 మధ్యతరహా, మరియు చిన్న నదులు ఆంధ్రప్రదేశ్ లోపల ప్రవహిస్తున్నాయి.

గోదావరి నదీ జలాల ట్రిబ్యునల్(జిడబ్ల్యుటి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నమ్మకమైన గోదావరి నీరు 1480 శతకోటి ఘనపుటడుగులు (టిఎంసి) అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేసింది. కృష్ణా నదీజల వివాద ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు 811 శతకోటి ఘనపుటడుగుల కృష్ణాజలాలను కేటాయించింది. కాగా పెన్నానది నుండి లభించే నీరు 99 టిఎమ్‌సిలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంచనావేసింది. రాష్ట్రంలో ప్రవహించే ఇతర చిన్ననదుల నీటిని కూడా కలుపుకుంటే ఆంధ్రప్రదేశ్‌కు మొత్తంగా లభించే నీరు 2769 శతకోటిఘనపుటడుగులు. అయితే ఈ మొత్తం నీటిలో ఇప్పటివరకూ వాడుకుంటున్న నీరు 1933 టిఎంసిలు మాత్రమే. రాష్ట్రంలో మొత్తం సాగు భూమి విస్తీర్ణం 157.78 లక్షలహెక్టార్లు కాగా 61.66 లక్షల హెక్టార్ల భూమికి మాత్రమే సాగునీటి సౌకర్యం వుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనాభాలో ఇప్పటికీ వ్యవసాయంపై ఆధరపడి జీవించే వారు ఎక్కువే.

## ఆంధ్రప్రదేశ్ నదీపరివాహక ప్రాంతం

ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నో శతాబ్దాల పూర్వం నుండి వ్యవసాయ, సాగునీటి పారుదల వారసత్వం వుంది. తొలినాట పాలకులు తమతమ రాజానాలలో ప్రజలకు ఆహారం తదితర ఉపాధికై నీటిపారుదల సౌకర్యాలు కల్పించారు. పాకాల, లక్కవరం, రామప్ప చెరువు ద్వారా జరిగిన మేలు ప్రజలు ఇప్పటికీ స్మరిస్తూనే ఉన్నారు. కంభం చెరువు, కనిగిరి రిజర్వాయర్, అనంతపురం చెరువు, పోరుమామిళ్ల చెరువు, మేపాడ్ చెరువు, నంద్యాల చెరువు, తుంగభద్రానదిపై నిర్మించిన కోరెగాల్, వల్లభాపూర్ రామ, బసవన్న వంటి ఆనకట్టలు విజయనగరం రాజులు నిర్మించినవే. గోదావరిపై ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట, విజయవాడ వద్ద కృష్ణా నదిపై కట్టిన ఆనకట్ట, నెల్లూరు వద్ద పెన్నా నదిపై కట్టిన సంగం

ఆనకట్టలు బ్రిటిష్ హయాంలో బ్రిటన్ ఇంజనీర్లు సర్ ఆర్థర్‌కాటన్, సర్ చార్లెస్ అలగ్జాండర్ మరియు కల్నల్ జె.జాన్‌పెన్న నిర్మించినవే. ప్రజల కడగండ్లు చూసిన ఆ ఇంజనీర్లు 19వ శతాబ్దంలో కోస్తాఆంధ్రప్రాంతంలో లక్షలాది ఎకరాల బీడు భూములను ఈ సాగునీటి కట్టలద్వారా మంచి మాగాణులుగా, ధాన్యాగారాలుగా మార్చివేశారు.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో భూములకు నీటిపారుదల సౌకర్యాల కల్పనలో గణనీయమైన పురోగతి జరిగింది. దేశ సర్వతోముఖాభివృద్ధికోసం నదీజలాలను వినియోగించుకోవడానికి, జనజీవితాలను బాగుచేయడానికి భారతప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. నదీజలాలను గరిష్టంగా ప్రజల సౌకర్యార్థం ఉపయోగించుకోవడానికి నదులు, వాటి ఉపనదులపై భారీ, మధ్యతరహా మరియు చిన్న నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించారు. నదీ జల ప్రవాహాన్ని నియంత్రించి, నీటిని నిల్వ చేసి ప్రజల కోసం బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మించారు. ఆ విధంగా ఈమొత్తం అభివృద్ధి క్రమంలో ఆంధ్రప్రదేశ్ కూడా ఒక లబ్ధిదారుగా వుంది.

ఆంధ్రప్రదేశ్‌ను 40 భారీ మరియు చిన్ననీటి పరివాహక ప్రాంతాలుగా విభజించవచ్చు. వాటిని ఈ కింది 5 గ్రూపులుగా వర్గీకరించవచ్చు.

ఎ) కృష్ణానది పరివాహక ప్రాంతం

బి) గోదావరినది పరివాహక ప్రాంతం

సి) పెన్నానది పరివాహక ప్రాంతం

డి) వంశధార పరివాహక ప్రాంతం

ఇ) ఇతర నది పరివాహక ప్రాంతాలు

రాష్ట్ర నీటిపారుదల శాఖ నాగార్జున సాగర్ ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టు, శ్రీరాం సాగర్ ప్రాజెక్టు 1వదశ, వంశధార ప్రాజెక్టు 1వదశ, సోమశిల ప్రాజెక్టు, తుంగభద్ర ప్రాజెక్టు, తుంగభద్ర ఎగువ మరియు దిగువ కాలవ పథకాలు, మరియు రాజోలిబండ నీటి మళ్లింపు పథకం వంటి ఎన్నో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించింది. ధవళేశ్వరం వద్ద గోదావరిపై, విజయవాడ వద్ద కృష్ణా నదిపై పాత ఆనకట్టల స్థానంలో కొత్త బ్యారేజీలను నిర్మించారు.

## సమావేశాలు, వినతి పత్రాలలో ప్రజలు ప్రస్తావించిన ప్రధాన సమస్యలు

కమిటీ ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో పర్యటించింది. 3ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మరియు వివిధ వర్గాల ప్రజల నుండి నీరు, సాగునీటి సౌకర్యాల గురించి చేసిన విన్నపాలు విన్నది. కమిటీ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు కూడా పల్లెలు, పట్టణ ప్రాంతాల్లో వ్యక్తులు, ప్రజాసమూహాలను కలుసుకుని వారినుండి వివిధ సమస్యల గురించి అభిప్రాయాలను అడిగి తెలుసుకుంది. ఇలా ప్రజలను నేరుగా కలుసుకున్న సందర్భాలలో వివిధ సమస్యల గురించి, వాటిపై రాష్ట్రప్రజల విభిన్న అభిప్రాయాలను , ఆకాంక్షలను అడిగి తెలుసుకుంది. ఇలా ప్రజలను కలుసుకోవడంతో పాటు కమిటీ కొన్ని ప్రాజెక్టు ప్రాంతాలను కూడా సందర్శించింది.

నదీజలాల పంపిణీ, వినియోగం విషయంలో తమ ప్రాంతానికి అన్యాయం జరిగిందనేది తెలంగాణా ప్రజల ప్రధాన ఫిర్యాదు. నదీజలాల పంపిణీలో తెలంగాణాకు అన్యాయం జరిగినట్లు ఆప్రాంత ప్రజలు సమర్పించిన వినతిపత్రాలలోని ప్రధానమైన ఆరోపణ. వినతి పత్రాల ద్వారా, నేరుగా ప్రజలను

కలుసుకున్నప్పుడు తెలంగాణా పట్ల వివక్ష కొనసాగుతున్నదనే ఆరోపణలు వినవచ్చాయి. వివిధ ప్రాంతాల మధ్య నదీజలాల పంపిణీ, నీటివినియోగం తెలంగాణా ప్రయోజనాలకు విరుద్ధంగా గోదావరి జలాలను కొంత కోస్తా ఆంధ్రకు తరలించారని, కృష్ణా జలాలను రాయలసీమకు తరలించారనే ఆరోపణలు వచ్చాయి. వివిధ ప్రాంతాల మధ్య ఉత్పన్నమయ్యే ఇలాంటి వివాదాల పరిష్కారానికి తగిన యంత్రాంగం లేదనేది తెలంగాణా నుండి వచ్చిన ఆరోపణ. వివిధ ప్రాజెక్టుల అమలులో తెలంగాణాకు అన్యాయం జరుగుతున్నదనేది మరో ఫిర్యాదు. తెలంగాణాలో ఇచ్చంపల్లి, దేవాదుల ఎత్తిపోతల వంటి ఆచరణ వీలుకాని లేదా లాభదాయకం కాని ప్రాజెక్టులను చేపట్టారనేది ఇంకో ఆరోపణ. తెలంగాణా ప్రాంత ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా కోస్తాఆంధ్ర ప్రాంతానికి పోలవరం భారీ ప్రాజెక్టులను నిర్మిస్తున్నారని, మునుపటి హైదరాబాద్ సంస్థానాధీశుడు నిజాం కాలం నాటినుండి సంక్రమించిన ప్రాజెక్టులను పక్కన పెట్టారనది ఇంకో ఆరోపణ.

చెరువులను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని, తెలంగాణాలో చెరువుల కింద సాగయ్యే భూవిస్తీర్ణం 12 లక్షల ఎకరాల నుండి 5లక్షల ఎకరాలకు తగ్గిపోయిందని, ఫలితంగా ఇక్కడి ప్రజలు బావులు, గొట్టపుబావుల ద్వారా భూగర్భ జలాలపై ఆధారపడే పరిస్థితి కల్పించారనేది మరో ఆరోపణ. ప్రభుత్వం డబ్బుతో కాల్వలద్వారా సేద్యపు నీటి సౌకర్యం కల్పిస్తున్నారని, అయితే రైతులు సొంతడబ్బుతో బావులు, బోర్లు వేసుకుని భూగర్భ జలాలు తోడి ఖర్చుతో కూడిని సేద్యం చేస్తున్నారని, ఫలితంగా తెలంగాణా రైతులు అప్పులపాలై, దారిద్ర్యంతో, దైన్యంతో బతుకుతూ, కొదరైతే ఆత్మహత్యలకు కూడా పాల్పడవలసి వస్తోందని ఆప్రాంత ప్రజలు కమిటీకి తెలియజేశారు. నదీపరివాహక ప్రాంత విస్తీర్ణం ఎక్కువగా ఉన్నప్పటికీ కోస్తాఆంధ్రకంటే తెలంగాణాలో తక్కువ భూమికి సేద్యపునీటి సౌకర్యం ఉందని, అందువల్ల ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేస్తే వ్యవసాయోత్పత్తికి కృష్ణా, గోదావరి నదీ జలాలను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుని, స్థానిక ప్రజలకు మరింత ఉపాధి కల్పించడానికి వీలవుతుందని అక్కడి ప్రజలు కోరారు.

అయితే కోస్తాఆంధ్ర, రాయలసీమ ప్రాంతప్రజలు, ప్రతినిధి వర్గాలు పూర్తి విరుద్ధమైన వాదనలు వినిపించారు. తెలంగాణా భూభాగం ఎత్తైన ప్రదేశంలో ఉండటం, నదులు కింది స్థాయిలో ప్రవహిస్తూ ఉండటం వంటి భౌగోళిక పరిస్థితుల కారణంగానే ఆప్రాంతంలో నీటిపారుదల సౌకర్యాల విస్తరణకు ప్రధాన అడ్డంకిగా ఉందని, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజల వినతి పత్రాల ద్వారా, ముఖాముఖి సంభాషణల ద్వారా తగిన సాక్ష్యాధారాలను కమిటీ ముందుకు తెచ్చారు. నైసర్గిక పరిస్థితుల కారణంగా నీటిపారుదల విస్తరణ సాధ్యం కాలేదనేది వాస్తవం కాగా, వాటికి ఇతరప్రాంతాల వారు కారకులన్నట్లు ఆరోపించడం సరికాదని, అలాంటి ఫిర్యాదులకు ఆస్కారమే లేదని కోస్తా, రాయలసీమ ప్రాంతాల ప్రజలు వాదించారు. నిజానికి తెలంగాణా ఎంతో మెరుగని సేద్యం అభివృద్ధి విషయంలో రాయలసీమ ప్రాంతం తెలంగాణాకంటే ఎంతో వెనకబడి ఉందని ఆ ప్రాంతం వారు కమిటీకి వివరించారు. తెలంగాణా నాయకులు తప్పుదోవ పట్టించే ఇలాంటి ప్రకటనలు పదేపదే చేయడం ద్వారా ఊహాపోహల ద్వారా వారు కల్పించుకున్న అభిప్రాయాల ఆధారంగా కార్యాచరణకు పూనుకుంటే, ఆధారాలు లేని అభిప్రాయాల ప్రకారం రాష్ట్రాన్ని విభజిస్తే భవిష్యత్తులో తమకు తీవ్రమైన నీటిసమస్యలు తలెత్తగలవని కోస్తాఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రతినిధి వర్గాలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

## సాంకేతిక నిపుణుడి నియామకం

రాష్ట్రంలో నీరు, సాగునీటి పారుదల అత్యంత వివాదాస్పద విషయమైనందున నదీజలాల విషయమై లోతైన సమగ్ర అధ్యయనం కోసం విషయ పరిజ్ఞానం కలిగిన సీనియర్ అధికారిని, రాష్ట్రం వెలుపలి

నిపుణుడిని కమిటీ నియమించింది. ఆ విధంగా నదీజలాల విషయం పరిశీలనకు కేంద్రజలసంఘం మాజీ ఛైర్మన్ శ్రీ ఎ.డి. మెహిలేశును నియమించారు. నదీజలాల పంపిణీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రాంతానికైనా, లేక ఏ ప్రాంతంపట్ల అయినా నిర్లక్ష్యం లేదా వివక్ష జరిగిందా అనే అంశాలను పరిశీలించి, రాష్ట్రంలో నీరు, సాగునీటి విస్తీర్ణాన్ని మెరుగుపరచడానికి తగు తరుణోపాయాలను సూచించవలసిందిగా జలవనరుల సీనియర్ నిపుణుడు శ్రీ మొహిలేశును కోరడం జరిగింది.

జలవనరుల నిపుణుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ జలవనరుల శాఖల వద్ద లభించిన విపులమైన సమాచార, గణాంకాలను, నీటివిషయమై రాష్ట్రంలోని వివిధప్రాంతాల ప్రజల వినతి పత్రాలలో లేవనెత్తిన సమస్యలను ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. శ్రీ మొహిలే ఢిల్లీ, హైదరాబాద్‌లలో వివిధ వర్గాల ప్రజలు, సంఘాల వారితో సమావేశమై వారినుండి వివరాలు సమగ్రంగా స్వీకరించారు. అంతేకాక ఆయన రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో కూడా పర్యటించారు. మహబూబ్‌నగర్ వైపునగల తుంగభద్రపై గల సుంకేశుల బ్యారేజీని, కర్నూలుజిల్లాలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను, రాజోలిబండ కాలువను, ఘన్‌పూర్, నిజాంపూర్, సింగూరు డ్యామ్‌లను, శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గాన్ని, నాగార్జున సాగర్‌ను, కరీంనగర్ జిల్లాలో దిగువ మానేరు డ్యాంలను కూడా శ్రీ మొహిలే సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. ఈ బ్యారేజీలు, డ్యాంలకు సంబంధించిన సాంకేతిక సమస్యలను గురించి, ఆయాప్రాంతాల వారితో ఆయన నేరుగా చర్చించి విషయాలు తెలుసుకున్నారు.

రాష్ట్రంలో నీరు, నీటిపారుదలకు సంబంధించిన, లభించే సమాచార, గణాంకాలను సవివరంగా విశ్లేషించాక, క్షేత్రస్థాయి పర్యటనల సందర్భంగా, సమావేశాలలో ప్రజల ద్వారా తెలుసుకున్న వివరాల ఆధారంగా శ్రీ మొహిలే ఆంధ్రప్రదేశ్‌లో నీరు, నీటిపారుదల నివేదికను సమర్పించారు. శ్రీ మెహిలే నివేదిక ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదలకు సంబంధించిన మెరుగైన అవగాహన కల్పించడానికి ఎంతో దోహదపడింది.

## సాధారణ నిర్ధారణలు

ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలు, రాష్ట్రం మొత్తంగా అభివృద్ధి, నీటి నిర్వహణ, నీటిపారుదల వనరులకు సంబంధించిన భారీ సమస్యలను, అంశాలను గురించి కమిటీ సాధారణ నిర్ధారణలను ఈ కింద ఇవ్వడమైనది.

1. వివిధ రాజకీయపార్టీలు, సంఘాల నుండి కమిటీకి అందిన వినతి పత్రాల పరిశీలన
2. పార్టీలు, వివిధ వర్గాల ప్రతినిధుల కమిటీకి మౌఖికంగా చేసిన వినతులు
3. కమిటీ జిల్లా మరియు క్షేత్రస్థాయి పర్యటనలు మరియు స్థానిక నాయకులు, ప్రజల నుండి అందిన సమాచారం
4. జలవనరుల నిపుణుడి నివేదిక ఆధారంగా కమిటీ ఈ నిర్ధారణలు చేసింది.

అంతేగాక అవసరమైన సందర్భాల్లో కేంద్రజలవనరుల మంత్రిత్వ శాఖ, రాష్ట్రప్రభుత్వం నుండి ఆయా అంశాలపై సేకరించిన అదనపు సమాచారం, వివరణల ఆధారంగా కమిటీ నిర్ధారణలకు వచ్చింది.

## భూగర్భజలాలలతో సాగు

భూగర్భ జలాల ద్వారా సాగు తెలంగాణాలో అధికంగాను, కోస్తాంధ్ర, రాయలసీమ తర్వాతిస్థానాల్లో ఉన్నాయి. లభ్యమయ్యే భూగర్భ నీటి వనరులకంటే ఎక్కువగా వాడుకుంటే భూగర్భ నీటి మట్టం తగ్గిపోతుంది.

అలా ఉపయోగిస్తే భూగర్భ జలాలు అధికంగా వాడుతున్న ప్రాంతాలుగా పరిగణిస్తారు. లభ్యమయ్యే భూగర్భ జలాల్లో 90-100% మధ్య వినియోగిస్తుంటే ఆ ప్రాంతాన్ని క్లిష్టమైన ప్రాంతంగా, 70-90% వినియోగిస్తుంటే ఉప సంక్లిష్ట ప్రాంతంగా పరిగణిస్తారు. సీమాంధ్రతో పోలిస్తే తెలంగాణాలో బావులు, బోర్లకింద సాగువిస్తీర్ణం అధికం. అయితే సీమాంధ్రతో పోలిస్తే తెలంగాణాలో బావి, బోరు బావి కింద సాగు కొంత తక్కువే.

## నదీజలాల ఎత్తిపోతలు

రాష్ట్రప్రభుత్వంలో ఎన్.సి(ఐ.డబ్ల్యు), డి & సి.ఎ.డి విభాగం అందించిన సమాచారం ప్రకారం... కల్వకుర్తి హైలిఫ్ట్ నుండి 90 రోజులలో 30 టిఎమ్‌సిల నీటిని ఎత్తిపోతల ద్వారా సాగుకు అందిస్తారు. 298 మెగావాట్లతో కూడిన ఈ లిఫ్ట్‌లో కలిగే 30మెగావాట్ల నష్టాన్ని కూడా కలిపితే అది మొత్తం 328 మెగావాట్లు అవుతుంది. సిద్ధాంత ప్రకారం మొత్తంగా 351.9 మెగావాట్ల విద్యుత్ అవసరం. ఎత్తిపోతల పంపు తోడే సామర్థ్యం 0.85 గా భావిస్తే సగటున 89415336.53 వాట్ల విద్యుత్ అవసరం. కిలోవాట్ విద్యుత్‌కు రూ॥ 6 ఖర్చు అనుకుంటే ఏడాదికి కల్వకుర్తి ఎత్తిపోతలకుగాను అయ్యే విద్యుత్‌ఖర్చు రూ॥ 536.5 కోట్లు. ఇది ఏటా 3.75 లక్షల ఎకరాల సాగుకుగాను నీరు తోడేందుకయ్యే విద్యుత్ ఖర్చు. అందువల్ల ఇలాంటి పథకాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి. సాంకేతికంగా సాధ్యమే అయినా నీటిలభ్యత, ఎత్తిపోతల అవకాశాలను సమగ్ర విశ్లేషణ ద్వారా నిర్ధారించలేదు.

## జలయజ్ఞం కార్యక్రమం

1. రాష్ట్రంలో లభ్యమయ్యే నీటిని గరిష్టంగా ఉపయోగించుకోవడానికి గాను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలయజ్ఞం కార్యక్రమం కింద పెక్కు భారీ,మధ్య, చిన్నతరహా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని తలపెట్టింది. 39.54 లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు అందించే లక్ష్యంతో 86భారీ మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణాన్ని జలయజ్ఞం కింద తలపెట్టారు. రాష్ట్రంలో వెనుకబడిన గిరిజన ప్రాంతాలు, కరువు ప్రాంతాలకు సాగునీటి సౌకర్యాలు కల్పించడానికి, పారిశ్రామిక, త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉపరితల జలాలతో కలిపి భూగర్భజలాలను పొదుపుగా వాడుకోవడానికి ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు. జలయజ్ఞం ప్రాజెక్టులకింద 425 మండలాల్లో 65.14 టిఎమ్‌సిల నీటిద్వారా 2.11 కోట్ల మంది ప్రజలకు త్రాగునీరు అందిస్తారు.

2. రాష్ట్రంలో 2004-05, 2009-10 సంవత్సరాల మధ్య 12 భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు విడుదల చేశారు. మరో 20 ప్రాజెక్టులు పూర్తిచేసి పాక్షికంగా నీటిపారుదల సౌకర్యం కల్పించారు. ఈ కాలంలో భారీమధ్యతరహా ప్రాజెక్టులకింద 1.32 లక్షల హెక్టార్ల సాగువిస్తీర్ణాన్ని స్థిరీకరించడంతోపాటు కొత్తగా 6.15 లక్షల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కల్పించారు. అదే విధంగా రూ॥2,705 కోట్ల వ్యయంతో 4.13 లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు స్థిరీకరించడంతోపాటు కొత్తగా 2.30 లక్షల హెక్టార్ల భూమికి సాగునీటి సౌకర్యం కల్పించారు. మరో రూ॥2,445కోట్ల ఖర్చుతో తలపెట్టిన మరో 541చిన్ననీటిపారుదల పనులు కొనసాగుతున్నాయి. ఇవి పూర్తయితే మరో 2.23 లక్షల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం లభిస్తుంది.

3. వీటితోపాటు కృష్ణా, గోదావరి, నాగావళి, వంశధార నదుల వరదలవల్ల జనావాసాలు, ఆయకట్టు మునిగిపోకుండా 670 కిలోమీటర్ల దూరం వరదగట్టు పునరుద్ధరణకై రూ॥2,313 కోట్ల ఖర్చుతో పనులు సాగుతున్నాయి. కృష్ణా, గోదావరి, పెన్నా డెల్టాల ఆధునికీకరణ, నాగార్జునసాగర్,

తుంగభద్ర ప్రాజెక్టులు, హెచ్ఎల్సి, ఎల్ఎల్సి, నిజాం సాగర్ ప్రాజెక్టుల నవీకరణకై రూ॥15,001 కోట్ల ఖర్చుతో పనులు చేపట్టారు. 21.75 లక్షల ప్రస్తుత ఆయకట్టను ఆధునికీకరిస్తారు.

## మొత్తం పంట విస్తీర్ణం... మొత్తం సాగు నీటి విస్తీర్ణం

మొత్తం సాగునీటి విస్తీర్ణానికి సంబంధించి మూడు ప్రాంతాలలో గల తేడాలను గమనించవచ్చు. ఈ సుదీర్ఘకాలంలో తెలంగాణా, కోస్తా ఆంధ్రలలో సాగునీటి విస్తీర్ణం పెరిగింది. అయితే రాయలసీమలో సాగునీటి విస్తీర్ణం పెరగలేదు. తరగలేదు.

## నికర సాగునీటి విస్తీర్ణం

తెలంగాణాలో కాలవల ద్వారా సాగునీటి విస్తీర్ణం లక్షహెక్టార్లకుంది. 2.5 లక్షల హెక్టార్లకు పెరిగినట్లు తేలుతున్నది. 1955-56లో చెరువుల కింద సాగువిస్తీర్ణం 4 లక్షల హెక్టార్లు కాగా, ఇప్పుడది 2 లక్షల హెక్టార్లకు తగ్గింది. అయితే బావులకింద సాగునీటి విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 18 లక్షల హెక్టార్ల మొత్తం సాగునీటి విస్తీర్ణంలో బావులకింద సాగువిస్తీర్ణం 14 లక్షల హెక్టార్లు. తెలంగాణాలో 1955-56లో నికరసాగునీటి విస్తీర్ణం 847 లక్షల హెక్టార్లుండగా 2008-09 నాటికి అది 18 లక్షల హెక్టార్లకు పెరిగింది.

రాయలసీమ పరిస్థితి కొంతమేరకు తెలంగాణాలో మాదిరిగానే ఉంది. కాలవల ద్వారా సాగునీటి విస్తీర్ణం 0.8 లక్షల హెక్టార్ల నుండి 1.3 లక్షల హెక్టార్లకు పెరిగింది. చెరువుల కింద సాగునీటి విస్తీర్ణం 1.7 లక్షల హెక్టార్లు నుండి లక్ష హెక్టార్ల కంటే తక్కువకు పడిపోయింది. గత 54 సంవత్సరాలలో రాయలసీమలో సాగునీటి విస్తీర్ణం 3.8 లక్షల హెక్టార్ల నుండి 6.3 లక్షల హెక్టార్లకు పెరిగింది.

1. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో నీటిపారుదల సౌకర్యాల అభివృద్ధి ఇతర 2 ప్రాంతాల కంటే పూర్తి భిన్నంగా వుంది. 1955-56 నుండి ఇప్పటి వరకు కాలువల ద్వారా సాగు 11 లక్షల హెక్టార్ల నుంచి 13 లక్షల హెక్టార్లకు పెరిగింది. చెరువుల ద్వారా సాగునీటి విస్తీర్ణం 4 లక్షల హెక్టార్ల నుంచి 2.5 లక్షల హెక్టార్లకు తగ్గింది. 1955-56 లో బావుల కింద సేద్యం నామమాత్రం కాగా ఇప్పుడది 5 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఈ విధంగా కోస్తా ఆంధ్రలో మొత్తం నీటిపారుదల సౌకర్య విస్తీర్ణం మొత్తం 23 లక్షల హెక్టార్లు.
2. మూడు ప్రాంతాల్లో నికర సాగునీటి విస్తీర్ణం వివరాల తులనాత్మక తేడాలను ఈ కింద చూడవచ్చు.
3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద కల్పించిన నీటిపారుదల సౌకర్యం తెలంగాణలో 713% పెరగగా, రాయలసీమలో 390%, కోస్తాఆంధ్రాలో101% పెరిగింది.

## బహుళ నీటి పారుదల

వివిధ మార్గాల ద్వారా సాగునీటి విస్తీర్ణం 1955-56లో రాయలసీమలో 30% ఉండగా ఇప్పుడది 22% కి తగ్గింది. 1955-56లో తెలంగాణలో 18% ఉండగా 1975 నాటికి 50% పెరిగింది. కోస్తా ఆంధ్రలో బహుళ వనరుల ద్వారా నీటిపారుదల 13% భూమిలో మాత్రమే జరుగుతున్నది. మిగులు, భూగర్భ జలాలలో నీటిపారుదలతో ఇప్పుడది 40%కి పెరిగింది.

## వ్యవసాయం, అనుబంధ వృత్తుల ద్వారా ఆదాయం

1. పల్లెల్లో వ్యవసాయం, అనుబంధ వృత్తుల ద్వారా లభించే ఆదాయాలు గ్రామీణ ఆదాయాలకు సూచిక.

2. రాయలసీమ పల్లెల జనాభా అత్యంత నిరుపేదలు. కనీసం తెలంగాణా పౌరులతో ధీటుగా ఉండడానికి తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కోస్తా ఆంధ్రారైతుకు నీటిపారుదల సౌకర్యాలు, వ్యవసాయ విస్తరణ స్తంభించినా ఇప్పటికీ మిగతా వారి కంటే మెరుగే.

## బియ్యం

1. ఆంధ్రప్రదేశ్‌లో వరి ప్రధాన ఆహారపంట. కోస్తా ఆంధ్ర మొత్తం సాగువిస్తీర్ణంలో 40-45% వరిసాగే. తెలంగాణాలో వరిసాగు 20 నుండి 30%, రాయలసీమలో వరిసాగు 10%కంటే తక్కువే. నగదు పంటలవైపు మొగ్గడమే అందుకు కారణం.

2. కోస్తాఆంధ్రలో మొత్తం పంట విస్తీర్ణంలో ఆహారధాన్యాల సాగు (జిసిఎ) 80%, తెలంగాణాలో ఇది 80నుండి 70%కి తగ్గింది. రాయలసీమలో 1955-56లో ఆహారపంటల విస్తీర్ణం 70% ఉండగా ఇప్పుడది 40%కి తగ్గింది. ఆహారధాన్యాల ఉత్పాదకత తెలంగాణా, రాయలసీమలతో పోలిస్తే కోస్తాఆంధ్రలో అత్యధికం.

## వ్యవసాయం

1. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు ఇప్పటికీ సేద్యమే ప్రధాన వృత్తి. ఇతర రంగాలు అభివృద్ధి చెందడం వల్ల వ్యవసాయ ప్రాధాన్యం తగ్గుతోంది. చేపలు, పాడిపశువుల పెంపకం వంటి అనుబంధ వృత్తులు పెరిగాయి. మొత్తం జిడిపిలో ప్రాంతాల వారీగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవల వాటా కింద ఇవ్వడమైనది.

2. కోస్తాఆంధ్రలో 1993-96లో వ్యవసాయం అనుబంధ రంగాల నుండి జిడిపికి 38% లభించగా 2005-08నాటికి అది 29%కి తగ్గింది. తెలంగాణాలో అది 27 నుంచి 24%కి, రాయలసీమలో 39 నుంచి 27%కి తగ్గింది.

### జనాభా

ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం మూడు ప్రాంతాల్లో పల్లెలు, పట్టణ జనాభా పెరుగుదల, ఆర్థికవ్యవస్థ, వ్యవసాయం, నీటిపారుదలలో తేడాలను తెలుసుకోవడానికి తోడ్పడతాయి. 2001 జనాభాలెక్కల ప్రకారం కోస్తాఆంధ్రలో పల్లెల జనాభా అత్యధికం. 238.85 లక్షలు. తెలంగాణాలో గ్రామీణ జనాభా 211.34 లక్షలు. రాయలసీమలో 103.82 లక్షలు కాగా 1961-2001లో తెలంగాణాలో 24లక్షలున్న పట్టణ జనాభా గత 55 ఏళ్లలో 100 లక్షలకు పెరిగింది. మొత్తం తెలంగాణా జనాభా 125 లక్షల నుండి 311 లక్షలకు పెరిగింది. 1991 నుండి జనాభా వృద్ధిరేటు తగ్గుతున్న ధోరణి కనబడుతోంది. నగర విస్తరణవల్ల తెలంగాణాలో పట్టణీకరణ పెరిగింది. రాయలసీమలో 2001లో జనాభా 135 లక్షలుకాగా 31 లక్షల మంది పట్టణాల్లో నివసిస్తున్నారు. అందువల్ల పట్టణీకరణ నెమ్మదిగా జరుగుతున్నది. కోస్తా ఆంధ్రలో కూడా 1991 నుండి జనాభా వృద్ధిరేటు ధోరణి తగ్గుతోంది. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, మచిలీపట్నం, కాకినాడ వంటి ఎన్నో పెద్దపట్టణాలున్నా పట్టణ జనాభా వృద్ధి రేటు తగ్గుతోంది. ఆంధ్రప్రదేశ్ జనాభా ప్రస్తుతం 8కోట్లు అని అంచనా. పట్టణ, పల్లెల్లో జనాభా పెరిగింది.

## ఉత్తరాంధ్ర – కోస్తాఆంధ్ర తులనాత్మక పరిశీలన

ఉత్తర కోస్తాఆంధ్ర కోస్తాఆంధ్రకంటే భిన్నమైందని, నీటిపారుదల అవసరాలు తీర్చడంలో ప్రత్యేక ప్రాధాన్యత అవసరమనే డిమాండ్ వుంది. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళాలతోకూడిన ఉత్తరాంధ్రలో చిన్నచిన్న నదులు ఎక్కువ. అవి ఒరిస్సాలో పుట్టి బంగాళాఖాతంలో కలుస్తాయి. కోస్తాంధ్రతో ఉత్తరాంధ్రను పోల్చిన వివరాలు ఈ కింద ఇవ్వడం జరిగింది. కోస్తాంధ్రలో మొత్తం నీటిపారుదల విస్తీర్ణం అధికం. అయితే ఉత్తరాంధ్రలో సాగునీటి సౌకర్యం తక్కువ. జిడిపిలో ఉత్తరాంధ్ర మొత్తం కోస్తాజిల్లాలతో దీటుగా వుంది. అయితే వ్యవసాయం అనుబంధ వృత్తుల ద్వారా తలసరి ఆదాయం మాత్రం కోస్తాఆంధ్రలో సగమే.

శ్రీశైలం రిజర్వాయర్‌కు కుడివైపున పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ మరియు ఆ కిందికాలువల నిర్మాణాన్ని శరవేగంగాపూర్తి చేసారు. వీటివల్ల రాయలసీమ, కోస్తాఆంధ్రలో విస్తృత ప్రాంతాలకు సాగునీటి సౌకర్యం లభిస్తుంది. నీటిమళ్లింపునకు వీలుగా శ్రీశైలం రిజర్వాయర్ నుండి నీటి మళ్లింపు స్థాయిని పెంచారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ నుండి కృష్ణా జలాలను తెలంగాణాకు మళ్లించడానికిగాను 40 కిలోమీటర్ల సొరంగ మార్గాన్ని నిర్మిస్తున్నారు. ఈ సొరంగమార్గం పనులను మరింత వేగవంతం చేసి అత్యంత ప్రాధాన్యతా క్రమంలో సత్వరమే పూర్తిచేయాలి.

## ఇరిగేషన్

సాగు నీటిపారుదలను కాలువలు, చెరువులతో పోల్చి చూస్తున్నందున ఉపరితల నదీజలాలు, చెరువులపై భారీ ప్రాజెక్టులు నిర్మించడానికి తెలంగాణా ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. భూగర్భజల మట్టాలు తగ్గిపోతున్న ప్రాంతాలలో మళ్లీ భూగర్భజిల్లాలు నిండడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. నల్గండ జిల్లాలో ఫ్లోరోసిస్ వ్యాధి వల్ల ఎంతోమంది వికలాంగులు, అస్వస్థులౌతున్నందున వారికి రక్షిత మంచినీటి సరఫరాపై శ్రద్ధ వహించాలి.

## భారీమధ్యతరహా నీటి పారుదల, ఇంజనీర్స్ ఇన్ చీఫ్

మంత్రులకు సంబంధించిన సమాచార గణాంకాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి తీసుకోవడం జరిగింది. ఎక్కువగా భారీ నీటిపారుదల శాఖా మంత్రులు 55% మంది తెలంగాణాకు చెందిన వారు. ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు మాత్రం ఎక్కువ శాతం కోస్తాఆంధ్ర ప్రాంతానికి చెందినవారు. అయితే తెలంగాణా ప్రాంతానికి చెందిన వారుకూడా గణనీయంగానే ఇంజనీరింగ్ చీఫ్‌లుగా (43%) ఉన్నారు. ఈరంగంలో బాధ్యతలు నిర్వహించినవారు ఎక్కువ భాగం తెలంగాణేతరులేనని ఈ సంఖ్యా వివరాలు సూచించడం లేదు.

## పోలవరం ప్రాజెక్టు

కోస్తాఆంధ్రలోని పశ్చిమగోదావరిజిల్లా పోలవరం మండలం రామయ్యపేట గ్రామంసమీపంలో గోదావరి నదిపై ఇందిరా సాగర్ (పోలవరం) ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇది బహుళార్థసాధక ప్రాజెక్టు. నీటిపారుదల సౌకర్యాల అభివృద్ధి, జలవిద్యుత్ ఉత్పత్తి, కోస్తాఆంధ్రలోని విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి మరియు కృష్ణాజిల్లాల ప్రజలకు త్రాగునీటి సౌకర్యాలవంటి ఎన్నో ప్రయోజనాలకోసం గోదావరి నదిపై ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా 2.91 లక్షల హెక్టార్ల భూమికి సాగునీటి సౌకర్యం లభిస్తుంది. 960 మెగావాట్ల స్థాపిత ఉత్పాదక సామర్థ్యంతో జలవిద్యుత్ ఉత్పాదన జరుగుతుంది. దీనితోపాటు విశాఖనగరానికి త్రాగునీరు, పరిశ్రమలకు నీటికోసం ఉక్కుఫ్యాక్టరీకి

23.44 టిఎమ్‌సిల నీటిని తరలించాలని సంకల్పించారు. 80 టిఎమ్‌సిల గోదావరి జలాలను కృష్ణానదిలోకి మళ్లిస్తారు. అంతిమంగా పోలవరం ప్రాజెక్ట్‌ద్వారా 4.36 లక్షల హెక్టార్ల భూమికి సాగునీటి సౌకర్యం లభిస్తుంది. ఏటా 2,369.43 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతుంది. అంతేకాక ఆయకట్ట ప్రాంతంలో 540 గ్రామాలకు త్రాగునీటి సౌకర్యం లభిస్తుంది. నదుల అనుసంధాన కార్యక్రమంలో భాగంగా పోలవరం ప్రాజెక్ట్ ద్వారా గోదావరి, కృష్ణానదులను సంధానిస్తారు. 80 టిఎమ్‌సిల గోదావరి మిగులు జలాలలను కృష్ణానదిలోకి మళ్లిస్తారు. గోదావరి ట్రిబ్యునల్ తీర్పు మేరుకు ఆనీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 45 టిఎమ్‌సిలు, కర్నాటక, మహారాష్ట్రలకు 35టిఎమ్‌సిలు లభిస్తాయి. అయితే పోలవరం ప్రాజెక్ట్‌వల్ల 119 జనావాసాలు పూర్తిగా, 158 పల్లెలు పాక్షికంగా ముంపునకు గురౌతాయి. మొత్తంగా 277 జనావాసాలకు నష్టం జరుగుతుంది. వీటిలో 47 తెలంగాణాపల్లెలు పూర్తిగానూ, 108 పల్లెలు పల్లెలు పాక్షికంగానూ మొత్తం 205 ముంపునకు గురౌతాయి. 44,574 కుటుంబాలకు చెందిన 1,75000 మంది నిర్వాసితులౌతారు. వీరందరికీ పునారావాసం, ఉపాధికల్పనకు ప్రభుత్వం పూర్తి చర్యలు తీసుకుంది. ఇంతమంది నిర్వాసితులై కష్టనష్టాలు ఎదుర్కోవలసి వస్తుందనే కారణంగానే తెలంగాణాలో పోలవరం ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నారు. దీనికి తోడు గోదావరి జలాలను కోస్తాంధ్రలో సాగునీటి సౌకర్యాల కోసం, ఆ ప్రాంతానికి ప్రయోజనం కలిగించడానికి వాడుతున్నారనే అభిప్రాయం తెలంగాణా ప్రాంతం వారిలో ఉండనేవుంది.

## జలయజ్ఞం

జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డా॥అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి' పేరిట భారీ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది. గోదావరి ఉపనది అయిన ప్రాణహిత జలాలను పలుఎత్తిపోతల ద్వారా సేద్యానికి అందిస్తారు. అయితే ప్రాణహితనీటిని కనీసం 150 మీటర్ల నుండి ఎత్తిపోతల ద్వారా తరలించినపుడే ప్రయోజనం చేకూరుతుంది. పూర్తి ప్రయోజనాలు పొందాలంటే గరిష్టంగా 660 కిలోమీటర్ల ఎత్తున నీటిని ఎత్తిపోతలద్వారా తరలించాల్సి ఉంటుంది. ప్రాణహిత నుండి 160 టిఎమ్‌సిల నీటి ద్వారా మొత్తం 12.2 లక్షల ఎకరాల భూమికి సేద్యపునీటి సౌకర్యం కల్పించాలని తలపెట్టారు. నీటి తరలింపుకు 7 కాలువ వ్యవస్థలు, 20 ఎత్తిపోతల కేంద్రాలు అవసరం. 1096 చెరువులకు నీరు తరలిస్తారు. హైదరాబాద్ నగర సముదాయానికి పారిశ్రామిక, మున్సిపల్ అవసరాలకు కూడా ప్రాణహిత నీరు సరఫరా చేస్తారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ఖర్చు ప్రస్తుతానికి రూ॥17,875 కోట్లు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణాలో అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండ మరియు రంగారెడ్డి జిల్లాలకు ప్రయోజనం చేకూరుతుంది.

రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నదుల పరీవాహక ప్రదేశం తెలంగాణాలోనే ఎక్కువగా ఉన్నప్పటికీ తెలంగాణాకు నీటి కేటాయింపులుజరగడం లేదని కృష్ణ, గోదావరి జలాల కేటాయింపులు తక్కువని, తెలంగాణా వారి ఫిర్యాదు. పరీవాహక ప్రాంతం విస్తీర్ణంతో పోలిస్తే కేటాయింపులు తక్కువైనా, ఏ పరిమాణంలో నీరు ఆ బేసిన్‌కు అందుతున్నదనే అంశం, వాటిపై ఆధారపడిన జనాభా, అభివృద్ధికి వాడకాల, ప్రత్యామ్నాయ వనరులు, సాధ్యాసాధ్యాల వంటి అంశాల ప్రాతిపదికగానే నదీజలాల కేటాయింపు జరుగుతున్నది. పరీవాహక ప్రాంతమొక్కటే నీటి కేటాయింపులకు ప్రాతిపదిక కాదు. అదీగాక కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ మరియు గోదావరి జలాల వివాద ట్రిబ్యునల్ సూచనలద్వారా ఇప్పటికే జలాల కేటాయింపు నిర్ధారణ జరిగింది. అంతేగాక ప్రాంతాలవారీగా, ప్రాజెక్టుల వారీగా, సాంకేతిక కమిటీల ద్వారా ఈ నీటిని మళ్లీ కేటాయించారు. అంతేగాక తెలంగాణా భూభాగం ఎత్తైన

ప్రదేశంలో ఉండి నదులు కిందిస్థాయిలో ఉండటం వంటి ప్రకృతి సహజ కారణాల వల్ల భారీ ప్రాజెక్టుల నుండి కాలువల ద్వారా నీటి సరఫరా సాధ్యం కావడం లేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే శ్రీశైలం ఎడమ గట్టుకాలువ ప్రాజెక్టు నిర్మాణాన్ని జాప్యం చేసిందనేది తెలంగాణా వాదుల మరో ఆరోపణ. ఈ ప్రాజెక్టులో కొండను తొలిచి 40 కి॥మీ సొరంగ మార్గాన్ని రెండు దశల్లోనే తవ్వాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ నిర్మాణాలలో ఇది సంక్లిష్టమైనది గనుక ఆ పని పూర్తి చేయడానికి గణనీయమైన సమయం పడుతుంది.

తెలంగాణాలో సంప్రదాయక నీటి వనరులు ఉన్న అసంఖ్యాకమైన చిన్న చెరువులను మరమ్మత్తులు చేయడానికి ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తూ వాటిని ఉద్దేశ్యపూర్వకంగా ధ్వంసం చేస్తున్నదని,, అందువల్ల భారీనష్టం జరుగుతున్నదని తెలంగాణా వాదుల అభిప్రాయం. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు విధిలేక భారీఖర్చుతో బావుల, బోరులు వేసి సేద్యం చేస్తూ అప్పులపాలవుతున్నారని తెలంగాణావాదులు భావిస్తున్నారు. సాగుకు చిన్ననీటి వనరుల ప్రాముఖ్యతను తగ్గించడం, భూగర్భ జలాలను సేద్యానికి అధికంగా ఉపయోగించుకోవడమనేది దేశవ్యాప్తంగా ఉన్నదే. జనాభా వత్తిడి పెరగడం, పంటలు పెరగడం, భూమి ధరలుపెరగడం, పల్లెల్లో విద్యుత్, డీసెల్, పెట్రోలు వంటి ఇంధనం అందుబాటులో ఉండటం, దెబ్బతిన్న చెరువులను మరమ్మత్తు చేయకపోవడం వంటి అనేక కారణాల వల్ల దేశవ్యాప్తంగా సేద్యానికై భూగర్భ జాలలపైనే ఆధారపడుతున్నారు. తెలంగాణాలో చిన్ననీటి వనరుల ద్వారా సాగునీటి సేద్యం తగ్గినప్పటికీ, మొత్తం మీద తెలంగాణాలో నికర నీటిపారుదల శాతం భారీగా పెరిగిన సంగతి ఈ అధ్యాయంలో ఇంతకు ముందే సూచితమైంది.

నీటిపారుదలకు భూగర్భ జలాల వాడకం పెరిగినందున ఇది సాధ్యమయింది. రైతులందరు అప్పులపాలైతే ఇంత భారీగా సేద్యానికి భూగర్భ జలాల వాడకం పెరిగేది కాదు. గొట్టపు బావుల తవ్వడానికి భారీ పెట్టుబడి ఖర్చు, భూగర్భ జలాలు తక్కువగా వున్నచోట్ల నీటిని తోడడానికి అధిక ఖర్చుకావడం వల్ల రైతులు అప్పులపాలవుతున్నారని అందరూ గుర్తించారు. రైతులను ఆదుకొనే తక్షణ చర్యగా బోర్లు వేసుకోవడానికి రైతులకు తక్కువ వడ్డీ రుణాలు, విద్యుత్ సబ్సిడీలు ఇవ్వడం (ఇప్పటికే ఇస్తున్నారు) వంటి వాటిని మెరుగుపరచాలి. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జల మట్టం పెరుగుదలకు, తిరిగి నీటిని నింపే చర్యలను చేపట్టాలి. అదే విధంగా పాత చెరువులను పునరుద్ధరించిన చోట, కొత్త చెక్‌డ్యాంలు, ఊట చెరువులు కట్టిన ప్రాంతాలలో రైతులకు ఈ రాయితీలు కల్పించడాన్ని ప్రోత్సహించాలి.

గోదావరి నదిపై పోలవరం ప్రాజక్టు నిర్మాణాన్ని తెలంగాణా వాదులు వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం తలపెట్టిన భారీ డ్యాం స్థానంలో గోదావరి నదిపై మూడు బ్యారేజీలు నిర్మిస్తే తెలంగాణా ముంపునకు గురయ్యే ప్రాంతం తక్కువగా ఉంటుందనీ, డ్యాం నిర్మిస్తే ఎంత నీటిపారుదల సామర్థ్యం వుంటే ఈ బ్యారేజీల నిర్మాణం వల్ల కూడా అంతే నీటిపారుదల సౌకర్యం లభిస్తుందనేది తెలంగాణా వాదుల అభిప్రాయం. ఈ ప్రత్యామ్నాయాన్ని పరిశీలించకుండా పోలవరం ప్రాజక్టు నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారనేది వారి వాదన. పోలవరం ప్రాజక్టు నిర్మాణాన్ని ఎన్నో ఏళ్లక్రితమే తలపెట్టారు. గోదావరి నదీజలాల వివాద ట్రిబ్యునల్ అవార్డులో (జిడబ్ల్యుడిటి) భాగం. ఈ ప్రాజక్టు ద్వారా 80 టిఎమ్‌సీల గోదావరి జలాలను కృష్ణానదిలోకి మళ్ళిస్తారు. ఆ నీటిని ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర పంపిణీ చేసుకుంటాయి. ఆంధ్రప్రదేశ్‌కు లభించే జలాలలో కొంతభాగం తెలంగాణా ప్రాంతానికి కూడా లభిస్తుంది. అందువల్ల పోలవరం ప్రాజక్టు వల్ల తెలంగాణాలో కొంత భూమి కోల్పోయినా ఈ ప్రాజక్టు ద్వారా తెలంగాణాకు ఈ విధంగా ప్రయోజనం కూడా చేకూరుతుంది. ఈ దశలో పోలవరం ప్రాజక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలని తెలంగాణా వాదులు కోరడం అనేది దురభిప్రాయంతో కూడినది.

తెలంగాణా ప్రాంతానికి ప్రయోజనం చేకూర్చే ఇచ్చంపల్లి ప్రాజక్టును ప్రభుత్వం చేపట్టడం లేదనేది తెలంగాణా వాదుల మరో ఫిర్యాదు. ఇచ్చంపల్లి ప్రాజక్టును నిర్మిస్తే వేల ఎకరాల అటవీ భూమి ముంపునకు గురవుతుంది. వేలాది మంది గిరిజన జనాభా నిర్వాసితులవుతారు. అందువల్ల ఈ ప్రాజక్టు నిర్మాణానికి పర్యావరణ, అటవీ శాఖల అనుమతి లభించడం కష్టం. అందువల్ల తెలంగాణా వాదుల ఈ అభిప్రాయం కూడా పొరపాటు అవగాహనతో కూడినదే. అయితే తెలంగాణా వాదుల కొన్ని కోర్కెలు సమంజసమైనవే నని నీటిపారుదల నిపుణుల అభిప్రాయాన్ని బట్టి వ్యక్తమవుతుంది. కృష్ణానదీ జలాలకు సంబంధించి శ్రీశైలం ప్రాజక్టు కనీస నీటిమట్టం (ఎమ్‌ఎమ్‌డిఎల్) విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజక్టుగా తలపెట్టారు. ఆ తరువాత శ్రీశైలం కుడిగట్టు కాలువ, తెలుగు గంగ కాలువల ద్వారా కుడిగట్టును కూడా కృష్ణా జలాలను మళ్ళించడానికి సులువుగా వాడుకోవడానికి వీలుగా కనిష్టంగా నీటిని (ఎమ్‌ఎమ్‌డిఎల్) తీసుకునే మట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గణనీయంగా పెంచింది. బచావత్ ట్రిబ్యునల్ (కెడబ్ల్యుడిటి) అవార్డులో కృష్ణా మిగులు జలాలను వినియోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌కు 'స్వేచ్ఛ' ఇచ్చిన కారణంగా మద్రాసు నగరానికి మంచినీటి సరఫరాకై 15 టిఎమ్‌సిల నీరు తరలింపు, శ్రీశైలం కుడి కాలువకు కేటాయించిన 19 టిఎమ్‌సిల నికరజలాల సరఫరా, తెలుగుగంగ ప్రాజక్టు ద్వారా సాగునీటి సరఫరా కోసం ఈ మట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఇటీవల శ్రీశైలం ఎగువన పోతిరెడ్డిపాడు భారీ రెగ్యులేటర్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేశారు. అన్ని న్యాయపరమైన హక్కులను, సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా తగినన్ని నిధులు మంజూరు చేసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను పూర్తిచేశారు. ప్రదేష్‌కుమార్ ఆధ్వర్యంలో కృష్ణాజలాల ట్రిబ్యునల్ ఈ అంశాలను పరిశీలిస్తున్నది.

నాగార్జునసాగర్ ఎడమ గట్టు కాలువ (ఎన్‌ఎల్‌బిసి) మార్గాన్ని తెలంగాణాకు నష్టం కలిగించే రీతిలో మార్చారని కాలువను ఒక సరస్సులోకి వదిలేయడం వల్ల ఆయకట్టుకు నష్టం కలిగిందనేది తెలంగాణా వాదుల మరో ఫిర్యాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కాలువ నుండి ఎత్తిపోతల ద్వారా సాగునీరు తీసుకోవడానికి రైతులకు అనుమతి ఇచ్చినందున తెలంగాణా వాదుల ఫిర్యాదు సమంజసంగా అనిపిస్తున్నది.

జూరాల, ఎన్‌ఎస్‌బిసి తదితర ప్రాజెక్టుల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని జూరాల నుండి కర్నాటకకు వాటా ఈ రెండు ప్రాజక్టుల ద్వారా మహారాష్ట్రకు సకాలంలో ఇవ్వకపోవడం వల్ల ఆ ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరుగుతున్నదనే ఫిర్యాదు న్యాయమైందే. తుంగభద్రపై రాజోలిబండ నీటి మళ్ళింపు పథకానికి బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన వాటా నీటి కంటే తక్కువ పరిమాణంలో నీరు సరఫరా చేస్తున్నారనేది తెలంగాణా వాదుల ఇంకో ఆరోపణ. ఈ విషయాన్ని కర్నాటక, తుంగభద్ర బోర్డుల దృష్టికి సమర్థవంతంగా తీసుకెళ్ళక పోవడం తెలంగాణా వాదుల అభిప్రాయానికి కారణం కావచ్చు.

గోదావరి నది పరీవాహక ప్రాంతానికి సంబంధించి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సముదాయంలో భాగమైన ఎన్‌ఆర్‌ఎస్‌పి 1వ దశ, ఎస్‌ఆర్‌ఎస్‌పి 2వ దశ, వరద కాలువ పథకాల వల్ల దిగువ స్థాయికి నీరు రావడం లేదనేది తెలంగాణా వారి మరో ఫిర్యాదు. వాస్తవమేమంటే ఎస్‌ఆర్‌ఎస్‌సి 1వ దశ ఆయకట్టు చివరి భూములకు, ఎస్‌ఆర్‌ఎస్‌సి 2లో భాగమైన దిగువ మానేరు డ్యాంకు నీరు రావడం లేదు. ప్రధానమైన కాకతీయ కాలువ నీటి సరఫరా సామర్థ్యం తగ్గింది. శ్రీరాంసాగర్ డ్యాంలో పూడిక పెరిగింది. వరద కాలువ ఇంకా పూర్తికానే లేదు. గరిష్ట ప్రయోజనాలు పొందడానికి

అనుగుణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టును రూపొందించాల్సి వుందని కేంద్ర జలసంఘం మాజీ అధ్యక్షుడు అభిప్రాయపడ్డారు. శ్రీరాంసాగర్ కింద కొన్ని పంపింగ్ పథకాలను మంజూరు చేయడం వల్ల కూడా పరిస్థితి మరింత క్లిష్టిస్తున్నది. ఈ విషయమై తెలంగాణావాదుల ఫిర్యాదు సరైందే. అయితే వాటికి సులువైన పరిష్కారమేమీ లేదు. తక్కువ నీటిని వాడుకునే ఆరుతడి పంటలసాగును ప్రోత్సహించడం ద్వారా ఈ నీటి సమస్యకు కొంత పరిష్కారం లభించవచ్చు. కాకతీయ కాలువ నీటి సరఫరా సామర్థ్యాన్ని వెంటనే పునరుద్ధరించాలి.

సింగూరు-ఘన్‌పూర్-నిజాం సాగర్ వ్యవస్థలో నీటి సరఫరా సరిగా లేదనేది తెలంగాణా వాదుల మరో ఫిర్యాదు. పాత నిజాంసాగర్ రిజర్వాయర్‌లో పూడిక భారీగా పేరుకు పోయింది. సింగూరు ప్రాజెక్టును ప్రధానంగా ఈ నీటి సరఫరా వ్యవస్థకు తోడ్పడేందుకే నిర్మించారు. హైదరాబాద్ నగరానికి త్రాగునీటికి, పరిశ్రమల అవసరాలకు కేవలం 4 టిఎంసిల నీటిని మాత్రమే సరఫరా చేయాల్సి వుంది. అయితే కృష్ణా బేసిన్‌లో ఉన్న హైదరాబాద్ నగరానికి సింగూరు ప్రాజెక్టులోని మొత్తం జలాలను తరలిస్తున్నారు. త్రాగునీరు, పరిశ్రమల వినియోగం తక్కువ కనుక మరలివచ్చే నీరు కృష్ణాను మెరుగు పరుస్తుంది. అయితే ఘన్‌పూర్, నిజాంసాగర్ ఆయకట్టు దార్లు నష్టపోతున్నారు. అందువల్ల ఈ ఫిర్యాదు న్యాయమైందిగా కనిపిస్తోంది.

హైదరాబాద్ నగరానికి సింగూరు జలాలకు బదులు కృష్ణానదీ జలాలను అదనంగా తరలించే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలి. అందువల్ల తెలంగాణా రైతులకు ఉపశమనం కలుగుతుంది.

## రాయలసీమలో భయాందోళనలు

రాయలసీమ తమిళనాడులో సేద్యానికి 500 టిఎంసిల కృష్ణా జలాల వినియోగానికై 1951లో కృష్ణా - పెన్నార్ ప్రాజెక్టులను రూపొందించారని రాయలసీమకు చెందిన ప్రతినిధులు గుర్తుచేశారు. తెలుగు గంగ కాలువల ద్వారా సాగునీటి సరఫరా కొన్ని దశాబ్దాల తరువాత పాక్షికంగా అమలువుతోంది. రాజోలిబండ నీటి మళ్ళింపు కూడా కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టులలో భాగమే. ఇవిగాక వరదనీరు ఎక్కువగా వచ్చినపుడు 30 రోజుల్లో శ్రీశైలం రిజర్వాయర్ నుండి 112 టిఎంసిల నీటిని తరలించవలసి వుంది. ఇందుకు గాను పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ సామర్థ్యం 44000 క్యూసెక్కుల నీటి సరఫరాకు అనువైందిగా వుండాలి. కాగా అవసరాలకు మించి పోతిరెడ్డిపాడు పాండ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచారనే అభిప్రాయాలు సరైనవి కాదని వాటిలో నిజంలేదని రాయలసీమ ప్రతినిధులు తెలిపారు. రాయలసీమకు 500 టిఎంసిల నీటి మళ్ళింపునకు ఉద్దేశించిన కృష్ణా-పెన్నార్ పథకం బచావత్ ట్రిబ్యునల్ (కెడబ్ల్యుడి7)కు అవార్డు అనుగుణమైంది కాదు. ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన కృష్ణా జలాల వాటా 800 టిఎం.సిలు (11 టిఎంసిలు పునరుత్పత్తి) కడప-కర్నూలు కాలువద్వారా కొంత కృష్ణా జలాల వాడకంతో బాటు, శ్రీశైలం కుడికాలువకు 19 టిఎంసిల నికర జలాల కేటాయింపు వుంది. కృష్ణా మిగులు జలాలు వినియోగించుకునే 'స్వేచ్ఛ'ను ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చినందున ఆర్థిక-సాంకేతిక సాధ్యాసాధ్యాలు, గిట్టుబాటు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా భారీ పెట్టుబడులతో మిగులు జలాల ఆధారంగా భారీ ఎత్తిపోతల పథకాలను తలపెట్టారు. అదీగాక ఎగువ రాష్ట్రాలలో కృష్ణా జలాల వినియోగం పెరిగేకొద్దీ దిగువకు వచ్చేనీరు తగ్గిపోతుంది. అప్పుడు మిగులు జలాలు మిగలకపోవచ్చు. 30 రోజుల్లోనూ 112 టిఎంసిల నీటి సరఫరాను సమర్థించే పత్రాలను వారు సమర్పించలేదు. అందువల్ల రాయలసీమ ప్రజలు భయాందోళనలు పొరపాటు అవగాహనతో కూడినవి. అయితే ప్రస్తుతమున్న నీటి సరఫరా కాలువల నిర్వహణ అత్యంత అధ్వాన్నంగా ఉందని రాయలసీమ ప్రజలు వెల్లిడించిన భయాందోళనలు న్యాయమైనవే.

## కోస్తా ఆంధ్రుల ఆందోళనలు

కృష్ణా డెల్టా వ్యవస్థకు కేటాయించిన 181 టిఎంసిల నీటిలో 20 టిఎంసిలను తెలంగాణాలోని బీమా ప్రాజెక్టులకు మళ్ళించారని కోస్తాఆంధ్ర ప్రజలు కమిటి దృష్టికి తెచ్చారు. అదే విధంగా నెల్లూరుకు జరిపిన కేటాయింపులను తగ్గించి తెలంగాణాలోని జూరాల ప్రాజెక్టులకు కృష్ణా జలాలను కేటాయించారని వారు ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాకే జూరాల ప్రాజెక్టులను తలపెట్టారు. బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా డెల్టాలకు 181 టిఎంసిలు సరిపోతాయని చెప్పిన బచావత్ ట్రిబ్యునల్ రాష్ట్రానికి చట్టబద్ధంగా కట్టుబడి ఉండేవిధంగా కృష్ణా జలాలను కేటాయించింది. ప్రస్తుతం కృష్ణా డెల్టాలో 181 టిఎంసిల కంటే అధికంగా నీటి వాడకం జరుగుతున్నది. జూరాల ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాకే చేపట్టారు. అయితే తొలుత మునుపటి హైదరాబాద్ సంస్థానంలో ఎగువ కృష్ణా ప్రాజెక్టు క్రింద జూరాలకు ఆయకట్టు ప్రతిపాదన వుంది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ జరిగినపుడు ఎగువ కృష్ణా ప్రాజెక్టు కర్నాటక పరిధిలోకి వెళ్ళినందున జూరాల ప్రాజెక్టులకు కేటాయింపులు జరిపింది. అయితే తుది ఉత్తర్వులలో చట్టబద్ధ కట్టుబాటుకు వర్తించేలా ఉత్తర్వులివ్వలేదు. అందువల్ల ఈ విషయమై రాయలసీమ వారివి కేవలం అపోహాలే. శ్రీశైలం కుడికాలువను 11 టిఎంసిల పునరుత్పత్తి జలాలు, 8 టిఎంసిలు కెసి కెనాల్ కింద ఆదా చేసిన జలాలను కలిపి మొత్తం 19 టిఎంసిలు నికర జలాలు కేటాయింపులో 1981లో అనుమతి ఇచ్చారని అయితే ఈనాటికీ ఎస్ఆర్బిసి పనులు పూర్తి చేయలేదని కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్ఆర్బిసికి కేటాయించిన 19 టిఎంసిల నికర జలాలను, చెన్నై నగరానికి కేటాయించిన 15 టిఎంసిల మంచినీటిని, మిగులు జలాల ఆధారంగా తలపెట్టిన తెలుగుగంగ ప్రాజెక్టు కాలువలతో బాటు అనుసంధానించింది. అందువల్ల ఈ విషయమై వెలిబుచ్చిన భయాందోళనలు 'అపోహాలే'.

ఎస్ఆర్ఎస్పి సముదాయం వరదకాలువల ద్వారా గోదావరి జలాలన్నీ అక్కడి వరకు అన్నీ వాడుకుంటే కిందికి నీరు రాదని కోస్తా ఆంధ్ర ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే గంగ, ప్రాణహిత, శబరి, ఇంద్రావతి నదుల నుండి గోదావరి వచ్చి చేరే నీటితో కోస్తా ఆంధ్ర అవసరాలు తీరుతాయి. వారి భయాందోళనలకు ఆస్కారం లేదు.

అయితే గోదావరి నదిపై ఎగువ భాగంలో తెలంగాణాప్రాంతంలో తలపెట్టిన భారీ ఎత్తిపోతల పథకాలవల్ల దిగువన గోదావరి నది ఎండిపోతుందనే కోస్తా ఆంధ్రుల భయాందోళనలు పరిశీలనార్హమైనవి. వరదనీరు ఇంకా వస్తోందని అంచనా వేసినా, తక్కువ స్థాయిలో క్రిందికి వస్తున్న నీరు తగ్గిపోతున్నది. భారీ ఖర్చుతో కూడిన ఎత్తిపోతల పథకాలను చేపట్టడం సరికాదని ఆచరణ సాధ్యంకాదని తెలంగాణా వారిలో చాలా మంది భావిస్తున్నారు. అందువల్ల కోస్తా ఆంధ్ర జిల్లాల వారి భయాందోళనలు నిజమే.కనుక దీనిపై క్షుణ్ణంగా పరిశీలన జరపాలి.

గోదావరి డెల్టాకు నీటి నిల్వ మద్దతు అవసరమని కోస్తా ఆంధ్రుల అభిప్రాయం. కృష్ణా, గోదావరి డెల్టాలు భారతదేశ 'ధాన్యాగారాలు'. అందువల్ల జాతీయ అవసరాల దృష్ట్యా ఈ డెల్టాలను పరిరక్షించాలి. అందువల్ల నీటి సరఫరాను మెరుగు పరచడానికి నిల్వ సామర్థ్యం మద్దతు అవసరం. కాని ఇచ్చంపల్లి, చత్తీస్ఘడ్లో ఇంద్రావతి నదిపై గతంలో తలపెట్టిన జలవిద్యుత్ కేంద్రాలు... అటవీ, పర్యావరణ అనుమతులు రాక అమలు కాలేదు. పోలవరం కొంచెం ఉపశమనం కల్గిస్తుంది. ఆ ప్రాజెక్టును పూర్తి చేయాలి. దీనిపై కోస్తా ఆంధ్రుల భయాందోళనల్లో నిజమున్నట్లు కనిపిస్తోంది. తొలుత అనుకున్నట్లు పోలవరం ప్రాజెక్టులు నిర్మాణాన్ని పూర్తి చేయాలి. ముంపునకు గురయ్యే నిర్వాసితుల కుటుంబాలకు

పునరావాసం పునర్వసతి, జీవనోపాధి కల్పించాలి. నాగార్జునసాగర్‌తో సహా తమ నీటిపారుదల వ్యవస్థలు అత్యంత అధ్వాన్నంగా వున్నాయని కోస్తా ఆంధ్ర ప్రతినిధులు తెలియజేశారు. కాలువల నిర్వహణ సరిగా ఉంటేనే కాలువల ద్వారా సేద్యపునీటి సరఫరా సామర్థ్యం ఆధారపడి వుంది. అందువల్ల అన్ని కాలువల వ్యవస్థలను మెరుగుపరచాలి. రాష్ట్రంలో నీరు మరియు నీటిపారుదల వనరుల విషయమై కమిటీ క్షుణ్ణంగా పరిశీలించింది. వ్యవస్థాపర సంస్కరణలు చేపట్టడం ద్వారా సమస్యలను పరిష్కరించడం ఎంతో ముఖ్యం.

## నీటి నిర్వహణ సంస్థ లేదా బోర్డు

గతానుభవాలను బట్టి రాష్ట్రంలో కృష్ణా-గోదావరి తదితర నదీ పరీవాహక ప్రాంతాలు పర్యవేక్షణకు చట్టబద్ధ అధికారాలతో సాంకేతిక నీటి నిర్వహణ సంస్థను వేర్పాటు చేయడం అభిలషణీయం. ఈ సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నీటిని పంపిణీ చేయడం, ప్రాజెక్టుల రూపకల్పన, వాటికి సమంగా బడ్జెట్ నిధుల కేటాయింపు వంటి బాధ్యతలను నిర్వహిస్తుంది. చేపలు, రొయ్యల పెంపకానికి తగిన నీటి సరఫరా అయ్యేలా ఈ సంస్థ విధులు నిర్వహిస్తుంది. నీటిలభ్యత, నీటి కేటాయింపులు, విడుదల, నీటి పారుదల ప్రాజెక్టులకు అనుయాయులు, పర్యవేక్షణకు సంబంధించిన సాంకేతిక యాజమాన్య సమస్యలను ఈ సంస్థ పరిశీలిస్తుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య నీటి పంపిణీకి సంబంధించి తలెత్తిన విభేదాలు, వివాదాల చరిత్రను పరిశీలిస్తే మొత్తం రాష్ట్రానికి బృహత్తర ప్రణాళికను రూపొందించడం, నీటిని, సాగునీటి వనరులను గరిష్ఠంగా వినియోగించుకోవడానికి ప్రాంతీయ బృహత్తర ప్రణాళికలను రూపొందించడం నీటి నిర్వహణ సంస్థ ప్రధాన విధిగా వుంటుంది. నీటి యాజమాన్య సంస్థ చేసిన సిఫార్సులనే సాధారణంగా పాటించాల్సి ఉంటుంది. వీటిని ఆమోదించక పోవడానికి బలమైన కారణాలుంటేే తప్ప ప్రభుత్వం వెనక్కి తగ్గకూడదు. అలాంటి సందర్భాలలో ఆ సిఫార్సులను ప్రభుత్వం నీటియాజమాన్య సంస్థకు పున:పరిశీలనకై పంపవచ్చు. అమలులో ఉన్న సాంప్రదాయలు పద్ధతుల మేరకు సంస్థ వార్షిక నివేదికను రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టాలి.

భారత ప్రభుత్వంలో అదనపు కార్యదర్శి హోదాలో పనిచేసే నీటియాజమాన్య నిపుణుడిని డిప్యూటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం ఈ నీటి యాజమాన్య సంస్థ చైర్మన్‌గా నియమించాలి. (కేంద్ర జలసంఘంలో రెండోస్థానంలో లేదా ఆ సమానస్థాయిలో వున్నవారు) అయితే ఆ నిపుణుడు రాష్ట్రానికి చెందిన వ్యక్తి కారాదు. ఇద్దరు సాంకేతిక సభ్యులను కూడా నియమించాలి. వారిలో ఒకరు కృష్ణా బేసిన్, కృష్ణకు దిగువన పరీవాహక ప్రాంత సమస్యలను, మరొకరు గోదావరి బేసిన్ మరియు గోదావరికి ఉత్తరాన పరీవాహక ప్రాంత సమస్యలను పరిశీలిస్తారు. పాలన, ఫైనాన్స్, పర్యావరణ అంశాల పరిశీలనకు మరో ముగ్గురు సభ్యులను నియమించాలి. తెలంగాణా నుండి ఇద్దరు, కోస్తా ఆంధ్ర నుండి ఇద్దరు రాయలసీమ నుండి ఒకరిని ఈ సంస్థ 5 సభ్య స్థానాలకు రొటేషన్ పద్ధతిలో నియమించాలి. ఇలాంటి ప్రయోజనాలు, అవసరాలకోసమే దేశంలో భాక్రా.బి.యాస్ మేనేజ్‌మెంట్ బోర్డు, తుంగభద్ర బోర్డు, నర్మదా వ్యాలీ కార్పొరేషన్, బ్రహ్మపుత్ర బోర్డు, బేట్వానది బోర్డు వంటి ఎన్నో చట్టబద్ధ బోర్డులను నియమించారు.

ఇతర దేశాల్లో కూడా ఇలాంటి బోర్డులున్నాయి. అమెరికాలో టెన్నెసీ వ్యాలీ అథారిటీ, ఆస్ట్రేలియాలో ముర్రే- డార్లింగ్ అథారిటీ వంటివి అంతరాష్ట్ర నీటి నిర్వహణ, ప్రాజెక్టు ప్రణాళికల తయారీ, నిర్మాణం నీరు, విద్యుత్ వ్యవస్థల నిర్వహణ వంటి ఎన్నో బాధ్యతలను ఈ బోర్డులు నిర్వహిస్తున్నాయి.

ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేస్తే రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో ఈ బోర్డు అంతర్భాగమవుతుంది. భాక్రాబియాస్ బోర్డు, తుంగభద్రా బోర్డు వలె పనిచేస్తుంది.

## నీటి పారుదల/నీటి వనరుల అభివృద్ధి సంస్థ లేదా కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బలమైన నీటిపారుదల జలవనరుల అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసే విధంగా వ్యవస్థాపరమైన ప్రధానమార్పు చేయాలని కమిటీ సూచిస్తున్నది. ఈ అంశానికి సంబంధించి 1956 కంపెనీల చట్టం కింద ఏర్పాటైన ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ (మెమోరాండం మరియు ఆర్టికల్స్ అసోసియేషన్) నిబంధనలను కమిటీ జాగ్రత్తగా అధ్యయనం చేసింది. దీనిని ప్రాతిపదికగా చేసుకుని ఈ క్రింది మార్పులు చేయాలని కమిటీ సూచిస్తున్నది.

కార్పొరేషన్ విధులు : ప్రజారోగ్యం, పారిశ్రామిక అవసరాలకు సంబంధించిన నీటిపారుదల సామర్థ్యం పెంపుదలకు వీలుగా నీటిపారుదల సామర్థ్యం, సంబంధిత పనుల నిర్వహణకు విధులు ఇప్పటికే వున్నాయి. అయితే వక్రభాష్యాలకు వీలులేకుండా భూగర్భజలాలు, స్థానిక అవసరాలకు నీటి సరఫరా, వాననీటి నిల్వ, వాటర్‌షెడ్ ఆ నిర్వహణ, ఊట చెరువులు, చెరువులు పునరుద్ధరణ వంటివాటిని స్థానిక సంస్థలు, పంచాయితీలు, స్వచ్ఛందసంస్థల ద్వారా చేయించడం కోసం వాటిని నిర్దిష్టంగా ప్రస్తావించాలి. ఉపరితల జలాల నిర్వహణ, భూగర్భ జలాల నాణ్యత పరిరక్షణను రాష్ట్ర నీటి కాలుష్య మండలితో కలిసి వాటి మెరుగు లేదా అమలు చర్యలను సూచించడం వంటి అంశాలను కూడా నిర్దిష్టంగా పేర్కొనాలి. ఈ కార్పొరేషన్ అన్ని ప్రాజెక్టులను అమలు చేస్తుంది. నీటిపారుదల, స్థానిక ప్రజల అవసరాలు పరిశ్రమల వినియోగానికి నీటి సరఫరా వంటి అంశాలకు సంబంధించి ఈ సంస్థ ప్రభుత్వ అమలు విభాగంగా వ్యవహరిస్తుంది.

## సంస్థ డైరెక్టర్ల బోర్డు స్వరూపం

ఈ సంస్థకు ఒక ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రెండు లేదా మూడు ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే ఇద్దరు లేదా ముగ్గురు డైరెక్టర్లు, ఒక డైరెక్టర్-ఫైనాన్స్, మరో డైరెక్టర్ (పరిపాలన), ఇంకో డైరెక్టర్ (భూగర్భజలాలు), నీటి కాలుష్యం, నీటి నాణ్యత పరిశీలనకు మరో డైరెక్టర్ ఉండాలి. వీరితోబాటు నీటిపారుదల / జలవనరులకు సంబంధించిన భూగర్భ జలాలు, నీటి నాణ్యత మొదలైన అంశాలపై విషయ పరిజ్ఞానం గల నిపుణుల కొందరిని పార్ట్‌టైం లేదా పూర్తికాలం పనిచేసే డైరెక్టర్లుగా నియమించాలి. నీటి వినియోగదార్లు, నైపుణ్య సంస్థలకు చెందిన కొందరిని కూడా ఈ కార్పొరేషన్‌లో డైరెక్టర్లుగా తీసికోవాలి. పూర్తికాలం పనిచేసే ఒకే ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను నియమించాలనేదే కమిటీ అభిమతమైనప్పటికీ అవసరమైతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ కార్పొరేషన్‌కు ఎక్స్ అఫిషియో ఛైర్మన్‌గా ఉంటూ, పూర్తికాలం పనిచేసే మరో మేనేజింగ్ డైరెక్టర్‌ను నియమించవచ్చు. నీటిపారుదల, ఫైనాన్స్, విద్యుత్, సర్వీసులకు సంబంధించిన వారు ఎక్స్ అఫిషియో డైరెక్టర్లుగా ఉండవచ్చు. నీటి పారుదల విభాగం నుండే ప్రాజెక్టు డైరెక్టర్లను నియమించాలి. రొటేషన్ ప్రాతిపదికపైనే డైరెక్టర్ల నియామకం జరగాలి. నీటి నిర్వహణ సంస్థకు సూచించినట్లుగానే ఈ డైరెక్టర్లు రాష్ట్రంలోని 3 ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే విదంగా వుండాలి.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలోని కమిటీ సంస్థ సిఎండి/ మేనేజింగ్ డైరెక్టర్ల నియామకాలను సిఫార్సు చేయాలి. అందులో నీటి నిర్వహణ సంస్థ ఛైర్మన్ (కేంద్ర జల సంఘం అధికారి) సంబంధిత శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. అయితే ప్రభుత్వం ఇందుకోసం మరో స్వతంత్ర కమిటీని

కూడా ఏర్పాటు చేయవచ్చు. అదే విధంగా అవసరమైతే ప్రాంతాల వారీగా / నీటిపారుదల నీటి అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయవచ్చు.

## ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడంలో సమభావం పాటించడం

ప్రాజెక్టులకు అవసరమైన నిధులను ప్రణాళికా సంఘం ఆమోదించిన ప్రణాళికా వ్యయం నుండే చేయాలి. అదే ప్రధాన వనరు.

ఇదిగాక రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు, బాండ్ల ద్వారా సేకరించిన నిధులు మెమోరాండం, ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ (బి), (6) ప్రకారం కార్పొరేషన్ సేకరించిన నిధులు, నీటి సరఫరా ద్వారా లభించే ఆదాయం వంటివి ఇతర వనరులు మరిన్ని నిధులు అవసరమై బాండ్లు జారీ చేయవలసి వస్తే వాటికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఉండాలి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో సమతుల్య అభివృద్ధి జరిగేలా నిధుల వినియోగం జరిగేలా ప్రభుత్వం జాగ్రత్త వహించాలి.

రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని కార్పొరేషన్ తన బడ్జెట్‌ను రూపొందించాలి. టెక్నికల్ మేనేజ్‌మెంట్ బోర్డుకు సమర్పించాలి. ఆ రంగానికి మొత్తంగా కేటాయించిన నిధుల పరిధికి లోబడి టెక్నికల్ మేనేజ్‌మెంట్ బోర్డు ప్రాజెక్టుల వారీ, ప్రాంతాలవారీ బడ్జెట్‌ను ఆమోదిస్తుంది. అయితే బలమైన కారణాలుండే టెక్నికల్ మేనేజ్‌మెంట్ బోర్డు సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించజాలదు. ఆ సిఫార్సులను పున: పరిశీలన చేయవలసిన అవసరాన్ని, కారణాలు తెలియజేస్తూ బోర్డుకు తిప్పి పంపవచ్చు. ప్రాంతాల వారీగా ఏ మేరకు నిధులిస్తున్నారనే విషయం బడ్జెట్‌లో స్పష్టంగా ఉండాలి. కార్పొరేషన్ సాధారణంగా ఒక ప్రాంతానికి కేటాయించిన నిధులను మరో ప్రాంతానికి కేటాయించడం లేదా మళ్ళించడం చేయరాదు. అలా నిధుల మళ్ళింపు అత్యవసరమైతే టెక్నికల్ మేనేజ్‌మెంట్ బోర్డు ద్వారా ప్రభుత్వ దృష్టికి తేవాలి. టెక్నికల్ మేనేజ్‌మెంట్ బోర్డు సలహాను పరిగణనలోకి తీసుకుని కార్పొరేషన్ నిధులను సర్దుబాటు చేయవచ్చు.

## నిధులు సమంగా పంపిణీ చేయడానికి ప్రత్యామ్నాయ సంస్థాగత యంత్రాంగం

నీటివనరుల అభివృద్ధి సంస్థ, టెక్నికల్ మేనేజ్‌మెంట్ బోర్డుల ద్వారా వివిధ ప్రాంతాలకు సమంగా నీటి ప్రాజెక్టులకు నిధులు ఖర్చు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. అవసరమైతే ప్రభుత్వం ఇతర ప్రత్యామ్నాయాలను పరిశీలించవచ్చు. ఉదాహరణకు మహారాష్ట్రలో రాజ్యాంగం 371(2) అధికరణం ప్రకారం అలా నిధులు కేటాయింపు అధికారం రాష్ట్రపతికి దాఖలు పడింది. ఆ మేరకు గవర్నర్ వివిధ జిల్లాలకు నీటి పారుదల నిధులను సమానంగా పంపిణీ అయ్యేలా, నిర్దిష్ట కాలవ్యవధిలో అమలయ్యేలా చూస్తారు. కమిటీ ఆ ప్రక్రియను పరిశీలించింది. అందులో కొన్ని లోటుపాట్లున్నా మొత్తం మీద సమర్ధవంతంగా పనిచేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంకా నీటి సంబంధమైన అభివృద్ధికి సంబంధించి వివిధ ప్రాంతాలకు సమాన నిష్పత్తిలో నిధుల పంపిణీకి సంబంధించిన ఏ చట్టమైనా, అమలులో వున్న పద్ధతి వున్నా ఆ విధంగా కార్పొరేషన్‌కు నిధులందించే పద్ధతినైనా పరిశీలించి అమలు చేయవచ్చు.

పైన సూచించిన సంస్కరణలను అమలు చేయడం ద్వారా అభివృద్ధి, నీటి కేటాయింపులు మరియు నీటి పారుదల వనరుల పంపిణీకి సంబంధించి తల ఎత్తిన అసంతృప్తిని పూర్తిగా నిర్మూలించలేక పోయినా చాలా వరకు తగ్గించవచ్చు.

## ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ కోస్తా ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమ అనే మూడు ప్రాంతాలతో కూడిన వ్యవసాయ ప్రధానరాష్ట్రం. ఇది దక్షిణ భారత ద్వీపకల్పంలో 275,100 చ.కిమీ విస్తీర్ణం, 974 కి.మీ సముద్ర తీర ప్రాంతం గల అతిపెద్ద రాష్ట్రం. గోదావరి, కృష్ణా, పెన్న, వంశధార వంటి పెద్ద నదులు రాష్ట్రంలో ప్రవహిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ కోస్తా ఆంధ్రలో 9 జిల్లాలు, తెలంగాణలో 10 జిల్లాలు, రాయలసీమలో 4 జిల్లాలు కలిపి మొత్తం 23 జిల్లాలతో కూడిన రాష్ట్రం. 2001 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జనాభా 7 కోట్ల 62 లక్షలు. ఇది దేశ మొత్తం జనాభాలో 7.4%. దక్షిణాదిలో ఎక్కువ జనాభాగల రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

### వనరులు

వ్యవసాయం : ఆంధ్రప్రదేశ్ సారవంతమైన నేలలు, జీవనదులు, విలువైన ఖనిజ నిక్షేపాలు, సేద్యానికి అనువైన వాతావరణం గల రాష్ట్రం. వరి, పత్తి, పొగాకు,చెరకు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా వుంది. రాష్ట్రంలో మామిడి, ద్రాక్ష, పైనాపిల్, అరటి, జామవంటి పండ్లు గణనీయంగా ఉత్పత్తి అవుతున్నాయి. ఇవేగాక ధనియాలు, మిరప, అల్లం, పసుపు వంటి సుగంధ ద్రవ్యపంటల ఉత్పత్తి కూడా జరుగుతున్నది.

### అడవులు

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 61.99 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు ఆవరించి వున్నాయి. ఇది రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 22.4%. ఈ అడవులలో 45 శాతం తెలంగాణలో, 30 శాతం కోస్తా ఆంధ్రలో, 25% రాయలసీమ ప్రాంతంలో వున్నాయి.

### ఖనిజాలు

ఆంధ్రప్రదేశ్‌లో 48 రకాల ఖనిజ నిక్షేపాలున్నాయి. బెరైటీస్, మైకా, బొగ్గు, బాక్సైట్, సున్నపురాయి, గ్రానైట్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా వుంది. రాష్ట్రం 5 కోట్ల టన్నుల పారిశ్రామిక ఖనిజాలను ఉత్పత్తి చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రధాన ఖనిజ నిక్షేపాలు : 1 బొగ్గు 130,21 లక్షల టన్నులు, 2. సున్నపురాయి 304 లక్షల టన్నులు, 3. బాక్సైట్ 70 కోట్ల టన్నులు.

## హైదరాబాద్ రాష్ట్ర విద్యుత్ విభాగం

హైదరాబాద్ రాష్ట్ర విద్యుత్ విభాగాన్ని 1910లో నెలకొల్పారు. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో 10 కిలోవాట్ల డీజిల్ విద్యుత్ ఉత్పాదన మొదట యూనిట్‌ను ఏర్పాటు చేశారు. 1956 ఆఖరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు (ఎపిఎస్ఇబి)ను నెలకొల్పారు. 1955-56లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినపుడు థర్మల్ విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అయ్యేది. ఆనాడు విద్యుత్ సౌకర్యం గల గ్రామాలు కోస్తా ఆంధ్రలో 398, రాయలసీమలో 147, తెలంగాణలో 17 మాత్రమే ఉండేవి.

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, ప్రసార, పంపిణీలు మొత్తం మునుపటి ఎపిఎస్ఇబి ఆధ్వర్యంలోనే జరిగేవి. 1999లో ఎపిఎస్ఇబి స్థానంలో ట్రాన్స్‌కో, జెన్‌కో అనే కంపెనీలను ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో 2010 జూన్ 30 నాటికి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కోస్తా ఆంధ్రలో 5242.46 మెగావాట్లు, తెలంగాణాలో 4368 మెగావాట్లు, రాయలసీమలో 1840.14 మెగావాట్లు. ఆంధ్రప్రదేశ్

100 శాతం పల్లెలకు విద్యుత్ సౌకర్యం కల్పించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1997లో విద్యుత్ సంస్కరణలు తెచ్చి ఎపిఎస్ఇబిని ఉత్పత్తి,ప్రసార, పంపిణీ అనే 3 కంపెనీలుగా విడగొట్టింది. దీని ఆధారంగా "ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల బిల్లును 1998లో ఆమోదించగా అది 1999 ఫిబ్రవరి 1 నుండి అమలులోకి వచ్చింది. దరిమిలా ఎపిజెన్‌కో, ఎపిట్రాన్స్‌కో, డిస్కంలు, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఎపిఇఆర్‌సి)లు ఏర్పాటు చేశారు.

ఎపిఎస్ఇబి తన సొంత విద్యుత్ కేంద్రాల నుండి కరెంటు ఉత్పత్తి చేయడంతోబాటు, కేంద్ర విద్యుత్ ఉత్పాదన సంస్థల నుండి, ఇతర రాష్ట్రాల నుండి, సంయుక్త విద్యుత్ కేంద్రాల నుండి 1995 నుండి ప్రైవేటు విద్యుత్ సంస్థల నుండి విద్యుత్ సేకరిస్తూ వచ్చింది. గత 5 దశాబ్దాలలో ఎపిఎస్ఇబి ఎంతో అద్భుతమైన అభివృద్ధిని సాధించింది. ఎపిజెన్‌కో స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 8085.86 మెగావాట్లు. అందులో 31.03.2010 నాటికి 4382.5 మెగావాట్లు థర్మల్ విద్యుత్ కాగా, 3703.36 మెగావాట్లు జలవిద్యుత్. కేంద్ర సంస్థల నుండి 3048.54 మెగావాట్లు, సంయుక్త రంగం నుండి 273 మెగావాట్లు, ప్రైవేటు రంగం నుండి 3217.12 మెగావాట్ల విద్యుత్ లభిస్తున్నది. విద్యుత్, ప్రసార, పంపిణీ మార్గాలు 864064 కి.మీ వున్నాయి. రాష్ట్రంలో సరఫరా లైసెన్సు సంస్థలూ, ఎన్నో గ్రామీణ విద్యుత్ సహకార సంస్థలు పనిచేస్తున్నాయి.

రాష్ట్రం విద్యుత్ వ్యవస్థలో గణనీయమైన ప్రగతి సాధించినప్పటికీ కరెంటు కొరతను ఎదుర్కొంటున్నది. హెచ్.టి.పరిశ్రమలకు విద్యుత్ కోతలు అనివార్యమైనాయి. గరిష్ట విద్యుత్ వినియోగ వేళల్లో సరఫరాను క్రమబద్ధ చేయడంతో బాటు విద్యుత్‌రంగంలో సమస్యలకు మీటర్లు లేకుండా ఒకే ధరలో వ్యవసాయ వినియోగదార్లకు విద్యుత్ సరఫరా చేయడం కూడా ఓ ప్రధాన కారణం. పరిశ్రమలకు విద్యుత్ కోత కారణంగా పారిశ్రామిక వినియోగదార్లు సొంత విద్యుత్ ఉత్పాదనలపై అధికంగా ఆధారపడుతున్నారు. పరిశ్రమల రంగంలో 2009-10 నాటికి 1606 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నది. అది 3915 డబ్ల్యుటిఎస్‌కు (గిగావాట్ల గంటలు అది 10 లక్షల యూనిట్లకు) సమానం.

## గరిష్ట వినియోగ వేళలు : ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన పరిస్థితి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2009-10లో 10,880 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరిగింది. కాగా విద్యుత్ అవసరాలు 12010 మెగావాట్లు. ఆ విధంగా 1330 మెగావాట్ల కొరత (9.41%) ఉంది. 2009-10లో ఆంధ్రప్రదేశ్‌లో 79,201 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ వుండగా 74,859 మిలియన్ యూనిట్‌లు మాత్రమే సరఫరా చేయగలిగింది. ఆ విధంగా 4,342 మిలియన్ (-5.48%) యూనిట్‌ల కొరత వుంది.

## విద్యుత్ ప్రసార, పంపిణీ నష్టాలు

ఎపిట్రాన్స్‌కో తన విద్యుత్ ఉత్పాదన నెట్‌వర్క్‌ను ఆధునీకరించడానికి, విస్తరణకు గణనీయంగా పెట్టుబడులు పెడుతోంది. గణనీయంగా పెరిగిన లోడ్ వృద్ధిని తట్టుకోవడానికి వీలుగా అవసరాలను తీర్చడానికి వీలుగా పంపిణీ వ్యవస్థను గణనీయంగా విస్తరించారు. సరఫరాలో నాణ్యత, విశ్వసనీయతను పెంచడానికి చర్యలు తీసుకున్నారు. 1999-2000లో సబ్‌స్టేషన్ల సంఖ్యను 1996 కాగా 2009-10 నాటికి వాటిని 4086కు పెంచారు. 1999లో 186847 పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లుండగా, 2009-10 నాటికి ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను 737544కు పెంచారు. ఇన్నేళ్ళలో ఇంత భారీగా, నిరంతరాయంగా వృద్ధి జరుగుతున్నా అన్నిరకాల వినియోగ దార్లకు విద్యుత్ సరఫరాకు వీలుగా విద్యుత్ ప్రసార

పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయవలసి వుంది. మీటర్లు లేని వ్యవసాయ కనెక్షన్లు, వాణిజ్య, సాంకేతిక నష్టాలు తగ్గించడంలో ఇబ్బంది కల్గిస్తున్నాయి.

## పెట్టుబడి కార్యక్రమం

రాష్ట్రంలో విద్యుత్ రంగ మెరుగుదలకు అవసరమైన పెట్టుబడులు కార్యక్రమంలో కొంత భాగం అడాప్టబుల్ ప్రోగ్రాం లెండింగ్ (ఎపిఎల్) కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రుణాలుగా ఇవ్వడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. ఈ విధంగా లభించిన తొలి రంగాన్ని విద్యుత్ ప్రసార, పంపిణీ వ్యవస్థల పటిష్టతకు, సబ్‌స్టేషన్లలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపునకు వినియోగించారు.సబ్‌ట్రాన్స్‌మిషన్ మరియు పంపిణీ నెట్‌వర్క్‌లు, వినియోగదార్లకు మెరుగైన మీటర్ల అమర్పు, కమ్యూనికేషన్ వ్యవస్థకోసం ఆ రంగాన్ని వెచ్చించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన ఉత్పత్తికి మార్గాలు లేదా మూలాలు: రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ప్రధానమైన సహజ వనరులు నదులు, బొగు, సహజ వాయువు. నీటిపారుదల, విద్యుత్ ఉత్పత్తికి నదులు అత్యంత ముఖ్యమైన వనరులు ఆంధ్రప్రదేశ్ భూభాగంలో 17 చిన్న, పెద్ద నదులు ప్రవహిస్తున్నాయి. వీటిలో కృష్ణా, గోదావరి నదులు ప్రవహించే డెల్టా ప్రాంత భూములు ఎంతో సారవంతమైనవి. ఎన్నో పంటల సాగుతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే వ్యవసాయ ప్రధాన రాష్ట్రంగా అవిర్భవించదానికి దోహదం చేశాయి. వరి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రగామి.

కృష్ణా, గోదావరి నదులు పశ్చిమ కనుమలలో ఎత్తైన ప్రదేశంలో పుట్టి ఆంధ్రప్రదేశ్‌లో దిగువ భాగంలో తూర్పుదిశగా సముద్రంలో కలిసేందుకు వేగంగా ప్రవహిస్తాయి. తుంగభద్ర, కృష్ణా, గోదావరి నదులు సేద్యానికి సాగు నీరందిస్తున్నాయి. తవ్విన కాలువల ద్వారా ఈ నదీజలాలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భూములకు సేద్యం కోసం సరఫరా చేస్తున్నారు. సేద్యం కోసం అవసరమైన జలవనరుల నిల్వకోసం పెక్కు కృష్ణా-గోదావరి నదులపై నిర్మించిన పెక్కు ప్రాజెక్టులలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను కూడా నెలకొల్పారు. ఇంధన వనరులను పునరుత్పత్తి అయ్యేవి, కానివి అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. పునరుత్పత్తికి వీలుకాని ఇంధనాన్ని ఖనిజ తైలాలు, అణు ఇంధనం అనేవిగా వర్గీకరించవచ్చు.

## జలవిద్యుత్ డ్యాంలు, థర్మల్ ప్రాజెక్టులు

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన వనరులు నీరు, బొగ్గు, గాలి, సహజవాయువు, సౌరశక్తి వంటివి పుష్కలంగా వున్నాయి. థర్మల్ విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన బొగ్గునిక్షేపాలు తెలంగాణాలో వున్నాయి. వివిధ రకాల బొగ్గు వుంది. సల్ఫరత్ కూడిన శుద్ధంకాని బొగ్గును మండించినపుడు అది వాతావరణాన్ని కలుషితం చేస్తుంది. బొగ్గు నిక్షేపాలు విస్తారంగా వున్నందున తీయడం కొంత తేలికే గనుక మిగతా వాటితో పోలిస్తే చౌకగా లభిస్తుంది. కొంతబొగ్గు ఉపరితలానికి దగ్గరగా లభిస్తుంది. బొగ్గు ఘనపదార్థం గనుక రవాణా చేయడం సులువు. జలవిద్యుత్ ఉత్పాదనకు అవసరమైన జలవనరులు తెలంగాణాలో లభిస్తాయి. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సహజవాయువు కెజిబేసిన్‌లో లభిస్తుంది. విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన గాలి, సౌరశక్తి దాదాపు వెయ్యి కిలో మీటర్ల కోస్తా తీరం వెంబడి లభిస్తాయి.

తెలంగాణాలో సింగరేణి వద్ద బొగ్గు క్షేత్రాలున్నాయి. కోస్తా ఆంధ్రలోని కృష్ణా-గోదావరి బేసిన్‌లో సహజ వాయువు పుష్కలంగా లభిస్తుంది. అందువల్ల సహజ వాయువు ఆధారంగా ఎన్నో విద్యుత్ ఉ

త్పత్తి కేంద్రాలను ప్రారంభించారు. మరెన్నో గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు కూడా రానున్నాయి. రాయలసీమలో బొగ్గు, సహజ వాయు నిక్షేపాలేవీ లేవు. భారత ప్రభుత్వం సింగరేణి బొగ్గును భారత ప్రభుత్వం తెలంగాణాలోని కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రానికి (కెటిపిఎస్) కోస్తా ఆంధ్రలో విజయవాడలోని థర్మల్ విద్యుత్ కేంద్రానికి కేటాయించింది. సింగరేణిలో బొగ్గు తగినంతగా లేనందున, అదీగాక అది ఖరీదైంది గనుక ఈ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును ఒరిస్సాలోని తల్చార్ బొగ్గుగనుల నుండి తెప్పిస్తున్నారు. ఈ థర్మల్ కేంద్రాలకు అవసరమైన కొంత బొగ్గును విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లాలో 2100 మెగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. సముద్రతీరం వెంబడిగల పెద్ద రేవుల ద్వారా బొగ్గు, సహజవాయువును, విద్యుత్ ఉత్పాదన మరియు ప్రసార పరికరాలను దిగుమతి చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 3 ప్రాంతాలలో సమన్వయ పూర్వకమైన సమతుల్యమైన విద్యుత్ రంగ అభివృద్ధి జరగాలంటే కృష్ణా, గోదావరి బేసిన్ నుండి సహజవాయువును చమురును సరఫరా చేయడం, సింగరేణి, తల్చార్ గనుల నుండి బొగ్గును తరలించడం, శ్రీశైలం, నాగార్జున సాగర్‌ల నుండి జలవిద్యుత్‌ను సరఫరా చేయడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

## థర్మల్ విద్యుత్

తెలంగాణాలోని థర్మల్ విద్యుత్ కోస్తా ఆంధ్రతో దాదాపు సరిసమానంగా వుంది. తెలంగాణాకు బొగ్గు గనులున్నా, కోస్తా ఆంధ్ర, సింగరేణి, తల్చార్ గనుల నుండి, విదేశాల నుండి బొగ్గు దిగుమతి చేసుకుని థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అయితే కోస్తా ఆంధ్రతో పోలిస్తే తెలంగాణా ప్రాంతంలో స్థాపిత విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం ఎక్కువ. అయితే తెలంగాణాకు అవసరమైన విద్యుత్‌ను పూర్తిగా ఎపిట్రాన్స్ మిషన్ గ్రేడ్‌నుండి సరఫరా చేస్తున్నందున అదేమంత ఆందోళనకర విషయం కాదు.

## జలవిద్యుత్

రాష్ట్రంలోని మొత్తం 3 ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణాలో జలవిద్యుత్ ఉత్పాదన సామర్థ్యం (68శాతం) అధికం. 2 పెద్ద నదులు కృష్ణా, గోదావరి తెలంగాణాలోనే తొలుత ప్రవేశించడం, రాయలసీమ, కోస్తా ఆంధ్రలకంటే తెలంగాణా ఎత్తైన ప్రదేశంలో ఉండటం వల్ల జలవిద్యుత్ ఉత్పత్తికి భౌగోళికంగా అనువైందిగా వుండటమే ఇందుకు కారణం. అందువల్ల నీరు పుష్కలంగా వున్నందున తెలంగాణలో జలవిద్యుత్ కేంద్రాలు ఏర్పాటుకు అనుకూలం.

## విద్యుత్ సహజ వాయువు

తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో సహజ వాయువు ఆధారిత విద్యుత్ కేంద్రాలు లేవు. కృష్ణా-గోదావరి బేసిన్‌లో, సహజవాయువు పుష్కలంగా లభిస్తున్నందున ప్రైవేటు రంగంలో గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలను నెలకొల్పడానికి ప్రోత్సాహం లభించింది. వేమగిరి సిసిపిపి, జేగురుపాడు సిసిపిపి (కంబైన్డ్ సైకిల్ పవర్ ప్రాజెక్టు), (జివికె విస్తరణ) విద్యుత్ ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించడానికి సిద్ధమై సహజ వాయువు కేటాయింపులకోసం నిరీక్షిస్తున్నాయి. గౌతమి, కోనసీమ విద్యుత్ కేంద్రాలు దాదాపు పూర్తయి, ఎప్పుడైనా ప్రారంభించడానికి సిద్ధంగా వున్నాయి.అయితే గ్యాస్ సరఫరాలో భద్రతపై ఆందోళనలు అధికమైనందున గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాల ఏర్పాటు ఉత్సాహంపై నీళ్ళు చల్లినట్లైంది. దేశ ఆర్థిక వ్యవస్థలో గ్యాస్‌కు డిమాండ్ పెరుగుతున్నది. అయితే దేశీయ ఉత్పత్తి డిమాండ్‌కు తగినంతగా లేదు. దేశంలో 2003-04 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వార్షిక గ్యాస్ ఉత్పత్తి 33

బిలియన్ ఘనపు మీటర్లు. విద్యుత్‌రంగం ఇప్పటికే గ్యాస్ సరఫరా కొరతను ఎదుర్కొంటున్నది. దేశంలో 38 గ్యాస్ ఆధారిత దేశంలో 38 గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు స్థాపిత ఉత్పాదక సామర్థ్యం 9536 మెగావాట్లు కాగా గ్యాస్ కొరతవల్ల 2004-05లో 58 శాతం (పిఎల్‌ఎఫ్) సామర్థ్యంతో మాత్రమే పనిచేయగలుగు తున్నాయని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

గ్యాస్ ఆధారంగా విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు పెంచడానికి ఆ రంగం 3 పెనుసవాళ్ళను ఎదుర్కొంటోంది. అవి.

1. సహజ వాయువునకు తగినంతగా సరఫరా చేయడానికి అనువైన మౌలిక సదుపాయాలు లేకపోవడం.
2. ఈ రంగానికి తోడ్పడేందుకు న్యాయపరమైన నియంత్రణ చట్టం లేకపోవడం
3. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన గ్యాస్ లభ్యత, ధరలపై నిరంతర ప్రశ్నలుత్పన్నమవడం.

గ్యాస్ సరఫరా కంటే డిమాండ్ అధికంగా ఉన్నందున గ్యాస్ లింకేజెస్ కమిటీ సిఫార్సుల మేరకే ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేస్తున్నది. పెట్టుబడి-ప్రణాళికా ప్రక్రియలో భాగంగానే విద్యుత్ కేంద్రాలకు గ్యాస్ సరఫరా పరిమాణాన్ని జిఎల్‌సి నిర్ణయిస్తున్నది.

## విద్యుత్-డీజిల్ మరియు సాంప్రదాయేతర ఇంధన వనరులు

కోస్తా ఆంధ్రలో అతికొద్ది పరిమాణంలో మాత్రమే డీజిల్ ఉత్పాదన సామర్థ్యం వుంది. అది 37 మెగావాట్లు మాత్రమే. డీజిల్ విద్యుత్ కేంద్రాలు వ్యయం అధికంగా ఉండటమే ఇందుకు కారణం. కోస్తా ఆంధ్రలో 444 మెగావాట్లు, తెలంగాణాలో 159 మెగావాట్లు, రాయలసీమలో 210 మెగావాట్ల మేర సాంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తి జరుగుతున్నది.

## 12వ ప్రణాళికలో అదనపు సామర్థ్యం, విద్యుత్ ప్రసారం-పంపిణీ

విద్యుత్ ఉత్పాదన సాధారణంగా 11 కెవి నుండి 18 కెవిల మధ్య ఉంటుంది. విద్యుదుత్పత్తి కేంద్రంలోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా వోల్టేజీని 132 కెవి/220 కెవి 400 కెవిల స్థాయి వరకు పెంచుతారు. ఈ విధంగా పెంచిన వోల్టేజీని విద్యుత్ కేంద్రాల నుండి ట్రాన్స్ మిషన్ గ్రిడ్‌కు తరలించడానికి ఉపయోగిస్తారు. ట్రాన్స్‌మిషన్ గ్రిడ్ 1. రాష్ట్ర ట్రాన్స్‌మిషన్‌గ్రిడ్ 2. కేంద్ర ట్రాన్స్‌మిషన్ గ్రిడ్ అని రెండు విధాలుగా వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు రంగం విద్యుత్ కేంద్రాలుత్పత్తి చేసిన విద్యుత్‌ను రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. కేంద్ర రంగంలోని విద్యుత్ కేంద్రాలు ఉత్పత్తి చేసిన కరెంటును కేంద్ర ట్రాన్స్‌మిసన్ గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. అక్కడి నుండి రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ గ్రిడ్‌కు కలుపుతారు. విద్యుత్ ఉత్పాదనను తలపెట్టినపుడే ట్రాన్స్‌మిషన్‌లు మరియు సబ్‌స్టేషన్ల ఏర్పాటును కూడా ఏకకాలంలో చేపడతారు. రాష్ట్ర, కేంద్ర రంగ విద్యుత్ కర్మాగారాలకు ఆమోదం లభించిన వెంటనే రాష్ట్రం లేదా విద్యుత్ శాఖలు అందుకు తగిన ప్రసార-పంపిణీ వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించినప్రతిపాదనలను ట్రాన్స్‌మిషన్ విభాగానికి సమర్పిస్తారు. కొత్త విద్యుత్ కేంద్రాలు ఉత్పత్తి ప్రారంభించే సమయానికల్లా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌లతో సంధానమయ్యేలా కేంద్ర, రాష్ట్ర మరియు కేంద్ర ట్రాన్స్‌మిషన్ సంస్థ (పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లు తగు ఏర్పాట్లు చేస్తాయి.

విద్యుత్‌కు గిరాకీ పెరుగుతున్నందున ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో వున్న భారీ విద్యుత్ కేంద్రాలతో బాటు రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థలు పరిమాణంలో సంక్లిష్టతలు పెరుగుతున్నాయి. భారీ

సూపర్ థర్మల్ విద్యుత్ స్టేషన్లు ఉత్పత్తి ప్రారంభించినందున ప్రసార వోల్టేజి స్థాయిలు 400 కెవి. ఆపైన పెరిగాయి. ఏపిట్రాన్స్‌కో రాష్ట్రంలోని ఎపిసిపిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్,ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిఎన్ పిడిసిఎల్ అనే 4 విద్యుత్ కంపెనీలకు విద్యుత్ పంపిణీ చేస్తున్నది. ఏపిట్రాన్స్‌కో 132 కెవిస్థాయిలో విద్యుత్ పంపిణీ చేస్తున్నది. విద్యుత్ పంపిణీ కంపెనీలు తమ అవసరాలకు అనుగుణంగా ఏ వనరు నుండి అయినా విద్యుత్‌ను కొనుగోలు చేయవచ్చు.

ఎపిగ్రిడ్ సగటున రోజుకు 213.53 ఎంయు ఇంధన, అవసరాలు తీర్చగలుగుతున్నది. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు సైతం విద్యుత్ ప్రసారం పంపిణీ చేయగల నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్ కలిగి వుంది.

## మూడు ప్రాంతాల్లో పటిష్టంగా విద్యుత్ ప్రసార, పంపిణీ వ్యవస్థలు

ఎపి ట్రాన్స్‌కో విద్యుత్ పంపిణీ లోడ్‌ను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తోంది. ఆ అధ్యయనం ఆధారంగా ఎక్కడైనా విద్యుత్ పంపిణీని పటిష్టం చేయవలసి ఉంటే వెంటనే అందుకు తగు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నది. కెపాసిటర్ బ్యాంకులను నెలకొల్పి పని చేయిస్తున్నది. విద్యుత్ ప్రసార వ్యవస్థ గురించి ముఖ్యాంశాలు.

ఎపిగ్రిడ్ 400 కెవి సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ల లైన్‌లద్వారా ఇరుగుపొరుగు రాష్ట్రాలలో సంధానమై వుంది. చినకంపల్లి నుండి చెన్నై నగరానికి (తమిళనాడు) 400 కెవిలైన్‌లు మరియు చినకంపల్లి నుండి కర్నాటకలోని కోలార్‌కు 400 కెవిలైన్‌లు. గుత్తి (పిజిసిఐఎల్) నుండి కర్నాటకలోని హుడీ, నెలమంగళకు 400 కెవిలైన్. గుత్తినుండి రాయచూర్ (కర్నాటక)కు 400 కెవిలైన్లు. రామగుండం నుండి మహారాష్ట్రలోని చంద్రాపూర్ (సెంట్రల్ గ్రిడ్‌కు 400 కె.వి.) బ్యాక్ టు బాక్ కనెక్షన్. గాజువాక (పిజిసిఐఎల్) నుండి ఒరిస్సాలోని ఏపూర్ (తూర్పుగ్రిడ్)కు 400 కెవి బ్యాక్‌టుబ్యాక్ కనెక్షన్.

## ఇంధనం ఆదా

విద్యుత్‌ను ఆదా చేయడానికి డిస్కంలు చర్యలు తీసుకుంటున్నాయి. డిస్కంలు తీసుకునే చర్యలకు బద్ధులు కావాలని వ్యవసాయ వినియోగదారులను ఒప్పించడం జరుగుతుంది. వివిధ సర్కిల్‌లో ప్రధాని బచత్ దీపం పథకం క్రింద ప్రయోగాత్మక ప్రాతిపదికపైన 6.5 లక్షల గృహ వినియోగదార్లకు సిఎఫ్ఎల్ బల్బుల పంపిణీ చేశారు. డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్ల (డిటిఆర్) ఎల్‌వి వైపు కెపాసిటర్ల ఏర్పాటు చేశారు. గరిష్ట వినియోగ (పీక్‌లోడ్) డిమాండ్‌ను తగ్గించడం ద్వారా విద్యుత్ ఆదాను లాభాలను సాధించారు.

## వ్యవసాయరంగం

రాష్ట్రంలో ప్రస్తుతం వ్యవసాయ సర్వీసులకు రెండు దశలుగా 3-4 గంటలు విద్యుత్ సరఫరా జరుగుతున్నది. సేద్యానికి రెండుసార్లు 3 ఫేస్ విద్యుత్ సరఫరా చేయాలనే ప్రభుత్వ విధానానికి అనుగుణంగా పగలు 4 గంటలు, రాత్రివేళ 3 గంటలపాటు విద్యుత్ సరఫరా జరుగుతున్నది. ఎత్తిపోతల పథకాలకు కామన్ ఫీడర్‌లున్నచోట్ల 7 గంటలపాటు 3 ఫేస్ కరెంట్ సరఫరా చేస్తున్నారు. వాటికోసం ఏర్పాటు చేసిన ఫీడర్ల ద్వారా ఎత్తిపోతలకు 16 గంటల విద్యుత్ సరఫరా అవుతున్నది. పట్టణాలతో బాటు గ్రామాలకు కూడా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయగలమని డిస్కంలు ఆశాభావంతో వున్నాయి. 14.05.2004 నుండి అర్హులైన వ్యవసాయదార్లందరికీ ఉచిత విద్యుత్ సరఫరా జరుగుతున్నది. ఇందుకు అవసరమైన సబ్సిడీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరిస్తున్నది. వచ్చే

ఐదేళ్ళలో 40 లక్షల ఎకరాలకు ఉపరితల నీటిపారుదల వర్తింపజేసినపుడు విద్యుత్ వినియోగం, ఆ మేరకు అదనపు సబ్సిడీ భారం పెరుగుతుంది.

## హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ప్రత్యేక చర్యలు

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో పీక్ విద్యుత్ డిమాండ్ 1500 మెగావాట్లు. 2019-20 నాటికి ఈ డిమాండ్ 5000 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా. జపాన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, తదితర ఆర్థిక సహాయ సంస్థల నుండి అందిన ఆర్థిక సాయంతో ఎపిట్రాన్స్‌కో ప్రస్తుతం హైదరాబాద్‌లో విద్యుత్ మెరుగుదల పథకాన్ని అమలు చేస్తున్నది. ఈపథకానికి రూ.1265 కోట్లు మంజూరయ్యాయి. 400 కెవి రింగ్ మెయిన్ ట్రాన్స్‌మిషన్ పథకం కొరకు 2010జూన్‌లో మల్కారంలో రూ.72 కోట్ల ఖర్చుతో 400 కెవి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఎద్దుమైలారంలో రూ.115 కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న 400 కెవి సబ్ స్టేషన్ 2011 డిసెంబర్ నాటికి పూర్తవుతుంది.

ఈ రెండు సబ్‌స్టేషన్లు మామిడిపల్లిలో 220 కెవి మరియు ఘన్‌పూర్‌లో 132 కెవి సబ్‌స్టేషన్ల ద్వారా 400 కెవి సబ్‌స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించి సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తాయి.

సరఫరాలో విశ్వసనీయతకొరకు 220 కెవి మరియు 132 కెవి వ్యవస్థలలో గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్స్ (జిఐఎస్) సబ్‌స్టేషన్లు, ఎక్స్ఎల్‌పిఇ (క్రస్ లింక్‌డ్ పాలిథిన్ కేబుల్) అండర్‌గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటు జరుగుతున్నది.

హైదరాబాద్ నగరంలో విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ మరియు సరఫరాను మెరుగుపరచడానికి కొన్ని సబ్‌స్టేషన్ల నిర్మాణం అవసరం. జంటనగరాల పరిసర ప్రాంతాలలో ఎన్నో నివాస, వాణిజ్య సముదాయాలు నిర్మాణంలో వున్నందున, ఎస్ఇజడ్‌లు, ఐ.టి. పరిశ్రమలు ఏర్పాటవుతున్నందున వాటి విద్యుత్ అవసరాలు తీర్చడానికి, నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సబ్‌స్టేషన్లు, కొత్త లైన్‌లు అవసరం.

## వివిధ సంఘాలు ప్రస్తావించిన సమస్యలు

కమిటీ (సిసిఎస్ఎపి) ప్రజలను కలుసుకుని వారి అభిప్రాయాలు తెలుసుకున్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాజెక్టుల ఏర్పాటులో వివక్ష జరిగిందని, తెలంగాణాలో ప్రాజెక్టుల అమలులో జాప్యం జరిగిందని, సింగరేణి బొగ్గును తెలంగాణా వెలుపల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వాడటం జరిగిందని, విద్యుత్ ప్రాజెక్టులు, పథకాలతో స్థానికులకు ఉద్యోగాలు చాలా తక్కువగా ఇచ్చారని ఇలా ఎన్నో ఫిర్యాదులు అందాయి.

ఈ సమస్యలన్నీ సాంకేతిక పరమైనవి. విద్యుదుత్పత్తి సరఫరా, పంపిణీకి సంబంధించిన ఆ సమస్యలన్నింటినీ పరిశీలించి నిజాలు, నిగ్గు తేల్చడానికి కమిటీ భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ విద్యుత్ సంస్థ మాజీ చీఫ్ ఇంజినీర్ శ్రీ వి.బి.గుప్తాను నియమించింది. రాష్ట్రంలోని 3 ప్రాంతాల విషయంలో ఈ సమస్యల పట్ల ఏమైనా వివక్ష జరిగిందా అనే అంశాన్ని పరిశీలించమని ఆయనను కోరాం. శ్రీ గుప్తా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలు, వివిధ ప్రతినిధి వర్గాలు కమిటీకి అందజేసిన అనేక వినతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వివిధ ప్రాజెక్టులను కూడా సందర్శించి సాంకేతిక నిపుణులతో, ఇతరులతో ఈ అంశాల గురించి చర్చించారు.

తెలంగాణా ప్రాంతంలో విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన బొగ్గు వనరు పుష్కలంగా వుందనే సంగతి నిజమే. ఎంత ఖర్చవుతుంది/ ఎంత లాభదాయకంగా వుంటుందనే అంశాల ప్రాతిపదికపై ఈ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని నిర్ణయిస్తారు.

ప్రస్తుత విధానం మేరకు విద్యుత్ ప్రాజెక్టుల (జల, విద్యుత్)కు కేంద్ర విద్యుత్ సంస్థ అనుమతి అవసరం. రాష్ట్రప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలను కేంద్ర విద్యుత్ సంస్థ ఆర్థిక-సాంకేతిక కోణంలో పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో చర్చించాలి. సాంకేతిక, ఆర్థిక ప్రాతిపదిక లేదా పరిమితుల ఆధారంగా నిష్పాక్షిక దృష్టితో నిర్ణయం తీసుకుంటుంది.

## విద్యుత్ రంగం కీలక సూచికలు, ఎల్‌టి సర్వీసుల వినియోగదార్ల సంఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌టి విద్యుత్ వినియోగదార్లకు సంస్థకు సంబంధించి 1971-72 నుండి 2008-09 వరకు గల సర్వీసుల వివరాలను పరిశీలిస్తే ఎన్నో ఏళ్ళుగా ఇళ్ళకు విద్యుత్ సౌకర్యం కల్గించినట్లు వెల్లడైంది. తెలంగాణాలో 1971-72లో 4.19 లక్షలుగా వున్న ఎల్‌టి సర్వీసులు 2008-09 నాటికి 85.62 లక్షలకు పెరిగాయి. రాయలసీమలో 2.91 లక్షల నుండి 35.76 లక్షలకు, కోస్తా ఆంధ్రలో ఎల్‌టి విద్యుత్ సర్వీసులు 5.30 లోల నుండి 85.31 లక్షలకు పెరిగాయి. ఎల్‌టి సర్వీసుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు ఈ గణాంకాలను బట్టి స్పష్టమవుతున్నది. ఆంధ్ర, రాయలసీమలతో పోలిస్తే ఎల్‌టి సర్వీసుల సంఖ్య తెలంగాణాలో గణనీయంగా పెరిగినట్లు విదితమవుతున్నది.

## ఎల్‌టి వినియోగదార్ల విద్యుత్ వినియోగం : మిలియన్ కెడబ్ల్యుహెచ్ (ఎమ్‌యుఎస్)లలో

ఆంధ్రప్రదేశ్‌లో ఎల్.టి. విద్యుత్ వినియోగదార్లు ఏ మేరకు విద్యుత్ వాడారని తెలుసుకోవడానికి 1971-72 నుండి 2008-09 వరకు తీసుకున్న గణాంకాలు ఎంతో ముఖ్యమైనవి. తెలంగాణాలో 1971-72లలో 351 మిలియన్ యూనిట్లుగా వున్న ఎల్‌టి విద్యుత్ వినియోగం 2008-09 నాటికి 18342 మిలియన్ యూనిట్లకు పెరిగింది. రాయలసీమలో 250 మిలియన్ యూనిట్‌ల నుండి వినియోగం 6132 మిలియన్ యూనిట్లకు, కోస్తా ఆంధ్రలో 443 మిలియన్ యూనిట్‌ల నుండి 10418 యూనిట్‌లకు పెరిగింది. ఈ వివరాలను బట్టి తెలంగాణాలో విద్యుత్ వినియోగం అద్భుతంగా పెరిగిన విషయం, ఇతర రెండు ప్రాంతాల కంటే అధికంగా వున్న విషయం స్పష్టమవుతున్నది.

## హెచ్‌టి వినియోగదార్ల విద్యుత్ వినియోగం మిలియన్ యూనిట్లలో

రాయలసీమ, కోస్తా ఆంధ్రలతో పోలిస్తే తెలంగాణాలో 2008-09లో పారిశ్రామిక వాడకం దార్ల విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో) బాగా పెరిగినట్లు తేలింది. ఇతర ప్రాంతాలలో క్రమంగా హెచ్.టి. వాడకం దార్ల విద్యుత్ వినియోగం పెరుగుతున్నది. 2008-09లో హెచ్.టి. కనెక్షన్లకు ఇటీవల గిరాకీ బాగా పెరిగినట్లు, ఇది ఇలాగే కొనసాగితే పారిశ్రామికీకరణలో తెలంగాణా అద్భుత పురోగతి సాధించగలదని వెల్లడవుతుంది.

తెలంగాణా ప్రాంతంలో 1971-72లో 770 మెగా వాట్లుగా వున్న ఎల్‌టి, మరియు హెచ్‌టి విద్యుత్ వినియోగం 2008-09 నాటికి 16739కి పెరిగింది. రాయలసీమలో 474 మెగావాట్ల నుండి 5402 మెగావాట్లకు, కోస్తా ఆంధ్రలో 949 మెగావాట్ల నుండి 16203 మెగావాట్లకు వినియోగం పెరిగింది. 1981-82 తర్వాత రాయలసీమ, కోస్తా ఆంధ్రలతో పోలిస్తే తెలంగాణా ప్రాంతంలో ఎల్‌టి.హెచ్‌టి సర్వీసుల ద్వారా విద్యుత్ వినియోగం అత్యధికంగా ఉన్నట్లు స్పష్టంగా తేలుతున్నది.

ఇతర ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణలోనే విద్యుత్‌కు గిరాకీ అధికంగా వున్నట్లు, ఆ గిరాకీ మేరకు విద్యుత్‌శాఖ సరఫరా చేస్తున్నట్లు విదితమవుతున్నది.

రాయలసీమ, కోస్తా ఆంధ్రలతో పోలిస్తే తెలంగాణ వ్యవసాయ వాడకం దార్ల విద్యుత్ వినియోగం అత్యధికంగా ఉంది. దీనిని బట్టి రాయలసీమ, కోస్తా ఆంధ్రలతో పోలిస్తే తెలంగాణాలో సేద్యపు అవసరాలకు గరిష్టంగా కరెంటు వాడుతున్నట్లు తేలుతున్నది.

ఈ వివరాలన్నీ పరిశీలిస్తే 1971 నుండి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయానికి విద్యుత్ వాడకం పెరుగుతున్నట్లు విదితమవుతున్నది. ఆ వాడకం 1981 తరువాత 2008-09 వరకు చాలా అధికంగా వుంది. కోస్తా ఆంధ్ర, రాయలసీమలతో పోలిస్తే తెలంగాణాలో సేద్యపు అవసరాలకు కరెంటు వాడకం అత్యధికంగా కన్పిస్తున్నది.

## 2010 నాటికి ప్రాంతాల వారీగా సబ్‌స్టేషన్ల సంఖ్య

రాయలసీమ, కోస్తా ఆంధ్రలతో పోలిస్తే 400 కెవి, 220 కెవి, 132 కెవి, మరియు 33 కెవి సబ్‌స్టేషన్ల సంఖ్య తెలంగాణాలోనే అత్యధికం. వినియోగదార్లకు సంరఫరాకు గాను తెలంగాణాలో విద్యుత్ సరఫరా పంపిణీ మెరుగైనరీతిలో వున్నట్లు తెలుస్తున్నది.

కోస్తా ఆంధ్ర, రాయలసీమలతో పోలిస్తే విద్యుత్ పంపిణీకి అవసరమైన ప్రస్తుత డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య తెలంగాణాలోనే (2009-10 నాటికి) అత్యధికం. తెలంగాణాలో ఆ ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య 296522, కోస్తా ఆంధ్రలో, రాయలసీమలో 208757.

హైదరాబాద్ నగరాన్ని మినహాయించి ఇతర ప్రాంతాలతో తెలంగాణాను పోల్చినపుడు విద్యుత్ వినియోగం వేరుగా వుంది. హైదరాబాద్‌తో కలిసి తెలంగాణాలో తలసరి విద్యుత్ వినియోగం 999 యూనిట్లు (కెడబ్ల్యుహెచ్) హైదరాబాద్ మినహాయించి ఇతర తెలంగాణా ప్రాంతంలో తలసరి విద్యుత్ వాడకం 1445.6 (కెడబ్ల్యుహెచ్). తెలంగాణాలో గొట్టపు బావుల ద్వారా సేద్యం ఎక్కువ గనుక విద్యుత్ వినియోగం ఎక్కువ.

## బోరు బావుల కింద నీటి పారుదల మరియు విద్యుత్ వినియోగం

సీమ ఆంధ్రతో పోలిస్తే తెలంగాణాలో గొట్టపు బావులు అధికం సీమ ఆంధ్రతో పోలిస్తే తెలంగాణాలో బోరు బావులకు విద్యుత్ వినియోగం 3000 మిలియన్ యూనిట్లు అధికం.

## విద్యుత్ రంగంలో ఉద్యోగాలు

విద్యుత్ రంగంలో తమకు ఉద్యోగావకాశాలు/ ఉపాధి లేవని కమిటీకి ఫిర్యాదులందాయి. కమిటీ సంబంధిత సమాచార, గణాంకాలను పరిశీలించింది. ఎపిజెన్‌కో ఉత్పత్తి కేంద్రాలు/కోస్తా ఆంధ్ర, తెలంగాణా ప్రాంత ప్రధాన కేంద్రాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య దాదాపు సమానంగా వుంది. రాయలసీమ ప్రాంత ఉద్యోగుల సంఖ్య తక్కువ. జిల్లాలు, జనాభా తక్కువ గనుక. ఉద్యోగాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానం ప్రకారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌రంగంలో కార్మికుల నియామకం సర్కిల్ (జిల్లాస్థాయిలో లేదా పవర్‌హౌస్ యూనిట్ ప్రాతిపదికగా జరుగుతున్నది. వీరిలో 90% స్థానిక అభ్యర్థులే. 2008 నుండి రాష్ట్రంలో 6 జోన్‌లను దృష్టిలో ఉంచుకుని 610 జీవో ప్రకారం అసిస్టెంట్ ఇంజనీర్ తత్సమాన మోదా ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయి. 610 జీవో ప్రకారం 80 శాతం ఉద్యోగాలు స్థానిక అభ్యర్థులకో, మిగతా 20శాతం స్థానికేతర అభ్యర్థులకో భర్తీ

అవుతున్నాయి. మంజూరైన ఉద్యోగాలు, ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తదితర వివరాలు పరిశీలిస్తే తెలంగాణాలోనే స్థానిక అభ్యర్థుల నియామకం అత్యధికం. విద్యుత్ రంగానికి సంబంధించిన వివిధ సూచనలను విశ్లేషిస్తే ఇతర రెండు ప్రాంతాలతో బాటు తెలంగాణాలో విద్యుత్‌రంగం గణనీయమైన పురోగతి సాధించిందని, తెలంగాణాపట్ల ఎలాంటి వివక్ష లేదని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గానీ లేదా విద్యుత్ ఉత్పత్తి ప్రసార, పంపిణీని పర్యవేక్షించే సంస్థలకు తెలంగాణా, రాయలసీమ, కోస్తా ఆంధ్రలపై ఎలాంటి వివక్ష లేదని వెల్లడైంది.

కోస్తా ఆంధ్రలో వలె కాకుండా తెలంగాణాలో బొగ్గు నిక్షేపాలు ఎక్కువ. దాదాపు 1000కి.మీ సముద్ర తీరం గల కోస్తా ఆంధ్రలో చమురు, సమజవాయు నిక్షేపాలు అధికం. రాయలసీమ పరిస్థితి అధ్వాన్నం. ఆయా ప్రాంతాలకు సహజంగా సంక్రమించిన ప్రకృతి వనరులు, సౌకర్యాల ఆధారంగా అభివృద్ధి కోరాలి. భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర విద్యుత్ సంస్థ, సాంకేతిక తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించాకే థర్మల్ జల విద్యుత్, గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలను 3 ప్రాంతాలలో నెలకొల్పడానికి అనుమతించారు. 3 ప్రాంతాలు నీటిపారుదల జలవిద్యుత్ ఉత్పాదనకు కృష్ణా, గోదావరి జలాలను వాడుతున్నాయి.

రాష్ట్రంలో విద్యుత్‌రంగ అభివృద్ధికి ఎపిఎస్ఇబి/ఎపిజెన్‌కోలు బాధ్యత వహిస్తున్నాయి. విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు నిష్పాక్షికంగా స్థలాల ఎంపిక జరుగుతున్నది. తగినంత నీరు, ఇంధనం లభిస్తుందనే గ్యారంటీ వుంటేనే విద్యుత్ కేంద్రాలకు స్థలాల ఎంపిక జరుగుతున్నది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణా ప్రాంతంలో విద్యుత్ వినియోగం ఎక్కువ. దీన్ని బట్టి తెలంగాణా పురోభివృద్ధి హోదా తెలుస్తోంది. బలమైన ప్రసార, పంపిణీ నెట్‌వర్క్ ద్వారా తెలంగాణా ప్రాంతంలో ప్రజలకు విద్యుత్ అందుబాటులో వున్నట్లు దీనిద్వారా స్పష్టమవుతున్నది. తెలంగాణా ప్రజలు ఎక్కువ విద్యుత్ వాడుతున్నారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే సేద్యానికి కరెంటు ఎక్కువ వాడుతూ తెలంగాణావారు అధిక సబ్సిడీ పొందుతున్నారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాకుగాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2009-10లో మొత్తం రూ.3787.49 కోట్ల సబ్సిడీగా ఇవ్వగా ఒక్క తెలంగాణాలోనే అత్యధికంగా అంటే 2028.35 కోట్లు (53%) సబ్సిడీగా ఖర్చు చేస్తున్నారు. రాయలసీమకు రూ.893.94 కోట్లు (24%), కోస్తా ఆంధ్రకు రూ.865.2 కోట్లు (23%) సబ్సిడీగా ఖర్చు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ గ్రిడ్ 14648 మెగా వాట్ల స్థాపిత సామర్థ్యంలో (2010 జూన్) చాలా పటిష్టంగా ఉన్న గ్రిడ్ 2009-10లో విద్యుత్ గరిష్ట గిరాకీ 12,010 మెగావాట్లు కాగా 10880 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేశారు. ఆయా జిల్లాల అవసరాల మేరకు విద్యుత్ అందుబాటులో వుంది.

విద్యుత్‌రంగంలో సంస్కరణలు పూర్తి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నో విధాన నిర్ణయాలు తీసుకున్నది. సంస్కరణల బిల్లు ఆమోదం పొందడంతో శాసనాత్మక చట్టం ఏర్పడింది. ప్రభుత్వం సంస్కరణలకు కట్టుబడి ఉన్నందున విద్యుత్ రంగానికి విశ్వసనీయ .. లభ్యత మళ్ళీ చేకూరింది. ఇప్పటికి సంస్కరణల క్రమంలో వాస్తవం. విద్యుత్‌రంగం సామర్థ్యం, ఉత్పాదకత పెంపునకు దోహదపడుతుంది. సరసమైన రేట్లలో ప్రజలకు మెరుగైన నాణ్యత, విశ్వసనీయ సరఫరా ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలు ఎన్నో విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించాయి. మరెన్నో తలపెట్టాయి. విద్యుత్ గిరాకీ సరఫరాకుగల తేడాను పూరించడానికి మరింత విద్యుత్ సరఫరాకు ప్రయత్నిస్తున్నాయి. వివిధ ప్రాజెక్టులు స్థలాలను సందర్శించినపుడు జరిపిన సమావేశాల్లో నిరుద్యోగ సమస్య ప్రస్తావనకు వచ్చింది. విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ ప్రసార పంపిణీలో

ఎన్నోవేల ఉద్యోగాలు కల్పించిన సంగతి తెలిసిందే. జోనల్ నిబంధనలకు లోబడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఉద్యోగాలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. నిర్మాణ కార్మికులకు సాధారణంగా స్థానికులనే తీసుకుంటారు. తెలంగాణా/రాయలసీమలలో నిరుద్యోగం అధికం. దానిపై వారు ఎక్కువగా ఆందోళన చెందుతున్నందున వారి మనోభావాలను, భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుత పాలనా, చట్టపరమైన యంత్రాంగాలు, నిబంధనలు, ఖాళీల భర్తీకి తగినంతగా లేకపోతే, తెలంగాణా, రాయలసీమలలో వాటిని సవరించడానికి పాలన పరంగా తగు చర్యలు తీసుకోవాలి.

## ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ పరిస్థితి మెరుగుకు సూచనలు

సింగరేణి బొగ్గగనులు ఉన్నందున తెలంగాణలో మరిన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి. థర్మల్ విద్యుత్ ఉత్పాదనలో అసమానతలు తగ్గించడానికి ప్రయత్నించాలి. కోస్తా ఆంధ్రతో పోలిస్తే విద్యుత్ ప్రాజెక్టులలో ఉద్యోగాలు పొందిన వారు తొలుత తెలంగాణా వారే. అయితే తెలంగాణావాదులు, రాయలసీమ ప్రతినిధి వర్గాలతో కమిటీ చర్చించినపుడు విద్యుత్ ప్రాజెక్టులలో స్థానికులకు ఉద్యోగాలు చాలా తక్కువగా ఇస్తున్నారనే అంశాన్ని వారు ప్రధానంగా ప్రస్తావించారు. ఉద్యోగాలలో అసమానతలకు అనేక కారణాలుండవచ్చు. గతంలో విద్యుత్ రంగానికి జోనల్ వ్యవస్థ వర్తించనందున ఉద్యోగ నియామకాలలో జోనల్ పద్ధతి పాటించలేదు. అందువల్లనే ఉన్నతోద్యోగాలకు సంబంధించి కొన్ని అసమానతలున్నాయి. 2008 నుండి విద్యుత్ రంగ ఉద్యోగాలకు కూడా జోనల్ పద్ధతిని వర్తింప చేస్తున్నందున మూడు నాలుగేళ్ళలో పరిస్థితి చక్కదిద్దవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లోని విద్యుత్ ప్రాజెక్టులలో పనిచేస్తున్న అన్ని శ్రేణుల ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి కోస్తా ఆంధ్రలోని విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఒకేఒక శిక్షణా కేంద్రముంది. ఎపిజెన్‌కో 12వ ప్రణాళికా కాలంలో భారీగా 20,000 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి కార్యక్రమాన్ని తలపెట్టినందునను, తదనుగుణంగా విద్యుత్ ప్రసార పంపిణీ నెట్‌వర్క్‌లను కూడా విస్తరించనున్నందునను విద్యుత్ ఉత్పత్తి, ప్రసార పంపిణీ అంశాలలో కొత్తగా ఒక్కచోట 50000 ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఇందుకుగాను వెనుకబడిన జిల్లాల నుండి ఉద్యోగాలకు అభ్యర్థులను (తొలుత కార్మికుల స్థాయిలో) ఎంపికచేసి వారికి విద్యుత్ శిక్షణా సంస్థలలో శిక్షణ ఇవ్వాలి. ఇందుకుగాను తెలంగాణాలో ఒకటి, రాయలసీమలో మరో శిక్షణా సంస్థలను నెలకొల్పాలి. దీనికి తోడు తెలంగాణా ప్రాంతంలో (శ్రీశైలం విద్యుత్‌కేంద్రం) ప్రత్యేకంగా మరో జలవిద్యుత్ శిక్షణా సంస్థను ఏర్పాటు చేయాలి. విద్యుత్ ప్రసారం, పంపిణీ రంగాలకు కనీసం రెండు వేర్వేరు శిక్షణా సంస్థలను నెలకొల్పాలి. దీనివల్ల విద్యుత్‌రంగంలో ఉద్యోగాలకు సంబంధించి ప్రాంతాల వారిగా గల అసమానతలను తొలగించడానికి వీలవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో 2009-10లో 12010 మెగావాట్ల విద్యుత్‌కు గిరాకీ ఉండగా 10880 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేయగలిగారు. దీన్ని బట్టి 1130 మెగావాట్ల (-9.4%) విద్యుత్ కొరత ఉన్నట్లు తేలుతున్నది. 79210 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం కాగా 74859 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరిగింది. 4342 (-5.48%) మిలియన్ యూనిట్ల కొరత ఏర్పడింది. ఈ కొరతను అధిగమించడానికి ఈ క్రింది చర్యలను పరిశీలించాలి.

ప్రివెంటివ్, ప్రిడెక్టివ్ నిర్వహణ షెడ్యూళ్ళను పాటించడం ద్వారా ఎపిజెన్‌కో థర్మల్ విద్యుత్‌కేంద్రాలలో అన్‌షెడ్యూల్డ్ ఔటేజెస్‌ను తగ్గించాలి. సౌకర్యస్థాయి తగ్గకుండానే విద్యుత్ పొదుపు, విద్యుత్ ఆదా చేయడానికి వున్న చర్యల గురించి విద్యుత్ వినియోగదార్లకు అవగాహన కల్గించాలి. విద్యుత్ చౌర్యాన్ని నిరోధించడానికి గట్టి చర్యలు తీసుకోవాలి. రైతులకు ఉచిత విద్యుత్‌కు సంబంధించి సేద్యానికి తప్ప

ఇతర విద్యుత్ వాడకం నిరోధించాలి. ధవళేశ్వరం వద్దగల సర్‌ఆర్థర్ కాటన్ బ్యారేజీకి ఎగువన 42 కి.మీ వద్ద "ఇందిరాసాగర్ పోలవరం ప్రాజెక్టు"ను నిర్మించాలని 1943లో తలపెట్టారు. అనేక కారణాల వల్ల ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరిగింది. ఇప్పుడు ఆ స్థలంలో పనులు ప్రారంభమై 33% పూర్తయ్యాయి. రూ.3229.14 కోట్లు ఆ పనులకు (జూలై 2010 నాటికి) ఖర్చు చేశారు. పోలవరం ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తిచేయాలి. ఈ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణా, రాయలసీమ ప్రజలకు మరో 960 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 7.2 లక్షల హెక్టార్ల భూమికి అదనంగా సాగునీటి సౌకర్యం లభిస్తుంది. ఎగువన ఇచ్చంపల్లి ప్రాజెక్టు, కాంతానపల్లి ఎత్తిపోతల పథకం, 'సింగిరెడ్డి పల్లి హెచ్.ఇ పథకం", రాజీవ్‌సాగర్ ఎత్తిపోతల పథకం, ఇందిరాసాగర్ ఎత్తిపోతల పథకం వంటి ఎన్నో సాగునీటి ప్రాజెక్టులను చేపట్టడానికి దోహదపడుతుంది.

❖ ❖ ❖

అధ్యాయం

# 5 ప్రభుత్వ ఉపాధి అంశాలు

ఉపాధి కల్పన విషయంలో తెలంగాణ ప్రాంత వాసుల హక్కులను కాపాడుకోవాలని డిమాండు ఇప్పటిది కాదు, చాలా పాతది. 1919లో హైదరాబాద్ నిజాం ప్రభుత్వ ఉద్యోగాల కొరకు నివాస ధృవీకరణ ఉండాలని ఒక ఫర్మానా జారీ చేశారు. ముల్కీ నిబంధనల ప్రకారం ఈ ప్రాంతంలో ఉద్యోగాలకు నివాసార్హత తప్పనిసరి. ఈ విధంగా ఉపాధి అంశం మీద 1947-1975 మధ్య చోటుచేసుకున్న రాజకీయ, రాజ్యాంగ, చట్టపర సంఘటనలు ఈ అంశాన్ని మరింత జటిలం చేశాయి. గత కొన్నేళ్ళలో ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలంగాణా ప్రాంత వాసులపట్ల వివక్ష ఉందనే వాదన ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రభుత్వ ఉద్యోగాల్లోను, విద్యాసంస్థల్లోను రిజర్వేషన్ ఉండాలన్న వివాదం ఎలా ప్రారంభమైందో అర్థం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం దాని అమలుకు తీసుకున్న వివిధ నిర్ణయాలను పరిశీలించేందుకు ఈ కమిటి ఒక సాంకేతిక పర అధ్యయనాన్ని నిర్వహించింది. ఈ సాంకేతికపర అధ్యయానికి ఒక కమిటీని ముఖేష్ కర్కర్ (రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్) నియమించింది. ఆయన ప్రస్తుతం న్యూఢిల్లీలోని ఇన్స్టిట్యూట్ ఫర్ రెగ్యులేషన్ అండ్ కాంపిటీషన్ అనే సంస్థలో డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు.

ప్రాథమిక అవగాహన కోసం ఈ కమిటీ రాజకీయ పార్టీలు, స్వచ్ఛందసంస్థలు, లాయర్లు, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు వంటి వారితో సుదీర్ఘ సంప్రదింపులను జరిపింది. ఈ అధ్యాయంలో ఈ అంశం మీద జరిపిన చర్చలు, కనిపెట్టిన అంశాలు మొదలైనవి ఉన్నాయి. వీటిని ఈ కమిటి గ్రామాలకు, జిల్లాలకు వెళ్లినప్పుడు సంబంధిత గ్రూపులతో జరిపిన చర్చల ఫలితంగా రాబట్టుకున్నవి. మరోవైపు నిపుణుల కమిటి నివేదికను కూడా పరిశీలనలోకి తీసుకొనడమైనది.

## ప్రభుత్వ ఉద్యోగాల్లో నివాస అర్హత అంశంమీద ముల్కీ నిబంధనలకు రాజ్యాంగపర, పరిపాలనా పర, చట్టపరమైన అంశాలు

**ముల్కీ నిబంధనలు 1919-1959 :** నిజాం 1337, 25వ రంజాన్ (1919వ సంవత్సరం) నాడు జారీ చేసిన ఫర్మానాకు అనుగుణంగా హైదరాబాద్ ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ముల్కీ నిబంధనలను విధించడమైనది. ఉర్దూ భాషల్లో 'ముల్క్' అనగా జాతి అని అర్థం. ముల్కీలు అంటే జాతీయులు అని అర్థం. ఈ ముల్కీ నిబంధనలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాంతీయుల ప్రయోజనాలను కాపాడేందుకు ఏర్పడ్డవి. ఈ నిబంధనల ప్రకరణ 39, అనుబంధం ఎన్ ప్రకారం ముల్కీ అనబడే వ్యక్తి :

- ❖ జన్మరీత్యా హైదరాబాద్ రాష్ట్రానికి చెందినవాడై వుండాలి.
- ❖ హైదరాబాద్ రాష్ట్రంలో నివాసిగా వుండాలి. లేదా
- ❖ అతని తండ్రి ప్రభుత్వ ఉద్యోగంలో 15 సంవత్సరాలు పూర్తి చేసి వుండాలి. లేదా

❖ ముల్కీని వివాహమాడిన వనిత కూడా ముల్కీ కిందకే వస్తుంది.

❖ హైదరాబాద్ రాష్ట్రంలో ఒక ముల్కీకి జన్మించిన వ్యక్తిని ముల్కీగా గుర్తిస్తారు.

❖ ఇతరత్రా ముల్కీ గుర్తింపు ఇలా వుంటుంది. ఒక వ్యక్తి హైదరాబాద్ రాష్ట్రంలో కనీసం 15 సంవత్సరాలు శాశ్వతంగా నివసించిన వారై వుండాలి. ఆ తరువాత తమ నివాసాన్ని అక్కడ నుండి మార్చనని లిఖితపత్రం ద్వారా తెలిపి మెజిస్ట్రేట్ ధృవీకరణను పొంది వుండాలి. ఒక ముల్కీ మహిళ ముల్కీయేతర వ్యక్తిని వివాహమాడి హైదరాబాద్ రాష్ట్రంలోని నివసిస్తూ వుంటే ఆమె ముల్కీ అర్హత కోల్పోదు.

ఒక ముల్కీ మహిళ ముల్కీ యేతర వ్యక్తిని వివాహమాడి హైదరాబాద్ రాష్ట్రం వెలుపల నివసించి భర్త మరణానంతరం లేదా విడాకుల తీసుకున్న తరువాత హైదరాబాద్ రాష్ట్రానికి తిరిగి నివసించడానికి వస్తే ఆమెను ముల్కీ క్రింద పరిగణిస్తారు. ఆమె పిల్లలను నిబంధనలు అనుమతించినంత వరకు ముల్కీయేతరులుగానే పరిగణిస్తారు.

ముల్కీ ధృవీకరణ పత్రాన్ని జిల్లాలలో తాహసీల్దారులు జారీ చేయవచ్చు. దరఖాస్తుదారు ఒక నిర్ణీత దరఖాస్తులో తాను తెలిపిన వివరాలన్నీ సరైనవేనని ధృవీకరిస్తూ దానిని దాఖలు చేయాలి. కొన్ని ప్రశ్నలకు దరఖాస్తుదారుడు జవాబు ఇవ్వాల్సి వుంటుంది. ఆ ప్రశ్నలివి :

❖ దరఖాస్తు దారు పుట్టిన స్థలం?

❖ హైదరాబాద్ రాష్ట్రంలో నివసించడానికి ముందు అతను ఎక్కడ నివసించేవాడు ?

❖ అతని తండ్రి, తాత, పుట్టిన స్థలం, జాతీయత?

❖ దరఖాస్తు దారు తండ్రి విద్యనభ్యసించిన స్థలం?

❖ దరఖాస్తు దారు జన్మించే సమయంలో అతని తండ్రి నివాసస్థలం? దరఖాస్తుదారుకు 21 సంవత్సరం పూర్తయిన తరువాత నివాసస్థలం?

దరఖాస్తులో పేర్కొన్న అంశాలు ఏవైనా తప్పని తేలితే దరఖాస్తుదారు మీద చర్యతీసుకునే వీలుంటుంది. ముల్కీ ధృవపత్రాన్ని రద్దు చేయవచ్చు. ఆ వ్యక్తి తండ్రి లేదా భర్త ముల్కీ ధృవపత్రాన్నికూడా రద్దు చేయవచ్చు. ముల్కీ ధృవీకరణ పత్రమున్న వ్యక్తి ఘనత వహించిన నిజాం పట్ల గానీ, లేదా హైదరాబాద్ ప్రభుత్వం పట్లగానీ, ప్రత్యక్షంగా కానీ లేదా పరోక్షంగా కానీ హైదరాబాద్ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పాల్పడినట్లు రుజువయితే అతని ముల్కీ పత్రాన్ని రద్దు చేయవచ్చు. ఈ విధంగా ముల్కీ నిబంధనలు జాతీయ నిబంధనల వంటివి. ఇవి ఆ ప్రాంతంలో దీర్ఘకాలంగా నివసిస్తున్న ప్రజలకు మేలు చేకూర్చేవి. 1949 నవంబరులో నిజాం మరొక ఫర్మానాను జారీ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకానికి ముల్కీ నిబంధనలు తప్పనసరి అని పేర్కొన్నారు.

## ముల్కీ నిబంధనలకు ప్రత్యామ్నాయంగా వివిధ చట్టాలు

భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలుకు వచ్చింది. రాజ్యాంగంలోని 35(బి) అధికరణ ప్రకారం ఒక ప్రాంతంలో లేదా రాష్ట్రంలో ఉపాధి అంశం మీద వున్న నిబంధనలను అలాగే కొనసాగించాలని పేర్కొన్నారు. ఉపాధిని ప్రాథమిక హక్కుగా పేర్కొంటూ ఈ విధమైన రక్షణను కూడా భారత రాజ్యాంగం కల్పించింది. ఈ విధంగా ముల్కీ నిబంధనలు భారత రాజ్యాంగం 35(బి)

అధికరణ ప్రకారం నిలదొక్కుకున్నాయి. ఆ తరువాత హైదరాబాద్ ప్రభుత్వం ముల్కీ నిబంధనలను అధికరణ 35(బి) ప్రకారం తగినవిధంగా మార్పులు/సవరణలు చేస్తూ వచ్చాయి.

సవరించిన నిబంధనల ప్రకారం హైదరాబాద్ రాష్ట్రంలో 15 సంవత్సరాలు నిరవధికంగా నివసించి వుంటే చాలు. 1955లో హైదరాబాద్ రాజ్ ప్రముఖ్ ప్రభుత్వ ఉద్యోగాల నిబంధనల్లో కొన్ని సవరణలు చేశారు. ఇవి ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా వున్నవి. అయితే ముల్కీ నిబంధనలను కేంద్రప్రభుత్వం పార్లమెంటులో మాత్రమే సవరించాల్సి వుంటుంది. రాష్ట్ర శాసనసభకు ఆ అధికారం లేదు. అందువల్ల రాజ్‌ప్రముఖ్ ఆదేశాలు కొట్టివేయబడి ముల్కీ నిబంధనలు మునుపటి లాగే అమలవుతున్నాయి.

ఆ తరువాత 1.11.1956లో రాష్ట్ర పునర్నిర్మాణ చట్టం అమలుకు వచ్చిన తరువాత కూడా ముల్కీ నిబంధనలు అలాగే కొనసాగాయి. అందువల్ల మనకు అవసరమైన మేరకు అర్థం చేసుకోవాలంటే 1. 11. 1956న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత కూడా ముల్కీ నిబంధనలు కొనసాగుతూనే వున్నాయి.

## రాష్ట్ర పునర్నిర్మాణ కమిషన్ (ఎస్ఆర్‌సి)

హైదరాబాద్ రాష్ట్రం 1948 నుండి 1956 వరకు భారత ప్రభుత్వం క్రింద ప్రత్యేక రాష్ట్రంగానే ఉన్నందువల్ల ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆ రాష్ట్ర వాసుల రిజర్వేషన్ల అంశం ఆ రాష్ట్రానికి సంబంధించిన నిబంధనలమేరకే వుంది. అయితే 1952-53లో మద్రాసు రాష్ట్రం నుండి వచ్చిన ముల్కీ యేతరులకు వ్యతిరేకంగా మొట్టమొదటి ముల్కీ ఉద్యమం రాష్ట్రంలో చోటు చేసుకుంది.

కోస్తాంధ్ర ప్రజలు విశాలాంధ్ర కొరకు చేసిన డిమాండులో తెలంగాణా ప్రాంత ప్రయోజనాలను కాపాడతామని హామీ ఇచ్చారు. 1956 ఫిబ్రవరి 20న కాంగ్రెస్ అధిష్టానవర్గం రెండు ప్రాంతాల నాయకులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశంలో తెలంగాణా భద్రతకు కొన్ని అంశాలను ఉటంకిస్తూ విశాలాంధ్ర ఏర్పడటానికి అంగీకారం కుదిరింది. 1956 నవంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడటానికి దారిచూపిన ఈ ఒప్పందాన్ని 'పెద్దమనుషుల ఒప్పందం' అని వ్యవహరిస్తారు.

## పెద్దమనుషుల ఒప్పందం, 1956

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణకు ముందు తెలంగాణా, ఆంధ్ర నాయకుల మధ్య కుదిరిన ఒప్పందాన్ని పెద్దమనుషుల ఒప్పందం అని అంటున్నారు. తెలంగాణా ప్రాంతంలో అధికారం పంచుకోవడం, ప్రాంతీయ నిబంధనలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, వివిధ ప్రాంతాల ఖర్చుల పంపిణీ, విద్య మొదలైన అంశాలు ఈ ఒప్పందంలో చేరి వున్నాయి.

## 1969 అష్టసూత్ర కార్యక్రమం

తెలంగాణా ప్రాంతంలో విద్య, ఉపాధి అవకాశాలను పెంచి ప్రణాళికా అమలు కమిటీలు ఏర్పరచడానికి అష్టసూత్ర ప్రణాళిక ఏర్పడింది. ఉన్నతస్థాయి తెలంగాణా అభివృద్ధి కమిటీ కూడా ఇందులో ఒకటి. ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా తెలంగాణా అభివృద్ధి పనితీరును పర్యవేక్షించడానికి ఈ ఉన్నత స్థాయి కమిటీని ఉద్దేశించారు. ఈ సూత్రం ఏమంటోందంటే -

తెలంగాణా ప్రాంత ప్రజలకు, ప్రభుత్వోద్యోగాలను కల్పించే నిమిత్తం, రాజ్యాంగ రక్షణను సక్రమంగా కల్పించే అవకాశాలను ఈ కమిటీతో సంప్రదింపులు జరిపి పరిశీలిస్తారు. ఈ కమిటీ న్యాయ నిపుణులతో కూడినది. ఈ ప్రకటనకు అనుగుణంగా రెండు కమిటీలను కేంద్ర ప్రభుత్వం ఏర్పరిచింది.

1. మాజీ న్యాయమూర్తి కె.ఎన్.వాంఛూ సారధ్యంలో నిపుణుల కమిటీని తెలంగాణా ప్రాంతం ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగాలకల్పనలో, రాజ్యాంగ రక్షణ కల్పించే విషయంపై సూచనలకు నియమిస్తారు.

2. జస్టిస్ భార్గవ సారధ్యంలో మరోకమిటీ తెలంగాణా ఆదాయంలో మిగులు నిర్ధారణకు నియమిస్తారు. అయితే 8సూత్రాల ప్రణాళికను స్వాగతించేవారు లేక అది అస్థిత్వంలో లేకుండా పోయింది. అమలే కాలేదు. రాష్ట్రంలో ప్రతిష్టంభన ఏర్పడే విధంగా ఉద్యమం కొంతకాలం కొనసాగింది. అయితే ఆ ఉద్యమం కూడా ఊపు కోల్పోయి క్రమంగా రాష్ట్రంలో మామూలు పరిస్థితులు నెలకొన్నాయి.

## 1972 నాటి ఐదుసూత్రాల కార్యక్రమం

ఎనిమిది సూత్రాల కార్యక్రమం విఫలం అయ్యాక 1972లో ఐదుసూత్రాల ప్రణాళికను ప్రభుత్వం సూచించింది. ఈ ప్రణాళిక ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ సూచించడానికి సంబంధించినది.

తెలంగాణా ప్రాంతంలో నాన్‌గెజిటెడ్ హోదాలకు తాసిల్దార్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ల నియామకం కోసం మాత్రమే ముల్కీ నిబంధనలు వర్తింపచేయాలని నిర్దేశించారు. 1956 నవంబరు 1కి నాన్‌గెజిటెడ్ హోదా ఉండి, ఆతరువాత గెజిటెడ్ హోదా పొందిన ఉద్యోగాల్లోకి చేసే నియామకాలకు సైతం ఈ నిబంధన వర్తిస్తుంది. కానీ, సెక్రటేరియట్ వంటి ఉమ్మడి కార్యాలయాల విషయంలో శాఖాధిపతుల హోదాలను, రాష్ట్రప్రభుత్వానికి చెందిన ఉమ్మడి సంస్థల విషయంలోనూ ఈ నిబంధనలు కొన్ని షరతులపై వర్తిస్తాయి. నాన్ గెజిటెడ్ పోస్టుల్లో 3 నేరుగా నియమించే ఖాళీల్లో 2వ ఖాళీని పూరించడానికి ఈ నియమాలు వర్తిస్తాయి.

ఈ రెండు ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగులకు తగిన ప్రమోషన్ అవకాశాలు కల్పించడానికి, మొదటి లేదా రెండో గెజిటెడ్ స్థాయికి వివిధ సర్వీస్ కేడర్ల ప్రాంతీయాకరణ చేయాలి. అయితే ఈ సూత్రాలకు మద్దతు లేకపోవడంతో త్వరలోనే విడిచిపెట్టారు.

## తెలంగాణా ఉద్యమం

తెలంగాణా ప్రాంతంలో ప్రభుత్వోద్యోగాలకు నివాస నిబంధనను 1957 ప్రభుత్వోద్యోగాల చట్టం తెచ్చారు. ఈ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించింది. ఇదే తెలంగాణా ప్రాంతంలో అసంతృప్తిని రేకెత్తించి ఉద్యమానికి దారితీసింది. ఉద్యమానికి మరోకారణం పన్నుల రూపేణా తెలంగాణా ప్రాంతం నుండి వసూలు చేసిన మిగులు నిధులు ఆంధ్రాప్రాంత అభివృద్ధికి కృషి చేసారన్నది. ఈ నేపథ్యంలో 1968-69లో 'తెలంగాణా ఉద్యమం' రేకెత్తింది. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు ఈ ఉద్యమాన్ని ప్రారంభించినప్పటికీ ఇతర ప్రాంతాలకు కూడా అదిత్వరగా పాకింది. ప్రభుత్వోద్యోగులు, రాష్ట్ర శాసనసభ్యులు కూడా సమ్మెల ద్వారా విద్యార్థులతో సంఘీభావాన్ని ప్రకటించారు. తెలంగాణా ప్రాంతం అంతటా నిరసనలు వెల్లువెత్తి ఉద్యమం హింసాత్మకంగా మారాక, ఉద్రిక్తతను సడలించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణా ప్రాంతంలోని ఆంధ్రసిబ్బందిని 1969 ఫిబ్రవరి 28 నాటికి పంపిచివేస్తామని ప్రకటించింది. అయితే ఈ ప్రకటనపై సుప్రీం కోర్టులో సవాలు చేశారు. ఫలితంగా ప్రత్యేక తెలంగాణా కోసం ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చింది. అదే తరుణంలో అసెంబ్లీలోని అన్ని రాజకీయ పార్టీల తెలంగాణా నాయకులు 1969 జనవరి 19న సమావేశమై, తెలంగాణా రక్షణ

చర్యలను అమలు పరచడానికి అంగీకారం కుదుర్చుకున్నారు. తర్వాత ఈ వివాదం సుప్రీంకోర్టుకు ఎక్కి అనేక వివాదాస్పద పరిణామాల తరువాత 1972లో ముల్కీ రూల్స్ చట్టం తిరిగి అమలు లోకి తెస్తూ తీర్పునిచ్చింది. ఇది రాష్ట్రంలో రాజకీయ సంక్షోభానికి దారి తీసింది. 1972 డిసెంబరు 30న ముల్కీ నిబంధనల చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర లభించింది. ఇది 'జై ఆంధ్ర' ఉద్యమానికి దారితీసి 1973 జనవరి 10న రాష్ట్రపతి పాలనకు దారితీసింది. అనంతరం ఆరుసూత్రాల ప్రణాళిక వచ్చింది. 1973లో పి.వి.నరసింహారావు ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించారు. దాని తరువాత జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ప్రజాప్రభుత్వం ఏర్పడింది. 1978 మార్చి 16న డా॥మర్రి చెన్నారెడ్డి 6వ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ప్రత్యేక తెలంగాణా ఇక ఏమాత్రం సందర్భ శుద్ధిలేని విషయమని ప్రకటించారు. పార్టీలో అంతర్గత తగాదాలవల్ల ఆయన 1980 అక్టోబర్‌న రాజీనామా చేశారు. ఆ తరువాత టంగుటూరి అంజయ్య ఏడాది నాలుగునెలల పాటు పాలించారు. 1982 ఫిబ్రవరిలో భవనం వెంకటరామ్‌ను ముఖ్యమంత్రిని చేశారు. తిరిగి ఆయన స్థానంలో 1982 సెప్టెంబర్‌లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అవిధంగా నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ నలుగురు ముఖ్యమంత్రులను చూసింది.

## ఉద్యోగాలకై 3 ఉద్యమాలు

సిసిఎస్‌ఎపి ఏర్పాటు చేసిన తరువాత ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి 3 ఉద్యమాలు సాగాయి. గ్రూప్1 ఉద్యోగాల్లో 42% తెలంగాణా వారికి రిజర్వ్ చేస్తే తప్ప ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ స్క్రీనింగ్‌టెస్ట్‌ను జరగనివ్వబోమని ఉస్మానియా యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ(జెఎసి) 2010 సెప్టెంబర్‌లో ఉద్యమాన్ని చేపట్టింది. ఈ అంశానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండిఅందిన నివేదిక సారాంశం-

లక్షా తొంభై ఒక్క వేల మంది దరఖాస్తుదారులకు ముందే నిర్ణయించిన తేదీల్లో పరీక్ష నిర్వహించడానికి 445 కేంద్రాలను ఎపిపిఎస్‌సి నెలకొల్పిందని, అందులో 246 కేంద్రాలు తెలంగాణా ప్రాంతానికి చెందినవని ఈ నివేదిక పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పరీక్షలను సాహసంతో నిర్వహించింది. సెప్టెంబరు 5న ఈ పరీక్ష కొన్ని చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ బిఇడి కళాశాలలో తెలంగాణా విద్యార్థులు పరీక్షా హాలులోకి ప్రవేశించి ప్రశ్నా పత్రాలను చించివేశారు. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 43.9% మంది హాజరవగా ఒక్క తెలంగాణాలో ఈ శాతం 39.6% ఉంది.

ఎపిపిఎస్‌సి ఈ పరీక్షను తిరిగి 25.10.2010నాడు యూనివర్సిటీ బిఇడి కాలేజీ సెంటర్‌గాగల అందరు విద్యార్థులకు, తెలంగాణా బంద్‌వల్ల పరీక్షకు హాజరు కాలేని వారికి నిర్వహించింది. ఈ పరీక్షకు మొత్తం 1037మంది అభ్యర్థులు హాజరయ్యారు.

## న్యాయవాదుల ఆందోళన

హైకోర్టు ట్రిబ్యునల్స్‌లో 42% న్యాయాధికారుల ఉద్యోగాలను తెలంగాణా న్యాయవాదులకు కేటాయించాలంటూ అడ్వకేట్ జనరల్‌కు 2010 ఫిబ్రవరి నుంచి విజ్ఞాపనలు చేస్తూ వచ్చారు. 13.09.2010న తమ డిమాండ్లపై తెలంగాణా లాయర్లు హైకోర్టు ప్రాంగణంలో ఆమరణ దీక్ష ప్రారంభించారు. హైకోర్టు లాయర్ల ఆందోళనకు మద్దతుగా తెలంగాణా లాయర్లు దిగువ కోర్టుల్లో విధులను బహిష్కరించారు. తరువాత సెప్టెంబర్ 15,16తేదీల్లో హైకోర్టుతో సహా తెలంగాణా

ప్రాంతంలోని అన్ని కోర్టులను తమ డిమాండ్లకు మద్దతుగా తెలంగాణా లాయర్లు బహిష్కరించారు. హైకోర్టు ఆవరణలో ఆస్తులు ధ్వంసానికి ఆవేదన చెందుతూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సివి.నాగార్జునరెడ్డి రాజీనామా చేశారు. సెప్టెంబరు17న నిరాహారదీక్ష చేస్తున్న అడ్వకేట్లు, వారి మద్దతుదారులను అరెస్టు చేశారు. దీక్షలో ఉన్నవారిని ఆసుపత్రులకు తరలించారు. తరువాత తెలంగాణా ప్రాంతపు అడ్వకేట్లు కోర్టు హాల్స్‌లోకి ప్రవేశించకుండా ప్రభుత్వం నిరోధించింది. ఆతరువాత రాష్ట్రమంత్రి గీతారెడ్డి కమిటీని ఈఅంశంపై నియమించారు. హైకోర్టులో ప్రభుత్వ లా ఆఫీసర్ల నియామకంలో ప్రాంతాల వారీపొంతన సాధించడానికి సిఫార్సులు చేయడం ఈ కమిటీ విధి. దీనిలో రాష్ట్రమంత్రులు మోపిదేవి వెంకటరమణారావు, పి.రామచంద్రారెడ్డి సభ్యులు. ఈ కమిటీ అందించిన సమాచారం ప్రకారం స్టాండింగ్ కౌన్సిల్ గుర్తించిన మొత్తం ఖాళీల సంఖ్య 69. వాటిలోకి నియామకాలు జరుగుతున్నాయి. తెలంగాణా ప్రాంతంలో ఖాళీలు 30కాగా, రాయలసీమలో 11, ఆంధ్రలో 28.

## పోలీసు నియామకాలు

హైదరాబాద్‌లో పోలీస్ ఉద్యోగాలకు రాష్ట్రంలో ఏ ప్రాతం నుంచైనా పోటీపడవచ్చు. సుప్రీం కోర్టు 2002లో సిఎ నెం. 5141, నెం. 5142, సిఎ నెం. 5144, 2003లో 2965 కేసులపై 2009 అక్టోబర్ 9న ఈ వాదాన్ని బలపరిచింది. ఇటీవల రాష్ట్రస్థాయి రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఎస్ఎల్ఆర్‌బి) 1269 సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు హైదరాబాద్‌తో సహా అన్ని ప్రాంతాల్లో 2010 డిసెంబర్ 18, 19న పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పరీక్షకు కొన్ని వారాలముందు హైదరాబాద్‌లో దాని చుట్టపక్కల విద్యార్థులు యువకులు ఉద్యమించారు. ఈ ఉద్యోగాలను కేవలం 6వజోన్‌కు చెందిన అభ్యర్థులతోనే నింపాలని వారు డిమాండ్ చేశారు. 6వజోన్ అంటే నల్గొండ, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు. ఈ ఆందోళనవల్ల ప్రభుత్వం ఈ ఉద్యోగాలను 19.11.2010నాడు వాయిదా వేసింది. ఇది వాయిదా పడగానే కోస్తా, రాయలసీమ వంటి ఇతర ప్రాంతాల్లో ప్రతిఘటనా ఉద్యమాలు జోరందుకున్నాయి. ఈ వివాదంపై తుది నిర్ణయం ఇంకా రావలసి వుంది.

❖ ❖ ❖

A.C. No. 18069

అధ్యాయం 6

# హైదరాబాద్ ముఖచిత్రం

## హైదరాబాద్ మహానగరానికి చెందిన అంశాలు

శ్రీకృష్ణ కమిటీ హైదరాబాద్ నగరం గురించి పలు నివేదికలు అందాక రాజకీయ పార్టీలు గ్రూపులతో పలుసార్లు చర్చించి హైదరాబాద్ కీలక అంశం అని గుర్తించింది. హైదరాబాద్ ప్రధాన మహానగరాల్లో ఒకటిగా అభివృద్ధి చెందే క్రమంలో ఎలాంటి మార్పులు, సంక్లిష్టతలకు గురైందో కమిటీ ప్రధానంగా పరిశీలించింది.

తెలంగాణా ప్రాంతం రాజకీయాలు భారతదేశం స్వాతంత్ర్యం పొందాక తెలంగాణా ప్రాంతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు రెండు కీలక రాజకీయ శక్తులుగా ఎదిగాయి. 1928లో ఆల్‌ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్ ఉల్ ముస్లిమీన్(ఎఐఎంఐఎం) పార్టీ హైదరాబాద్‌ను శాశ్వతంగా ముస్లిం ప్రాంతం చేయాలన్న లక్ష్యంతో స్థానికులు స్థాపించారు. ఆ పార్టీకి సరైన నాయకత్వం లేకపోవడంతోపాటు, భారతవ్యతిరేక వైఖరివల్ల ఒకరకంగా సామాజిక వెలికి గురైంది. 1957 ఎన్నికల్లో మొత్తం ఓట్లలో 52% గెలుచుకుని కాంగ్రెస్‌పార్టీ 42కు 35స్థానాలు గెలిచింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత కమ్యూనిస్ట్ పార్టీ క్రమంగా పునాదిని కోల్పోయింది. చివరికి తెలంగాణాలోని కమ్యూనిస్ట్ కోటల్లోకూడా ఇదే పరిస్థితి ఎదురవడంతో కాంగ్రెస్ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో 3 దశాబ్దాలపాటు తిరుగులేని స్థితిని పొందింది. 1970 దశకంలో దేశంలోని ఇతర ప్రాంతాల్లో తుడిచిపెట్టుకుపోయినా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆ పార్టీ చెక్కుచెదరలేదు. తరువాత ఆ పార్టీలో రానురాను వర్గపోరు పెరిగి 1983లో ఎన్టీరామారావు సారధ్యంలో తెలుగుదేశం పార్టీ స్థాపించిన 9నెలల కాలంలోనే అధికారానికి రాగలిగింది.

ముందు ఎన్టీరామారావు, తరువాత నారాచంద్రబాబు నాయుడు హయాంలలో హైదరాబాద్ ముఖచిత్రం రెండు రకాల పరిణామాలను చవిచూసింది. ముందుగా ఎన్టీరామారావు తెలుగువారి ఆత్మగౌరవం పేరుతో పాలన సాగించి హైదరాబాద్‌ను తెలుగువారి సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈ కాలంలోనే చాలామంది విజయవంతమైన పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్‌కు ఇతర ప్రాంతాలనుంచి వలసవచ్చారు. చెన్నై నుంచి తెలుగుచిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలివచ్చింది కూడా ఈకాలంలోనే. తరువాత1997 సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రిగా వచ్చిన చంద్రబాబు హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా చేయాలని ప్రయత్నించారు, దానిని ఐటి ఇండస్ట్రీకి బెంగుళూరు తర్వాతి కేంద్రంగా రూపొందించారు. తిరిగి 1997లో జరిగిన ఎన్నికల్లో గెలిచాక మొత్తం తొమ్మిదేళ్ళు నిరాటంకంగా ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన విఖ్యాతిని సొంతం చేసుకున్న తొలిపాలకుడు అయ్యాడు. 2004 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సారధ్యంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి చంద్రబాబు ఓటమి దారితీసింది. చంద్రబాబు నాయుడి రెండొవసారి ముఖ్యమంత్రిత్వంలోనే తిరిగి తెలంగాణా వేర్పాటు వాదానికి బీజాలు పడ్డాయి. చంద్రబాబు రెండోసారి పాలనలో కేంద్రంలో ఎన్డీఏ, ఉత్తరాంచల్ (నేడు ఉత్తరాఖండ్), ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ చిన్న రాష్ట్రాలు కొత్తగా ఏర్పడ్డాయి. తెలుగుదేశం అసమ్మతి నాయకుడు

కల్వకుర్తిచంద్రశేఖర్ రావు సారధ్యంలోని టిఆర్ఎస్ పార్టీ తెలంగాణా ఉద్యమానికి 2001లో ఆజ్యం పోసింది. అది ఊపందుకుని ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విభజన ఉద్యమాల నేపథ్యానికి కారణమైంది.

## హైదరాబాద్ పరిపాలన:

రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే హైదరాబాద్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇదో 'ప్రధాన' నగరమనే చెప్పాలి. ఇక్కడ నగరీకరణ ఎక్కువగా సాగింది. ఆంధ్రప్రదేశ్‌లో రెండో నగరమైన విశాఖపట్నం జనాభాతో పోలిస్తే హైదరాబాద్‌లో జనాభా నాలుగు రెట్లు అధికం. జనాభా విషయానికి వస్తే రాష్ట్రంలోని ఇతర తొమ్మిది నగరాలతో దీన్ని పోల్చలేము. 1921నాటికి 54 చదరపు కిలోమీటర్ల పరిధి ఉన్న ఈ నగరం 1933లో ఛాదర్‌ఘాట్ మున్సిపాలిటీని హైదరాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేసుకున్న తర్వాత దీని పరిధి 84 చదరపు కిలోమీటర్లకు చేరింది. తదనంతరం 1934లో ఎన్నికలు జరిగాయి. ఓ స్థాయీ సంఘం ఏర్పడింది. తర్వాత ఈ నగరంతో 1937లో జూబ్లీహిల్స్ మున్సిపాలిటీ, 1945లో సికింద్రాబాద్ మున్సిపాలిటీ అనుసంధానమయ్యాయి. పరిమాణం పెరిగి చివరికి 1960లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపుదిద్దుకుంది. అనంతరం ఈ హైదరాబాద్ నగరం రాష్ట్ర రాజధానిగా ఏర్పడింది.

నిజానికి హైదరాబాద్‌ను ఎవరు పరిపాలిస్తున్నారంటే... దేశంలోని ఇతర నగరాల మాదిరిగా చెప్పడం అంత సులభం కాదు. 2007లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)గా రూపొందింది. దీని పరిధిలో 626 కిలోమీటర్లు ఉంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు దీని చుట్టూ ఉన్న మరో 12 మున్సిపాలిటీలు కూడా ఇందులో ఇమిడిపోయాయి. జిహెచ్ఎంసీ పౌర సేవల నిర్వహణతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. హైదరాబాద్ మున్సిపల్ డవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) పరిధి ఇపుడు 7073 చదరపు కిలోమీటర్లకు విస్తరించి ఉంది.. దీంతో హైదరాబాద్ అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ కనుమరుగైపోయింది. దీనికి అనుబంధంగా కొన్ని ప్రత్యేక అభివృద్ధి బోర్డులు ఏర్పడ్డాయి. ఇపుడు హెచ్ఎండిఏ పరిధిలో 70 లక్షల జనాభాతోపాటు జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలు, సంగారెడ్డి, భువనగిరి మున్సిపాలిటీలు, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలోని 52 మండలాల్లో ఉన్న 849 గ్రామాలు ఉన్నాయి. హైదరాబాద్ పరిధిలో మొత్తం 34 అసెంబ్లీ స్థానాల్లో 26 ఈ రీజియన్ పరిధిలోనే ఉన్నాయి. హైదరాబాద్‌లో మొత్తం 9 లోక్‌సభ స్థానాలుంటే ఈ రీజియన్‌లో ఉన్నవి కేవలం రెండే. మిగిలినవన్నీ హెచ్ఎండిఏ పరిధిలోని జిల్లాల్లోనివే. ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం ఓటర్లలో ఒక్క హైదరాబాద్ పరిధిలోనే 11 శాతం ఉన్నారు.

హెఎండిఏ, జిహెచ్ఎంసీలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో మరికొన్ని సమాంతర వ్యవస్థలున్నాయి. ఇవన్నీ వేటికవి ప్రత్యేక సేవలను నిర్వహిస్తున్నాయి. కులికుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ రిజిస్టర్ సొసైటీ అయినప్పటికీ పాతబస్తీ అభివృద్ధిలో ఇది గణనీయపాత్ర పోషిస్తోంది. రంగారెడ్డి, మెదక్ జిల్లాలకు జిల్లా యంత్రాంగాలు ప్రత్యేకంగా పని చేస్తున్నాయి. 1975లో ఆంధ్రప్రదేశ్ అర్బన్ డవలప్‌మెంట్ చట్టం (అభివృద్ధి) కింద ఏర్పడిన సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీడీఏ), బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ (బీపీపీఏ), హైదరాబాద్ ఎయిర్‌పోర్టు అథారిటీ (హెచ్ఏడీఏ)లు హెచ్ఎండీఏ ఏర్పడిన తర్వాత అందులో విలీనమైపోగా ఒక్క కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (క్యూక్యూఎస్‌యుడిఏ) మాత్రం తన ఉనికిని అలాగే ఉంచుకుంది. జిహెచ్ఎంసీ సేవలను చెప్పుకోవాల్సి వస్తే పౌర సేవలకు ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, రహదారులు, వీధుల్లో

దీపాల నిర్వహణ, భవనాల ప్లాన్‌ల ధ్రువీకరణ, వినతుల స్వీకరణ, నమోదు వంటివి చేపడుతుంది. నీటి సరఫరా, ట్రాన్స్‌పోర్టు నిర్వహణ ముంబయిలో మాదిరిగా ఇక్కడ జీహెచ్‌ఎంసీ చేపట్టడం లేదు. వీటికి ప్రత్యేకంగా వ్యవస్థలున్నాయి. నీటి సరఫరాలకు, వ్యర్థాల తొలగింపు కార్యక్రమాలకు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఉండగా... పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఏపీఎస్ ఆర్టీసీ, ఎంఎంటీఎస్ చూసుకుంటున్నాయి. త్వరలో హైదరాబాద్ మెట్రోరైల్ కూడా దీనికి అనుబంధం కాబోతుంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 150 మున్సిపల్ వార్డులున్నాయి. రాజకీయ పార్టీలు పోటీ చేయడం ద్వారా ప్రత్యక్షంగా వీటికి ప్రజలు ప్రతినిధులను ఎన్నుకుంటున్నారు.

ఇవి కాకుండా హైదరాబాద్‌లో ఎపి హౌసింగ్ బోర్డు, సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూటన్ కంపెనీ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఎపి స్టేట్ హైవేస్ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (ఏపీఐఐసీ) అథారిటీలున్నాయి. వీటితోపాటు హైదరాబాద్ అవుటర్ రింగ్‌రోడ్డు చుట్టూ అభివృద్ధికి ఉద్దేశించిన హైదరాబాద్ గ్రోత్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఉంది. మెట్రోపాలిటన్ ప్రాంతంలో అభివృద్ధిని చేపట్టడానికి మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

హైదరాబాద్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను నిర్వహిస్తూ తన పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల అభివృద్ధి కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది హెచ్ఎండీఏ. పౌరులకు సేవలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయా మున్సిపాలిటీలు తయారు చేసే ప్రణాళికల ఆధారంగా నిధులను కేటాయించడం కూడా హెచ్ఎండీఏ బాధ్యత. మూలధన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై పన్నులు విధించే అధికారం కూడా ఈ వ్యవస్థకు ఉంది. హెచ్ఎండీఏ అత్యున్నత వ్యవస్థ. దీనికి ముఖ్యమంత్రి ఛైర్మన్. 26 మంది సభ్యులతో కూడిన పాలకవర్గం ఇందులో ఉంటుంది. వీరిలో మున్సిపల్ శాఖ మంత్రి (వైస్ ఛైర్మన్), జీహెచ్‌ఎంసీ మేయర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, ఎనిమిది విభాగాలకు చెందిన ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఏపీఐఐసీ, ఏపీఎస్ ఆర్టీసీ, ఏపీ ట్రాన్స్‌కో మేనేజింగ్ డైరెక్టర్‌లు, మెట్రోపాలిటన్ ప్రాంతానికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలుగాని, ఎమ్మెల్సీలుగాని, మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఎన్నికయిన నలుగురు ప్రజా ప్రతినిధులు, బీఎస్ఎన్ఎల్ సీజీఎం, దక్షిణ మధ్య రైల్వే జీఎంతోపాటు మెంబర్ కన్వీనర్‌గా మెట్రోపాలిటన్ కమిషనర్ ఉంటారు.

కేంద్రపాలిత ప్రాంతంగా... 3702 చదరపు కిలోమీటర్ల పరిధి ఉన్న గోవాతో పోల్చినపుడు హెచ్ఎండీఏ రెండు రెట్లు పెద్దది. దేశ రాజధాని ఢిల్లీ కేవలం 1483 చదరపు కిలోమీటర్లే. కేంద్రపాలిత ప్రాంతాలయిన పుదుచ్చేరి 492 చదరపు కిలోమీటర్లు కాగా చండీగఢ్ కేవలం 114 చదరపు కిలోమీటర్లే. వీటితో హెచ్ఎండీఏను పోల్చినపుడు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉంటుంది. హైదరాబాద్ హెచ్ఎండీఏతో పోల్చి చూసినపుడు ఒక్క బెంగుళూరు మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాత్రమే 8022 చదరపు కిలోమీటర్లు. ముంబాయిలోని ఎంఎంఆర్‌డీఏ కూడా 4355 చదరపు కిలోమీటర్లు మాత్రమే. హెచ్ఎండీఏకు వనరులతోపాటు రాజకీయ ప్రాతినిధ్యం కూడా సమృద్ధిగా ఉందని చెప్పవచ్చు.

## హైదరాబాద్... వ్యూహాత్మక వ్యవస్థలు

ఇంతకుముందు చెప్పినట్టు హైదరాబాద్ ఎన్నో వ్యూహాత్మక వ్యవస్థలకు వేదికై ఉంది. జాతీయ భద్రత ప్రాధాన్యం కలిగిన రక్షణ శాఖ వంటి ముఖ్యమైన 28 వ్యవస్థలు ఇక్కడ ఉన్నాయి. ఇవికాక కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ పరిశోధన, అభివృద్ధి, విద్యా సంబంధమై 40 సంస్థలు ఇక్కడ

పని చేస్తున్నాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో అనేక విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు ఇక్కడ నెలకొని ఉన్నాయి. ఇందులో ఎక్కువగా జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉండగా మరికొన్ని హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. ఇవన్నీ కూడా జాతీయంగా ఎందరినో ఆకట్టుకుంటున్నాయి.

## రాజధాని నగరం... హైదరాబాద్

ఈ విభాగంలో హైదరాబాద్ ఆర్థిక స్థితిగతులను వివరించింది. హైదరాబాద్‌ని మినహాయించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మొత్తం మూడు భాగాలుగా విభజించింది. కోస్తా ఆంధ్ర 9 జిల్లాలు, తెలంగాణ 9 జిల్లాలు, రాయలసీమ 4 జిల్లాల ఆర్థిక పరిస్థితిని విశ్లేషించింది. ప్రాంతాలవారీగా చూస్తే... స్థూల ఉత్పత్తి(జీడీపీ)లో అన్ని ప్రాంతాలు దాదాపు ఒకే రకంగా ఉన్నాయి. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు సమంగా విస్తరించింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో కోస్తా, తెలంగాణలు... ఒక రకంగా చూస్తే సమ భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. తెలంగాణ స్థూల ఉత్పత్తిలో ఆరో వంతు హైదరాబాద్ నుంచే వస్తోంది. ప్రాంతాల వారీగా ఉన్న జీడీపీలను చూస్తే... హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థకున్న ప్రత్యేకత అర్థమవుతుంది. మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే... హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ చాలా విభిన్నంగా ఉంది. నగర ఆర్థిక వ్యవస్థలో రవాణా రంగానిది 19 శాతం. ఇదే రంగంలో కోస్తాంధ్ర వాటా 6 శాతం కాగా రాయలసీమ 5 శాతం, తెలంగాణ 4 శాతం. హైదరాబాద్‌లో సేవారంగం వాటా 39 శాతంగా ఉంది. ఇది కోస్తాంధ్రలో 15, రాయలసీమలో 16, తెలంగాణలో 13 శాతాలుగా ఉన్నాయి. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు ఆధునిక ఆర్థిక వ్యవహారాల్లో ముందున్నాయి. ఇందులో ఉత్పత్తి రంగం 44 శాతం, నిర్మాణ రంగం 39 శాతం చొప్పున భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. 1999–2000 వరకు ఈ పరిస్థితి స్థిరంగా ఉంది. రవాణా రంగం 62 శాతంతో అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ ప్రాంతంలోని ఆధునిక సేవల్లో ఈ రెండు జిల్లాల వాటా 54 శాతంగా ఉంది. ప్రపంచంలోని పట్టణ ఆర్థిక వ్యవస్థల్లో ఆధునిక సేవలు కీలకమైన పాత్రను పోషిస్తున్నాయి. హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థలో ఈ ఆధునిక సేవల విస్తరణ క్రమేపీ పెరుగుతూ వచ్చింది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలతో పోల్చి చూస్తే...హైదరాబాద్ మహానగర ఆర్థిక చిత్రం వైవిధ్యంగా ఉండడానికి ఇదే కారణం. వ్యవసాయరంగంలో హైదరాబాద్‌ను మినహాయించి చూస్తే... తెలంగాణది 24 శాతం, ఉండగా కోస్తాంధ్ర 30 శాతం, సీమ వాటా 30 శాతంగా ఉంది. అలాగే నిర్మాణ రంగంలో కూడా కోస్తాంధ్రలో 7 శాతం, రాయలసీమలో 9 శాతం ఉండగా హైదరాబాద్ మినహా తెలంగాణలో 8 శాతం ఉంది. ఒక్క హైదరాబాద్‌లోనే 8 శాతం వాటాగా ఉంది. ఈ గణాంకాలు ప్రణాళికా సంఘం నుంచి స్వీకరించినవని నివేదికలో శ్రీకృష్ణ కమిటీ స్పష్టం చేసింది.

## ఉపాధి అవకాశాలు

స్థూల ఉత్పత్తితో పోలిస్తే ఆధునిక సేవల కారణంగా హైదరాబాద్‌లో ఉద్యోగిత ఉగ్గింది. ఈ రంగంలో ఇప్పటికే గణనీయమైన ఉత్పాదకత నమోదు కావడమే దీనికి కారణం. 64వ జాతీయ నమూనా సర్వేను చూస్తే ఆధునిక సేవలు హైదరాబాద్‌లో 18 శాతం ఉండగా రాయలసీమలో 3.7 శాతమే. మిగిలిన పట్టణాలతో పోల్చితే హైదరాబాద్‌లో 1999–2000 నుంచి 2007–08 కాలంలో ఆధునిక సేవల రంగంలో ఉద్యోగిత గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ, సంప్రదాయ ఉద్యోగాల్లో కొరత ఏర్పడింది. ఫలితంగా ఉద్యోగిత తగ్గింది. మిగిలిన ప్రాంతాల్లో ఉద్యోగిత పూర్తిగా తగ్గిపోయింది.. హైదరాబాద్ ఆర్థిక చిత్రం పూర్తిగా ప్రయివేటు, ఆధునిక సేవల రంగాల వైపు వేగంగా మారిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. సామాజిక వర్గాలుగా చూసినా... హైదరాబాద్‌లో ఉద్యోగిత విభిన్నంగా ఉ

ంది. ముస్లింలలో ఈ భేదం ప్రధానంగా కనిపిస్తోంది. ఆధునిక సేవల్లో ముస్లింలు తక్కువగాను, సంప్రదాయ, ఉత్పత్తి రంగాల్లో ఎక్కువగాను ఉన్నారు. వేగంగా విస్తరిస్తున్న ఆధునిక సేవల రంగాన్ని వారు అందిపుచ్చుకోలేక పోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా ముస్లింల వాటా తగ్గింది. వారు ఎక్కువగా ఉత్పత్తి, నిర్మాణ రంగాలకు తరలిపోతున్నారు. ముస్లిమేతరులు ఆధునిక సేవల రంగాల వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. ఉత్పత్తి రంగానికి కాకుండా సేవల రంగానికి నగర విధానాలు పెద్ద పీట వేస్తే ఏదో కోల్పోయామన్న భావన వారిలో ఏర్పడుతోంది.

హైదరాబాద్ నగరానికి సంబంధించి ఎస్సీలది ఆసక్తి కలిగించే అంశం. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీల వాటానే ఎక్కువగా ఉంది. దాదాపు వీరి వాటా ప్రస్తుతం 39 శాతంగా ఉంది. 1999 నుంచి ప్రభుత్వ ఉద్యోగాల్లో గిరిజనులు, ముస్లింల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. ఎస్సీల సంఖ్య 15.1 శాతం పెరిగింది. 1999 నుంచి 2008 మధ్యకాలంలో నగర ఉద్యోగాల్లో ముస్లిమేతరుల వాటా 5.8 శాతం తగ్గింది. హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థల్లో 'హైదరాబాదీ ముస్లింల' కంటే గిరిజనులు, ఎస్సీల్లోనే క్రియాశీలత ఎక్కువగా కనిపిస్తోంది. వెనుకబడిన తరగతుల వారు ప్రభుత్వ ఉద్యోగాలను వదిలి... ఆధునిక సేవలు, నిర్మాణ రంగాల వైపు మొగ్గు చూపుతున్నారు. గిరిజనులు నిర్మాణ, సంప్రదాయ రంగాలకు చేరువవుతున్నారు.

## హైదరాబాద్ చుట్టూ దృష్టి కేంద్రీకరణ

ఆధునిక సేవల్లో హైదరాబాద్ ఆర్థిక వృద్ధి గణనీయంగా పెరిగింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఈ ఆధునిక సేవల వాటా 1999-00 నుంచి 2005-06 మధ్య 20 శాతం నుంచి 25 శాతానికి పెరగగా ఇతర ప్రాంతాల్లో మాత్రం ఇది క్రమంగా తగ్గిపోయింది. హైదరాబాద్ చుట్టూనే సెజ్‌లు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళ(సెజ్‌లు) ఏర్పాటు ప్రాంతీయ సమతౌల్యాన్ని పాటించలేదు. హైదరాబాద్, దీని చుట్టుపక్కల ప్రాంతాల్లోనే సెజ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. తెలంగాణలోని మిగతా ప్రాంతాల్లో వీటి సంఖ్య తక్కువని తేలింది. కమిటీ నివేదిక ప్రకారం... సూత్రప్రాయ ఆమోదం పొందిన మొత్తం 103 సెజుల్లో 57 హైదరాబాద్ చుట్టుపక్కలే ఉన్నాయి. వీటిలో రంగారెడ్డి జిల్లాలో 49, హైదరాబాద్‌లో మూడు, మెదక్ జిల్లాలో ఐదు ఉన్నాయి. తెలంగాణలోని మిగతా ఏడు జిల్లాల్లో ఉన్న సెజ్‌లు పది మాత్రమే. కోస్తాంధ్రలో 28 సెజ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో 12 విశాఖ జిల్లాలోనే ఉన్నాయి. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు కలిపి ఎనిమిది సెజ్‌లకు అనుమతిచ్చింది. ప్రత్యేక ఆర్థిక మండళ్ళు విస్తీర్ణపరంగా చూస్తే అది కోస్తాంధ్రలో ఎక్కువగా ఉందని నివేదిక తెలిపింది. హైదరాబాద్ చుట్టుపక్కల ఏర్పాటయిన సెజ్‌లు విస్తీర్ణంలో చాలా చిన్నవి. రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళ మొత్తం విస్తీర్ణంలో కోస్తాంధ్ర సెజ్‌లు 60 శాతం ఉండగా తెలంగాణ, రాయలసీమల్లో 40 శాతం ఉన్నాయి. కోస్తాలో 76.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సెజ్‌ల ఏర్పాటుకు అనుమతి లభించింది. తెలంగాణలో 27.68 చదరపు కిలోమీటర్ల పరిధిలో, రాయలసీమలో 17.06 చదరపు కిలోమీటర్ల పరిధిలో వీటి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఐటీ, దాని అనుబంధ సేవల రంగానికి, స్థిరాస్తి వ్యాపారానికి మధ్య సంబంధం ఏర్పడడానికి సెజ్‌లే దోహదం చేశాయని నివేదిక పేర్కొంది.

## ఐటీ, ఐటీ ఆధారిత సేవల రంగం

భారతదేశంలోని ఐటీ, ఐటీ ఆధారిత సేవల రంగం నుంచి జరుగుతున్న ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా క్రమంగా పెరుగుతూ ఉంది. గత కొన్నేళ్ళుగా ఇది వృద్ధి చెందుతోంది. 2005-06లో ఇది

12 శాతం (రూ. 32,500 కోట్లు) ఉంటే 2008-09లో 15 శాతానికి అంటే 2,17,000 కోట్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగానికి కేంద్రం హైదరాబాదే. రాష్ట్రం నుంచి జరిగే ఐటీ ఎగుమతుల్లో 98 శాతం ఇక్కడి నుంచే జరుగుతున్నాయి. ఈ ప్రగతికి కారణం... 'సైబరాబాద్ అభివృద్ధి మండలి' ఏర్పాటు చేయడమే. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలు ఐటీ ప్రగతికి తొలిదశలో బాగా తోడ్పడ్డాయి. ఆ తర్వాత కాలంలో మౌలిక సదుపాయాల రంగం విస్తృతి తదితర అంశాలు అభివృద్ధికి మరింత ఊతం ఇచ్చాయి. అయితే హైదరాబాద్‌కు సహజంగా ఉన్న కొన్ని సదుపాయాలు, సానుకూల అంశాలు ఈ పరిస్థితికి కారణమయ్యాయి. మరో విశేషమేమంటే... ఈ నగరం గత కొన్నేళ్ళుగా ఉన్నత విద్యకు కేంద్రంగా ఉంది. విశ్వజనీన (కాస్మోపాలిటన్) స్వభావం కారణంగా రాష్ట్రంలోని ఇతర జిల్లాల, దేశంలోని ఇతర ప్రాంతాల నిపుణులను హైదరాబాద్ ఆకర్షిస్తోంది. జనాభాలో భిన్నత్వం, హిందీ భాషా వినియోగం కూడా నగరానికి మరింత అనుకూల వాతావరణాన్ని కల్పించి ఇతర రాష్ట్రాలవారిని, ఇతర ప్రాంతాల వారిని ఆకర్షించింది. ఐటీ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, మానవ వనరులు ఒకవైపు... వాటిని వినియోగించగల సంస్థలు మరోవైపు నగరంలో ఉన్నాయి. ఈ విధంగా హైదరాబాద్ స్వయం పోషకత్వాన్ని కలిగి ఉంది. ఇక్కడ ఏర్పాటయిన ఐటీ సంస్థలు కూడా జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగినవి కావడంతో హైదరాబాద్‌కు మరింత గుర్తింపును తీసుకువచ్చాయి. ఫలితంగా దేశీయ సంస్థలను పెట్టుబడులకు ఆకర్షించడంతో పాటు ఎగుమతులకు అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించాయి. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడానికి హైదరాబాద్ మంచి వేదికగా తయారయ్యింది.

## స్థిరాస్తి రంగం

హైదరాబాద్‌లో స్థిరాస్తి రంగం అభివృద్ధి ఐటీతో ముడిపడి ఉంది. భారీ ఐటీ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడంతో వాటికి కావలసిన మౌలిక సదుపాయాల కోసం స్థానిక కంపెనీలతోపాటు బెంగుళూరు, ముంబయి, ఢిల్లీ తదితర నగరాలకు చెందిన స్థిరాస్తి కంపెనీలు కూడా ముందుకు వచ్చాయి. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో స్థిరాస్తి రంగంలో స్థానిక కంపెనీల ఆధిపత్యమే ఇటీవల కాలం వరకు కొనసాగుతూ వచ్చింది. హైదరాబాద్‌లో మాత్రం వేరువేరు రాష్ట్రాలకు చెందిన సంస్థలు కూడా ప్రముఖంగా వచ్చి చేరాయి. భూ కేటాయింపులకు వేలంపాట జరపడం వంటి ప్రక్రియలు చేపట్టడమే దీనికి కారణమై ఉంటుందని శ్రీకృష్ణ కమిటీ అభిప్రాయపడింది. హైదరాబాద్ స్థిరాస్తి రంగానికి ఒక ముఖ్యమైన వేదికని నిరూపితమయ్యింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ఈరంగంతో సంబంధాలను కలిగి ఉండడానికి కారణం హైదరాబాద్ స్థిరాస్తి రంగానికి మంచి వేదికని భావించడమే. విజయవాడ ఎంపీ లగడపాటి రాజ్‌గోపాల్‌కు చెందిన ల్యాంకో, విశాఖపట్నం ఎంపీ టి.సుబ్బిరామిరెడ్డికి చెందిన గాయత్రి కన్‌స్ట్రక్షన్, గుంటూరు ఎంపీ రాయపాటి సాంబశివరావుకు చెందిన ట్రాన్స్‌ట్రాయ్ వంటివి ఇందులో ముఖ్యమైనవి. హైదరాబాద్‌తోపాటు దీనిని ఆనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లాలో కూడా స్థిరాస్తి రంగం బాగా విస్తరించింది. రాష్ట్రంలో స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు, దాంట్లో జరిగే వ్యాపారం ఏ స్థాయిలో ఉందో లెక్క గట్టడానికి స్పష్టమైన ఆధారాలు లేవు. కాని ఆస్తుల బదలాయింపుల వల్ల రాష్ట్ర ఖజానాకు లభించే ఆదాయాన్ని బట్టి ఒక అంచనాకు రావచ్చు. అయితే హైదరాబాద్ వాటా 2004-05 కాలంలో 17 శాతం ఉంటే 2008-09 నాటికి ఇది 11 శాతానికి పడిపోయింది. అలాగే రంగారెడ్డి జిల్లాలో కూడా ఇది 30 శాతం అయిపోయింది. దీనికి ప్రాంతీయ వాదమే కారణమని చెప్పవచ్చు. ఈ రెండు జిల్లాల రాబడిలో దాదాపు 40 శాతం రెవిన్యూ ఆస్తుల బదలాయింపు వల్లే వస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. స్థూల ఉత్పత్తిపై ఇది ప్రభావం చూపుతుంది.

## మౌలిక రంగం - పెట్టుబడులు

రాజకీయ, ప్రాంతీయ అనిశ్చితి కొనసాగుతున్నా మౌలిక రంగంలో పెట్టుబడులు కొనసాగుతూనే ఉన్నాయి. హైదరాబాద్‌ని మరింత పరిపుష్టం చేయడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు పెట్టుబడులు వస్తూనే ఉన్నాయి. ఇందులో కొన్ని ప్రాజెక్టులు...

ఇరవై రెండు చదరపు కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటయిన రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణ కొనసాగుతూనే ఉంది. యేడాదికి కోటి మంది ప్రయాణికుల సామర్థ్యంతో ఉన్న ఈ విమానాశ్రయాన్ని నాలుగు కోట్ల మంది ప్రయాణికుల లక్ష్యానికి చేర్చాలన్నది ప్రణాళిక. దీనికి అవసరమైన ఏర్పాట్లను జి.ఎం.ఆర్. సంస్థ చేపడుతూనే ఉంది. కోస్తా ఆంధ్ర ప్రాంతానికి చెందిన జి.ఎం.ఆర్. గ్రూపు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సంస్థ. ఇస్తాంబుల్, టర్కీ బ్రిటన్, నెదర్‌లాండ్స్, మెక్సికో తదితర దేశాలలో ఇది అనేక ప్రాజెక్టులను చేపడుతుంది. జాతీయ రహదారులు, ఇంధనం, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో అపార అనుభవం ఉన్న ఈ సంస్థ హైదరా బాద్‌లో తన ప్రాజెక్టును కొనసాగిస్తూనే ఉంది. 11.6 కిలోమీటర్ల విస్తీర్ణంగల పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే, 159 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సర్వీస్ (ఎంఎంటీఎస్), హైదరాబాద్ మెట్రో రైల్ తదితర ప్రాజెక్టులు వడివడిగా నడుస్తున్నాయి. ఇందులో కొన్ని ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంలోను, మరికొన్ని పూర్తిగా ప్రయివేటు సంస్థల నిర్వహణలోను, మరికొన్ని ప్రభుత్వ నిర్వహణలోను జరుగుతున్నాయి.

## హైదరాబాద్ - వలసలు

హైదరాబాద్ జనాభాలో 25 శాతం మంది వలస వచ్చిన వారే. అంటే మొత్తం జనాభాలో 14 లక్షలు. 2001 జనాభా లెక్కల ప్రకారం ఇది స్పష్టమవుతుంది. 2007-08 ఎన్ఎస్ఎస్ సర్వే ప్రకారం... నగరంలోని 35.7 శాతం మంది ఇతర ప్రాంతాలకు చెందిన వారిగా వెల్లడైంది. హైదరాబాద్‌కు యేటా 10.6 శాతం వలసలు కొనసాగుతున్నాయి. వలస వచ్చిన వారిలో 84 శాతం మంది రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందినవారు. మిగిలిన శాతం తెలంగాణ జిల్లాల నుంచి కొనసాగుతోంది. అయితే ఇది క్రమంగా తగ్గుతోంది. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్, కేరళ, గుజరాత్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వలసలు అధికంగా ఉండే ముంబయిని పరిశీలిస్తే... మహారాష్ట్రలోని వివిధ జిల్లాల నుంచి ఆ నగరానికి వస్తున్నవారి సంఖ్య 26 శాతం మాత్రమే. వివిధ రాష్ట్రాల నుంచి అక్కడికి వచ్చేవారే అత్యధికం. ఈ రకంగా కాస్మోపాలిటన్ స్వభావం ప్రకారం చూస్తే హైదరాబాద్, విశాఖపట్నం ముందుకు వెళుతున్నప్పటికీ ముంబయితో వాటిని పోల్చలేం.

ఈ వలసలు నాలుగు దశలుగా జరిగాయి. హైదరాబాద్‌కు రాయలసీమ, కోస్తాంధ్ర నుంచి, తెలంగాణ జిల్లాల్లోని ఇతర ప్రాంతాల నుంచి ఈ వలసలు జరుగుతున్నాయి. 1950కి ముందు నిజాంసాగర్ డ్యాం దిగువ ప్రాంతంలో భూముల సాగు కోసం నిజాం ప్రభుత్వం కోస్తాంధ్ర రైతులను ఆహ్వానించింది. అదే సమయంలో కోస్తాంధ్ర జిల్లాల్లో పెట్టుబడిదారీ రైతు వర్గం మరింత విస్తరించింది. తెలంగాణ ప్రాంతంలో 'గుంటూరు పల్లెలు' విస్తరించింది ఈ సమయంలోనే. వీరినే సెటిలర్లుగా పిలుస్తున్నారు. రెండోదశలో 1950లలో కమ్యూనిస్టులు తమ పట్టు కోల్పోతున్నప్పుడు వలసలు ప్రోత్సహించడం జరిగింది. ఎగువ కర్ణాటక ప్రభుత్వం అమలు చేస్తున్న సాగు నీటి ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందేందుకు తెలంగాణకు తరలి రావాలంటూ కమ్యూనిస్టులు తమ శ్రేణులను ప్రోత్సహించాయి.

తర్వాత మూడో దశలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో వలసలు బాగా జరిగాయి. ఇది 1980 ప్రాంతంలో జరిగింది. ఈసారి ఎక్కువగా పెట్టుబడిదారులు, వ్యాపారులు తరలివచ్చారు. నాలుగోదశలో వలసలు రావడానికి ప్రబల కారణమే ఉంది. 2000 సంవత్సరం ప్రాంతంలో ఐటీ విప్లవం రాకతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి విద్యావంతులు హైదరాబాద్‌కు భారీగా తరలివచ్చారు. ఇలా ఐదు సందర్భాల్లోను వలసలు భారీగానే జరిగాయి. తొలిదశలో స్థానికులు, సెటిలర్ల మధ్య పెద్ద తేడా ఏమీ కనిపించలేదు. తొలి రెండు దశల్లో వలసగా వచ్చినవారు చాలామంది తమ మూలాలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. తెలంగాణలో వారు మమేకమైపోయారు. కొన్నిచోట్ల వారు ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మద్దతు కూడా ఇస్తున్నట్టు వార్తలను గమనించాం. కోస్తాంధ్ర, రాయలసీమల్లో పుట్టి హైదరాబాద్, రంగారెడ్డిల్లో ఉంటున్న వారు ఇక్కడి జనాభా మొత్తంలో 7.2 శాతంగా ఉన్నారు. వీరు ఈ రెండు జిల్లాలకు వెలుపల పుట్టినవారిలో సగానికంటే తక్కువే.

పనుల కోసం హైదరాబాద్‌కు తాత్కాలికంగా వలస వచ్చేవారు కేవలం ఒక శాతమే. అయితే ఇలా తాత్కాలికంగా వలస వచ్చేవారు జిల్లాల్లోని ఇతర పట్టణ ప్రాంతాలకు కూడా వెళుతున్నారు. వీరిలో ఎక్కువ మంది సంప్రదాయ సేవలు, నిర్మాణ రంగాల్లో పని చేస్తున్నారు. రాయలసీమ నుంచి 74 శాతం మంది వలస వస్తుంటే ఇందులో 89 శాతం మంది ఈ రెండు రంగాల్లోనే పని చేస్తున్నారు. అలాగే కోస్తాంధ్ర నుంచి పట్టణ ప్రాంతాలకు 52 శాతం మంది వలస పోతుండగా ఇందులో 86 శాతం మంది పై రెండు సేవలకే పరిమితమవుతున్నారు. హైదరాబాద్ మినహా తెలంగాణ జిల్లాల నుంచి వలస పోతున్న 67 శాతం మందిలో 75 శాతం మంది ఈరెండు రంగాల్లోనే పని చేస్తున్నారు. ఇక్కడొక విషయాన్ని కమిటీ గమనించింది. పల్లెలకు కూడా పనుల నిమిత్తం తాత్కాలికంగా వలసలు జరుగుతున్నాయి. అయితే వీరంతా వ్యవసాయ పనుల నిమిత్తం వలస పోతున్నా వారు. కోస్తాంధ్ర నుంచి సొంత జిల్లాల్లోనే పల్లెలకు వలస పోతున్నవారు 15 శాతం కాగా రాష్ట్రంలోని పల్లెలకు వలస పోతున్నవారు 29 శాతం, ఇతర రాష్ట్రాల్లోని పల్లెలకు వలస పోతున్నవారు 4 శాతం మంది ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇదే రాయలసీమలో అయితే సొంత జిల్లాల్లోని పల్లెలకు వలస పోతున్నవారు ఒక్క శాతం కాగా రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని గ్రామాల్లోని వలస పోతున్నవారు 20 శాతం, ఇతర రాష్ట్రాల్లోని పల్లెలకు వలస పోతున్నవారు ఐదు శాతంగా ఉన్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్ మినహా తెలంగాణ జిల్లాల్లో సొంత జిల్లాల్లోని గ్రామాలకు వలస పోతున్నవారు 21 శాతం మంది ఉండగా రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని పల్లెలకు వలసపోతున్నవారు 11 శాతం, ఇతర రాష్ట్రాల్లోని పల్లెలకు వలస పోతున్నవారు ఒక్క శాతంగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ లెక్కన చూస్తే కోస్తాంధ్ర నుంచే పల్లెలకు వలసలు ఎక్కువగా జరుగుతన్నట్టు స్పష్టమవుతోంది. ఇక్కడ నుంచి 48 శాతం మంది వలస పోతుండగా రాయలసీమ నుంచి 26 శాతం, హైదరాబాద్ మినహా తెలంగాణ నుంచి 33 శాతం ఇలాంటి వలసలు కొనసాగుతున్నాయి.

## హైదరాబాద్ – పెట్టుబడులు

హైదరాబాద్ నగరంలో పెట్టుబడులు పెట్టినవారు ఈ ప్రాంతం వారని చెప్పడానికి కచ్చితమైన ఆధారాలు లేవు. సిఎంఐఈ డేటా ఆధారంగా 2000-2010 మధ్యకాలంలో చేపట్టిన ప్రాజెక్టులు, వీటిపై చేసిన మూలధన వ్యయం తదితరాల విశ్లేషణతో కమిటీ కొంత సమాచారాన్ని సేకరించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో జరిగిన పెట్టుబడులను ఆధారం చేసుకుని 94 గ్రూపులుగా వర్గీకరించింది. ఇందులో 74 ఆంధ్రప్రదేశ్ నుంచి కాకుండా బయట ప్రాంతానికి చెందినవి. ఇందులో

కొన్ని విదేశీ కంపెనీలు కూడా ఉన్నాయి. కేంద్రం, ఇతర రాష్ట్రాలకు చెందిన పెట్టుబడిదారులను హైదరాబాద్ బాగా ఆకర్షించిదని చెప్పవచ్చు. మొత్తం పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 25 శాతం మాత్రమే. నిర్మాణ రంగం, స్థిరాస్తి వ్యాపారం, ఆర్థిక వ్యవహారాలు, సర్వీస్ రంగంలో సైతం ఆంధ్రప్రదేశేతర ప్రాంతం వారే ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. అయితే ఫార్మాస్యూటికల్స్, ఆరోగ్యం, విద్యా రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఎక్కువగా పెట్టుబడులు పెట్టారు. ఇప్పటివరకు పూర్తి అయిన 337 ప్రాజెక్టుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు 25.1 శాతం, రాష్ట్రేతరులు 39.7 శాతం, కేంద్ర ప్రభుత్వం వాటా 13.5 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 20.8 శాతం కాగా 1.5 శాతం మంది ఎవరో తెలియలేదు. ఈ 337 ప్రాజెక్టుల్లో 31,268 కోట్ల రూపాయల పెట్టుబడులు ఉన్నట్టు కమిటీ గమనించింది. కొనసాగుతున్న 128 ప్రాజెక్టుల్లో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారులు 33.9 శాతం, రాష్ట్రేతరులు 33.9 శాతం, కేంద్రం వాటా 3.6 శాతం, రాష్ట్రం వాటా 26.5 శాతం కాగా రెండు శాతం ఏ ప్రాంతం వారో గుర్తించాల్సి ఉంది. ఇందులో 61,971 కోట్ల రూపాయల పెట్టుబడులు ఇమిడి ఉన్నాయి. ప్రకటిత 223 ప్రాజెక్టుల్లో కూడా రాష్ట్ర పెట్టుబడిదారులు 14.1 శాతం, రాష్ట్రేతరులు 60.9 శాతం, కేంద్రం వాటా 1.8 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 19.0 శాతంగా ఉంది. 4.2 శాతం ఎవరిదో ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టుల్లో 1,87,147 కోట్ల పెట్టుబడులు ఇమిడి ఉన్నాయి. స్థూలంగా గత పదేళ్ళ నుంచి పెట్టుబడులు పెరుగుతూ వస్తున్న విషయం గమనించాల్సి ఉంది. వార్షిక పరంగా చూస్తే 2008 తర్వాత పెట్టుబడుల రాకతోపాటు ప్రాజెక్టుల నిర్మాణం కూడా ఆశించిన స్థాయిలో వేగంగా జరగడం లేదనే విషయం స్పష్టమవుతోంది. దీనికి కారణం ప్రాంతీయంగా ఉన్న వివాదాలు... అసమానతల అనుమానం... అశాంతి... అని విదితమవుతోంది.

## ఇతర నగరాలు - కోస్తాంధ్ర

హైదరాబాద్ తర్వాత బాగా పేరున్న నగరం విశాఖపట్నం. ఇది భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమలు, తూర్పు నౌకా దళ కమాండ్‌కు నెలవుగా ఉంది. తద్వారా దేశ వ్యాప్తంగా ప్రజల్ని ఆకర్షిస్తుండడంతో దీనికి కాస్మోపాలిటన్ ఇమేజ్ ఏర్పడింది. విశాఖ-కోస్తా కారిడార్ వెంబడి పెట్రోలియం, కెమికల్, పెట్రో-కెమికల్ జోన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఫలితంగా ఈ ప్రాంతం పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఇవికాక... కేజీ బేసిన్‌లోని రిలయన్స్, ఎస్సార్-గుజరాత్‌ల ఆధ్వర్యంలోని గ్యాస్, విద్యుత్ ప్రాజెక్టులు, మరోవైపు జీఎంఆర్ వంటి సంస్థలు కాకినాడ చుట్టుపక్కల విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పుతున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ తయారు చేసిన నగరాభివృద్ధి ప్రణాళికను పరిశీలిస్తే... విశాఖపట్నంలో 55 భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో 42 ప్రయివేటు రంగంలోను, ఐదు సహకార రంగంలోను ఉన్నాయి. విశాఖ రిఫైనరీకి సొంతమైన హెచ్‌పీసీఎల్ 571 కిలోమీటర్ల పైపులైనుతో రాజమండ్రి, విజయవాడ, సూర్యాపేట, హైదరాబాద్‌లకు చమురును సరఫరా చేస్తోంది. సౌత్ ఆసియా ఎల్‌పీజీ కంపెనీ, ఫ్రెంచ్‌కు చెందిన టోటల్ గ్యాస్ కంపెనీ, విశాఖ స్టీల్ ప్లాంట్, ఆంధ్ర పెట్రో కెమికల్స్, ఎన్‌టీపీసీ, బీహెచ్‌ఈఎల్, హిందుస్థాన్ షిప్‌యార్డు, ఎన్‌ఎస్‌టీఎల్‌లు ఈ ప్రాంతంలోనే నెలకొని ఉన్నాయి. సంపన్నవంతమైన డెల్టా జిల్లాలైన గుంటూరు, కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు... వీటి పరిధిలోని విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు నగరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. 19, 20 శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ ప్రభుత్వ విధానాల మూలంగా ఇక్కడ కాలువల ద్వారా వ్యవసాయం జరిగి ఇవి సంపన్న జిల్లాలుగా మారాయి. హరిత విప్లవానికి ఈ జిల్లాలు ప్రతీకలై రైతులు మార్గదర్శకులయ్యారు. ఫలితంగానే గుంటూరు, విజయవాడ, రాజమండ్రి సంపన్న నగరాలుగా అభివృద్ధి చెందాయి. ఇక్కడ రైతులంతా

కమ్మ, రెడ్డి కులాల నుంచి వచ్చిన వారై ఉండి ఔత్సాహిక రైతులుగా మారారు. వ్యవసాయం నుంచి వస్తున్న ఆదాయాల్లో మిగులును వీరు అనేక ప్రాజెక్టుల్లో పెట్టుబడులుగా పెడుతున్నారు. తొలినాళ్ళలో వీరు ధాన్యం సేకరణ, వాణిజ్యంపై దృష్టిపెట్టి తర్వాత దేశంలోని ఇతర ప్రాంతాలకు వీటిని ఎగుమతి చేయడానికి ప్రాధాన్యం ఇచ్చారు. తర్వాత ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు కొనడంపైన, వ్యవసాయానుబంధ పరిశ్రమలపైన దృష్టి సారించారు. చక్కెర, ఆయిల్ మిల్స్, సినిమా పరిశ్రమ, ఆర్థిక సంస్థలు, రవాణారంగాన్ని వీరు పెట్టుబడులతో ఆకర్షించారని చెప్పవచ్చు. తెలంగాణలో 'గుంటూరు పల్లెలు' అన్న దానికి మూలం ఈ నేపథ్యమేనని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే వీరికి ఇతర పట్టణాలతో అనుబంధం ఏర్పడడం, చదువులపై ఆసక్తి పెరిగి పిల్లలను చదివించడం, తమ పిల్లలకు కూడా మంచి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యాలు ఏర్పడడం, ఇతర ప్రాంతాలకు పంపి ఉద్యోగాల్లో స్థిర పడేట్టు చేయడం జరిగింది. ఫలితంగానే వలసలకు కారణమైంది. ఈ నేపథ్యంలోనే విజయవాడ రవాణా రంగానికి పెద్ద కేంద్రమైపోయింది. విజయవాడ, గుంటూరు కూడా విద్యా సంస్థలకు నెలవయ్యాయి. ఇలా అనేక అంశాల ప్రభావంగా హైదరాబాద్‌తో వీరికి అనుబంధం ఏర్పడింది.

## రాయలసీమ

రాయలసీమలో పట్టణీకరణ తక్కువ. ఆంధ్రప్రదేశ్‌లోని మిగతా నగరాలు పట్టణాలతో పోల్చి చూసినపుడు రాయలసీమ బాగా వెనుకబడి ఉందని చెప్పవచ్చు. పైగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచి వలసలు అధికంగా ఉండడం ఇందుకు సాక్ష్యం. ఈ ప్రాంతంలోని పెద్ద పట్టణంగా చెప్పుకోవాల్సి వస్తే కర్నూలు మాత్రమే. తర్వాత తిరుపతి. ఇది యాత్రా కేంద్రం. కర్నూలు 1953 నుంచి 1956 వరకు ఆంధ్ర రాష్ట్రానికి రాజధానిగా ఉంది. అయినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ప్రస్తుత రాజధాని హైదరాబాద్‌తో దీన్ని పోల్చి చూడలేము. కర్నూలుకు ప్రధానంగా వ్యవసాయం, రవాణా రంగాల నుంచి మాత్రమే ఆదాయం వస్తోంది. 2005-06 సంవత్సరంలో కర్నూలు ప్రాంతానికి 34 శాతం వ్యవసాయంపైన, 23 శాతం సంప్రదాయ సేవలు, ఆధునిక సేవల ద్వారా 14 శాతం ఆదాయం వచ్చినట్టు గణాంకాలు చెబుతున్నాయి. విజయవాడ, గుంటూరు, రాజమండ్రి మాదిరిగా వ్యవసాయం, వ్యాపార సంబంధాల విషయంలో కర్నూలుకు కొన్ని సామీప్యతలున్నాయి. కాని తిరుపతి మాత్రం పూర్తిగా "ఆలయ పట్టణం"గానే విరాజిల్లుతోంది. భక్తులు, యాత్రికుల నుంచి వచ్చే ఆదాయమే తిరుపతికి ప్రధాన వనరు అని చెప్పక తప్పదు.

పైన పేర్కొన్న కీలక నగరాలు కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని మిగతా ముఖ్య పట్టణాల మధ్య పరస్పర ఆధారిత ఆర్థిక అవసరాలు పరిమితమే. హైదరాబాద్, కోస్తాంధ్ర, రాయలసీమల్లోని ప్రతి పట్టణ కేంద్రం కూడా తమకంటూ సొంతంగా పోషకత్వంతో కూడిన ఆర్థిక పునాదిని, వృద్ధి కారకాలను కలిగి ఉన్నాయి. ఈ విధమైన ఆర్థిక వైవిధ్యం ఉన్నప్పటికీ అది ప్రాంతాల మధ్య ప్రజల రాకపోకలకు, బలమైన సామాజిక, సాంస్కృతిక సంబంధాలు పెంపొందించుకునేందుకు అడ్డంకిగా నిలవడం లేదు.

ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే... ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ప్రధాన పట్టణ కేంద్రమనే విషయం స్పష్టమవుతుంది. ఇది రాష్ట్రంలోని ఇతర నగరాల కంటే భారీ నగరమైనప్పటికీ... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇతర నగరాలు మార్కెట్ అనుసంధానం, ఇతర సేవల కోసం దీనిపైన పూర్తిగా ఆధారపడి మాత్రం లేవు. 300పేజీవద్ద పూర్తయింది.

ㅇ ㅇ ㅇ

అధ్యాయం
7
# సామాజిక, సాంస్కృతిక అంశాలు

తెలంగాణాలో ప్రస్తుతం జరుగుతున్న వేర్పాటు ఉద్యమం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల్లో భావోద్వేగాలు చోటుచేసుకున్నాయి. తెలంగాణా ప్రాంత వాసులు ఏక కంఠంతో ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరగా, కోస్తాంధ్ర, రాయలసీమల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కోస్తాంధ్రలో చాలా తక్కువ మంది రాష్ట్ర విభజనకు తాము సిద్ధంగా ఉన్నామనీ, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంతో సంతృప్తి చెందగలమని చెప్పగా అత్యధిక సంఖ్యలో ప్రజలు తమకు సమైక్యాంధ్రే ఇష్టమని అన్నారు. రాయలసీమలో కూడా సమైక్యాంధ్రకు మొగ్గు చూపారు. అయితే వారిలో కొన్ని వర్గాలు విభజన గనుక జరిగితే మూడు రాష్ట్రాలుగా జరగాలని గ్రేటర్ రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలనీ తమ అభిప్రాయంగా ప్రకటించారు.

రాష్ట్రంలో విభజన కొరకు పలు ఉద్యమాలు చోటు చేసుకున్నాయి. 1969 నుండి 72 వరకు జరిగిన వేర్పాటు ఉద్యమాలు ఎలాంటి ఫలితాలనూ ఇవ్వలేకపోయాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలను, విద్యావకాశాలను సమానంగా చేసేందుకు జోన్‌ల వారి పద్ధతిని 1972లో రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా తీసుకువచ్చి వేర్పాటు ఉద్యమాన్ని ఆపగలిగారు. ఈ జోన్‌ల వారీ విధానం రాజకీయ విజయంగా అప్పట్లో పరిగణించారు. ఆ తరువాత తెలుగుదేశం పార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవం నినాదం వేర్పాటు ఉద్యమాన్ని మరింత పక్కకు నెట్టివేసింది.

ప్రస్తుత వేర్పాటు ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన వాటా అనే అంశం ప్రాధాన్యతను సంతరించుకున్నా తెలంగాణా సంస్కృతి విభిన్నమైనదన్న వాదనకూడా దీనికి తోడైంది. సమైక్యాంధ్రలో ఈ విభిన్న సంస్కృతికి మనుగడ లేకుండా పోతోందని, రాజకీయంగా కూడా కోస్తాంధ్రవారు తెలంగాణాపై ఆధిక్యతలో ఉన్నారనీ, రాయలసీమ ఫ్యాక్షనిస్టు రాజకీయాల ద్వారా తెలంగాణా కన్నా ఆధిక్యంలో ఉన్నారని నిరసనలు వెల్లువెత్తాయి. పెద్దమనుషుల ఒప్పందంలోని అంశాలను సరిగా అమలుచేయలేదన్న వాదన కూడా ఉంది.

తెలంగాణా ప్రాంత వాసుల నుండి ఫిర్యాదులందుకున్నాక ఆర్థిక, విద్య, ఉపాధి, నీటిపారుదల తదితర రంగాల్లో ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి, వివక్షకు గురవుతుందన్న ఆరోపణలను కమిటీ పరిశీలించింది. ఈ ప్రాంతంలో ఆర్థికాభివృద్ధి అత్యధికంగా ఉందని కమిటీ అభిప్రాయపడింది. కొన్ని రంగాల్లో సౌభాగ్యవంతమైన ఆంధ్రప్రాంతాన్ని మించిన అభివృద్ధి జరిగింది. అయితే ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన వాటా రావడం లేదనీ, సాగునీటి అభివృద్ధి జరగడం లేదనీ, విద్యాసౌకర్యాలు తగినంతగా లేవనీ వచ్చిన ఆరోపణలలో కొంత నిజం ఉంది. కానీ తెలంగాణా నాయకులు హామీ ఇస్తున్న మాదిరిగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే నీటికి, ప్రభుత్వ ఉద్యోగాలకు, విద్యకు ఆటోమాటిక్‌గా అవకాశాలు ఏర్పడతాయనేది సరైనది కాదు.

ఆర్థిక, రాజకీయ అసమానతలను కొన్ని నిర్ణీత పద్ధతుల ద్వారా సరిచేయడం వీలవుతుంది. అయితే సాంస్కృతిక వైరుధ్యాన్ని సరిచేయడం కష్టం. ఇక్కడ కొన్ని ప్రశ్నలకు సమాధానాలను రాబట్టాల్సి ఉంటుంది. చారిత్రాత్మక అనుభవాలు, సాంస్కృతిక వైరుధ్యాలు, ప్రాంతీయతను రెచ్చగొట్టి కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నాయా? వేర్పాటువాదం పూర్తిగా అసూయ నుండి, నిర్లక్ష్యం నుండి, నిరాదరణ నుండి ఉద్భవించిందా? లేక ఆ వేర్పాటు వాదానికి సరైన కారణం ఏదైనా ఉందా? వేరు పడటం వలన తెలంగాణకు ఏ విధమైన లాభం చేకూరుతుంది?

తెలంగాణా ఉద్యమం దేశ సమైక్యతకు ఏ విధమైన భంగం కలిగించని ఉద్యమం. అయినా కూడా ఈ డిమాండ్ వల్ల దేశం మీద పడే ప్రభావాన్ని పరిగణించాల్సి వుంటుంది. ఈ విషయాన్ని ముగింపులో చర్చించటం జరిగింది. ఈ ప్రస్తుత ఉద్యమానికి కొన్ని చర్చనీయాంశాలు వున్నాయి. రాష్ట్రావతరణకు భాష ప్రాతిపదిక కాదు. పెద్ద రాష్ట్రాల కన్నా చిన్న రాష్ట్రాలు అభివృద్ధి పథంలో నడవగలవు: చిన్న రాష్ట్రాలలో పరిపాలన సౌలభ్యంగా ఉంటుంది. వీటన్నింటిని మించిన ప్రశ్న చిన్న రాష్ట్రాల డిమాండును ఏవిధంగా సంతృప్తి పరచాలి అనేది?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణా ఏర్పాటు ఉద్యమానికి ఒక వైవిధ్యత వుంది. విభజన తరువాత హైదరాబాద్ నగరం పరిస్థితి ఏమిటనేది ఆ వైవిధ్యత. హైదరాబాద్ నగరంలో వేర్పాటు ఉద్యమ ప్రభావం అంతగా లేదు. ఒక్క ఉస్మానియా యూనివర్శిటీలోనే విద్యార్థుల ఉద్యమ తీవ్రత కనపడుతుంది. ఈ నగరంలో ముస్లిమ్ సంస్కృతి విస్తరించి వుంది. ముస్లిం జనాభా మొత్తం జనాభాలో సుమారు 41%గా ఉంది. ఈ ఉద్యమం ద్వారా ఆయా వర్గాల వారు తమ అభిప్రాయాలనూ, కోరికలనూ వెల్లడించేందుకు అవకాశం ఏర్పడింది. ఈ కమిటీ కూడా షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారు, ముస్లిములు తదితర ఇతర మైనారిటీ గ్రూపులతో ముఖాముఖీ సమావేశము జరిపి రాష్ట్ర ముఖచిత్రం మారితే వారికి లాభమేమిటి? లేదా నష్టమేమిటి? అని అడిగి తెలుసుకుంది. చాలా మంది తాము ఆ ప్రాంతానికి చెందిన వారం కనుక ఆ ప్రాంతపు సామాజిక, ఆర్థిక లాభనష్టాలతో తమ జీవితాలు కూడా ముడివడి ఉన్నాయని తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. తమ ప్రాంత వాతావరణం, నైసర్గిక స్వరూపం, లభ్యమయ్యే ప్రాథమిక సౌకర్యాలు, సాగునీటి వనరులు, వైద్య, విద్యా సౌకర్యాలు రాజకీయ పరిపాలనలో నాణ్యత తదితర అంశాలు తమ దైనందిక జీవితాన్ని ప్రభావితం చేస్తాయని వారన్నారు. చారిత్రకంగా తెలంగాణా ఆంధ్రప్రాంతానికి విరుద్ధంగా ఉంటుందనీ, ఆంధ్రప్రాంతం సాంస్కృతిక పరంగా బలమైనదనీ కనుక తెలంగాణాకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే స్వపరిపాలన, ఆత్మగౌరవం తమకు ఉంటాయనీ వారి వాదన.

ఈ కమిటీ రాష్ట్రంలో వందలాది వర్గాలతో సమావేశమయ్యారు. మూడు ప్రాంతాలలో పలు గ్రామాలనూ, పట్టణాలనూ, కాలేజీలనూ, విశ్వవిద్యాలయాలను సందర్శించింది. అన్నిసామాజిక వర్గాలకూ చెందిన ప్రజలూ, కులాలూ, తరగతులూ, ఉద్యోగులూ, మహిళలూ, మత సంబంధమైన వారూ, గిరిజనవర్గాలూ మొదలైన వారందరూ ఈ అంశంమీద మమ్మల్ని సంప్రదించారు. కమిటీకి పంపిన ప్రాతినిధ్యాలను నిశితంగా పరిశీలించడం జరిగింది. రాష్ట్రంలోని విద్యాధికులతో, మేధావులతో, ప్రముఖ వ్యక్తులతో చర్చించడం జరిగింది. ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో విస్తృతంగా చర్చలు జరిగాయి.

తెలంగాణా ప్రాంతంవారి వాదన ప్రకారం 54 సంవత్సరాలు కలిసి వున్న తరువాత కూడా సీమాంధ్ర, తెలంగాణా ప్రాంతాల మధ్య సమైక్య భావన కుదరలేదు. కుటుంబాన్ని ఉదహరిస్తూ

చాలామంది తమ వాదనలను వినిపించారు. తెలంగాణా ప్రాంతంలో వారు 'చిన్న కుటుంబం' మంచిదని వాదించారు. ఉమ్మడి కుటుంబంకన్నా చిన్న కుటుంబంలో అభివృద్ధి ఎక్కువగా జరుగుతుందనీ అన్నారు. తెగతెంపుల దాకా వెళ్ళేబదులు ముందుగానే విడిపోతే మంచిదన్నది వారి వాదన. మిగతా రెండు ప్రాంతాలవారు ఉమ్మడి కుటుంబంలోని ప్రయోజనాలను వివరించారు. 'సోదరుల మధ్య వివాదాలుంటాయి వాటిని సామరస్యంగా పరిష్కరించుకోవాలి' అని అన్నారు. మరో వింత ఉదాహరణ ఏమంటే రాష్ట్రం ఒక మానవ శరీరం. దాని గుండె హైదరాబాద్ నగరం. ఆ గుండెను మేము వదలమని తెలంగాణా వారన్నారు. రాయలసీమవారు మాత్రం హైదరాబాద్‌ను మానవశరీరంలో తలగా అభివర్ణించారు. మూడు ప్రాంతాలవారు హైదరాబాద్ నగర నిర్మాణానికి ఉన్నతికి తాముకూడా శ్రమించామని చెప్పుకొచ్చారు. తమ విద్య, ఉపాధి స్వప్నాలు హైదరాబాద్‌తో ముడిపడి ఉన్నాయని వారన్నారు.

తెలంగాణా ఉద్యమం అప్పుడప్పుడు తలెత్తుతూ వస్తుంది. ప్రస్తుత ఉద్యమం కె. చంద్రశేఖరరావు 2009 నవంబరు 29న ఆమరణ నిరాహారదీక్షకు కూర్చోవడంతో భావోద్వేగం వల్ల ఏర్పడ్డది. హోంమంత్రి 2010 డిసెంబరు 9న ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు కొరకు కేంద్రం ప్రక్రియను ప్రారంభించనున్నదని ప్రకటించడంతో పలుసంఘటనలు జరిగి రాష్ట్రం భావోద్వేగ వాతావరణంతో నిండిపోయింది. సీమాంధ్ర ప్రాంతాలు రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నడిపాయి. ఫలితంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర డిమాండ్లను పరిశీలించేందుకు ఒక కమిటీని వేసింది.

ఈ కమిటీ ఏర్పడ్డ తరువాత పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంకోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీ టిఆర్ఎస్ భారీఎత్తున రాజకీయ సమీకరణకు ప్రయత్నించింది. మరికొన్ని చిన్న గ్రూపులు కూడా ఈ విధంగానే చేశాయి. మరోవైపు సీమాంధ్రలో కూడా రాజకీయ సమీకరణ ప్రయత్నాలు జరిగాయి. తెలంగాణా ప్రాంతంలో ఈ సమీకరణ హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి, వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయానికి పరిమితమైంది.

ఈ కాలంలో అనేక ఉమ్మడి కార్యాచరణ సంఘాలు (జెఎసి) పుట్టుకొచ్చాయి. వాటిలో ముఖ్యమైనవి ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కోదండరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన జెఎసి ప్రారంభంలో రాజకీయ పార్టీలన్నీ ఈ జెఎసిలో సభ్యత్వాన్ని పొందాయి. ఆ తరువాత టిఆర్ఎస్‌తో పాటు కొన్ని పార్టీలు దీన్ని వదలివెళ్ళాయి. అయితే జెఎసి తన ఉద్యమాన్ని తెలంగాణలో జిల్లా, మండల, గ్రామ స్థాయికి తీసుకెళ్ళగలిగింది. దీనితో ప్రత్యేకరాష్ట్రం కొరకు డిమాండు తారస్థాయికి చేరుకుంది. తెలంగాణా రాజకీయనాయకులు చెపుతున్న అభియోగాల్లో నీరు, విద్య, ఉద్యోగాలు ముఖ్యమైనవి.

ఉద్యమం వివిధ రూపాల్లో ఉంది. రిలే నిరాహార దీక్షలు, నిరసన ప్రదర్శనలు, సభలు, సైన్‌బోర్డులు, అభియోగాలను ఎత్తిచూపుతూ రాసిన కరపత్రాల్లో రాతపూర్వకంగా, వ్యక్తిగతంగా ప్రాతినిధ్యాల ఏర్పాటు వంటివి ముఖ్యమైనవి. ఇవి మండల స్థాయి నుండి... ఇంకా చెప్పాలంటే పంచాయితీ స్థాయి నుండి కూడా ఆరంభమయ్యాయి. ఈ కమిటీ సభ్యులు వెళ్ళిన చాలా గ్రామాల్లో సభ్యులను స్వాగతిస్తూ పెద్ద పెద్ద బ్యానర్లు కనిపించాయి. ఒక గ్రామంలో సభాస్థలి వద్ద ఆ గ్రామ ప్రజలే గాక, పొరుగు గ్రామాలవారు, పట్టణంవారు కూడా వచ్చి చేరారు. తెలంగాణా ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను తెలుపుతూ బ్యానర్లు కట్టారు. తెలంగాణా జిల్లాలకు ఈ కమిటీ వెళ్ళినప్పుడు స్కూలు పిల్లలు, కాలేజి విద్యార్థులు

మార్గమధ్యంలో బారులు తీరి ప్రత్యేక తెలంగాణాను కోరుతూ ప్లకార్డులను చేతబట్టుకుని కనిపించారు. కాలేజీలు విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు, ఉద్యోగులు విద్యార్థుల భావోద్వేగాలు తీవ్ర స్థాయిలో ఉన్నా ముఖ్య విషయమేమంటే సంప్రదింపులకు, చర్చలకు వారు సిద్ధంగా ఉండడం,

ఖమ్మంలోని గిరిజన ప్రాంతాలకు ఈ కమిటీ సభ్యులు వెళ్ళినప్పుడు భద్రాచలం లోని కోయ జాతివారికి ఈ వేర్పాటు డిమాండు గురించి, ఉద్యమం గురించీ చాలా తక్కువ తెలుసు. కొంతమంది ప్రజలు 'జైతెలంగాణ' అని నినాదాలు చేస్తూ గ్రామాల్లోకి వచ్చారు. తెలంగాణా, కోస్తాంధ్ర మధ్యలో వున్న ఖమ్మం నగరంలో తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం మీద విభిన్న అభిప్రాయాలు వినిపించాయి. ఒక ఉపాధ్యాయురాలు తన తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారనీ, తమకంటూ ఒక ప్రాంతం, లేదా స్థలం లేదనీ చెప్పింది. తెలంగాణా వస్తే సమస్యలన్నీ పరిష్కారమవుతాయనీ విద్యార్థులు కొందరు నమ్ముతున్నారు. కోస్తాంధ్రలో కృష్ణాజిల్లా సరిహద్దుల్లో వున్న ఖమ్మం జిల్లాకు చెందిన గ్రామాన్ని ఈ కమిటీ సందర్శించినప్పుడు కమిటీ ముందు 200 మంది వరకు హాజరయ్యారు. అయితే ఆ గ్రామంలో కోస్తాంధ్ర నుండి వలస వచ్చిన అధిక సంఖ్యాకులు ఎవరూ హాజరు కాలేదు. దీని గురించి విచారించగా ఆ వూరి సర్పంచ్ వలస వచ్చిన వారిని రావద్దని చెప్పామనీ వారు తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు భయపడుతున్నారనీ ముభావంగా జవాబిచ్చారు. ఆదిలాబాద్‌లో (మహారాష్ట్ర సరిహద్దు) మరాఠా మాట్లాడే ప్రజలు తమకు విదర్భ ప్రత్యేకరాష్ట్రం కావాలని డిమాండు చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఒక వలస వచ్చినవారితో నిండిన గ్రామాన్ని ఈ కమిటీ సందర్శించినపుడు టిఆర్ఎస్ పార్టీ మద్దత్తు స్థానికులు సమావేశ స్థలం చుట్టూ గుమిగూడారు. వలస వచ్చిన వారు తమ అభిప్రాయాలను వెలిబుచ్చేందుకు తటపటాయించారు. ఈ గ్రామాలలోకి వలస వచ్చినవారు గోదావరి డెల్టా నుండి వచ్చారు. నిజాంసాగర్ ఆనకట్ట నిర్మాణం తరువాత నిజాం వీరిని వ్యవసాయం చేసేందుకు అక్కడకు ఆహ్వానించారట. స్థానికులు ఫిర్యాదు చేస్తూ వారు విడిగా వుంటున్నారనీ, స్థానిక జనాభాతో కలిసిపోవడం లేదనీ ఆరోపించారు. వారు ధనవంతులుగా ఉండటం స్థానికులకు అసూయ కలిగిస్తుంది. తెలంగాణా స్థానికుల వనరులను, అవకాశాలను వారు కొల్లగొడుతున్నారనే అభిప్రాయానికి కూడా అది కారణమవుతుంది.

చాలామంది యువతకు గతంలో జరిగిన జై తెలంగాణా, జై ఆంధ్ర ఉద్యమాల గురించి ఏమీ తెలియదు. ఇప్పటి తెలంగాణా ఉద్యమమే మూలమనీ వారు భావిస్తున్నారు. అయితే లోతట్టు ప్రాంతాల్లో ముందు తెలపకుండా వెళ్ళి పేదప్రజలను విచారించినప్పుడు వారు ఈ ఉద్యమం గురించి అమాయకంగా అగుపించారు. ఏ వైపూ తమ మద్దతును ప్రకటించలేదు.

భావోద్వేగ ఉద్రిక్తతలు ఒకే విధంగా హెచ్చుస్థాయిలో కనిపించలేదు. ప్రజల అభియోగాలు సాధారణంగా ఉన్నాయి. గత మూడు దశాబ్దాలలో అభివృద్ధి ప్రక్రియ తెలంగాణాలో ఎక్కువగా జరిగింది. ప్రత్యేక తెలంగాణా వస్తే వెనువెంటనే మంత్రం వేసినట్లు నీరు, ఉద్యోగాలు, విద్యావకాశాలు వచ్చిపడతాయనే భావన నిండుకొని వుంది.

తెలంగాణా వేర్పాటు ఉద్యమం ప్రజల్లోకి చొచ్చుకు పోవడంతో బడి పిల్లలకు కూడా అభియోగాలేంటో తెలిసిపోయాయి. ప్రత్యేక రాష్ట్రం కొరకు డిమాండును ఇతర అంశాలను వారు చర్చించుకునే స్థాయికి వచ్చారు. ప్రవాస తెలంగాణావాసులు కూడా ప్రత్యేక తెలంగాణా వాదనను సమర్థించగా అటువైపు ఆంధ్ర ప్రవాసులు సమైక్యాంధ్రను సమర్థిస్తున్నారు. ఈ ప్రవాస తెలంగాణా వాసులు ఉద్యమాన్ని పలు విధాలుగా బలపరుస్తున్నారు. ఈ కమిటీకి వారి ప్రతినిధులు కూడా వచ్చారు.

రాయలసీమ ప్రాంతానికి వస్తే రాష్ట్రంలో ఎక్కువ వెనుకబడిన ప్రాంతమైన ఈ సీమ తెలంగాణా రాష్ట్రం గనుక ఏర్పడితే తమకు మరోమారు అన్యాయం జరుగుతుందనే భావోద్వేగంతో వున్నారు. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని వారు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. రెండుసార్లు మోసపోయామన్న భావన వారిలో ఉంది. 1956 తరువాత కోస్తాంధ్రకు నీళ్ళుపోగా హైదరాబాద్ రాజధానిగా దాని అభివృద్ధికి సొమ్ము వెళ్ళింది. సీమప్రాంతం తెలుగు మాట్లాడేవారి కోసం సమైక్యాంధ్రకోసం ఎంతో త్యాగం చేసినా ఏమీ దక్కలేదు. హైదరాబాద్‌ను వదులు కోవదానికి సాగునీటి కోసం తెలంగాణా ప్రాంతం మీద ఆధారపడటానికి సీమ ప్రాంతంవారు సిద్ధంగా లేరు. అయితే విభజన అంటూ ఏర్పడితే ఆంధ్ర ప్రాంతంతో చేరేందుకు సీమవాసులు పరోక్షంగా ఇష్టపడటం లేదు.

కోస్తాంధ్రలో కొంతమంది సమ్మతించినా కూడా రాష్ట్రవిభజనకు వ్యతిరేక భావోద్వేగం కనిపించింది. సాగునీటి లభ్యత తమకు కరవవుతుందేమోనని కోస్తాంధ్రవారు ఆందోళనతో వున్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి తోడ్పడిన తాము దానిని కోల్పోతామేమోనన్న ఆందోళన కూడా వారిలో గోచరించింది. డెల్టా జిల్లాల్లో కొందరు రాష్ట్రం రెండు ముక్కలైనా, మూడు ముక్కలైనా సొంతంగా నిలబడ గలమనీ ధీమాను వ్యక్తం చేశారు. అయితే ఉత్తరకోస్తా ప్రజలు, దక్షిణకోస్తా ప్రజలు తమ ప్రాంత అభివృద్ధి స్వల్పమనీ, విద్యకోసం, ఉపాధికోసం హైదరాబాద్‌ను నమ్ముకున్న తాము దానిని కోల్పోతామేమోననీ ఆందోళనను వ్యక్తంచేశారు. ఉత్తర కోస్తాలో పలు గ్రామాలలోని మధ్యతరగతి రైతులు వ్యవసాయ కూలీలు ఏడాదిలో కొంత కాలం మాత్రమే తమ గ్రామాల్లో పనికి ఉంటారనీ, మిగతాకాలం హైదరాబాద్‌లో పనికి వెళ్తారనీ చెప్పారు.

## ప్రాంతీయ భావోద్వేగాలపై అవగాహన

రాష్ట్ర పునర్విభజన సంఘం ఇలా చెప్పింది : 'ఒక రాష్ట్రం భాషా పరంగా పునర్‌నిర్మితమైన ఆరాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమాన అభివృద్ధిని నోచుకోకపోవచ్చు. కొన్ని ప్రాంతాల వారు తాము వివక్షకు, నిర్లక్ష్యానికి గురైనామన్న భావనతో ఉండవచ్చు. ఈ అభియోగాలను సవరించాలంటే ప్రతి అభియోగాన్ని దానిలో పస ఎంత వుందో చూసి మాత్రమే చేయాలి. భాష పద్ధతిన రాష్ట్రాలను ఏకమొత్తంగా విభజించకూడదు'.

**దంకన్ ఫారెస్టర్ ఇలా చెప్పారు :** 'తెలంగాణా ప్రాంతంలో న్యాయపరమైన డిమాండ్లు చాలా కాలం అపరిష్కృతంగా ఉండిపోయాయి. వాటిని గుర్తించడానికి, సరిచేయానికి ఎలాంటి ప్రయత్నం జరగలేదు. అదే నేటి దుస్థితికి కారణం'. 1970లో ఫారెస్టర్ ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే విధమైన పరిస్థితి ఏర్పడి ఉద్రిక్త భావోద్వేగాలకు దారితీస్తుందని భావిస్తున్నాం. 1970 తరువాత తెలంగాణాలో పరిస్థితులు తగినంతగా మారిపోయాయి. అయినా కూడా ప్రత్యేక తెలంగాణాకు డిమాండు వుందంటే దానికి కారణమేమిటాని మేము అన్వేషించాం. తెలంగాణా భావోద్వేగాలను అర్థం చేసుకోవటం ఒక్కటే ఈ కమిటీ లక్ష్యం కాదు. వివక్ష సరైనదా ఎక్కడ జరిగింది? సాక్ష్యాధారంగా దానిని రుజువుచేయాలన్నది కూడా మా లక్ష్యం. అన్ని గ్రూపుల వారు వివక్షణకు గురి కాలేదు. ఈ విషయం మీద హన్మంతరావు మాట్లాడుతూ ఇలా అన్నారు : 'వివక్షకు గురయ్యామన్న భావన విద్యావంతుల్లో అనగా విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో, నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల్లో, వృత్తిపరమైన వారిలో ఎక్కువగా వుంది'. ఉత్తర తెలంగాణాలో అభివృద్ధి అధికంగా జరిగినా కూడా అక్కడ వేర్పాటు ఉద్యమ భావన బలంగా వుంది. వేర్పాటు వాదాన్ని అణచివేసేందుకు అభివృద్ధి పథకాలూ, సంక్షేమపథకాలూ ఎన్ని అమలు చేస్తున్నా వేర్పాటు ఉద్యమం అభివృద్ధితో పాటు బలపడుతూనే ఉంది.

అభివృద్ధిలో వివక్ష జరుగుతుందన్న భావన దీనికి కారణం కావచ్చు. కనుక వివక్షను నిర్మూలించడంతోపాటు ఆ వివక్ష జరుగుతుందన్న భావనను కూడా నిర్మూలించటం సరైనదని కమిటీ భావిస్తుంది.

## నేటి ప్రాంతీయతపై అవగాహన

పాల్‌గ్రాస్ అనే పేరొందిన రాజకీయ సైంటిస్టు, భారత రాజ్యాంగ చరిత్ర విద్యార్థి దేశంలో జరుగుతున్న పరిస్థితులను ఇలా గమనించాడు. ప్రాంతీయ గ్రూప్‌లు రాజకీయ రాజ్యాధికారం కోసం ప్రభుత్వ ఖజానాపై అజమాయిషీ కోసం మరింతగా ప్రయత్నిస్తున్నాయి. అవి సాంస్కృతిక పరంగా, భాషాపరంగా విడిపోవడానికి మాత్రం ప్రయత్నించడం కనుక ప్రాంతీయతత్వాన్ని లేదా ఉప ప్రాంతీయ తత్వాన్ని రాజకీయ సాధికారత కోసం ప్రయత్నించేవిగా చూడాలి.

తెలంగాణా ప్రాంతానికి కొన్ని స్పష్టమైన అభియోగాలున్నా, ఈ ప్రాంతం అత్యంత అభివృద్ధికి నోచుకుంది. అందువలన ప్రత్యేక రాష్ట్రం కోసం ఈ ప్రాంతపు భావోద్వేగాన్ని మరింత రాజకీయ సాధికారత కోసం తమ అధికారం కోసం, ఆ ప్రాంతపు కార్యకలాపాలలో తమ పట్టు కోసం చేస్తున్న ప్రయత్నంగా అభివర్ణించ వచ్చు.

## ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతాలలో సామాజిక సమైక్యత

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేరే ఇతర భారత రాష్ట్రం వలెనే విభిన్న సంస్కృతులతో, కులాలతో తెగలతో, భాషలతో, మతాలతో కూడినది. రాష్ట్ర జనాభా ఈ విధంగానే విడిపోయినా ప్రాంతాలవారీగా సమైక్యంగా ఉంటుంటాయి. 2010 ఫిబ్రవరి నుండి కొత్త సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ఇవి ఉమ్మడి కార్యాచరణ సంఘాలు (జెఎసి)లుగా రూపుదిద్దుకొని ప్రత్యేక తెలంగాణా డిమాండును చేస్తున్నాయి. లేదా సమైక్యాంధ్ర కొరకు కృషి చేస్తున్నాయి. ఈ గ్రూపుల్లో షేకు/షేటె, ఓబిసి, మైనార్టీలు (క్రిస్టియన్లు వున్నా ప్రధానంగా ముస్లిములు) వంటి సామాజిక గ్రూప్‌లు ఇంజనీర్లు ఉపాధ్యాయులు, లాయర్లు, రైతులు, వంటి వృత్తిపరమైనవారు, ఎన్‌జీవోలు, విద్యార్థులు, సాంస్కృతిక సంస్థలు ఇలా పలురకాల గ్రూపులు వున్నాయి. ఈ విధమైన గ్రూపులతో కూడిన జెఎసీలు రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో పుట్టుకొచ్చాయి. తెలంగాణా ప్రాంతంలో ఇవి మండలస్థాయిలో ఇంకా చెప్పాలంటే గ్రామస్థాయిలో కూడా ఎక్కువగా ఉన్నాయి. ఈ జెఎసీలు సాధారణ ప్రజలను ఉద్యమంలోకి లాగగలుగుతున్నాయి.

అందువల్ల ఈ రాష్ట్రంలోని సామాజిక వర్గాల గురించి కొంత అవగాహన కొరకు ఈ అంశం మీద దృష్టి సారించాము. షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన జనాభా ఈ రాష్ట్రంలో 22.8% వుంది. వెనుక బడిన తరగతులవారు 45% కన్నా ఎక్కువగా వుండగా, అగ్రవర్ణాలు సుమారు 22%గా వున్నాయి. ముస్లిములు, ఇతరులు సుమారు 11% మైనార్టీలుగా వున్నారు. అయితే వీరి ప్రాధాన్యత పలుకుబడి జనాభా వాటాకు తగ్గట్టుగా లేదు. షెడ్యూల్డు కులాలు, తెగలవారు మూడు ప్రాంతాలలో సమానంగా విస్తరించివున్నా, తెలంగాణాలో షెడ్యూల్డు తెగలవారు అధికం. ఓబిసీలు కూడా తెలంగాణలోనే అధికం. ఆ తరువాత రాయలసీమలో, కోస్తాంధ్రలో వున్నారు. అగ్రవర్ణాలు కోస్తాంధ్రలో అధికంగానూ, ఆ తరువాత రాయలసీమలోను వున్నారు. తెలంగాణలో వారిశాతం తక్కువ. ముస్లిములు హైదరాబాదులో అధిక సంఖ్యలో వుండగా, ఆ తరువాత రాయలసీమలోనూ, తెలంగాణాలోను వున్నారు.

ఈ పట్టికలో ప్రాంతాలవారీగా సామాజిక వర్గాల విభజన వివరాలు వున్నాయి

| ప్రాంతం | షె.కు. | షె.తె | ముస్లిములు | ఇతర మైనార్టీలు | ఓబిసిలు | అగ్రవర్ణాలు |
|---|---|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 16.2 | 6.6 | 9.2 | 1.7 | 44.5 | 22 |
| తెలంగాణ (హైదరాబాద్‌తోసహా) | 15.8 | 8.9 | 12.4 | 1.5 | 50.7 | 10.7 |
| తెలంగాణ (హైదరాబాద్ మినహా) | 6.9 | 10.0 | 8.4 | 1.2 | 53 | 10.5 |
| హైదరాబాద్ | 8.0 | 0.9 | 41.2 | 3.2 | 35 | 11.8 |
| రాయలసీమ | 16.7 | 2.9 | 12.5 | 0.9 | 43 | 24.2 |
| కోస్తాంధ్ర | 16.3 | 6.0 | 4.5 | 2.2 | 39 | 32 |

ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల్లో సామాజిక వర్గాల అభివృద్ధి.

ఈ వర్గాల అభివృద్ధిని 1987-2007 కాలంలో పరిశీలించారు. వాటి వివరాలున్న పట్టికలు 7ఎ, 7బి, 7సి, 7డి, 7ఇ లలో ఉన్నాయి.

వినియోగంలోనూ, బీదరికాన్ని తగ్గించడంలోనూ 1983 నుండి ఆంధ్రప్రదేశ్ మిక్కిలి కృషి జరిపింది. ఈ అభివృద్ధి ఇంచుమించు సమానంగానే వుంది. తెలంగాణా ప్రాంతం 71% అభివృద్ధిని సాధించగా రాయలసీమ 58% గాను, కోస్తాంధ్ర 61%గాను అభివృద్ధిని సాధించాయి.

## పేదరికం

టెండూల్కర్ దారిద్ర్య రేఖ ప్రకారం లెక్కవేస్తే అధికారిక దారిద్ర రేఖకన్నా 20% అధికం. ఇలా అధికంగా వున్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రాంతాల వారీగా, సామాజిక వర్గాల వారీగా పేదరిక నిర్మూలన విషయంలో తగిన పురోగతిని సాధించింది. 1983-2007 మధ్య పేదరికం 42% తగ్గింది. ముస్లింలలో ఇది 50%గా అత్యధికంగా వుంది. షెడ్యూల్డ్ కులాలలో 47%, అగ్రవర్ణాలలో 41%, షెడ్యూల్డ్ తెగలలో 38 % నమోదయ్యింది. ఓబిసి గణాంకాలు ఇంకా తేలలేదు.

## విద్య

ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలనకన్నా విద్యారంగంలో అభివృద్ధి మరింతగా వుంది. 2007-2008లో షెడ్యూల్డ్ తెగలవారు 70% విద్యాభ్యాసాన్ని అందుకోగా, షెడ్యూల్డ్ తెగలు 90%లో వున్నారు. ముస్లింలు 59% ప్రగతిని సాధించారు. మరొక చెప్పుకోదగ్గ ప్రగతి ఏమంటే బాలికలు విద్యను అధికంగా అభ్యసించటం. 1983లో ఎస్సీ బాలురలో 100 మంది బాలురు చదువుకుంటున్నారనుకుంటే ఆనాటికి బాలికల శాతం 64గా ఉంది. తెలంగాణాలో ఈ నిష్పత్తి 50%గా వుంది. 2007-08లో విద్యావంతులైన బాలికల సగటు 89% కాగా అందులో 92% తెలంగాణాలో వుంది.

## షెడ్యూల్డు కులాలు, తెగలు

తెలంగాణాలో సామాజిక, ఆర్థిక గ్రూపుల అక్షరాస్యత చెప్పుకోదగ్గట్లు వుంది. షెడ్యూల్డు తెగలవారు, షెడ్యూల్డు కులాలవారికన్నా ఎక్కువగా విద్యనభ్యసిస్తున్నారు. వారు కోస్తాంధ్రలోని గిరిజనులకన్నా మంచి స్థితిలో వున్నారు. 2007-08 లెక్కల ప్రకారం బాలికల విషయానికొస్తే ప్రతి 100 మంది షెడ్యూల్డు తెగల బాలురు చదువుకుంటున్నారనుకుంటే బాలికల శాతం అదే సమయంలో 61గా ఉ ంది.

## ముస్లింలు

తెలంగాణాలోని ముస్లింలు తలసరి వినిమయంలోనూ (76%), దారిద్ర్య నిర్మూలన స్థాయిలోనూ (33%) హెచ్చుస్థాయిలో వున్నారు. అయితే విద్యాభ్యాసంలో వారు షె.కు/షె.తె.ల కన్నా బాగా వెనుకబడి వున్నారు.

## ఓబిసిలు

ఓబిసిల గణాంకాలను ఎన్ఎస్ఎస్ సర్వే సంస్థ 1999-2000 నుండి మాత్రమే సేకరించింది. తెలంగాణా ప్రాంతంలో ఓబిసి బాలుర అక్షరాస్యత 29% ఇది రాష్ట్ర సగటు 31%కన్నా కొద్దిగా తక్కువ. ఓబిసిలలో బాలికల అక్షరాస్యత రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలకన్నా అధికంగా వుంది. పేదరిక నిర్మూలనా అంశం మీద కూడా తెలంగాణా ఓబిసిలు చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించారు.

## ప్రాంతీయ అసమానతలు

రెండు, మూడు అధ్యాయాల్లో చెప్పినట్టు ప్రాంతీయంగా ఉన్న అసమానతలను అంచనా వేయడానికి అనేక కోణాల్ని పరిశీలించాం. ఈ మూడు ప్రాంతాల్లోను కొన్ని కొన్ని జిల్లాల్లో అసమానతలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. రాజకీయ ప్రతినిధులతో సమావేశాలు, క్షేత్రస్థాయి పర్యటనలు, కొన్ని గ్రూపులతో చర్చలు ఈ అసమానతలకు కొలబద్దలుగా నిలిచాయి. తెలంగాణలో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాలు ఈ కోవలోకే వస్తాయి. షెడ్యూలు కులాలు, తెగలు అధికంగా ఉన్న ఉత్తర కోస్తా జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి. ఒక్క విశాఖపట్నం మినహాయిస్తే శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు వెనుకబాటుతనానికి అద్దం పడుతున్నాయి. ఈ రెండు జిల్లాల్లో తలసరి వినియోగాన్ని చూసినా, విద్యారంగాన్ని గమనించినా, బాలింతలు, శిశు మరణాల్ని పరిశీలించినా ఇవి ఎంత నిరాదరణకు గురయ్యాయో కనిపించింది. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం ఏజన్సీ ప్రాంతాల్లో మలేరియా, డయేరియా వంటి రోగాలు వచ్చి సరైన వైద్య సదుపాయం అందక యేటా అనేక మరణాలు సంభవిస్తున్నాయి. ఈ జిల్లాల నుంచి తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని లేదా అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని విజ్ఞాపనలు అందాయి. ప్రభుత్వం చేపడుతున్న పథకాల ఫలితాలు పేదలకు అందకపోతే అభివృద్ధి ఎప్పుడూ అట్టడుగునే ఉ ంటుందంటున్న ప్రధాని మన్మోహన్‌సింగ్ మాటలను ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. మరింత అసంతృప్తి, అసమతుల్యతల నుంచి బయట పడేయడానికి సకాలంలో వెనుకబడిన ప్రాంతాల్లో పథకాల ప్రయోజనాలు అందించడం ఒక్కటే పరిష్కారమని కమిటీ అభిప్రాయపడింది.

ఆర్థికంగా దెబ్బతిన్న బడుగులను సకాలంలో ఆదుకునే చర్యలు తీసుకోకపోతే ప్రాంతాలతో సంబంధం లేకుండా ఆత్మహత్యలే వారికి శరణ్యమవుతున్నాయి. ఇలాంటి చేదు నిజాలను ప్రభుత్వాలు గుర్తించాలి. రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న కరవు, నకిలీ పత్తి విత్తనాల కారణంగా 2004 మే నుంచి 2005 నవంబర్ వరకు దాదాపు 1068 మంది ప్రాణాలు కోల్పోయారని కమిటీ గుర్తు చేసింది. ఇందులో తెలంగాణ

నుంచి 663 మంది, రాయలసీమ నుంచి 231 మంది, కోస్తాంధ్ర నుంచి 174 మంది ఉన్నారని వివరించింది. కోస్తాంధ్రలోని ప్రకాశం, తెలంగాణలోని మెదక్, రాయలసీమలోని అనంతపురం నుంచి అందిన సమాచారం ఆధారంగా చనిపోయిన వారిలో ఎక్కువ మంది అగ్ర కులాల వారే ఉన్నారని, ఒక్క తెలంగాణలో మాత్రం ఓబీసీలు, ఎస్సీలు కూడా ఉన్నారని పేర్కొంది. కరవు, పంటలు దెబ్బతినడం, బీటీ కాటన్ విత్తనాలు అక్కరకు రాకపోవడం, అప్పుల పాలై పోవడం కారణంగా అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వెల్లడించింది. తెలంగాణ, రాయలసీమల్లోని మెట్ట ప్రాంతాల రైతులకు జీవితం నిత్యం భారంగానే గడుస్తోంది. ప్రస్తుత ఉద్యమానికి ఇది కారణం కాకపోయినప్పటికీ ఇక్కడ చెప్పక తప్పదు.

## షెడ్యూలు కులాలు

తెలంగాణ ఉద్యమంపై సామాజిక, సాంస్కృతిక గ్రూపుల ప్రభావం కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంది. ముందుగా షెడ్యూలు కులాల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే... 32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను పరిశీలిస్తే ఎస్సీల జనాభాలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలుస్తుంది. రాష్ట్రంలో 8 శాతంగా ఉన్న ఎస్సీలు 60 వర్గాలుగా గుర్తింపు పొందారు. నిజాం కాలంలో పాలకుల అణిచివేత కారణంగా తాము ఎన్నో యేళ్ళుగా విద్య, ఉపాధి అవకాశాల్లో వెనుకబాటు తనానికి గురయ్యామన్న భావన తెలంగాణ ఎస్సీల్లో ఉంది. అందుకే వారు ప్రత్యేక రాష్ట్రం కోరుతున్నారు. కోస్తాంధ్ర ప్రాంతంలో తమ సామాజిక వర్గానికే చెందిన వారు బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకున్నారని... ఫలితంగా వారు ఐఏఎస్., ఐపీఎస్., ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని వారు భావిస్తున్నారు. కనీసం తాము తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగాలు కూడా పొందలేని స్థితిలో ఉన్నామని వారు భావిస్తున్నారు. సంఖ్యాపరంగా ఆంధ్ర ప్రాంతంలో మాలలు అధికమని, అభివృద్ధిలో భాగస్వాములుగా ఉంటూ వారు మంచి ప్రయోజనాలు పొందుతున్నారని, కాని తెలంగాణలో అధికంగా ఉన్న మాదిగలు మాత్రం రిజర్వేషన్లు సైతం పొందలేని దుస్థితిలో ఉన్నట్టు భావిస్తున్నారని... ఫలితంగానే వారు ప్రత్యేక రాష్ట్రం కోరుకుంటున్నారని కమిటీ తెలిపింది. కోస్తాంధ్ర ప్రాంతానికి వచ్చేసరికి... మాలలు రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తుండగా మాదిగలు మాత్రం అనుకూలంగా స్పందిస్తున్నారు. ఎస్సీ రిజర్వేషన్ ప్రయోజనాలు తాము పొందాలంటే బీసీల మాదిరిగానే ఎస్సీలను కూడా ఎ, బి, సి, డి...లుగా వర్గీకరించాలని మాదిగలు డిమాండు చేస్తున్నారు. తెలంగాణ, కోస్తాంధ్రల్లో మాదిగలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరడం వెనుక కారణం... తమకు చట్ట ప్రకారం రావాల్సిన ప్రయోజనాలు పొందడమేనని అర్థం చేసుకోవచ్చు. అగ్ర కులాల పాలనలో ఉన్న రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీ ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. ఉత్తర కోస్తాలోని బలమైన ఎస్సీ సంఘాలు మాత్రం రాష్ట్ర సమైక్యంగానే ఉండాలంటూనే బాగా వెనుకబడిన తమకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని కోరాయి. అలాగే రాయలసీమలోని ఎస్సీలు రాష్ట్రం సమైక్యంగా ఉండాలన్న వాదననే బలంగా వినిపించారు. విభజన వల్ల తాము మరోసారి ఉద్యోగాల్లోను, విద్యావకాశాల్లోను అవకాశాలు కోల్పోతామని వారు వాదించారు. 54 యేళ్ళ సమైక్య రాష్ట్రంలో తాము పెద్దగా పొందిన ప్రయోజనం ఏమీ లేదని, చిన్న రాష్ట్రాల వల్ల తమకు తప్పనిసరిగా ప్రయోజనం కలుగుతుందని కొంతమంది ఎస్సీలు తమ వాదనను వినిపించారు.. మొత్తం మీద ఈ దళిత కమ్యూనిటీలో రెండు రకాల వాదనలు వినిపించాయి. రాజకీయాధికారం రావాలన్నా... పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్నా మైనారిటీలు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు చిన్న రాష్ట్రాల వల్లే సాధ్యమవుతుందని బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలను ఇక్కడ

ప్రస్తావిస్తున్నారు. దీన్ని ప్రస్తావిస్తూనే ఆంధ్ర దళిత మహాసభ నాయకుడు కత్తి పద్మారావు అగ్ర కులాల పాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం జరగదని... విభజన జరిగితే రెండు రాష్ట్రాల్లోని దళితులకు పాలనా పగ్గాలు చేతికొస్తాయని కమిటీ ముందుకు తెచ్చారు. కొన్ని దళిత గ్రూపులు కూడా చిన్న రాష్ట్రాల వల్లే తమకు ప్రయోజనం కలుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రిజర్వేషన్ ప్రయోజనాలు పొందే అంశంలో ఎస్సీల్లోనే మాల, మాదిగ వర్గాలు ఒకరిపై ఒకరు విమర్శలు సంధించుకుంటున్నారు. మొత్తం ఎస్సీల జనాభాలో 42 శాతం మాల, మాదిగలే ఉన్నారు. కోస్తాంధ్రలో మాలలు, రాయలసీమ, తెలంగాణలో మాదిగలు ఎక్కువగా ఉన్నా రిజర్వేషన్లు పొందడంలో ఇరువర్గాలకు అసంతృప్తులున్నాయి. ఇవి ప్రత్యేక రాష్ట్రం వైపు మొగ్గు చూపేలా చేస్తున్నాయి.

## షెడ్యూలు తెగలు

రాష్ట్ర జనాభాలో గిరిజనుల శాతం 6.6. వీరిలో 33 వర్గాలున్నాయి. ఈ జనాభా రాష్ట్రమంతా విస్తరించి ఉంది. ఇందులో ప్రధానంగా సుగాలి, కోయ, ఎరుకల, యానాది, గోండు తదితరాలను ప్రధానంగా చెప్పుకోవాలి. ఈ కులాల్లో కొంతమంది కొన్ని జిల్లాలకే పరిమితమై ఉన్నారు. గిరిజనుల్లో అత్యధికంగా ఉన్నది సుగాలిలే. ఆంధ్రప్రదేశ్ గిరిజన జనాభాలో వీరి శాతం 41.4 శాతం కాగా ఇందులో ఒక్క తెలంగాణలోనే 64.2 శాతం మంది ఉన్నారు. రాష్ట్రంలో మొత్తం 6.6 శాతం మంది గిరిజనులు ఉండగా వీరిలో తెలంగాణలో 9 శాతం, కోస్తాంధ్రలో 6 శాతం, రాయలసీమలో 3 శాతం ఉన్నారు. తెలంగాణలో ఉన్న అఖిల భారత బంజారా సేవా సంఘం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని డిమాండు చేస్తోంది. కోస్తాంధ్రలోని లంబాడాలు (సుగాలీలు), ఎరుకల కులాలు ఎస్టీల పేరుతో ఎంతోకాలంగా ఎస్టీలుగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతుండగా తెలంగాణలో తాము 1976 వరకు ఈ ప్రయోజనానికి నోచుకోలేదని... ఆ తర్వాత కూడా తమ కులానికున్న నిష్పత్తి స్థాయిలో రిజర్వేషన్లు పొందలేకపోతున్నామని బంజారాలు చెబుతున్నారు. సమైక్య రాష్ట్రంలో 6 శాతంగా ఉన్న తమ రిజర్వేషన్లు ప్రత్యేక రాష్ట్రం వల్ల 12 శాతానికి పెరుగుతాయని వారు భావిస్తున్నారు. అందుకే వారు ప్రత్యేక రాష్ట్ర వాదనను బలపరుస్తున్నారు. వీరు మరో కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. తెలంగాణలో తమకు ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని లేదా సమైక్య రాష్ట్రంలో తమకు మన్యసీమను ఏర్పాటు చేయాలని వారు డిమండు చేస్తున్నారు. రాయలసీమ గిరిజనులు సమైక్య వాదాన్నే బలంగా వినిపించారు. ఎరుకల హక్కుల పోరాట సంఘం కడపలో తమ వాదన వినిపించేటప్పుడు సమైక్య రాష్ట్రంలో తాము పెద్దగా ప్రయోజనం పొందింది లేదని... గ్రేటర్ రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు ఒక్కటే తమకు సమ్మతమని చెప్పారు. నల్లమల అడవిలో ఉండే గిరిజనజాతి చెంచులు తమ వాదనను వినిపించలేదు. రాష్ట్రం సమైక్యంగానే ఉండాలని లేకపోతే తమకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోస్తాంధ్ర ప్రాంత గిరిజనులు వాదించారు. దీనివల్ల తమలో ఉన్న వెనుకబాటు తనం పోతుందని వారు భావిస్తున్నారు. ఉత్తర కోస్తా, కోస్తాంధ్ర ప్రాంతంలో తాము ఎన్నో ఏళ్ళుగా అణిచివేతకు గురయ్యామని, తమను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోస్తాంధ్ర గిరిజనులు వాదించారు.

## మన్య సీమ డిమాండు

1976లో గిరిజనులుగా గుర్తింపు పొందిన ఆదివాసీలు రాష్ట్రంలో క్రమంగా తగ్గిపోతున్నారు. పెత్తందారుల దౌర్జన్యాలను తట్టుకోలేక వారు వలసలు వెళ్ళిపోతున్నారు. ఫలితంగానే మన్య సీమ

డిమాండు వేళ్ళూనుకుంది. దీనికి అనేక అంశాలను వారు తెర పైకి తెస్తున్నారు. గిరిజనేతరుల దాష్టీకాన్ని తట్టుకోలేకపోతున్నట్టు వారు చెబుతున్నారు. గిరిజనేతర పాలకుల మూలంగా తాము సంస్కృతిని, భాషని, వనరులను, స్వాభిమానాన్ని కోల్పోతున్నామని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా వారికి తగిన రక్షణ కల్పించకపోతే మరింత దోపిడీకి గురవుతారని కమిటీ భావించింది. వారికి ప్రత్యేక తెలంగాణ కన్నా గిరిజన రాష్ట్రం ఏర్పాడాలన్న లక్ష్యమే కనిపించింది. ఇదే తమ జీవితాలను బాగు చేయగలదని, అక్కడే తమకు మంచి సుఖమయ జీవనం కలుగుతుందని వారు నమ్ముతున్నారు. ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న జిల్లాల్లో గిరిజన ప్రాంతాలను గుర్తించి ఒక రాష్ట్రంగా తీర్చి దిద్దాలని వారు కోరుతున్నారు. ఏజన్సీ కాని ప్రాంతాల్లో తమకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పించాలన్నది వారి మనోగతం. ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడితే కోయ, కొండ రెడ్డి తదితర గ్రూపులు మరింత అన్యాయానికి గురవుతాయని వారు భావిస్తున్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఉన్న కోయలు తాము గతంలో రాష్ట్రాల వర్గీకరణ సందర్భంగా అన్యాయానికి గురయ్యామని, తమ సంస్కృతి సంప్రదాయాలు పూర్తిగా నాశనమైపోయాయని చెప్పారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సందర్భంగా తాము కూడా అలాంటి పరిస్థితుల్నే ఎదుర్కొన్నామని ఆదివాసీ గోండులు చెప్పారు. అందుకే తాము విభజనను వ్యతిరేకిస్తున్నామని, ప్రత్యేకంగా ఆదివాసీ రాష్ట్రం ఏర్పాటు చేయడమే తమ అభివృద్ధికి బలమైన పరిష్కారమని లేకపోతే ఒక పరిపాలనా మండలిని తమకోసం ఏర్పాటు చేయాలని వారు డిమాండు చేస్తున్నారు. మరో అంశం ఏమిటంటే సుగాలీలు, లంబాడాలు తదితర కులాలను ఎస్టీల్లో చేర్చిన కారణంగా నిజమైన ఆదివాసీలమయిన తాము ఎంతో నష్టపోతున్నామని, సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు, విద్యావకాశాలు, రాజకీయ అధికారం 90 శాతం కోల్పోతున్నామని వారు చెబుతున్నారు. ఇలాంటివారు ఇతర రాష్ట్రాల్లో ఎస్టీల జాబితాల్లో లేనందున ఆంధ్రప్రదేశ్‌కు వారు వలస వచ్చి ఇక్కడ రిజర్వేషన్లు పొందుతూ తమకు రావాల్సిన ప్రయోజనాలను కాజేస్తున్నారని ఆదివాసీలు వాదిస్తున్నారు. భూ కేటాయింపులు, ఉద్యోగాలు, ఎమ్మెల్యే, ఎంపీల ఎన్నికల్లో రిజర్వుడు స్థానాలు తాము కోల్పోతున్నట్టు వీరు వేలెత్తి చూపుతున్నారు. వీరిని ఎస్టీల జాబితా నుంచి తొలగించడంతోపాటు తమకు మన్యసీమ రాష్ట్రం ఏర్పాటు చేయడం ఒక్కటే తమ సమస్యలకు పరిష్కారమని వారు వాదిస్తున్నారు.

గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాలన్నింటినీ కలిపి మన్య సీమ ఏర్పాటు చేయాలన్న డిమాండు ఈనాటిది కాదు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్... ఈ తొమ్మిది జిల్లాలతో మన్య సీమ ఏర్పాటు చేయాలని, తమను తామే పరిపాలించుకోవాలని గిరిజనులు కోరుకుంటున్నారు. ఈ పది జిల్లాల జనాభాలో పది శాతం తామేనని వీరు చెబుతున్నారు. రిజర్వేషన్లు మాత్రం ఆరు శాతానికే వర్తిస్తున్నాయి. చెంచులెక్కువగా ఉన్న మహబూబ్‌నగర్, కర్నూలు, ప్రకాశం జిల్లాలు ఈ ప్రతిపాదిత మన్యసీమలో కలపలేదు. అయినా ప్రస్తుత పరిస్థితుల్లో మన్య సీమ ఏర్పాటు సాధ్యమయ్యే పని కానప్పటికీ ఎస్టీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పథకాల అమలును ఆయా ప్రాంతాల్లో వేగవంతం చేసి వారిని అందులో భాగస్వాములను చేయాలని కమిటీ నొక్కి చెప్పింది. విద్యారంగంలో ఎస్టీలను టీచర్లుగా ఎంపిక చేయడం, ఉన్న ఖాళీలను వారితోనే భర్తీ చేయడం, భూ సంబంధ హక్కులను వారికి అందజేయడం కమిటీ చేసిన సిఫార్సుల్లో ముఖ్యమైనవి. పోలవరం ప్రాజెక్టు కారణంగా భూములు కోల్పోయి నిర్వాసితులుగా మారిన ఎస్టీలకు తగిన పరిహారం ఇప్పించడం, వారికి పునరావాస ప్యాకేజీలను అమలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించింది.

## బీసీలు... ఓబీసీలు

రాష్ట్ర జనాభాలో 44.5 శాతం బీసీలు, ఓబీసీలు ఉన్నారు. బీసీలు 93 కుల గ్రూపులుగా ఉన్నాయి. వీరికి 29 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయి. బీసీలను ఐదు గ్రూపులుగా విభజించారు. మొత్తం 29 శాతం రిజర్వేషన్లలో ఎ గ్రూపుకు 7 శాతం, బీ గ్రూపుకు 10 శాతం, సి గ్రూపుకు ఒక శాతం, గ్రూపు డికి ఏడు శాతం, గ్రూపు ఇకి 4 శాతం అమలు జరుగుతున్నాయి. గ్రూపు ఇ కింద ముస్లింలకు ఈమధ్య కాలంలోనే ఓబీసీ కింద రిజర్వేషన్లు కల్పించారు. ప్రాంతీయంగా చెప్పుకోవలసి వస్తే ఓబీసీలు హైదరాబాద్ మినహా తెలంగాణలోనే ఎక్కువ. ఇక్కడ 53 శాతంగా ఉన్నారు. హైదరాబాద్‌లో 35, రాయలసీమలో 43, కోస్తాంధ్రలో 40 శాతంగా ఓబీసీలున్నారు. ఓబీసీల్లో కొంతమంది రాజ్యాధికారం చేస్తూ సామాజికంగా, ఆర్థికంగా మంచి బలవంతులుగా ఉండగా కొంతమంది బాగా వెనుకబడి ఉన్నారు. కుల వృత్తులు, వ్యవసాయపనులు, చేనేత రంగంలో వీరు ఎక్కువగా ఉన్నారు. బ్రాహ్మణ, రెడ్డి, వెలమ, కాపు, కమ్మ వర్గాల తర్వాత... మాల, మాదిగ కులాలకు పైన ఉంటూ వీరు మధ్య స్థాయి వర్గాలుగా కొనసాగుతున్నారు. తెలుగుదేశం పార్టీ అవిర్భావ సమయంలో వీరు రాజకీయాల్లోకి దిగి అటు పరిపాలన రంగంలో కూడా పట్టు సాధించారు. ప్రత్యేక రాష్ట్ర వాదనకు వచ్చేసరికి వీరు కుల ప్రాతిపదిక కన్నా ప్రాంతీయ వాదం వల్లే వీరు ఏకమయ్యారు. రాష్ట్ర జనాభాలో 44.5 శాతం ఉన్న తమకు 25 శాతం రిజర్వేషన్లు సముచితం కాదన్న వాదనను వీరు తీసుకువచ్చారు. కోస్తాంధ్ర, రాయలసీమల్లోని ఓబీసీలు సమైక్యంగా ఉండాలంటూనే హైదరాబాద్‌తో అనుబంధాన్ని దూరం చేసుకునే ప్రసక్తే లేదని నిర్ద్వందంగా చెప్పారు. అయితే తెలంగాణలోని ఓబీసీలు మాత్రం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమకు మరిన్ని రాజకీయ పదవులు లభిస్తాయని భావిస్తున్నారు.

## అగ్రకులాలు

రాష్ట్ర జనాభాలో 22 శాతం ఉన్న అగ్రకులాలు ఆర్థిక రంగం, రాజకీయ, సామాజికపరంగా ప్రముఖ పాత్రను పోషిస్తున్నారని చెప్పాలి. ఈ 22 శాతంలో 32 శాతం మంది కోస్తాంధ్రలోనే ఉన్నారు. ఇక రాయలసీమలో 24 శాతం మంది, తెలంగాణలో 11 శాతం మంది మాత్రమే ఉన్నారు. తెలంగాణ అగ్ర కులాలు ప్రత్యేక రాష్ట్రం వాదనను వినిపిస్తుండగా మిగిలిన రెండు ప్రాంతాల్లోని వారూ సమైక్య రాష్ట్రం వాదనకే కట్టుబడి ఉన్నారు. మూడు ప్రాంతాల్లోని ఉద్యమాలకు అగ్రకులాలు నేతృత్వం వహిస్తుండగా ఎస్సీలు, ఓబీసీలు వారిని అనుసరిస్తున్నారు. రాష్ట్రంలో ప్రముఖంగా ఉన్న అగ్రకులాల్లో రెడ్డి, కమ్మ, కాపు, వెలమలు రాజకీయంగాను, ఆర్థికంగాను బహుముఖ పాత్ర పోషిస్తున్నారు. సంఖ్యాపరంగా తక్కువ ఉన్న కారణంగా రాజకీయ అధికారంలో బ్రాహ్మణులకు పెద్దగా పాత్ర లేదనే చెప్పాలి. అయితే ఆంధ్ర రాష్ట్ర అవతరణ సమయంలో వారు తమ రచనల ద్వారా ఉద్యమాన్ని పటిష్టం చేశారనే చెప్పాలి. ఆదిలో కమ్మ కులస్థులు హరిత విప్లవంతో ఆర్థికంగా సుసంపన్నులైనందున ఆర్థికంగా అణగారిన వర్గాలను నడిపించే సత్తా వీరికి ఏర్పడింది. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ అవిర్భావంతో వీరికి రాజకీయ అధికారం కూడా బాగా చేరువైంది. తర్వాత కాలంలో రెడ్డి, కమ్మ కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా తమ పట్టును నిలబెట్టుకున్నందున ఇపుడు ఉద్యమాన్ని బాగా ప్రభావితం చేసే స్థాయిలో ఉండగలిగారు. ఇదే సమయంలో కాపు, వెలమ కులస్తులు కూడా రాజకీయంగా తమ పట్టును బిగించడానికి పోరాడుతున్నారు. కమ్మ, రెడ్డి కమ్యూనిటీతో సమానంగా వీరు కూడా ఉద్యమంలో పావులు కదుపుతున్నారు. ఏది సాధించాలన్నా రాజకీయ అధికారం అవసరమని భావించిన వీరంతా ఆ దిశలో పావులు కదుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయంగా పంచాయతీల స్థాయి

నుంచి బలంగా వేళ్ళూనుకుని ఉంది. అందుచేత కింది స్థాయి నుంచే వీరంతా ఉద్యమాన్ని నిర్మిస్తూ బలోపేతం చేస్తున్నారు.

## మతపరమైన వర్గాలు

రాష్ట్ర జనాభాలో 89 శాతం హిందువులు ఉన్నప్పటికీ ముస్లింలు కూడా 9.2 శాతం ఉన్నారు. క్రైస్తవులు 1.6 శాతం. 0.3 శాతం మాత్రమే మిగిలిన వారు. హిందువులు హైదరాబాద్‌తో కూడిన తెలంగాణలో 86 శాతం మంది కాగా హైదరాబాద్ లేని తెలంగాణలో 90 శాతం. హైదరాబాద్‌లో 55.4 శాతంగా, కోస్తాంధ్రలో 93.1 శాతంగా, రాయలసీమలో 86.4 శాతంగా ఉన్నారు. ముస్లింలు ఒక్క హైదరాబాద్‌లోనే 41.2 శాతం ఉన్నారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలో 12.4 శాతం కాగా హైదరాబాద్ మినహా తెలంగాణలో 8.4 శాతం. రాయలసీమలో 12.5 శాతం కాగా కోస్తాంధ్రలో 4.5 శాతం మాత్రమే. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లోను ముస్లింలు విస్తరించి ఉండగా తెలంగాణలో హైదరాబాద్ కాకుండా నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో మాత్రమే చెప్పుకోదగిన స్థాయిలో ఉన్నారు. ఇక కోస్తాంధ్రకు వచ్చేసరికి గుంటూరు, నెల్లూరుల్లో మాత్రమే ముస్లింలు ఉన్నారని చెప్పవచ్చు. అనేక కారణాలను పరిశీలించిన పిదప హైదరాబాద్‌లో ప్రధాన రాజకీయ పార్టీగా ఉన్న ఏఐఎంఐఎం సమైక్యాంధ్రకే మొగ్గు చూపుతోంది. పెద్ద రాష్ట్రంగా ఉండడం వల్లే తమకు భద్రత ఉంటుందని ముస్లింలు భావిస్తున్నారు. వ్యాపార పరంగా చూసినా సమైక్య రాష్ట్రం వల్లే ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని ఎంఐఎం భావిస్తోంది. హైదరాబాద్ రాజధానిగా తెలంగాణగాని, లేదా రాయలసీమతో కలిపి రాయల తెలంగాణ కాని ఇవ్వాలని తదుపరి ఆప్షన్లలో పేర్కొంది. రాయల తెలంగాణ వల్ల ముస్లింల జనాభా పెరుగుతుందని, ఫలితంగా తమకు రాజకీయంగా మంచి పట్టు లభిస్తుందని భావిస్తోంది. అయితే కోస్తాంధ్ర, రాయలసీమల్లో మాత్రం ముస్లింలు సమైక్యాంధ్రనే కోరుకుంటున్నారు. క్రైస్తవులు హైదరాబాద్ తర్వాత కోస్తాంధ్రలోనే ఎక్కువగా ఉన్నారు. హైదరాబాద్‌లో 2.4 శాతం కాగా కోస్తాంధ్రలో 2.1 శాతం. ఇక రాయలసీమలో 0.9 శాతం కాగా తెలంగాణలో 1.1 శాతం. మాల ఉప విభాగంలో ఉన్న క్రిస్టియన్లు, బౌద్ధులు, సిక్కులు, జైన్స్ సంఖ్యాపరంగా చూస్తే చాలా తక్కువ... అంటే కేవలం... 0.3 శాతమే. తెలంగాణ ప్రాంతంలో ఉండి రిజర్వేషన్లు కోరుతున్న దఖాని సిక్కులు ప్రత్యేక రాష్ట్రం వైపు మొగ్గు చూపుతున్నారు. అలాగే తెలంగాణలో ఉన్న క్రైస్తవులు కూడా ప్రత్యేక రాష్ట్రం డిమాండుకు మద్దతు తెలుపుతూ... తమకు రావాల్సిన ప్రయోజనాలను సీమాంధ్ర ప్రాంతం వారు తన్నుకుపోతున్నారని భావిస్తున్నారు. అయితే తెలుగు మాట్లాడేవారంతా ఒకే రాష్ట్రంలో ఉండాలని... అందుకే తాము సమైక్యాంధ్ర వాదానికి కట్టుబడి ఉన్నామని రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల క్రైస్తవులు చెబుతున్నారు. అయితే ఈ మూడు ప్రాంతాల క్రైస్తవుల వాదనల్లో ఆయా ప్రాంతాల ప్రభావం ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. దీనికి కట్టుబడే వారు ఆయా వాదనలు వినిపించినట్టు అర్థమైంది.

## మహిళల మనోగతం

రాష్ట్ర జనాభాలో దాదాపు సగం ఉన్న మహిళలు కూడా తమ అభిప్రాయాలను నికచ్చిగా చెప్పారు. మద్యపాన నిషేధ ఉద్యమంలో వీరు పోషించిన పాత్ర అనిర్వచనీయం. అలాంటి మహిళ ప్రత్యేక వాదంపై తన మనోగతాన్ని వెల్లడించింది. ప్రాంతీయత అంశమే మహిళల ప్రాధాన్య క్రమంలో అగ్రభాగాన నిలచినట్టు శ్రీకృష్ణ కమిటీ పేర్కొంది. అభివృద్ధి, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం వంటి అంశాల్లో ప్రాంతాల వారీగా వారు తమ మనోగతాన్ని స్పష్టంగా ఆవిష్కరించారు. అదే రాజకీయ

విషయాలు వచ్చేసరికి వారంతా భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. మానవ వనరుల అభివృద్ధి, సంక్షేమంపైనే ఎక్కువ మంది దృష్టి పెట్టి మాట్లాడినట్టు అనిపించింది. తెలంగాణ ప్రాంతానికి చెందిన మహిళల్లో అత్యధికులు ప్రత్యేక రాష్ట్రం వైపే మొగ్గు చూపారు. అలా జరిగితే ముందుముందు తమ పిల్లలకు మంచి చదువులు, ఉద్యోగాలు వస్తాయన్నది వారి నమ్మకం. అంతే కాకుండా ఆంధ్ర విద్యార్థులతో ఈ ప్రాంత విద్యార్థులు పోటీ పడలేరని, ఫలితంగా అవకాశాలన్నీ వారే తన్నుకుపోతున్నారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఇలాంటి పోటీ ఉండబోదని వారి నమ్మకం. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారని వీరు స్పష్టం చేశారు. అయితే కోస్తా ఆంధ్ర ప్రాంతం వారు మాత్రం రాష్ట్రమంతా సమైక్యంగా ఉండాలన్నదే తమ కోరికగా చెప్పుకొచ్చారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేయడం ద్వారా అసమానతలను తొలగించవచ్చని... వెనుకబాటు పేరుతో రాష్ట్రాన్ని ముక్కలుగా విడగొట్టడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని విభజిస్తే పెద్ద రాష్ట్రాల ముందు బలహీనంగా తయారవుతామని... అభివృద్ధికి కూడా ఇది అవరోధంగా నిలుస్తుందని వారు అన్నారు. రాయలసీమ వనితలదీ ఇదే మాట. రాష్ట్రం సమైక్యంగా ఉంటేనే సురక్షిత భావం కలుగుతుందని చెబుతూ ప్రత్యేక ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజన పూరిత అంశంగా రాయలసీమ మహిళలు అభివర్ణించారు. విడిపోవడం వల్ల ఇపుడున్న తెలంగాణ ఉద్యోగాలు, ఇతర అవకాశాలు తగ్గిపోతాయన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమం వల్ల ఆయా ప్రాంతాల్లో పెళ్ళి సంబంధాల ప్రతిపాదనలు సైతం ముందడుగు వేయలేదని తెలిపారు.

## విద్యార్థుల మనోగతం

తెలంగాణ విషయంలో విద్యార్థులు తమ శక్తివంచన లేకుండా పోరాడుతున్నారు. వారు నిర్భయంగా, నిర్ణయాత్మకమైన పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థుల్లో చాలామంది ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొంటున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చేవరకు పోరాటం నిలపబోమని చెబుతున్నారు. ఇక కోస్తాంధ్ర విషయానికొస్తే విద్యార్థులు కలిసి ఉంటేనే కలదు సుఖం అన్న భావనతో ఉన్నారు. రాష్ట్ర విభజనకు తాము పూర్తి వ్యతిరేకమని చెబుతున్నారు. ప్రాణాలిచ్చి అయినా రాష్ట్రం విభజన కాకుండా చూసుకుంటామని చెప్పారు. విడిపోతే హైదరాబాద్, ఆ చుట్టు పక్కల ఉన్న విద్యా సంస్థల్లో చదువుకునే అవకాశాలు పోతాయని వారు బయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితి రాకూడదని వారు అభిలషిస్తున్నారు. రాయలసీమ విద్యార్థులు విభజనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. హైదరాబాద్‌లో ఎన్నో విద్యా వసతులు ఉన్నాయని, రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికీ వాటి నుంచి లాభం పొందే అవకాశం ఉండాలన్నది వారి వాదన. గతంలో మాదిరిగానే ఉద్యమం సందర్భంగా ఎంతోమంది విద్యార్థులు అసువులు బాస్తున్నారు. ఇపుడు తెలంగాణ విషయంలోను ఇదే జరుగుతుంది. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఉద్యమంలో బాగా చొచ్చుకుపోయారు. ఈ ప్రాంతం నిర్లక్ష్యం కావడాన్ని ఇంక ఏ మాత్రం సహించలేమని విద్యార్థులు అంటున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భవంతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేయడంతో ఉద్యమం ఊపందుకుంది. 2008 నవంబర్ 30 నుంచి 2010 ఫిబ్రవరి 27 మధ్య కాలంలో దాదాపు 313 మంది విద్యార్థులు ఉద్యమానికి బలైపోయారు. ఇందులో వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల నుంచి ఎక్కువ మంది ఉండగా నల్గొండ, రంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, హైదరాబాద్‌కు చెందిన వారు కూడా ఉన్నారు. ఇందులో 60 మంది 18-25 మధ్య వయస్సున్న వారే. దాదాపు 158 మంది 25-60 మధ్య వయస్కులు. ఆత్మహత్యలకు పాల్పడినట్టు చెబుతున్న వారిలో 8 శాతం మంది మహిళలు కూడా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

మరో 10 శాతం మంది ఆత్మహత్యా యత్నానికి ఒడిగట్టారు. 45 శాతం మందికి పైగా గుండెపోటుతో మరణించారు. వీరిలో కొంతమంది విషం తీసుకుని, ఉరి తీసుకుని, నడిచే రైళ్ళ నుంచి దూకి, ఆత్మాహుతికి పాల్పడి, భవనాల నుంచి దూకి ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం వీరే కాకుండా మరెంతో మంది ప్రాణదానం చేసినట్టు పలు వర్గాల నుంచి అందిన సమాచారం తెలియజేస్తోంది. సరిగ్గా ఇదే నేపథ్యంలో సమైక్యాంధ్ర కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులు ఆత్మహత్య యత్నాలు చేయడమే కాకుండా విద్యార్థుల కమిటీలు రూపొందించి జాయింట్ యాక్షన్ కమిటీలుగా తయారయ్యారు. రాయలసీమలోగాని, కోస్తాంధ్రల్లో కాని విద్యార్థులు రాష్ట్ర విభజనకు ససేమిరా అంటున్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఉండాలనడంలో తప్పు లేదని... ఆ వంకతో రాష్ట్రాన్ని విభజించదాన్ని సహించేది లేదని సీమాంధ్రల్లో విద్యార్థి ప్రతినిధులు అంటున్నారు. ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో మంచి అవకాశాలు పొందడం అవసరమని... ఈ వాదనను తాము వ్యతిరేకించడం లేదని చెబుతున్నారు. కోస్తాంధ్రలో మాదిరిగా రాయలసీమలో, తెలంగాణలో వ్యవసాయం వల్ల రాబడి లేదని... అటువంటప్పుడు చదువుకోవడం ఒక్కటే తమకున్న ఏకైక మార్గమని, తద్వారా ఉద్యోగాలు పొందడం అనివార్యమని, ఈ హక్కును ఎవరూ ఆపలేరని గట్టి స్వరంతోనే వారు చెబుతున్నారు.

## భాష... సాంస్కృతిక అంశాలు

రాష్ట్ర జనాభాలో ఎక్కువ మంది తెలుగునే మాట్లాడతారు. మరో మాటలో చెప్పాలంటే ఇది భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రం కాబట్టి ఇక్కడ ప్రధాన వ్యవహారిక భాష తెలుగనే విషయం అందరికీ తెలిసిందే. తెలుగు భాషలోని మాండలికాలు ఆయా ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలను బట్టి ఆధారపడి ఉంటాయన్నది అందరికీ తెలిసిన విషయమే. తెలుగు భాషలోని మాండలికాలను శ్రీకృష్ణ కమిటీ విశ్లేషించింది. 1991 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు ప్రధాన భాష. రాష్ట్రంలోని 85 శాతం మంది ప్రజలు ఈ భాషనే మాట్లాడతారు. ఉర్దూ మాట్లాడేవారు 8 శాతం. తమిళం, మరాఠీ మాట్లాడేవారు ఒక్కో శాతం ఉండగా ఇతర భాషలు మాట్లాడేవారు ఐదు శాతం ఉన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల వారినీ పరిశీలిస్తే కోస్తాలో 94 శాతం మంది తెలుగు మాట్లాడతారు. రాయలసీమలో ఈ శాతం 80 మాత్రమే. తెలంగాణకు వచ్చేసరికి 77 శాతం మంది తెలుగు మాట్లాడతారు. ఇక ఉర్దూ విషయానికి వస్తే తెలంగాణ, రాయలసీమల్లో 12 శాతం మంది మాట్లాడుతుండగా కోస్తాంధ్రలో ఈ భాష మాట్లాడేవారి సంఖ్య నాలుగు శాతం మాత్రమే. హైదరాబాద్‌లో 39 శాతం మంది ఉర్దూ మాట్లాడతారని కమిటీ వెల్లడించింది. తెలుగు భాషా వైవిధ్యంపై రాష్ట్ర చరిత్ర ప్రభావం చూపిందని తెలిపింది. నిజాం కాలంలో తెలంగాణలో 8 శాతం మంది ఉర్దూ మాట్లాడేవారు ఉండగా ఒక్క శాతం మంది మరాఠీ మాట్లాడేవారు. ఆనాడు బ్రిటిష్ పాలనలో ఉన్న కోస్తా, రాయలసీమల్లో ఒక శాతం తమిళం మాట్లాడేవారు. తెలంగాణలోని ఆదివాసీ గిరిజనులు ప్రధానంగా గోండు మాట్లాడతారు. కొన్ని తెలంగాణ జిల్లాల్లోని ప్రజలు వివిధ భాషలతో మమేకమై ఉన్న కారణంగా రకరకాల భాషల ప్రభావం వారిపై పడింది. ఒక విధంగా నేర్చుకున్నారని చెప్పాలి. రాయలసీమలో తమిళం మాట్లాడేవారి శాతం కొంచెం ఎక్కువగా ఉంది. కారణం తమిళనాడు సరిహద్దులో చిత్తూరు జిల్లా ఉండడంతోపాటు తిరుపతి వంటి యాత్రాస్థలం అక్కడ ఉండడం... దీనికి తమిళనాడు నుంచి వచ్చి స్థిరపడిన లేదా వలస వచ్చిన వారు తమిళం మాట్లాడడంతో ఇక్కడ ఈ భాష ప్రభావం కాస్త ఎక్కువగా ఉన్నట్టు అర్థమవతుంది. సీమలో తమిళం మాట్లాడేవారి సంఖ్య నాలుగు శాతానికి మించి ఉందని కమిటీ తేల్చింది.

పాఠ్య పుస్తకాల్లో పూర్తిగా ఎక్కడా తెలంగాణ తెలుగు ఛాయలు కనిపించవు. అంటే బొత్తిగా లేదన్న మాట. బలవంతంగా కోస్తాంధ్ర భాషతో పాఠ్యపుస్తకాల రూపకల్పన జరిగింది. కోస్తాంధ్ర తెలుగును ప్రామాణిక భాషను చేయడంతో తెలంగాణ విద్యార్థులకు కష్టమైంది. అని కమిటీ వ్యాఖ్యానించింది. కోస్తాంధ్ర తెలుగులోనూ, తెలంగాణ తెలుగులోను వ్యాత్సాసం కనిపిస్తోంది. తెలంగాణ కోస్తా కవుల రచనల్లోను వ్యత్సాసం కనిపిస్తుందని నివేదికలో కమిటీ తెలిపింది. తెలంగాణ కవిరాజాలైన పోతన, పాల్కురికి సోమనాధుడి రచనలు... ఆంధ్ర కవులైన నన్నయ్య, తిక్కన్న.. రాయలసీమ కవి అయిన శ్రీనాధుడు తమ తమ రచనల్లో ఇలాంటి వైవిధ్యం కనిపించింది. అయితే ఇలా ఒకే భాష మాట్లాడుతున్నప్పుడు... కేవలం మాండలికం ప్రాతిపదికన రాష్ట్ర విభజన చేయలేమని శ్రీకృష్ణ కమిటీ స్పష్టంగా తేల్చి చెప్పింది.

కోస్తాంధ్రలోని తెలుగును పాలనలో ప్రామాణిక భాషగా తీసుకున్నారు. తెలంగాణ భాషను పూర్తిగా విస్మరించారు. పాఠ్య పుస్తకాల్లో, ప్రణాళికల్లో తెలంగాణ మాండలికాల్ని పక్కన పెట్టారు. తెలంగాణకు స్థానం లేకుండా పోయిందన్నది ఆ ప్రాంత వాసుల భావన. ఇది తెలంగాణ విద్యార్థులకు కష్టం కలిగించింది... అని కమిటీ స్పష్టం చేసింది. దీనివల్లనే తెలంగాణ ప్రజల్లో తెలుగు వారంతా ఒక్కటి కాదన్న భావం తలెత్తేందుకు కారణమైంది అని కమిటీ వ్యాఖ్యానించింది. అయితే ఇపుడు ఒకే భాషతో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను మాండలికాల ఆధారంగా విభజించడం సాధ్యం కాదని కమిటీ స్పష్టం చేసింది. ఇటీవల కాలంలో తెలంగాణ యాసతో కూడా మంచి సాహిత్యం వస్తోంది. దానికి తగిన స్థానం లభించడం లేదన్న బాధ వారిలో ఉంది. ఇది ఎందుకు జరగడం లేదు? అని వారు ఆవేదన చెందుతున్నారు. అయితే ఇక్కడొక విషయం గమనించాలి. ఉత్తరాంధ్రలో కూడా తమ భాషను ఎగతాళి చేస్తున్నారన్న వాదన ఉంది. అంటే శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఒకరకమైన మాండలికాలు కనిపిస్తాయి. ఉచ్చారణలో తేడాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి వంద కిలోమీటర్ల దూరానికి మాండలికాల్లో మార్పులు ఉండడం సహజ పరిణామమని తేలింది. ప్రాంతాల్లోనే కాకుండా పక్కపక్కనున్న కొన్ని జిల్లాల్లో కూడా ఈ మాండలికాల ప్రభావం కనిపిస్తుంది. అలాంటప్పుడు అది పెద్ద రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇవి సర్వ సాధారణం. ఈ మాండలికాలను ఆధారం చేసుకుని ప్రత్యేక రాష్ట్ర ఆలోచన సరికాదని కమిటీ అభిప్రాయపడింది. భారతదేశ ఆవిర్భావం తర్వాత చాలామంది బయటి వ్యక్తులు భారత్ సమైక్యంగా ఉండడం అసాధ్యమని అన్నారు. వీరి వాదనలకు భిన్నంగా ఇప్పటికీ భారత్ ఒక్కటిగానే ఉంది. దీనికి కారణం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న సంస్కృతీ సంప్రదాయాలను ఒకరికొకరు అనుసరించడం... అర్థం చేసుకోవడం... ఆచరించడం. వీటిన్నింటి కన్నా ముఖ్యంగా గౌరవించడం.

సామాజికంగా, సాంస్కృతికంగా, సినిమాలు, పండుగలు, సాహిత్యం విషయాల్లో తెలంగాణ సంస్కృతి వివక్షకు గురవుతుందన్న భావన ఈ ప్రాంతవాసుల్లో ఉంది. రాష్ట్రమంతటా అత్యధిక ప్రజలు తెలుగు మాట్లాడుతున్నప్పటికీ తెలంగాణ తెలుగు యాసను గేలి చేస్తున్నారన్న అభిప్రాయం బలంగా నాటుకుంది. బతుకమ్మ, బోనాలు, దసరా, దీపావళి, హోలీ, పీర్ల పండుగ, జాతరలు... ఇవి తెలంగాణకే పండుగలని, ఆంధ్రావారికి కాదని ఈ ప్రాంత వాసులు చెప్పుకొచ్చారు. పోచమ్మ, పీరమ్మ, ఎల్లమ్మ, మారమ్మ, మల్లమ్మ, మైసమ్మ, ఉరాదమ్మ, అందాలమ్మ, బీరప్ప వంటి వారిని గ్రామ దేవతలుగా ఇక్కడి వారు కొలుస్తుంటే ఆంధ్రా వాళ్ళు ఈ పేర్లను ఎగతాళి చేస్తారని తెలంగాణ వాదులు చెప్పుకొచ్చారు. ఇంతకుముందు చెప్పినట్టు తెలుగుయాస సమస్య తెలంగాణలోనే కాకుండా ఉత్తర కోస్తాలోను ఉంది. అయితే తెలంగాణ పండుగలయిన బోనాలు, సమ్మక్క సారక్క జాతరలు సీమాంధ్రల్లో కూడా ఆదరణ

పొందాయని, తమకు ఆ ప్రాంతంపై వివక్ష ఏమీ లేదని సీమాంధ్రులు చెప్పారు. సినిమాలు, నాటకాల్లో తెలంగాణ భాషను, దాన్ని మాట్లాడే వ్యక్తులను హాస్య పాత్రలకు అన్వయించి అపహాసం చేస్తున్నారని... దీన్ని భరించలేకపోతున్నామని వారు చెప్పారు. టెలివిజన్ ఛానళ్ళలో కూడా ఇదే రీతిని వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు.

అయితే సమైక్యాన్ని సమర్థించే నేతలు మాత్రం అవన్నీ వట్టి మాటలని... విభజనకు కారణాలెదుకుతూ ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని, ప్రాంతీయంగా ఎవరి సంప్రదాయాలు వారికుంటాయని, వాటిని తాము గౌరవిస్తామని చెప్పుకొచ్చారు. సాంస్కృతిక వైరుధ్యాల లోతుపాతులను చర్చించేందుకు ఈ కమిటీకి నైపుణ్యం లేదని కమిటీ అంగీకరిస్తూ స్థూలంగా తన అభిప్రాయాన్ని చెప్పింది. అయితే భారతదేశం... అన్ని రాష్ట్రాల్లో వివిధ సామాజిక వర్గాలకు చెందిన సకల సంస్కృతులు పరిఢవిల్లేలా తగిన వాతావరణం కల్పించాల్సిందిగా ఎస్ఆర్సీ ఇచ్చిన సలహానే మేమూ ఇస్తున్నామంటూ కమిటీ తన మనోగతాన్ని బయట పెట్టింది.

పత్రికలు, టెలివిజన్ మీడియా దాదాపు సీమాంధ్ర నాయకులు చేతిలో ఉన్నందున ఈ రకమైన వివక్ష చూపుతున్నారన్న అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే ఇది కొంతవరకు పరిశీలించాల్సిన అంశమైనా ఇపుడిపుడే ఈ రంగాల్లోకి తెలంగాణ ప్రాంతం వారు కూడా అడుగిడుతున్న ఛాయలు కనిపిస్తున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వీరు కూడా సత్తా సంపాదిస్తూ ముందడుగు వేస్తున్నారు. ఒక్క తెలంగాణ ప్రాంతం విషయంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా కూడా అభివృద్ధిలో ముందు వెనుకలుండడం సహజ పరిణామం. ఒక దశలో దళిత సాహిత్యం ఒక్క ప్రాంతానికి పరిమితమవగా ఇపుడు దేశంలోని అన్ని ప్రాంతాలకు ఇది విస్తరించింది. అలాగే మహిళ చైతన్యం. ఇపుడిపుడే ఆంధ్రప్రదేశ్‌లో కూడా అభివృద్ధి పరిణామాలు వేగంగా జరుగుతున్నాయి.

## రాజకీయ ప్రాతినిధ్యం...

రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వివిధ ప్రాంతాలవారికీ, వివిధ వర్గాల వారికీ సముచిత స్థానం కల్పించడం అనివార్యం. ఇది జరగకపోతే అసమానతలు అవతరిస్తాయి. అశాంతి పేట్రేగుతుంది. అందరికీ సరైన స్థానం కల్పిస్తూ ఉంటే రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచేందుకు సాధ్యమవుతుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి తెలంగాణకు చాలా తక్కువ కాలమే దక్కిందని శ్రీకృష్ణ కమిటీ చెప్పింది.

1956 నుంచి ఇప్పటివరకు ముఖ్యమంత్రులుగా కోస్తాంధ్రకు చెందిన వారే అత్యధికంగా పదిసార్లు సీఎం పదవిని అధిష్ఠించారు. అయితే ఎక్కువ కాలం పాలించింది మాత్రం రాయలసీమకు చెందిన వారే. కోస్తాంధ్ర సీఎంలు 18.11 సంవత్సరాలు పరిపాలన సాగించగా రాయలసీమకు చెందిన 9 మంది 23.9 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించారు. తెలంగాణకు చెందిన ఆరుగురు ముఖ్యమంత్రులు పాలించిన కాలం పదిన్నర సంవత్సరాలే. అయితే శ్రీకృష్ణ కమిటీ రాయలసీమకు చెందిన నేతలు 9 సార్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా పని చేశారని నివేదికలో పేర్కొన్నారు.

నోట్: నిజానికి సీమకు చెందిన ఆరుగురు నాయకులు 11 సార్లు సీఎంలుగా బాధ్యతలు నిర్వర్తించారు. నీలం సంజీవరెడ్డి మూడుసార్లు (1956, 57, 62), కోట్ల విజయభాస్కరరెడ్డి రెండుసార్లు (1982, 92), చంద్రబాబు రెండుసార్లు (1995, 2000), వై.ఎస్.రాజశేఖరరెడ్డి రెండుసార్లు (2004, 09) సీఎంలుగా బాధ్యతలు నిర్వహించారు. దీని ప్రకారం 9 సార్లు అయినా 1960లో దామోదరం సంజీవయ్య సీఎంగా సేవలందించగా ఇపుడు చిత్తూరు జిల్లాకు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

పెద్ద మనుషుల అంగీకారం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి ఎంపికైతే మరో ప్రాంతానికి చెందిన వ్యక్తిని ఉప ముఖ్యమంత్రిని చేయాలి. ఈ ఒప్పందం కుదిరిన తర్వాత ఒక్కసారి మాత్రమే ఇలా ఎంపిక జరిగింది. కాని తర్వాత ఆ ప్రస్తావనే లేకుండా పోయింది. మొత్తం మీద... ఉప ముఖ్యమంత్రులుగా ఎక్కువ కాలం పదవుల్లో నిలిచింది తెలంగాణ వారే. నలుగురు ఉప ముఖ్యమంత్రులుగా ఉండి 7.8 సంవత్సరాలు పదవిలో ఉన్నారు. రాయలసీమకు చెందిన ముగ్గురు ఉప ముఖ్యమంత్రులు పదవిలో ఉన్న కాలం 5.7 సంవత్సరాలు. ఇక కోస్తాంధ్రకు చెందిన వ్యక్తి ఉప ముఖ్యమంత్రిగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఈయన పాలించిన కాలం రెండేళ్ళ రెండు నెలలు.

ఈ అంశంపై దృష్టి పెట్టడం ద్వారా రాజకీయ అసమానతలు పాలదోలడానికి అవకాశం ఉంది. వెనుకబాటు తనం ఆధారంగా తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రంగా విభజిస్తే... రాష్ట్రంలో ఇంకా వెనుకబడ్డ రాయలసీమలో మరో విభజనోద్యమం ఊపందుకునే అవకాశం ఉంది. దీనికి స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. వివిధ వర్గాల ప్రజల ప్రయోజనాలను రాష్ట్రం కాపాడగలుగుతున్నప్పుడు మరింత ప్రజాస్వామిక వికేంద్రీకరణ, సమానత్వం సాధించేందుకు మరింతగా ప్రయత్నించాలి.

❖ ❖ ❖

అధ్యాయం 8

# శాంతి భద్రతలు మరియు అంతర్గత రక్షణ వ్యవస్థలు

కమిటీవారు, శాంతి భద్రతలు విఘాతం వలన కల్గే దుష్ప్రభావాలు దీర్ఘకాలంగా అమలులో వున్న అంతర్గత రక్షణ వ్యవస్థలు, మావోయిస్టు, నక్సల్స్ చర్యల వలన ఉత్పన్నమయిన, ప్రమాణాలను నిశితంగా పరిశీలించడం జరిగింది. ఏడు గ్రామాలు, జిల్లాల్లో జరిపిన పర్యటనలు, రాజకీయ పార్టీలతో జరిపిన ముఖాముఖి చర్చలలో శాంతి భద్రతల సమస్యలు, అంతర్గత రక్షణపట్ల పలు అనుమానాలను కమిటీ వారికి తెలియజేయటం జరిగింది. ప్రత్యేకంగా, కమిటీ కార్యదర్శి సీనియర్ అధికారులు పోలీసు అధికారులతో, శాంతి భద్రతల సమస్యలను విస్తృతంగా చర్చించడం జరిగింది. వివిధ మార్గాల ద్వారా సమాచారం సేకరించడం జరిగింది. శాంతి భద్రత సమస్యలు, అంతర్గత రక్షణ వ్యవస్థలు పరిణామాలపై కమిటీ నివేదికతో పాటు, విడిగా మరొక నివేదికను కూడా పొందుపరచి కేంద్ర హోమ్‌శాఖ వారికి సమర్పించటం జరిగింది. తొమ్మిదో అధ్యాయంలో "మున్ముందు చేపట్ట దలచని చర్యలు" సూచించటం జరిగింది.

❖ ❖ ❖

అధ్యాయం 9

# ముందడుగు

కమిటీకి సంబంధించిన నిబంధనలను నివేదికలోని విధివిధానాల విభాగంలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. దీనిలో 'ప్రత్యేక తెలంగాణా, సమైక్యాంధ్ర డిమాండ్ల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితిని అధ్యయం చేయడం, రాజకీయ పార్టీలు, వివిధ సంస్థలు, ప్రజల నుంచి అభిప్రాయాలు, పరిష్కార మార్గాలు తెలుసుకోవడం, దీనికి సంబంధించిన కార్యాచరణ సూచించడం, కమిటీ అర్థమైనదిగా భావించే ఏ సూచనలైనా చేయడం వంటి అంశాలను పేర్కొనడం జరిగింది. తద్వారా ఈ సమస్యకు సంబంధించి తగిన సూచనలను, సలహాలను, వాటి లాభనష్టాలను బేరీజు వేస్తూ ఇవ్వవలసిన బాధ్యత కమిటీకి ఇవ్వడం జరిగింది. ఈ సమస్యకు సంబంధించి పరిష్కార మార్గాలను సూచన ప్రాయంగా పరిశీలించడానికి ముందు 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశంలో రాష్ట్రాలు ఏర్పడిన విషయాన్ని తెలుసుకోవడం అవసరం. స్వాతంత్ర్యానంతర భారతదేశం లౌకికవాదం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం తదితర అంశాలతో రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకుంది. 'భారత ప్రజలమైన మేము దేశాన్ని సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య, రిపబ్లిక్‌గా నిర్మించాలని ప్రజలందరికీ భద్రత కల్పించడం, సామాజిక, ఆర్థిక న్యాయం, ఆలోచనలు, వ్యక్తీకరణలు, విశ్వాసాలు, ప్రార్థనల విషయంలో స్వేచ్ఛ, స్థాయి, అవకాశాల్లో సమానత్వం, ప్రజల్లో సౌభ్రాతృత్వం పెంపొందించి దేశ సమగ్రతను ఐక్యతను కాపాడుతాం' అని ప్రస్తావించింది.

దీనికోసం భారత దేశం రాజ్యాంగాన్ని రూపొందించింది. ఆ ప్రకారం కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో సరిహద్దుల మార్పు, పేర్లలో మార్పు అవసరమైనప్పుడు చేయడానికి రాజ్యాంగం అవకాశం ఇచ్చింది(ఆర్టికల్ 3).

రాష్ట్రాల పునర్నిర్మాణంపై స్వాతంత్ర్యం రాకముందునుంచి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. బ్రిటిష్ హయాంలో రాష్ట్రాలు పరిపాలన, మిలటరీ అవసరాల దృష్ట్యా ఏర్పడ్డాయి. రాష్ట్రాల పునర్నిర్మాణాన్ని బ్రిటిష్ ప్రభుత్వం 'హేతుబద్ధంగారాష్ట్రాల ఏర్పాటు' అని వ్యవహరించింది. భారత ప్రభుత్వం దీనికి భిన్నంగా వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రాల పునర్నిర్మాణాన్ని చేపట్టాలని భావించింది. ఫలితంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుపై అంగీకారం కుదిరింది.

స్వాతంత్ర్యానంతరం, రాజ్యాంగాన్ని రూపొందించుకున్న తరువాత దేశం 1935నాటి భారత ప్రభుత్వ చట్టం మార్గదర్శకత్వంలో కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం నూతన ప్రభుత్వం చేసిన తొలిచట్టం – దేశంలో ఉన్న 550 రాజ్యాలను భారత యూనియన్‌లో విలీనం చేయడం, మరికొన్ని రాష్ట్రాలను గుర్తించడం. అనేక రాజ్యాలు అప్పటి రాష్ట్రాల్లో విలీనం కాగా, కొన్ని కొత్త రాష్ట్రాలు – ఉ దా: రాజపుతానా, హిమాచల్ ప్రదేశ్, మధ్యభారత్, వింధ్య ప్రదేశ్ – ఉద్భవించాయి. మైసూరు, హైదరాబాద్, భోపాల్, బిలాస్‌పూర్ వంటి కొన్నింటిని ప్రత్యేక రాష్ట్రాలుగా రూపొందించారు. భారత

రాజ్యాంగం ప్రకారం (1949 నవంబరు 26న చట్టసభ రాజ్యాంగాన్ని ఆమోదించగా 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది) ఇవి ఏర్పడ్డాయి.

ఇక్కడ భారతదేశం సార్వభౌమ ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా వివిధ రాష్ట్రాల యూనియన్, కేంద్రపాలిత ప్రాంతాలుగా అవతరించింది. రాష్ట్రాలకు విశేషాధికారాలు కల్పిస్తూ స్వయం పాలన కోసం చట్టసభల ఏర్పాటు, కేంద్ర పాలిత ప్రాంతాలు నేరుగా కేంద్రప్రభుత్వ పాలనలోకి తీసుకోవడం జరిగింది. 1956లో రాజ్యాంగ సవరణ చేయడానికి ముందు వివిధ రాష్ట్రాలను ఈ విధంగా వర్గీకరించారు. పార్ట్ ఎ రాష్ట్రాలు బ్రిటిష్ ఇండియాలోని గవర్నర్ పాలనలో ఎన్నుకోబడిన సభ్యులతో కూడిన రాష్ట్రాలు(ప్రావెన్సెస్). పార్ట్ బి రాష్ట్రాలు గతంలో ఉన్న రాజ్యాలు, రాజ్య ప్రముఖుల ఆధీనంలోని రాష్ట్రాలు. పార్ట్ సి రాష్ట్రాలు గతంలోని చీఫ్ కమీషనర్ పాలనలోని రాష్ట్రాలు. ఈ సమయంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ఉద్యమాలతోపాటు అనేక రాజకీయ ఉద్యమాలు జరిగాయి.

చాప్టర్ 1లో చెప్పినట్లు 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైంది. అయితే ఈ రాజకీయ చర్య రాష్ట్రాల పునర్నిర్మాణం అనే అంశంలో ఏకాభిప్రాయానికి అవకాశం కల్పించలేదు. ఫలితంగా 1953 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్నిర్మాణ కమిషన్ (ఎస్ఆర్‌సి) ను ఏర్పాటు చేసింది. ప్రతి ప్రాంతంలో ప్రజాసంక్షేమాన్నీ, మొత్తంగా జాతి సంక్షేమాన్ని అధ్యయనం చేయడం ఈ కమిషన్ విధి. ఎస్ఆర్‌సి చేసిన సూచనల మేరకు 1956లో రాష్ట్రాల పునర్నిర్మాణ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించింది. ఈ సందర్భంలోనే రాష్ట్రాల సరిహద్దులను, ముఖ్యంగా దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల సరిహద్దులను పునర్నిర్మించారు. ఎబిసిలుగా ఉన్న రాష్ట్రాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలుగా మారుస్తూ రాజ్యాంగ సవరణ చేశారు. ఆ సమయంలో ఆంధ్రరాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్‌గా మార్చి, హైదరాబాద్ సంస్థానంలో ఉన్న తెలంగాణా ప్రాంతాన్ని చేర్చారు. అప్పటికీ పోర్చుగీస్ ఆధీనంలో ఉన్న కొన్ని ప్రాంతాలను భారత్‌లో విలీనం చేశారు. కొన్ని ప్రాంతాలను ప్రత్యేక రాష్ట్రాలుగా మార్చారు. ఇటీవల (2000) కొత్తగా ఉత్తరాంచల్(ప్రస్తుతం ఉత్తరాఖండ్), ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలు ఏర్పడ్డాయి. కొండ ప్రాంతాలు, గిరిజన జాతుల ప్రజల అభివృద్ధికోసం ఈ రాష్ట్రాలు ఏర్పడ్డాయి.

నిజానికి రాష్ట్ర పరిధి ఎంత ఉండాలనే విషయంపై స్పష్టమైన నిర్ణయాలేవీ తీసుకోలేదు. ఆ తరువాత కాలంలో బలమైన కేంద్రం, బలమైన రాష్ట్రాలతో పాలన సాగిస్తూ దేశ పాలనను తీర్చిదిద్దాలనే దృక్పథం ఏర్పడింది. చిన్నా పెద్దా రాష్ట్రాలనే తేడా లేకుండా బలమైన నాయకత్వం, చక్కని పరిపాలన ఉన్న రాష్ట్రాలు (వాటి పరిమాణంలో సంబంధం లేకుండా) ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిని సాధించాయి. దీనికి భిన్నంగా సరైన నాయకత్వం, పరిపాలన లేని రాష్ట్రాలు ఆర్థికంగా సామాజికంగా దెబ్బతిన్నాయి.

కొత్త రాష్ట్రాల ఏర్పాటు విషయంలో జాతీయ స్థాయి రాజకీయ పార్టీల అభిప్రాయాలను ఇక్కడ పేర్కొనడం అవసరం. కొత్త రాష్ట్రాల ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ పార్టీ దృక్పథం ఆశావహంగా లేదు. వాస్తవానికి తెలంగాణా అంశం కూడా 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం చేపట్టిన 'నేషనల్ కామన్ మినిమమ్ ప్రోగ్రాం'లో చేర్చబడింది. భారతీయ జనతాపార్టీ చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలంగానే వుంది. 1997లో జరిగిన బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేస్తామని తీర్మానించినప్పటికీ, బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఆరేళ్ల పదవీకాలంలో దానిని అమలుపరచలేదు. దీనికి ఎన్‌డిఎలో ప్రధానభాగస్వామ్య పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ విధానమే కారణం. అప్పట్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్రవిభజనకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంది.

2009 ఎన్నికల మ్యానిఫెస్టోలో బిజెపి మరోసారి చిన్న రాష్ట్రాల ఏర్పాటు గురించి ప్రస్తావించింది. సుపరిపాలన, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం అనే అంశాలను దృష్టిలో ఉంచుకుని బిజెపి భవిష్యత్‌లో కూడా చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపింది.

సిపిఐ(ఎమ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన బృందంతో కమిటీని కలిసినప్పుడు తమ పార్టీ జాతీయ విధానం రాష్ట్రాల విభజనకు వ్యతిరేకమని, కనుక తాము ఆంధ్రప్రదేశ్ విభజనకు మద్దతు తెలుపలేమని చెప్పారు. చిన్నరాష్ట్రాలు ఏర్పాటు చేస్తే రాష్ట్రాలు స్వయం ప్రతిపత్తి విషయంలో కేంద్రంతో రాజీకి రావలసి వస్తుందని వివరించారు. అయితే తెలంగాణా విషయంలో ప్రత్యేకరాష్ట్రం కోసం వస్తున్న డిమాండ్ దృష్ట్యా దీనికి తమపార్టీ జాతీయకార్యవర్గం కొంత సడలింపు ఇచ్చిందని చెప్పారు. 2009 డిసెంబర్ 9న జాతీయ మీడియాలో ప్రకటన తరువాత బహుజన సమాజ్‌పార్టీ చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు సూచన ప్రాయంగా అంగీకారం తెలిపింది.

ఈ సందర్భంలో రాష్ట్రాల పునర్నిర్మాణ కమీషన్ అధ్యయనం చేసిన అంశాలను ఇక్కడ ఉటంకించడం ఉపయోగకరంగా ఉంటుంది.

మార్పుకోసం జరిగే వ్యయం, భారతదేశంలో ఐక్యత భద్రత, భాష, సంస్కృతి, ఆర్థిక వనరులు, జాతీయ అభివృధి పథకాల అమలుకు చేయవలసిన అంశాలు, ప్రాంతీయ ప్రణాళికలు, ఆర్థిక సమతుల్యత, చిన్నరాష్ట్రాలు, పెద్దరాష్ట్రాలు, ఇతర ముఖ్యమైన అంశాలు అంటే ప్రజల అభిప్రాయాలు, సెంటిమెంట్లు వగైరా. వీటితోపాటు చారిత్రక, భౌగోళిక, పరిపాలనాంశాలను కూడా పరిశీలించాల్సి వుంటుంది. వీటి తర్వాత భాషను కూడా ప్రధాన ప్రాతిపదికగా పేర్కొనడం జరిగింది. ఐకమత్యంగా ఉండాలనే అంశానికి మనం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని జవహర్‌లాల్ చెప్పిన మాటలను కూడా ఎస్ఆర్‌సి ఇక్కడ పేర్కొంది.

ప్రస్తుత పరిస్థితుల్లో గణనీయమైన అభివృద్ధి వుంటే తప్ప ఆ మార్పువల్ల సంబంధిత ప్రజలకు, మొత్తం జాతికి లబ్ది చేకూరుతుంటేతప్ప ఎలాంటి మార్పు చేపట్టరాదు(29వ పేజి, 106వ పేరా). రాష్ట్రాల పునర్నిర్మాణమంటే కేవలం ఒక ముగింపు కాదు. ఏ మార్పు వల్లనైనా ఫలితాలు సమతుల్యంగా వుంటే...భారతదేశ ఐక్యత, భద్రత అత్యంత ప్రధానమైనదని ఎస్ఆర్‌సిలో వివరంగా చెప్పబడి వుంది.

రాష్ట్ర పునర్విభజన సంఘం (ఎస్ఆర్‌సి) తన ముగింపు అధ్యాయంలో ఇలా చెప్పింది. 'ఈ సమస్యను అన్ని కోణాల నుండి నిశితంగా పరిశీలించిన అనంతరం మేము (ఎస్ఆర్‌సి) రాష్ట్రాల పునర్విభజన భాషాపరంగానో, లేదా సాంస్కృతిక పరంగానో జరగడం సాధ్యంకాదని, వాంఛనీయం కాదని అభిప్రాయానికి వచ్చాం. దీనికి ప్రత్యామ్నాయంగా మనదేశ సమైక్యతను దృష్టిలో వుంచుకొని మొత్తం సమస్యను సమతుల్యంగా పరిష్కరించాల్సిన అవసరం వుంది.

చిన్నరాష్ట్రాల ఏర్పాటు అంశంమీద ఎస్ఆర్‌సి వెలిబుచ్చిన అభిప్రాయం ఇలా వుంది. 'భారతదేశ గణతంత్రంలో ఒక రాజ్యాంగ విభాగంగా అన్ని హంగులతో వుండటానికి ప్రతి రాష్ట్రం సరైన వనరులను సమకూర్చుకోవడమే లక్ష్యంగా నిర్దేశించుకోవాలి. అయితే దీని అర్థం ఆయా రాష్ట్రాలు తమ జీవన శైలి ప్రత్యేకతను కోల్పోకూడదని కాదు. పెద్ద రాష్ట్రాల విషయంలో పరిపాలనా సామర్థ్యం పెంపొందించుకోవడంలోనూ ఆర్థికాభివృద్ధిమీద, సంక్షేమ పథకాలమీద సహకారాన్ని అందివ్వటంలోనూ వీలుంటుంది'. ఈ విధంగా ఎస్ఆర్‌సి రాష్ట్ర పునర్విభజన మీద అన్ని అంశాలనూ దృష్టిలో వుంచుకొని సమతుల్య భావనతో సమస్యలను పరిష్కరించుకోవాలని అభిప్రాయపడింది.

ఈ కమిటీకి పలు ఇతర రాష్ట్రాల్లో పలు పార్టీలు ప్రత్యేకరాష్ట్ర డిమాండుతో ఉద్యమిస్తున్నాయన్న సంగతి బాగా తెలుసు. పశ్చిమబెంగాల్, గుర్ఖాల్యాండ్, అస్సాంలో బోడోల్యాండ్ లాంటివి తెలంగాణా ఉద్యమంలాగానే ఉధృతంగా వున్నాయి. మహారాష్ట్రలో విదర్భ ఉత్తరప్రదేశ్‌లో బుందేల్‌ఖండ్, పూర్వాంచల్, హరితప్రదేశ్ లాంటివి ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నాయి. కాశ్మీర్‌లో లడక్‌ప్రాంతం, జమ్ముప్రాంతం వేర్పాటు బాటలో వున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో 2010 ఆగస్టులో లక్నో ప్రధాన కార్యాలయంగా 'చిన్న రాష్ట్రాల జాతీయ సమాఖ్య' ఒకటి ఏర్పడిందన్న విషయం ఈ కమిటీ దృష్టికి వచ్చింది. ఈ సమాఖ్య 2010 సెప్టెంబరులో హైదరాబాద్‌లో తన సమావేశాన్ని నిర్వహించగా చాలామంది హాజరయ్యారన్న విషయం కూడా కమిటీ దృష్టికొచ్చింది. ఈ సమావేశంలో పాల్గొన్నవారిలో పలు ప్రాంతాలకు చెందిన పేరొందిన నాయకులున్నారు. ఈ చిన్న రాష్ట్రాల లక్ష్యం ప్రజల ప్రాంతీయ తత్వాన్ని గౌరవించాలనడమే (సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక రంగాలు కలిపి). ఆ సమావేశంలో అన్ని రాజకీయపార్టీలూ, వర్గాలూ చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు సుముఖంగా వున్నాయనీ తుది తీర్మానం చేశారు.

దేశంలోని చట్టసభల ప్రతినిధులతో కూడిన 74వ సమావేశం 2010 ఫిబ్రవరి 3,4 తేదీలలో లోక్‌సభ స్పీకర్ శ్రీమతి మీరాకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వేర్పాటు అంశంమీద చర్చ జరిగిందని తెలియవచ్చింది. ఈ చర్చలో 1956 నాటి రాష్ట్ర పునర్విభజన సంఘం నివేదికను గూర్చి కూడా చర్చించారు. ఆ సభలో అత్యధికులు ఆ నివేదికతో ఏకీభవించి చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు ప్రత్యామ్నాయంగా దేశంలోని అన్ని భాగాలను సమానంగా అభివృద్ధి పరచాలనీ, మంచి పరిపాలన మీద దృష్టిసారించాలనీ అభిప్రాయపడ్డారు. అదే సమావేశంలో మరికొంతమంది చిన్న రాష్ట్రాల ఏర్పాటు అవసరం వాస్తవికతను ప్రతిబింబిస్తుందనీ, దేశంలో నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల ప్రజల మనోభావాలను పక్కన పెట్టడం మంచిది కాదనే అభిప్రాయం వ్యక్తమయింది. ఈ రెండు భిన్న అభిప్రాయాలకు అతీతంగా దేశ సమగ్రత అతి ముఖ్యమైన అంశమన్న అభిప్రాయం అందరూ వ్యక్తం చేశారు. రాజ్యాంగం చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు పార్లమెంటుకు అధికారాన్నిచ్చింది. ఈ అంశంలో రెండవ రాష్ట్ర పునర్విభజన సంఘాన్ని ఏర్పాటుచేసేందుకు సమయం ఆసన్నమైందా లేదా అన్న అంశంమీద నిర్ణయం తీసుకునే హక్కు పార్లమెంటుకు మాత్రమే ఉందనేది మా అభిప్రాయం.

చిన్నరాష్ట్రాల డిమాండు అంశంమీద మేధావి వర్గాల్లో తీవ్రచర్చ జరిగింది. అందులోని అనుకూల అంశాలను, వ్యతిరేక అంశాలనూ మేధావి వర్గం చర్చించింది. చిన్నరాష్ట్రాల ఏర్పాటు వలన రాష్ట్రాలు బలహీనపడి బలమైన కేంద్రం ఏర్పడుతుందనే శంక పలువురిలో ఏర్పడింది. ఇది ఫెడరల్ వ్యవస్థకు ప్రతికూలం.

ఈ కమిటీ ఇటీవల ఏర్పడ్డ మూడు చిన్నరాష్ట్రాల పనితీరు గురించి పరిశీలించింది. ఉత్తరాంచల్ (ప్రస్తుతం ఉత్తరఖండ్), చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ చిన్న రాష్ట్రాలుగా 2000 సంవత్సరంలో అవతరించాయి. ఉత్తరఖండ్ రాష్ట్రం కొండ ప్రాంతాల అభివృద్ధి వేగవంతం కావాలనే ఉద్దేశ్యంతో ఏర్పడగా చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాలు గిరిజన ప్రాంతాల ఆర్థికాభివృద్ధి వేగవంతం కావాలనే లక్ష్యంతో రూపుదిద్దుకున్నాయి. అవి ఏర్పడ్డ 10 ఏళ్ళ పనితీరును పరిశీలిస్తే వైవిధ్యత గోచరించింది. పరిపాలనా, రాజకీయ స్థిరత్వం, ఆర్థిక పాటవం అంశాలలో ఉత్తరఖండ్ తన లక్ష్యాన్ని బాగా నెరవేర్చ గలిగింది. ఈ రాష్ట్రం గిరిజన రాష్ట్రంగా ప్రత్యేక హోదాను పొందగలిగింది. దీనివల్ల ప్రణాళికా పరమైన నిధులు ఈ రాష్ట్రానికి అందాయి. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం కొంతమేరకు రాజకీయ స్థిరత్వం పొంది చెప్పుకోదగ్గ ఆర్థికాభివృద్ధిని

సాధించినా మావోయిస్టులనుండి అంతర్గత భద్రతా సమస్యలను తీవ్రంగా ఎదుర్కుంటోంది. ఈ రాష్ట్రం నక్సలైట్ల హింసాత్మక చర్యలను, డబ్బుగుంజడం వంటి కార్యకలాపాలను సమర్ధవంతంగా అదుపుచేయలేక పోయింది. జార్ఖండ్ రాష్ట్రం మొదట్లో కొంత ఆర్థిక పురోగతిని కనబరిచినా పరిపాలనా రంగంలో చాలా చోట్ల నిరాశపరిచిందనే చెప్పాలి. 10 సంవత్సరాల్లో 8మంది ముఖ్యమంత్రులు మారారు. రెండుసార్లు ఈ రాష్ట్రం రాష్ట్రపతి పాలనను చవిచూసింది. ఈ రాష్ట్ర ఆర్థిక పటుత్వం అంతకంతకూ తగ్గుతూ వస్తుంది. మావోయిస్టుల అభద్రతా చర్యలు పెరిగిపోయాయి. ఈ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య దేశంలోనే అత్యధికంగా వుంది. సరళీకృత ఆర్థిక వ్యవస్థలో చిన్నరాష్ట్రాల పనితీరు లాభనష్టాలను బేరీజు వేసి వాటి రాజకీయ, ఆర్థిక పాటవాన్ని మదింపు వేయాలని మేధావి వర్గం చాలా చర్చలను చేసింది.

ఈ మూడు చిన్న రాష్ట్రాల ఏర్పాటు దేశంలోని ఇతర ప్రాంతాలలో చిన్న రాష్ట్రాల ఏర్పాటు డిమాండుకు  బాట వేసింది. అయితే ఈ మూడు రాష్ట్రాల పనితీరును పరిశీలించిన అనంతరం చిన్న రాష్ట్రాల ఏర్పాటు వల్ల సర్వతోముఖాభివృద్ధి జరగదన్న వాదన బలపడింది. రాష్ట్ర వైశాల్యంతో సంబంధం లేకుండా మంచి పరిపాలనను అందివ్వగలగడమే మంచిదన్న అభిప్రాయం చాలామందిలో కలిగింది.

## సంతృప్తికరమైన పరిష్కారాలు/సూచనలు

ఈ నివేదిక గత అధ్యాయాల్లో ప్రత్యేక తెలంగాణాకు డిమాండును, రాష్ట్రం సమైక్యంగా వుండాలన్న డిమాండును కమిటీ కూలంకషంగా పరిశీలించింది. కొత్తరాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియను గురించి కూడా విపులంగా చర్చించింది. ఈ పరిస్థితిని అన్ని కోణాల నుండి, అన్ని దృక్పథాల నుండి పరిశీలించిన తరువాత స్థానిక, ప్రాంతీయ, జాతీయ దృక్పథాలతో ఈ కమిటీ కొన్ని ఆచరణ యోగ్యమైన పరిష్కారాలను, సూచనలను చేస్తోంది.

## యధాతథ స్థితి కొనసాగింపు

కేంద్రప్రభుత్వ జోక్యం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే శాంతిభద్రతల సమస్యను సవాలుగా తీసికొని యధాతథ స్థితిని కాపాడటం గత 54 సంవత్సరాలుగా తెలంగాణా వేర్పాటు ఉద్యమాన్ని రాజకీయ పరంగానే పరిష్కరిస్తూ వచ్చారు. వివిధ వర్గాలకూ ప్రభుత్వంలో తమ పార్టీలో చోటు కల్పిస్తూ ఉద్యమ తీవ్రతను తగ్గిస్తూ వచ్చారు. 'తెలుగు ఆత్మగౌరవం' నినాదం తెలంగాణా వాదాన్ని కొంతవరకు పక్కకు నెట్టగలిగినా దానిని పూర్తిగా తొలగించలేక పోయింది.  ఇది 2000 తరువాత తిరిగి ఉద్యమ రూపంలో ప్రత్యక్షమయింది. పెద్దమనుషుల ఒడంబడిక అమలు పాక్షికంగా వున్నందువల్ల, ఉపాధి అంశంమీద 1975 నాటి రాష్ట్రపతి ఉత్తర్వు అమలు సంతృప్తికరంగా లేనందువల్ల రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో విద్యాస్థాయి ప్రమాణాలు ఒకటిగా లేనందువల్ల, సాగునీటి వనరులు, నీటితీరువా సరిగా లేనందువల్ల, తెలంగాణా ప్రాంతంలో ఆర్థికాభివృద్ధి నిర్లక్ష్యం చేయబడినందువల్ల ఉద్యమం తిరిగి ప్రజల్లోకి రాగలిగింది. ఇవన్నీ కాక ప్రత్యేక తెలంగాణా కోసం సుదీర్ఘకాల కోరిక, భావానుబంధం వంటివి ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేశాయి. ఆర్థికాభివృద్ధి విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎటువంటి ప్రధాన నిర్లక్ష్యం జరగలేదనీ ఈ కమిటీ నిర్ధారించుకుంది. అయితే ఉపాధి, విద్య, నీటితీరువా, సాగునీరు వంటి అంశాలలో కొంత వెలితి ప్రస్ఫుటమవుతుంది. తెలంగాణా ప్రజల భావోద్వేగాలను సంతృప్తి పరచడంలో సరైనచర్యలు తీసికోనట్లయితే ఉద్యమం ఈ ప్రాంతంలో మరింత తీవ్రమై హింసాత్మకంగా మారగలదు. ఇదే కాక కొన్ని ప్రత్యేక డిమాండ్ల మీద వివిధ ప్రాంతాలలో ఉద్యమాలు

దీర్ఘకాలం కొనసాగే అవకాశం వుంది. తెలంగాణా ప్రజాఫ్రంట్ (టిపిఎఫ్-గద్దర్) మరోమారు టిఆర్ఎస్‌తో చేతులు కలిపితే ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకోగల అవకాశం వుంది. ఈ ఉద్యమాల వల్ల హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో సాధారణ జనజీవనం ప్రశాంతతను కోల్పోయి నగర ఆర్థిక పెరుగుదల ప్రశ్నార్థకంగా మారగలదు. ఇంతకుముందు జరిగినట్లుగానే ఈ ప్రాంతపు ప్రజాప్రతినిధుల మీద రాజీనామా చేయమని ఒత్తిడి పెరగలదు. ఇది తిరిగి రాజకీయ సంక్షోభానికి దారితీస్తుంది. ఈ నేపథ్యంలో మావోయిస్టు ఉ ద్యమం మరింత వేళ్ళూనుకునే అవకాశం వుంది. ఈ సంక్లిష్ట వాతావరణాన్ని పరిశీలించిన తరువాత, తీవ్రమైన భావోద్వేగంతో కూడిన అంశాలను పరిశీలించిన తరువాత ఈ పరిస్థితి మీద యథాతథ స్థితిని కొనసాగించి ఊరకుండటం సమంజసం కాదని ఏకాభిప్రాయానికి ఈ కమిటీ వచ్చింది. యథాతథ స్థితి అనేది ఒక మార్గం మాత్రమే. దీనిని చివర వుంచవచ్చు. పరిస్థితిని చక్కదిద్దేందుకు కొంత ప్రయత్నం చేయడం అత్యవసరం.

## రాష్ట్రాన్ని సీమాంధ్ర, తెలంగాణాగా రెండుగా విడదీయటం - హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతం - రెండు రాష్ట్రాలకు సొంత రాజధానులు

హైదరాబాద్ నగరం రాజకీయంగాను, ఆర్థిక పరంగానూ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకొని ప్రాంతీయంగా, జాతీయంగా, అంతర్జాతీయంగా ఎదుగుతూ వస్తోంది. నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఐటి, ఐటి ఆధారిత సర్వీసుల రంగంలో హైదరాబాద్ నగరం పెరుగుతూ వస్తోంది. ఇదే కాక రియల్ ఎస్టేట్ పరిశ్రమ ఈ నగరంలో ఊపందుకుంటోంది. ప్రాంతీయ సంస్థలతో పాటు, జాతీయ సంస్థలు కూడా ఈ రియల్ ఎస్టేట్ పరిశ్రమలో వున్నాయి. పక్కనే వున్న రంగారెడ్డి జిల్లాలో ఉత్పాదన పరిశ్రమలు ఊపందుకుంటూ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుండి, బయటనుండి పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. అనేక ప్రభుత్వరంగ సంస్థలు, జాతీయ సంస్థలు, పౌర సైనిక వ్యవస్థలు, రక్షణ సంస్థలు హైదరాబాద్ చుట్టుప్రక్కల ఏర్పడి వున్నాయి. కాలానుగతంగా ఈ నగర భౌగోళిక స్వరూపం మారుతూ వస్తోంది. ఇతర ప్రాంతాల నుండి, రాష్ట్రం వెలుపలి నుండి ప్రజలు అత్యధిక సంఖ్యలో ఈ నగరానికి వలస వస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మెట్రోపాలిటన్‌గా ఈ నగరం మారింది. ఈ నేపథ్యంలో నిరవధిక ఆర్థికాభివృద్ధి కొనసాగాలంటే ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపర్చాల్సి వుంటుంది. హైదరాబాద్‌తో ఇతర ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలకు లింకులేర్పర్చాల్సి వుంటుంది. మొత్తం మీద నగరంలో సుస్థిరమైన వాణిజ్య వాతావరణాన్ని ఏర్పర్చాల్సి వుంటుంది.

హైదరాబాద్ నగరంలోని పరిస్థితిని బెల్జియంలోని బ్రెసెల్స్ నగరంతో పోల్చవచ్చు. 1968లో బెల్జియంలో బ్రెసెల్స్ నగరం ఎవరిదన్న అంశం మీద హింసాత్మక సంఘటనలు వరుసగా చోటుచేసుకున్నాయి. ఈ నగరం ఉత్తర ఫ్లమాండ్ ప్రాంతంలో వుంది. దీనికి పరిష్కారం బెల్జియం రెండు సంస్కృతులతో, మూడు ప్రాంతాలతో కూడిన దేశం అని ప్రకటించడమే. బెల్జియం జనాభా సుమారుగా 1 కోటి వుంటుంది. ఇందులో 60 లక్షల మంది దేశ ఉత్తరాదిన నివసిస్తూ ఫ్లెమిష్ భాషను మాట్లాడేవారు. మరో 40 లక్షలమంది బెల్జియం దక్షిణాదిన నివశిస్తూ ఫ్రెంచి భాషను మాట్లాడేవారు. వీరు కాక జర్మన్ మాట్లాడే అల్పసంఖ్యాకులు కూడా వున్నారు. ఈ విధంగా బెల్జియం మూడు భాషల సమాఖ్య (ఫ్లెమిష్, ఫ్రెంచ్, జర్మన్)గా రూపొందింది. బ్రెసెల్స్ నగరాన్ని రెండు భాషాల ప్రత్యేక రాజధానిగా ఏర్పాటుచేసి దానికి స్వతంత్ర పరిపాలనా వ్యవస్థను, న్యాయ వ్యవస్థను ఏర్పరిచారు. ఆంధ్రప్రదేశ్ ఒకే సంస్కృతిని కలిగి ప్రధాన రాష్ట్ర భాషగా తెలుగు వుంది. మా అభిప్రాయం ప్రకారం ఈ నగరం కోసం రెండు వర్గాలు సమానంగా పోటీపడుతుంటే దానిని కేంద్రపాలిత ప్రాంతంగా

చేయటం సముచితం అందువల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్నిరెండుగా విభజిస్తే హైదరాబాద్ కేంద్రపాలితప్రాంతం అవ్వాలి రెండు రాష్ట్రాలూ తమ రాజధానులను సమయానుకూలంగా ఏర్పాటు చేసుకోవచ్చు. కేంద్రపాలిత ప్రాంతం నుండి వచ్చే రాబడి కేంద్రప్రభుత్వానికి పోతుంది గనుక ఈ మూడు ప్రాంతాలకు పరస్పర అంగీకారం ప్రకారం గ్రాంటులను ఇవ్వవచ్చు.

ఈ సూచన కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల వారికి ఆమోదయోగ్యం ఎందువలనంటే హైదరాబాద్‌లో వారి ఆర్థిక ప్రయోజనాలు సంరక్షించబడతాయి వారు సమైక్యాంధ్రను కాంక్షిస్తూ హైదరాబాద్ దాని రాజధానిగా వుండాలని కోరుకున్నా ఈ సూచన కొంతవరకు ఆమోదయోగ్యమే అయితే ఈ సూచన తెలంగాణా ప్రజలకు ఏమాత్రం రుచించదు తిరిగి ఉద్యమం తీవ్రతరం కాగల అవకాశాలు వున్నాయి ఇదికాక కేంద్రపాలిత ప్రాంతంగా హైదరాబాద్ పరిపాలనను వారు కొనసాగనివ్వరు మరో ముఖ్యమైన అంశమేమంటే హైదరాబాద్ నగరానికి రాకపోకలు సాగించేందుకు భౌగోళిక అంశం అడ్డుగా వుండటం ఈ నగరానికి కోస్తాంధ్ర వైపు నుండి కావాలంటే నల్గొండ జిల్లా నుండే రావాలి రాయలసీమ నుండి రావాలంటే మహబూబ్‌నగర్ నుండే రావాలి సీమాంధ్ర రాయలసీమ ప్రజలకు హైదరాబాద్‌లో ఆస్తిపాస్తులు వ్యాపారాలు ఉన్నందువల్ల భౌతికంగా ఈ నగరాన్ని వేరుచేయగల అవకాశం తెలంగాణా వాదులకు వుంది సరఫరాలను అడ్డుకోవడం ద్వారా మంచినీటి సరఫరాను అడ్డుకోవడం ద్వారా ఉద్యమకారులు తీవ్ర అసౌకర్యాలను కలిగించవచ్చు. ఇదికాక హైదరాబాద్ లేకుండా తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటిస్తే ఆ ప్రాంత ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసినట్లు అవుతుంది వారు హైదరాబాద్ తెలంగాణాలో ఒక అంతర్భాగమని గాఢంగా విశ్వసిస్తున్నారు కనుక ప్రత్యేక రాష్ట్రం వచ్చినా కూడా ఉద్యమం కొనసాగవచ్చు. అందువల్ల ఈ సూచన ఆచరణయోగ్యం కాదని కమిటీ అభిప్రాయ పడుతుంది

## రాష్ట్రాన్ని రాయల-తెలంగాణ రాష్ట్రంగానూ కోస్తాంధ్ర ప్రాంతంగాను విడదీయటం -హైదరాబాద్ రాయల-తెలంగాణ ప్రాంతంలో అంతర్భాగం

రాయలసీమకు చెందిన కొందరు ప్రజలు ఈ సూచనను కమిటీ ముందుంచారు వారి మొదటి ప్రాధాన్యత సమైక్యాంధ్ర మజ్లీస్ పార్టీకూడా సమైక్యాంధ్రనే కోరుతూ విభజన తప్పదంటే తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలను కలిపి కొత్త రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని సూచించింది రాయలసీమ ప్రాంతం ఈ మూడు ప్రాంతాలలో బాగా వెనుకబడినది నీటికోసం తమ సాగునీటికోసం తెలంగాణా మీద ఆధారపడాలి ఉపాధికోసం, విద్యకోసం హైదరాబాద్‌కు రావాలి ఈ రెండు ప్రాంతాల సాంఘిక పరిస్థితులు ఒక్కలానే వుంటాయి అందువల్ల కోస్తాంధ్ర నుండి రాయలసీమను విడదీసి తెలంగాణాకు కలపాలన్నది వాదన రాయలసీమ ప్రజలు తెలంగాణలో చేరేందుకు సుముఖత కనబరచవచ్చు. మా విశ్లేషణ ప్రకారం ఆర్థిక, సాంఘిక ప్రామాణికాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ సూచన ఆచరణయోగ్యమైనదిగా కనిపిస్తుంది

మరోవైపు తెలంగాణా ప్రాంతంలోని అన్ని రాజకీయ పార్టీలు, వర్గాలూ ఈ సూచనను పూర్తిగా వ్యతిరేకించగలవు రాయలసీమ రాజకీయ నాయకత్వం తెలంగాణా భూవనరులను కొల్లగొడుతూ దాని అభివృద్ధికి అడ్డుగా నిలిచిందని చాలామంది విశ్వసిస్తున్నారు ఈ కమిటీ తెలంగాణలోని అన్ని గ్రూపులతో ఈ విధానం గురించి చర్చించింది అయితే ఒక్కరు కూడా ఈ సూచనను సమర్థించకపోగా దీనిని పూర్తిగా వ్యతిరేకించారు

ఈ సూచనను తెలంగాణా వాదులు లేదా సమైక్యాంధ్ర వాదులు అంగీకరించడం లేదు ఇదే కాక మతశక్తులు రాజకీయ పార్టీలతో, వర్గాలతో పోటీపడగల అవకాశాలున్నాయి ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా తెలంగాణా ప్రాంతంలో ఉద్యమం జరిగే అవకాశం కూడా వుంది ఈ సూచన ఆర్థిక పరంగా న్యాయసమ్మతంగా వున్నాకూడా మూడు ప్రాంతాల ప్రజలకు ఆమోద యోగ్యంగా లేదని కమిటీ భావిస్తోంది

ఆంధ్రప్రదేశ్‌ను సీమాంధ్ర తెలంగాణా రాష్ట్రాలుగా విడదీయడం - హైదరాబాద్‌ను ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతం చేయడం - ఈ కేంద్ర పాలిత ప్రాంతానికి భౌగోళిక అనుసంధానతను కల్పించడం - నల్గొండ జిల్లా ఆగ్నేయంగా కోస్తాంధ్రలోని గుంటూరు జిల్లాకు, మహబూబ్ నగర్ జిల్లాగుండా దక్షిణంవైపు రాయలసీమలో కర్నూలు జిల్లాకు భౌగోళిక అనుసంధానం చేయడం

హైదరాబాద్ నగరం ప్రపంచ నగరంగా వృద్ధిచెందుతుందన్న అంశాన్ని దృష్టిలో వుంచుకొని ఈ సూచన చేయడం జరిగింది నగర సరిహద్దులను ఇటీవల 175 చ కి మీ నుండి 625 చ కి మీలకు పెంచడం జరిగింది గతంలో వున్న హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థను హైదరాబాద్ మెట్రో అభివృద్ధి సంస్థగా మార్చి ముఖ్యమంత్రి అధీనం క్రింద ఉంచి 7073 చ కి మీ వైశాల్యాన్ని ఏర్పరచారు ఇది గోవా రాష్ట్రానికి సుమారు రెండింతలు ఈ సూచనలో విస్తరించిన కేంద్ర పాలిత ప్రాంతం సుమారు 12 000 చ కి మీలు పటంలో విపులంగా విశదీకరించబడింది

విస్తరించిన కేంద్ర పాలిత ప్రాంతంలో 67 మండలాలు 1330 గ్రామాలు, 12430 చ కి మీ వైశాల్యం దిగువ సూచించిన విధంగా వుంటుంది

| జిల్లాపేరు | మండలాల సంఖ్య చ.కి.మీ. | రెవెన్యూగ్రా.సంఖ్య | ఏరియా |
|---|---|---|---|
| రంగారెడ్డి | 21 | 576 | 4186 |
| మెదక్ | 10 | 262 | 1776 |
| మహబూబ్‌నగర్ | 9 | 163 | 3109 |
| నల్గొండ | 11 | 263 | 3142 |
| హైదరాబాద్ | 16 | 66 | 217 |
| **మొత్తం** | **67** | **1330** | **12430** |

కమిటీ అభిప్రాయం ప్రకారం హైదరాబాద్ నగరం రాష్ట్రంలోనే కాక దేశం మొత్తంమీద త్వరగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక స్వరూపం దీని మొత్తం ఉత్పత్తి 2005-06లో 58%గా వుంది ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన సాఫ్ట్‌వేర్ కేంద్రం మాత్రమే గాక దేశంలోని ఐటి ఎగుమతుల్లో 15% ఈ నగరంనుండే ఇవి కాక రియల్ ఎస్టేట్, మౌలిక సౌకర్యాల రంగం కూడా హైదరాబాద్‌లో వృద్ధిచెందుతున్నాయి గతంలో వలసలు రాష్ట్రం వెలుపల కర్నాటక, మహారాష్ట్రల నుండే వచ్చేవి అయితే ఇప్పుడు తూర్పు రాష్ట్రాల నుండి ఉత్తరాది రాష్ట్రాల నుండి వలసలు వస్తున్నాయి దేశంలో అత్యంత కీలకమైన రాష్ట్రంగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటోంది దేశ భద్రతఅంశం విషయంలో కూడా ఈ నగరం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది

ఈ అంశాలను పరిగణిస్తే ఈ నగరానికి కేంద్రపాలిత హెూదా ఇవ్వవచ్చన్న సూచన సరైనదే రాష్ట్రంలోని మూడు ప్రాంతాలూ భౌగోళికంగా భౌతికంగా హైదరాబాద్ నగరానికి సానుకూలంగా వున్నాయి ఈ నగరం ఛండీఘడ్ లాగా ప్రత్యేక కేంద్రపాలిత పరిపాలనా వ్యవస్థతో అటు తెలంగాణాకు ఇటు సీమాంధ్రకు రాజధాని నగరంగా వెలుగొందవచ్చు. ఇందుకోసం మౌలిక సదుపాయల కల్పనకు కావలసినంత స్థలం ఇక్కడ లభిస్తుంది కోటి మందికి పైగా జనాభాతో ఈ నగరం భాసిల్లుతోంది ఛండీఘడ్, ఢిల్లీ తరహాలో ఈ నగరం కూడా సొంత శాసనసభ కలిగి వుండవచ్చు ఛండీఘడ్ పరిసర ప్రాంతాలు వృద్ధిచెందినట్లుగా ఢిల్లీ పరిసర ప్రాంతాలు వృద్ధిచెందినట్లుగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలుకూడా వృద్ధి చెందే అవకాశం వుంది ఈ సూచన మూడు ప్రాంతాలవారికి ఆమోదయోగ్యమయ్యే వీలుంది తెలంగాణా రాష్ట్రం ఇచ్చిన తరువాత రాయలసీమ రాష్ట్రం కొరకు ఉద్యమం వచ్చే వీలుంది కనుక భవిష్యతులో రాయలసీమ రాష్ట్రాన్ని కూడా ఏర్పరిస్తే ఆ రాష్ట్రానికి కూడా హైదరాబాద్‌నే రాజధాని చేయవచ్చు.

అయితే తెలంగాణావాదుల నుండి రెండు కారణాలవల్ల ఈ సూచన మీద తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది హైదరాబాద్ నగరం ఎల్లప్పుడూ తెలంగాణలో ఒక అంతర్భాగం అనే పరిగణింపబడుతూ వస్తోంది కనుక అన్ని ప్రాంతాల వారికీ దీన్ని రాజధాని చేయడం ఇక్కడి ప్రజలకు నచ్చదు ఇది ఒక కారణం కాగా మరొక కారణం నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలోని కొంత భాగాలను హైదరాబాద్ నగరానికి కలపడం ఇదే కాక మూడు ప్రాంతాల నుండి హైదరాబాద్‌ను దాని పరిసరప్రాంతాలను కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడం మీద వ్యతిరేకత రావచ్చు ఈ సూచన మీద అందరికీ ఆమోదయోగ్యమైన, ఆచరణ యోగ్యమైన ప్రతిపాదనలను చేయటం వీలుకాదనిపిస్తోంది ముఖ్యంగా తెలంగాణా నుండి తీవ్ర వ్యతిరిక్తత ఎదురుకావచ్చు. హైదరాబాద్ లేకుండా తెలంగాణా ఏర్పాటు చేస్తే మావోయిస్టుల కదలికలు ఉధ్రుతమవుతాయనే అనుమానం కూడా వుంది

## రాష్ట్రాన్ని తెలంగాణ, సీమాంధ్రగా రెండుగా విడదీయటం- హైదరాబాద్ తెలంగాణా రాజధాని- సీమాంధ్రకు మరో కొత్త రాజధాని

ఈ సూచనలో రాష్ట్రం రెండుగా విడగొట్టబడుతుంది రెండిటికీ మొదట్లో హైదరాబాద్ రాజధానిగా వుంటుంది. తరువాత సీమాంధ్ర కొత్త రాజధానిని ఏర్పరచుకుంటుంది కొత్త రాజధాని ఏర్పాటుకు పెద్ద ఎత్తున పెట్టుబడులు అవసరం దీనికోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ నిధులను కేటాయించాల్సి వుంటుంది ఈ సూచన తెలంగాణా ప్రజలకు మిక్కిలి ఆమోదయోగ్య మైనది తెలంగాణా ప్రాంతంలో ఈ కమిటీ పర్యటన జరిపినప్పుడు అధిక సంఖ్యలో ప్రజలు ప్రత్యేక తెలంగాణనే కోరుతున్నారు కొద్దిమంది మధ్యస్థ మార్గాన్ని ఎన్నుకోగా మరి కొన్ని వర్గాలు ప్రత్యేక తెలంగాణను వ్యతిరేకించాయి కమిటీ పరిశీలన ఇలా వుంది

## ప్రత్యేక తెలంగాణకోసం తీవ్ర అభిప్రాయాన్ని వెలిబుచ్చిన ప్రాంతాలు :

- వరంగల్, ఖమ్మం పశ్చిమ ప్రాంతం, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ దక్షిణప్రాంతం మెదక్‌లో సిద్ధిపేట ప్రాంతం, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డిలలో కొన్ని ప్రాంతాలు తెలంగాణా వేర్పాటు ఉద్యమాన్ని కాకతీయ, ఉస్మానియా విద్యాలయాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువత లాయర్లు, నాన్‌గెజిటెడ్ ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రతరం చేశారు

## ప్రత్యేక తెలంగాణకోసం మధ్యస్థ అభిప్రాయాన్ని వెలిబుచ్చిన ప్రాంతాలు :

- హైదరాబాద్ నగర జనాభా (మజ్లిస్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను కలిపి) మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, కోస్తాంధ్ర, రాయలసీమ, కర్నాటక సరిహద్దుల్లో వున్న గ్రామాలు/మండలాలు, తెలంగాణా ప్రాంతంలో ప్రవాసులు స్థిరపరుచుకున్న గ్రామాలు/మండలాలు (ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ మొ.నవి), గ్రేటర్ హైదరాబాద్‌లో వలస జనాభా.

- తెలంగాణా ఉత్తర ప్రాంతంలో గిరిజనులు మన్యసీమ ప్రత్యేక రాష్ట్రం ప్రస్తావన చేశారు. అలాగే ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గిరిజన ప్రాంతాల వారందురూ ఒకే పరిపాలనా వ్యవస్థ క్రింద తాము వుండాలని కోరుకున్నారు.

- షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు తగిన రాజకీయ జోక్యం, ఆర్థికాభివృద్ధి, రిజర్వేషన్ ప్రయోజనాలకోసం తమ సొంత అభిప్రాయాలను వెల్లడించారు.

- ఈ సూచన వల్ల కోస్తాంధ్రలో, రాయలసీమలో వెంటనే ఉద్యమం తీవ్రమౌతుంది. వ్యతిరేకతకు ముఖ్యాంశాలు హైదరాబాద్ నగరంతో పాటు నీటి తీరువా, సాగునీటి వనరుల వాటాలు. ప్రజలు సీమాంధ్రప్రాంతంలో రాజకీయ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను, ఎంపీలను సమైక్యాంధ్ర కొరకు రాజీనామాలు చేయమని ఒత్తిడి తెస్తారు. సీమాంధ్ర నుండి రాయలసీమను వేరుచేయాలన్న ఉద్యమం త్వరలోనే రూపుదిద్దుకునే అవకాశం వుంది. నీటి పంపిణీ విధానాలను ప్రత్యేకాధికార సంస్థల ఏర్పాటుద్వారా పరిష్కరించగలిగిన కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉంటుంది. నక్సలిజం, మతతత్వ శక్తులు పెరిగి, అభద్రతా వాతావరణాన్ని ఏర్పరుస్తాయి.

రాష్ట్రాన్ని రెండుగా విడగొట్టడం ఆంధ్రప్రదేశ్ వెలుపల కూడా ప్రభావాన్ని చూపిస్తుంది. రాష్ట్రాల విభజన ఇది మొదటిసారి కాకపోయినా, ఒకే భాష క్రింద ఏర్పడ్డ రాష్ట్రాన్ని రెండుగా విడగొట్టడం కేంద్ర ప్రభుత్వానికి ఇతర రాష్ట్రాల నుండి చిక్కులను తెప్పించవచ్చు. చిన్న రాష్ట్రాల ఏర్పాటు వల్ల సమన్వయం యాజమాన్య నిర్వహణ వంటి సమస్యలు తలెత్తుతాయి.

చిన్నరాష్ట్రాల ఏర్పాటు ఆర్థికరంగం మీద తన ప్రభావాన్ని చూపుతుంది. చిన్నరాష్ట్రాలు వివిధ రకాల ప్రవేశపన్నులను, సెజ్‌లను విధించి స్వేచ్ఛావాణిజ్యానికి అడ్డుగా నిలుస్తాయి. వ్యాపార నిర్వహణ ఖర్చులు పెరిగి తద్వారా సరకుల ధరలు, సర్వీసుల ధరలు కూడా పెరగవచ్చు. సరకులను పొందు ప్రాంతాలకు, పొరుగు రాష్ట్రాలకు తీసుకుని పోవడంపై స్థానిక చట్టాలు అంగీకరించక పోవచ్చు. ఈ భయం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ఎక్కువగా వుంది. హైదరాబాద్ నగరాన్ని మార్కెట్ కేంద్రంగా భావిస్తున్నందువల్ల తెలంగాణా రాష్ట్రంలో హైదరాబాద్ అంతర్భాగమైతే సమస్యలు ఎదురవ్వవచ్చు. ఈ లెక్కన ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టడం అనుచిత నిర్ణయమే అవుతుంది. మరోవైపు తెలంగాణా ప్రాంతం కూడా మూసుకుపోతుంది. ఈ ప్రాంతానికి తూర్పు తీరంలో ప్రధానరేవు పట్టణమైన విశాఖపట్టణం, ఇతర ఓడ రేవుల సౌకర్యం అంతగా వుండదు. చమురు, సహజవాయువు నిక్షేపాలు కోస్తాంధ్రలో అధికంగా బయట పడుతున్నందువల్ల ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు రెండుప్రాంతాల వారికి మాత్రమే అందుతాయి. అయితే హైదరాబాద్ నగరం వల్ల తెలంగాణ ప్రాంత ఆర్థిక పాటవం, మిగతా రాష్ట్రాలకన్నా ఎక్కువగా వుండవచ్చు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మీద చతురతతో వ్యవహరించకపోతే ఈ సూచనలను అంగీకరించవచ్చు.

ప్రత్యేక తెలంగాణా వాదులు వెలుబుచ్చిన అంశాలపై స్పందించని పక్షంలో, ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేయడమొక్కటే మార్గం. ఈ సూచనలను అమలులో పెట్టినట్లయితే కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలు హైదరాబాద్‌లోనూ, ఇతర తెలంగాణా జిల్లాలోను పెట్టిన పెట్టుబడులకు భద్రతను కల్పించటం, వారికి విశ్వాసాన్ని కల్పించటం ప్రభుత్వ విధి. తెలంగాణా ఏర్పాటు చేసినందువల్ల ఆ ప్రాంతంలో అత్యధిక ప్రజలను సంతృప్తి పరిచినట్లు అవుతుంది. అయితే ఇంతకుముందు తెలిపిన విధంగా అనేక సమస్యలు కూడా ఎదురవుతాయి. వీటినన్నింటినీ నిశితంగా పరిశీలించిన అనంతరం ఈ సూచన పూర్తి ఆచరణ యోగ్యమైనది కాదని కమిటీ భావిస్తోంది. అయితే ఇది రెండవ ఉత్తమ సూచన. విధిలేని పరిస్థితుల్లో మాత్రమే మూడు ప్రాంతాల సంపూర్ణ అంగీకారంతో ఈ సూచనను అమలు చేయవచ్చు.

**రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచడం : అదే సమయంలో తెలంగాణా ప్రాంతానికి సామాజిక ఆర్థికాభివృద్ధికి మరింత రాజకీయ ఉన్నతికి కొన్ని రాజ్యాంగపరమైన / చట్టబద్ధమైన చర్యలను చేపట్టటం - చట్టబద్ధమైన తెలంగాణా ప్రాంతీయ మండలి ఏర్పాటు**

ఇంతకుముందు తెలిపిన అంశాల ప్రకారం మూడు ప్రాంతాల సంక్షేమం కొరకు అభివృద్ధి అధిక ప్రాధాన్యతను సంతరించుకుంటుందని ఈ కమిటీ విశ్వసిస్తుంది. ఆర్థికరంగంలో, రాజకీయ రంగంలో మరింత వికేంద్రీకరణ జరిపి ఒక నమూనా విధానాన్ని ఏర్పరచటం సముచితంగా అనిపిస్తోంది. ఇతర సూచనల ప్రకారం రాజధానులు, శాసనసభలు, మంత్రిత్వ శాఖలు, కోర్టులు, సంస్థలు, పరిపాలనా మౌలిక సదుపాయాలూ మొదలైన వాటి అవసరమేమీ వుండకూడదని కమిటీ విశ్వసిస్తుంది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ప్రయోజనాలకోసం ఐక్యంగా ఉండటం ఒక్కటే శరణ్యమని కమిటీ భావిస్తోంది. ఇతర సమస్యలకు సరైన పరిష్కార మార్గాలను వెతకాలి. ఈ సూచన ప్రకారం రాష్ట్రాన్ని సమైఖ్యంగా వుంచి తెలంగాణా ప్రాంత అభివృద్ధికి సామాజిక, ఆర్థిక అంశాలపైన రాజ్యాంగబద్ధమైన/ చట్టబద్ధమైన కొన్ని చర్యలను చేపట్టాలని కమిటీ ప్రతిపాదించింది. దీనిని తెలంగాణా ప్రాంతీయ మండలి ఏర్పాటు ద్వారా చేయవచ్చు. ఆ మండలికి తగినన్ని నిధులను బదిలీ చేయాలి. 1956 పెద్దమనుషుల ఒప్పందం వంటి అంశాల స్ఫూర్తితో ఈ మండలి కార్యక్రమాలు జరగాలి. ఈ ప్రాంతీయ మండలి ఒక చట్టపరమైన సలహా యంత్రాంగంతో పనిచేస్తుంది. రాష్ట్ర శాసనసభ ఈ మండలి సలహా, సూచనల ప్రకారమే నడుచుకోవాలి. అదేవిధంగా ఈ మండలి ప్రభుత్వాన్ని ఏదైనా చట్టాన్ని చేయమని కోరితే దానిని అసెంబ్లీలో చర్చకు వుంచి ఆ తరువాత చట్టం చేయాలి. ప్రాంతీయ మండలికి, ప్రభుత్వానికీ/ శాసనసభకు భేదాభిప్రాయాలు ఏర్పడితే అటువంటి అంశాలను పరిష్కరించేందుకు ఒక అనుబంధ కమిటీ గవర్నర్ ఆధ్వర్యంలో నియమించుకోవాలి. అందులో రెండు ప్రాంతాల సభ్యులు సమానంగా వుండాలి. గవర్నర్‌కు కూడా ఓటు వేసే హక్కు వుండాలి. అనుబంధ కమిటీలో ముఖ్యమంత్రి, ఉ పముఖ్యమంత్రి, స్పీకరు, శాసనమండలి ఛైర్మన్, అసెంబ్లీలో ప్రతిపక్షనేత, తెలంగాణా ప్రాంతీయ మండలి ఛైర్మన్, ఒక గౌరవనీయుడైన జడ్జి సభ్యులుగా వుండాలి.

తెలంగాణ ప్రాంతీయ మండలి పరిధిలోని అంశాలు దిగువన వున్నాయి.

- ప్రణాళిక-ఆర్థికాభివృద్ధి హెచ్ఎమ్‌డిఏ ప్రాంతంకాక ఇతర తెలంగాణా ప్రాంతాల అభివృద్ధికి ఉపప్రణాళిక
- నీరు, సాగునీటి రంగం
- విద్య (ప్రాథమిక, మాధ్యమిక), నైపుణ్యత అభివృద్ధి వృత్తివిద్య
- స్థానిక పరిపాలన (హెచ్ఎమ్‌డిఏ మినహా పిఆర్ఐలు, యుఎల్‌బిలు)
- ప్రజారోగ్యం (వైద్య కళాశాలలు, ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు మినహా, జిల్లా ఆసుపత్రుల వరకు)

పై జాబితా తాత్కాలికం మాత్రమే. ప్రాంతీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలపై ఏమైనా అంశాలను చేర్చాలనుకుంటే మండలి రాజ్యాంగం ఏర్పరిచే సమయంలో లేదా అవసరమైనప్పుడు పొందుపరచవచ్చు.

ప్రాంతీయ మండలి ఛైర్మన్ ఎమ్మెల్యే అయి ఉండి రాష్ట్ర ప్రభుత్వంలో క్యాబినేట్ మంత్రి అయి వుండాలి.

ఈ మండలి తెలంగాణా ప్రాంతానికి ఉప ప్రణాళికను అమలుచేస్తోంది. దీనికవసరమైన నిధులను, విధులను నిర్వర్తించేవారు మండలి అధికారాలకు లోబడి వుంటారు. మండలికి సొంత సచివాలయం వుంటుంది. దీనియొక్క అధికారి రాష్ట్రంలో అదనపు ప్రధాన కార్యదర్శి హోదాలో వుండి మండలి ఛైర్మన్‌కు నివేదికను అందజేస్తారు. మండలి మొత్తం సభ్యత్వం ఎమ్మెల్యేలు, ఎమ్ఎల్‌సీలు మధ్య మండలికి కేటాయించిన అంశాల సంఖ్యను బట్టి, పని తీవ్రతను బట్టి వుంటుంది. కొంతమంది నిపుణులు కూడా ఈ మండలిలో ఓటు హక్కు లేని సభ్యులుగా వుండవచ్చు. మరిన్ని నిధులు అవసరమైతే ప్రాంతీయ మండలి సిఫార్సుల మేరకు మాత్రమే వాటిని కేటాయించవచ్చు.

తెలంగాణా ప్రాంతానికి రాజకీయ సాధికారత కల్పించేందుకు ముఖ్యమంత్రి పదవినీ, ఉపముఖ్యమంత్రి పదవినీ ఇవ్వాల్సి వుంటుంది. మంత్రిత్వ శాఖల కేటాయింపుల్లో ముఖ్యమైన వాటిని కేటాయించాల్సి వుంటుంది. నిధుల కేటాయింపు ఇతర ముఖ్యమైన అంశాలపై ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థికమంత్రి, ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడు వంటి వారితో సంప్రదింపులు జరిపేటప్పుడు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కూడా ఆ సంప్రదింపులకు హాజరు కావాలి. తెలంగాణా ఉద్యమం వల్ల ఏర్పడ్డ పరిస్థితులనన్నింటినీ తొలగించేందుకు శ్రమించాలి.

సమైక్యాంధ్ర సూచనను మూడు ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని, జాతీయ భావాన్ని దృష్టిలో వుంచుకొని తగినదని సూచించడమైనది. రాజకీయంగా, పరిపాలనా పరంగా దృఢంగా ప్రజల్లో ఈ అంశంపైన విశ్వాసాన్ని రేకెత్తించవచ్చు. హైదరాబాద్ పురోగతి మీద ఏర్పడ్డ నీలి నీడలు కూడా తొలగించవచ్చు. నీరు, సాగునీటి వనరుల యాజమాన్యానికిగాను నీటి యాజమాన్యం బోర్డు సాగునీటి ప్రాజక్టుల అభివృద్ధి కార్పొరేషన్ వంటి వాటిని ఏర్పరచాలని సిఫార్సు చేయడమైనది. పై చర్యలన్నీ తెలంగాణా ప్రజలను సంతృప్తి పరచగలవు.

ఈ సూచనను మొదట్లో తెలంగాణా ప్రాంతంలోని రాజకీయ పార్టీలూ, ఇతర గ్రూపులు, సంస్థలూ, అధిక సంఖ్యలో ప్రజలూ తిరస్కరిస్తారనీ ఈ కమిటీ భావిస్తోంది. అందరి ప్రజలకు ఆమోదయోగ్యంగా

రూపొందించిన ఈ సూచన పట్ల కొందరు విద్యార్థులు, నిరుద్యోగ యువత (లక్షల ఉద్యోగాలు వస్తాయని హామీలు పొందినవారు), నాన్‌గెజిటెడ్ అధికారులు (ప్రమోషన్లు వస్తాయని ఎదురుచూసేవారు), లాయర్లు, రైతులు మొదలైనవారు ఉద్యమకారులుగా మారతారు. రాజకీయ సంక్షోభాన్ని కల్పించేందుకు తెలంగాణా ప్రాంత ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను, ఎంపీలను రాజీనామా చేయమని ఒత్తిడి చేయడం జరుగవచ్చు. ఇవన్నీ కొంత కాలంపాటు నాయకత్వానికి తీవ్ర సవాళ్ళుగా అగుపిస్తాయి. దీనికి ఏమేం చేయాలో శాంతిభద్రతల అధ్యాయంలో కొన్ని సూచనలు చేయటం జరిగింది.

ఈ ప్రాంతీయ మండలి ఏర్పాటు సమ్మతమైతే రాయలసీమలో కూడా ఇలాంటి ప్రాంతీయ మండలికోసమే డిమాండు రావచ్చు. రాయలసీమను మూడు ప్రాంతాల్లో ఎక్కువ వెనుకబడిన ప్రాంతంగా కమిటీ గుర్తించింది. అదే విధంగా ఉత్తర కోస్తాంధ్ర, ఉత్తర సరిహద్దుల్లోని గిరిజన ప్రాంతాలు కూడా వెనుకబడి ఉన్నవే కనుక అవి కూడా ప్రాంతీయ మండలుల ఏర్పాటు కోసం డిమాండ్ చేయవచ్చు. అయితే మొత్తంమీద ఈ సూచన కోస్తాంధ్ర, రాయలసీమ, హైదరాబాద్ నగరంలో అధికభాగం ప్రజలకు సమ్మతంగా వుండగలదని కమిటీ విశ్వసిస్తోంది.

కమిటీ ఈ సూచన క్రింద అన్ని అంశాలనూ చర్చించింది. కార్యాచరణలో కొన్ని సమస్యలు ఎదురవవచ్చని ఊహిస్తుంది. దేశంలో ప్రాంతీయతత్వం పెరిగిన ఏ ప్రదేశంలోనైనా ఈ సూచనను అమలు చేయవచ్చుని కమిటీ విశ్వశిస్తోంది.

## ముగింపు

ఈ నివేదికలో చర్చించిన అంశాలు, చేసిన సిఫార్సులతోపాటు ఈ ముగింపులో రెండు కార్యాచరణ అంశాలను కమిటీ సూచిస్తోంది. (1) పరిపాలనా రంగానికి సంబంధించింది. వెంటనే చేయవలసినది. (2) రాజ్యాంగ, చట్టపరమైన చర్యలకు సంబంధించింది. దీన్ని రూపొందించాలి. రాష్ట్రంలో శాంతిభద్రతలను నెలకొల్పేందుకు పలు సిఫార్సులు దీర్ఘకాల ప్రభావాన్ని చూపాయి. కమిటీ సూచించిన పరిష్కార మార్గాలను, సూచనలను ప్రభుత్వం కూలంకషంగా పరిశీలించి అవసరమైన చర్యలను సమయానుకూలంగా తీసుకోగలదని కమిటీ గాఢంగా విశ్వశిస్తుంది. ఈ సూచనలు మంచి పరిపాలనను ఏర్పరచేందుకు, ప్రాంతీయ అభివృద్ధి సమానంగా జరిగే లక్ష్యంతో చేయబడ్డాయి. వీటిపై కార్యాచరణ ఒక పథకం ప్రకారం త్వరగా చేయబడాలి. ఆలస్యమయ్యే కొద్దీ ప్రజల మనస్సుల్లో తిరుగుబాటు ధ్వనిస్తుంది. ఎప్పటికప్పుడు చర్యలను చేపట్టడం ప్రజల భావోద్రేకాలను సంతృప్తి పరచగలదు. సిఫార్సులను పరిశీలించటం, నిర్ణయాలను అమలు చేయటం, వెంటవెంటనే జరుగగలవని కమిటీ విశ్వసిస్తుంది.

సిఫార్సులకు అవసరమైన చట్టపరమైన లేదా రాజ్యాంగపరమైన అంశాలను, తన దృష్టికి వచ్చిన మరికొన్నిటిని కమిటీ ఇక్కడ ఉంచుతోంది.

తెలంగాణా ఉత్తర ప్రాంతంలో వైద్యవిశ్వవిద్యాలయాన్ని, కళాశాలను ఏర్పాటు చేయాలి. దీని ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి చట్టపరమైన, రాజ్యాంగపరమైన అధికారాలున్నాయి.

నీటితీరువా, యాజమాన్య బోర్డు ఏర్పాటు కమిటి సిఫార్సు చేస్తుంది. ఈ అంశాన్ని పరిశీలించమని కమిటి కోరుతోంది. రాష్ట్రం సమైక్యంగా ఉండాలన్న నిర్ణయం గనుక తీసుకుంటే మూడు ప్రాంతాలకు సాగునీటి, నీటి, వనరుల పంపిణీ సమానంగా వుండేందుకు గాను ఈ బోర్డు అవసరం. మూడు ప్రాంతాలలో నిధుల విడుదలకు, బడ్జెట్ అవసరాల సిఫార్సుకు, ప్రాజెక్టుల పరిశీలనకు ఈ బోర్డు ఉపయోగపడుతుంది. ఈ బోర్డును కేంద్ర ప్రభుత్వ అనుమతితో రాష్ట్ర చట్టాల ప్రకారం ఏర్పాటు

చేయవచ్చు. ఈ బోర్డు అంతరాష్ట్ర తరహాలో పనిచేస్తుంది గతంలో భాక్రాబీస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ తుంగభద్ర బోర్డ్ ఈ తరహాలోనే పనిచేశాయి

రాష్ట్ర సాగునీటి అభివృద్ధి సంస్థను పునర్వ్యవస్థీకరించటం దాని పరిధిని విస్తరించడం రాష్ట్ర ప్రభుత్వ చట్టపరిధిలోనిదే మహారాష్ట్ర తరహాలో ఈ పనిని చేయవచ్చు.

చివరగా రాష్ట్రం సమైక్యంగా వుండే పక్షంలో తెలంగాణ ప్రాంతీయ మండలి ఏర్పాటుకు రాజ్యాంగ చట్టబద్ధత అంశాన్ని కమిటీ పరిశీలించింది

కమిటీ చేసిన సిఫార్సులు రాష్ట్రంలోని అత్యధిక ప్రజలకు పూర్తి సంతృప్తిని ఇస్తాయని కమిటీ గాఢంగా విశ్వసిస్తుంది ఇందులో చర్చించిన అంశాలను పూర్తిగా పరిశోధించి ఫలితాలను రికార్డు చేయడం జరిగింది కేంద్ర ప్రభుత్వం ఈ దీర్ఘకాల సమస్యకు ఒక పరిష్కార మార్గాన్ని చూపగలదని ఆశించడమైనది ఆ పరిష్కార మార్గం కాలానుగుణంగా సరిపోయేదిగా వుండాలి భారతదేశపు మొదటి హెూంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉటంకించిన వాక్యాన్ని ఇక్కడ ఉదహరిస్తూ మేము దీన్ని ముగిస్తున్నాము

*'వాస్తవాలను, నిజాలను సరిగా ఎదుర్కొనని పక్షంలో,*
*వాటిని నిర్లక్ష్యం చేసిన పక్షంలో అవి తమ ప్రతీకారాన్ని తీర్చుకోగలవు'.*

❖ ❖ ❖

సుందరయ్య గ్రంథాలయ
A C. No. 18069
హైదరాబాద్-500 044.

# సంక్రాంతి శుభాకాంక్షలు

**ప్రతిబింబం**
నవ జీవన దర్పణం
www.pratibimbam.com

మాస పత్రిక

## చదవండి.. చదివించండి...



**sri azendla Publications**

A Division of Azendla Ads & Printers

Office : Flat No. 12, 3rd Floor, Srinivas Apartments,
Lakdi-ka-pool, Hyderabad - 500 004. Andhra Pradesh. INDIA.
Tel : 040 - 66686999 Mobile : 9290603900
e-mail : azendlamurali@gmail.com, azendlaadvertising@gmail.com


P. Chidambaram